ఈనాడు

హైదరాబాద్ 3-8-2018 శుక్రవారం సిటీ సంపుటి 44. సంచిక 355

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నేర పరిశోధనకు బ్రహ్మాస్త్రం



➤ తెలంగాణ పోలీసుల చేతికి కొత్త అస్త్రం అందుబాటులోకి వచ్చింది.

➤ నేరగాడి ఫొటోను తీసి యాప్‌లో పెడితే సమగ్ర సమాచారం వెంటనే తెలిసిపోతుంది.

➤ నేరానికి పాల్పడిన వారి ముఖ కవళికలు ఏం కొంచెం లభించినా ఇట్టే పట్టేయొచ్చు. నేరం జరిగిన ప్రాంతం నుంచే సెల్‌ఫోన్‌లో టీఎస్ కాప్ యాప్ ద్వారా ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ఉపయోగించవచ్చు.

-2లో

ద్విచక్ర వాహనాలకూ గూగుల్ మార్గసూచీ

చండీగఢ్: భారత్‌లోని సవాళ్లు, అవకాశాలకు అనుగుణంగా 'గూగుల్ మ్యాప్స్'లో ప్రత్యేక అంశాలను తీసుకురానున్నట్లు గూగుల్ సంస్థ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. "ఒక చోటు నుంచి ఇంకో చోటుకు మార్గనిర్దేశానికే గూగుల్ మ్యాప్‌లు పరిమితం కావు. ప్రత్యేకంగా భారత్ కోసం కొన్ని వెసులుబాట్లు రూపొందిస్తున్నాం. ఇక్కడి సవాళ్లను అవి అధిగమిస్తాయి. గూగుల్ మ్యాప్‌లను మరింత సమగ్రంగా, కచ్చితత్వంగా, విశ్వసనీయంగా తీర్చిదిద్దడమే దీని ఉద్దేశం" (మిగతా 2లో)

లక్ష కోట్ల డాలర్ల యాపిల్

1976లో ఓ గ్యారేజీలో ప్రారంభమైన యాపిల్ సంస్థ ఇప్పుడు అమెరికాలోనే అత్యధికంగా లక్ష కోట్ల డాలర్ల మార్కెట్ విలువను సాధించింది. యాపిల్ వ్యవస్థాపకుల్లో స్టీవ్ జాబ్స్ ఒకరు. అద్భుతమైన సాంకేతిక నైపుణ్యంతో వినూత్న ఉత్పత్తులు అందిస్తూ, విభిన్నమైన మార్కెట్ వ్యూహాలతో పర్సనల్ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదిగింది.

- వివరాలు బిజినెస్ పేజీలో

'జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్'కు రాజ్యాంగ ప్రతిపత్తి

బిల్లుకు లోక్‌సభ ఆమోదం

రాజ్యసభ సవరణలకు తిరస్కృతి

దిల్లీ: 'జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్' (ఎన్‌సీబీసీ)కు రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించే కీలకమైన బిల్లుకు లోక్‌సభ గురువారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. రాజ్యసభ ప్రతిపాదించిన సవరణల్ని తోసిపుచ్చుతూ 123వ రాజ్యాంగ సవరణ బిల్లును మూడింట రెండొంతులకు పైగా ఆధిక్యంతో ఆమోదించింది. 5 గంటల చర్చలో 32 మంది ప్రసంగించారు. సభకు హాజరైన 406 మంది సభ్యులూ ఏకగ్రీవంగా ఓటు వేశారు. ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకొంది. ఈ బిల్లుకు ఆమోదం పొందడంలో విజయవంతమైనందుకు సామాజిక న్యాయం-సాధికారత శాఖ మంత్రి గహ్లోత్‌ను ప్రధాని మోదీ అభినందించారు. ఓటింగు సమయంలో ప్రధాని సభలోనే ఉన్నారు. రాజ్యసభ సవరణలతో ఆమోదించిన బిల్లును లోక్‌సభ సవరించడం చట్టసభ చరిత్రలోనే ప్రథమమని ఆర్ఎస్‌పీ సభ్యుడు ఎన్.కె.ప్రేమ్‌చంద్రన్ చెప్పారు. దేశంలో ఓబీసీ జనాభా ఎంతో స్పష్టం చేయాలనీ, 2014 సామాజిక-ఆర్థిక గణనను బహిర్గతం చేయాలని కొందరు డిమాండ్ చేశారు. ఎన్‌సీబీసీ బిల్లును గత (మిగతా 2లో)

ఆ సెక్షన్ సమానత్వ హక్కుకు విరుద్ధం

- వివాహేతర సంబంధాలపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ
- 497 నిబంధన ఏకపక్షమన్న ధర్మాసనం -2లో

సీట్లకు పాట్లే!



- ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో అరకొర సీట్లే
- ప్రైవేట్ కళాశాలతో పోల్చుకుంటే భారీ అంతరం
- ప్రభుత్వ కాలేజీల్లో కంటే 'ప్రైవేట్'లో 29 రెట్లు ఎక్కువ
- అయిదేళ్లుగా పెరగని తీరు
- ప్రైవేటుకు రూ.వందల కోట్ల బోధనా రుసుముల చెల్లింపు
- నాణ్యమైన విద్యకు దూరమవుతున్న విద్యార్థులు

ఈనాడు - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. దశాబ్దాలు గడుస్తున్నా ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, వాటిలో సీట్ల సంఖ్య మాత్రం పెరగడం లేదు. రాష్ట్రంలో ఉన్న 3,055 సీట్లలో 1000 వరకు సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లే. అంటే అక్కడ రుసుం రూ. 35,000 చెల్లించాలి. విచిత్రమేమంటే రాష్ట్రంలో కంటే రాష్ట్ర విద్యార్థులు ఎక్కువ మంది దేశవ్యాప్తంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలైన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్‌ఐటీల్లో విద్యనభ్యసిస్తున్నారు. తెలంగాణలో కనీసం ఒక్కో పాత జిల్లాకు ఒక్కో కళాశాల కూడా లేకపోవడం, ఉన్న వాటిల్లోనూ సీట్లు పెరగక పోవడమే అందుకు కారణం. సర్కారు కళాశాలల్లో బీటెక్ రుసుం రూ.10 వేలు. అదే (మిగతా 2లో)

➤ తెలంగాణలోని అన్ని విశ్వవిద్యాలయాలు, వర్సిటీ కళాశాలల్లోని కలిపి ఉన్న ఇంజినీరింగ్ సీట్ల సంఖ్య 2,895. అందులో సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను పక్కనబెడితే మిగిలేవి 2,200.

➤ హైదరాబాద్‌లో ఉన్న శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాల ఒక్క దాంట్లోనే ఉన్న సీట్లు 1,620. గోకరాజు ఇంజినీరింగ్ కళాశాలలో ఉన్నవి 1200 సీట్లు. అంటే ప్రభుత్వ సీట్లన్నీ కలిపినా రెండు ప్రైవేట్ కళాశాలల్లో సీట్లతో సమానం.

నేడు దిల్లీకి సీఎం కేసీఆర్

- మూడు రోజులు అక్కడే మకాం
- ప్రధాని, కేంద్ర మంత్రులతో భేటీ
- జోనల్ విధాన ఆమోదానికి ప్రాధాన్యం
- విభజన హామీల అమలు, రిజర్వేషన్ల పెంపు, కాళేశ్వరానికి ప్రత్యేక హోదా కోరనున్న సీఎం -2లో

60,000 రైల్వే ఉద్యోగాలు

- రెట్టింపునకు పైగా పోస్టుల పెంపు
- అసిస్టెంట్ లోకో పైలెట్, టెక్నీషియన్ ఉద్యోగార్థులకు తీపి కబురు -2లో

మణికీర్తన

చందనాశ్రీ

మణికీర్తన మృతదేహం వద్ద విలపిస్తున్న ఆమె తండ్రి

కుప్పకూలిన పాఠశాల వేదిక

ఇద్దరు చిన్నారుల దుర్మరణం

- మరో ఐదుగురికి గాయాలు
- హైదరాబాద్ కూకట్‌పల్లిలో విషాదం

మూసాపేట, న్యూస్‌టుడే: పాఠశాల ఆవరణలోని వేదిక కూలడంతో ఇద్దరు విద్యార్థినులు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో గురువారం మధ్యాహ్నం ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. కూకట్‌పల్లి శ్రీకృష్ణానగర్‌లో పదిహేనేళ్లుగా న్యూసెంచరీ పాఠశాల కొనసాగుతోంది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో పాఠశాల ఆవరణలోని వేదికపై వ్యాయామ ఉపాధ్యాయుడు నాలుగో తరగతి విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. ఆరుబయట ఉన్న వేదికకు చుట్టూ ఆరుస్తంభాలు నిర్మించారు. వాటిని కలుపుతూ పైన మీటరు వెడల్పుతో కూడిన ప్లింత్ బీమ్‌లు ఉన్నాయి. అక్కడ విద్యార్థులు శిక్షణ పొందుతుండగా బీమ్‌లు భారీ శబ్దంతో కుప్పకూలాయి. వాటి పెళ్లలు మీద పడటంతో డి.మణికీర్తన (9), చందనాశ్రీ (8), నిఖిత (9), నరేష్ (11), సందీప్ (10), దేవిశ్రీ (10), సహస్ర (9) అనే విద్యార్థులకు గాయాలయ్యాయి. పాఠశాల నిర్వాహకులు వారిని వివేకానందనగర్‌లోని ఓ ప్రైవేట్ (మిగతా 2లో)

సమోసాలకూ టోల్‌ఫ్రీ నంబర్లివ్వాలా?

- ప్యాకింగేతర ఆహార పదార్థాల విక్రయాలపై నిబంధనలు ఏకపక్షం
- తూనికలు కొలతల శాఖను తప్పుపట్టిన హైకోర్టు -2లో

నిరుద్యోగుల 'నేస్తం'

- ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున భృతి
- 10 నుంచి 12 లక్షల మందికి లబ్ధి
- ఆమోదించిన ఏపీ మంత్రి మండలి
- 12న పథకాన్ని ప్రారంభించే అవకాశం -11లో

డీఎస్ కుమారుడి లైంగిక వేధింపులు

- హోంమంత్రికి నర్సింగ్ కళాశాల విద్యార్థినుల ఫిర్యాదు
- డీజీపీతో ఫోన్‌లో మాట్లాడిన నాయిని
- విచారణకు ఆదేశాలు -2లో

ఇదీ సంగతి!

శశికళ మేడం ఉంటున్న జైలు వీడియో పంపిద్దాం సార్. వాళ్ల దిమ్మ తిరుగుతుంది!

లెక్కలేనితనం

8,682 పంచాయతీలు.. 6.94 లక్షల అభ్యంతరాలు

- రూ. 399 కోట్ల లావాదేవీల్లో ఎన్నో ఉల్లంఘనలు
- రాష్ట్ర ఆడిట్ శాఖ తనిఖీల్లో తేలిన వైనం

ఈనాడు, హైదరాబాద్: గ్రామపంచాయతీల్లో కోట్ల రూపాయల ప్రజాధనం స్వాహా అయింది. ఒకే పనికి రెండుసార్లు డబ్బు చెల్లించడం, రూ.లక్షలు డ్రా చేసి లెక్కలు లేకుండా చేయడం వంటి అక్రమాలు కోకొల్లలు. తెలంగాణ రాష్ట్ర ఆడిట్ శాఖ నివేదికలో గ్రామపంచాయతీల ఆర్థిక వ్యవహారాల్లో 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.399 కోట్ల నిధులకు సంబంధించి ఎన్నో అక్రమాలను గుర్తించింది. రాష్ట్రంలో ఈ ఒక్క ఏడాదిలోనే 8,682 గ్రామ పంచాయతీల ఆడిట్‌లో 6.9 లక్షల అభ్యంతరాలను వ్యక్తం చేసింది. ఈ ఆడిట్ నివేదికలన్నీ పంచాయతీరాజ్‌శాఖకు చేరాయి. ప్రతి లేఅవుట్‌లో 10% ఖాళీ స్థలాన్ని గ్రామ పంచాయతీలకు అప్పగించాలి. రంగారెడ్డి జిల్లాలో కొడకల్, మోకిలా పంచాయతీల్లో 14 లేఅవుట్‌లలో 10% ఖాళీ స్థలాలను తీసుకోక (మిగతా 2లో)

'కొత్త' సంబురం

- రాష్ట్రంలో 4,378 పంచాయతీలు నూతనంగా ఆవిర్భావం -5లో



థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో తనిఖీలు

ఈనాడు, హైదరాబాద్: నిబంధనలు అమలు చేయని సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌లపై తూనికలు, కొలతల శాఖ మరోసారి కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ నగరంతోపాటు శివారులోని పలు ప్రాంతాల్లో అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో విక్రయించే ఆహార పదార్థాలపై గరిష్ఠ ధర, పరిమాణం తదితర వివరాలు ఉండాలని తూనికలు, కొలతల శాఖ గత నెలలో ఉత్తర్వులు జారీ చేసింది. వివిధ సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఉత్తర్వులను వివరించారు. అమలు చేసేందుకు ఆగస్టు ఒకటో తేదీ వరకు గడువు ఇస్తున్నట్లు తెలిపారు. సదరు ఉత్తర్వుల అమలు తీరును నిర్ధరించేందుకు గురువారం 30 మంది అధికారులు ఏడు బృందాలుగా ఏర్పడి 20 మల్టీప్లెక్స్‌లు, థియేటర్లలో తనిఖీలు చేపట్టారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఓ మల్టీప్లెక్స్‌లో.. శీతలపానీయాలు, తినుబండారాల ధరల వివరాలను పరిశీలిస్తున్న తూనికలు కొలతల శాఖ అధికారులు, పోలీసులు

18 మల్టీప్లెక్స్‌ల్లో నిబంధనలు అమలు చేయటం లేదని గుర్తించి 53 కేసులు నమోదు చేశారు. తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్లు భాస్కర్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, విజయసారథి, నిర్మల్‌కుమార్, రాజేశ్వర్, శివానంద్ బృందాలకు నాయకత్వం వహించారు.

సమోసాలకూ టోల్‌ఫ్రీ నంబర్లివ్వాలా?

ఈనాడు, హైదరాబాద్: సినిమా థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో ప్యాకింగ్‌ల్లో లేకుండా విడిగా విక్రయించే ఆహార పదార్థాలకు టోల్‌ఫ్రీ నంబరు ఉండాలన్న తెలంగాణ తూనికలు కొలతల శాఖ ఉత్తర్వులపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. కాగితాల్లో చుట్టి ఇచ్చే సమోసాలకు టోల్‌ఫ్రీ నంబర్లు ఇవ్వాలనడం సరికాదంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మల్టీప్లెక్స్‌ల్లో వినియోగదారుడు కోరిన బ్రాండ్‌ను అందించాలన్న నిబంధననూ తప్పుబట్టింది. ఏ బ్రాండ్లను విక్రయించాలనేదీ మీరే నిర్ణయిస్తారా అని ప్రశ్నించింది. మల్టీప్లెక్స్‌ల్లో బిల్లు జారీ చేయాలన్న నిబంధనను సమర్థించవచ్చునీ, అందులోనే అన్ని వివరాలు ఉంటాయని పేర్కొంది. థియేటర్లు, మల్టీప్లెక్స్‌ల్లో ప్యాకింగ్‌ల్లో లేని ఆహార పదార్థాల విక్రయాలపై నిబంధనలతో తూనికలు కొలతలు శాఖ జారీ చేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, పీవీఆర్ లిమిటెడ్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయి. వీటిపై గురువారం జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు విచారణ చేపట్టి ఇరుపక్షాల వాదనల అనంతరం నిర్ణయాన్ని ఈనెల 7వ తేదీకి వాయిదా వేశారు.

అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ప్యాకింగేతర ఆహార విక్రయాలపై జారీ చేసిన నిబంధనలు ఆచరణ సాధ్యం కావని చెప్పారు. విడిగా అమ్మే ఆహార పదార్థాల బరువు, నాణ్యత, తయారీలకు సంబంధించిన పూర్తి వివరాలను డిక్లరేషన్ రూపంలో ఇవ్వాలనడం ఆచరణలో కష్టమని తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ కాగితంలో చుట్టి ఇచ్చే రెండు సమోసాలకు డిక్లరేషన్ ఎలా ఇవ్వాలని ప్రశ్నించారు. సమోసా ఇచ్చే కాగితం పళ్లేలపై వివరాలు ముద్రించి ఇవ్వాలనీ, ఇందుకయ్యే వ్యయాన్నీ వినియోగదారుల నుంచే వసూలు చేస్తారనీ, ఏ రకంగానైనా నష్టపోయేది ప్రేక్షకులేనన్నారు. బిల్లును తప్పనిసరి చేయడాన్ని తప్పుపట్టలేమన్నారు. ప్రభుత్వ న్యాయవాది జ్యోతికిరణ్ వాదనలు వినిపిస్తూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో తూనికలు, కొలతల శాఖ నిబంధనలు రూపొందించిందని చెప్పారు. అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌లో ధరల ప్రస్తావన లేదన్న విషయాన్ని న్యాయమూర్తి ప్రస్తావించారు. థియేటర్లలో ఏవి విక్రయించాలనేది యాజమాన్యాల ఇష్టమనీ, కోరిన బ్రాండ్ అందుబాటులో ఉంచాలనడం అతిగా ప్రవర్తించడమేనన్నారు. ప్రతి విషయంలోనూ జోక్యం చేసుకుంటూ అధికారాన్ని ప్రదర్శిస్తామనడం తగదనీ, నిబంధనలు చట్ట విరుద్ధంగా ఉంటే అనుమతించలేమన్నారు.

డీఎస్ కుమారుడి లైంగిక వేధింపులు

ఈనాడు, హైదరాబాద్: రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ తనయుడు, నిజామాబాద్ మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ తమను లైంగికంగా వేధిస్తున్నారని నిజామాబాద్‌లో ఆయనకు చెందిన శాంకరి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డికి ఫిర్యాదుచేశారు. ప్రగతిశీల మహిళా సంఘం అధ్యక్షురాలు సంధ్య, పీడీఎస్‌యూ ఇతర సంఘాల ప్రతినిధులు, తమ తల్లిదండ్రులతో 11 మంది విద్యార్థినులు గురువారం సచివాలయంలో హోంమంత్రిని కలిశారు. సంజయ్‌కు చెందిన కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ మొదటి సంవత్సరంలో గత డిసెంబరులో చేరామని, బాలిక హాస్టలులో ఉంటున్నామని విద్యార్థినులు పేర్కొన్నారు. ప్రవేశాల సమయంలో ఉన్న ప్రిన్సిపల్‌ను తొలగించిన కళాశాల ఛైర్మన్ సంజయ్.. తమను కళాశాల హాస్టలుకి రావాలని ఒత్తిడి తెచ్చారని, అసభ్య పదజాలంతో, దూషించి భయభ్రాంతులకు గురిచేశారని లిఖితపూర్వకంగా తెలిపారు. ఇద్దరు విద్యార్థినులను తన వసతిగృహానికి బలవంతంగా తీసుకెళ్లి లైంగికదాడులు చేయడానికి ప్రయత్నించారని, ఒక విద్యార్థిని గాయపడిందని వాపోయారు. అయినా ఆమెను ఇంటికి పంపించకుండా బెదిరించారన్నారు. గతనెల 26న మరో విద్యార్థిని బంధించారని వివరించారు. మొత్తం 13 విద్యార్థినుల్లో 11 మందిపై ఇలాగే ప్రవర్తిస్తున్నారని వాపోయారు. సంజయ్‌పైనా, కళాశాల నిర్వాహకులపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తాము విద్యాసంవత్సరం నష్టపోకుండా చూడాలని కోరారు. ఈఫిర్యాదుపై స్పందించిన హోంమంత్రి డీజీపీ మహేందర్‌రెడ్డితో ఫోన్లో మాట్లాడారు. దీనిపై నిజామాబాద్ పోలీసు కమిషనర్‌తో పూర్తిస్థాయి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థినులు శుక్రవారం నిజామాబాద్ కమిషనర్‌ను కలిసి సమాచారమివ్వాలని సూచించారు. అభియోగాలు నిజమైతే ఉపేక్షించేది లేదని స్పష్టంచేశారు. సంజయ్‌ను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం నేతలు డిమాండ్ చేశారు.

నేడు దిల్లీకి సీఎం కేసీఆర్

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం మూడు రోజుల పర్యటన కోసం దిల్లీకి వెళ్లనున్నారు. ఉదయం ప్రత్యేక విమానంలో బేగంపేట నుంచి బయల్దేరి వెళ్లనున్న సీఎం ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్ర మంత్రులను కలుస్తారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త జోనల్ విధానానికి ఆమోదం పొందడం పర్యటన ప్రధాన ఉద్దేశం. గిరిజనులు, ముస్లింల రిజర్వేషన్ల పెంపు, ఉమ్మడి హైకోర్టు విభజన సహా కేంద్రం ఇచ్చిన ఇతర హామీలు, కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రత్యేక హోదా వంటి అంశాలపైనా ఆయన వారితో చర్చించనున్నారు. స్థానికులకు విద్య, ఉద్యోగాల కోసం తెలంగాణ ప్రభుత్వం కొత్త జోనల్ విధానాన్ని రూపొందించింది. దానిపై చట్టం చేసి శాసనసభలో ఏకగ్రీవంగా తీర్మానించి కేంద్రానికి ఆమోదం కోసం పంపింది. గత నెలలో సీఎం కేసీఆర్ ప్రధానిని, కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌లను కలిసి దీనిని ఆమోదించాలని అభ్యర్థించారు. కేంద్ర న్యాయ, హోం శాఖలు స్పందించి దస్త్రాన్ని ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులకు పెద్దపీట వేయడానికి ప్రస్తుతం జోనల్ విధానం అవరోధంగా ఉందని సీఎం భావించి, సమూల మార్పులు చేపట్టారు. తెలంగాణలోని 31 జిల్లాల్లో యువతకు ఎక్కడికక్కడే ఉద్యోగాలు లభించేలా 95 శాతం స్థానిక రిజర్వేషన్లతో చట్టం రూపొందించారు. కొత్త విధానాన్ని కేంద్రం ఆమోదిస్తే దాని ప్రకారమే ప్రకారం ఉద్యోగ నియామకాలు చేపట్టాలని భావిస్తున్నారు. అందుకే తానే ప్రధానిని కలిసి కొత్త జోనల్ వ్యవస్థ ఆవశ్యకతను వివరించి, ఆమోదం పొందే వరకు అక్కడే ఉండి పర్యవేక్షించాలని కేసీఆర్ నిర్ణయించారు. ప్రధానిని కలవడానికి ఆయన కార్యాలయం సీఎంకు సమయం ఇచ్చింది.

విభజన హామీలపై..

ఎస్టీలు, ముస్లింల రిజర్వేషన్ల బిల్లు పెంపు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉంది. దీనిపైనా సీఎం స్పష్టత తీసుకోనున్నారు. హైకోర్టు విభజన కీలకాంశంగా భావిస్తున్న కేసీఆర్ దీనిపై ప్రధానితో పాటు కేంద్ర న్యాయ, హోం శాఖల మంత్రులను కలుస్తారు. బయ్యారంలో ఉక్కు కర్మాగారం, కాజీపేటలో రైల్వే కోచ్ పరిశ్రమ, గిరిజన విశ్వవిద్యాలయం, తొమ్మిదో, పదో షెడ్యూలు సంస్థల విభజనపైనా చర్చిస్తారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించాలని కోరతారు. మిషన్ భగీరథకు నిధుల సాయాన్ని అభ్యర్థిస్తారు.

రాజకీయ ప్రాధాన్యం

అవిశ్వాస తీర్మానం సందర్భంగా ప్రధాని మోదీ కేసీఆర్ ప్రభుత్వానికి అనుకూలంగా మాట్లాడారు. ఓవైపు పార్లమెంటు సమావేశాలు, మరోవైపు వివిధ రాజకీయ అంశాలపై దేశవ్యాప్తంగా చర్చలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రధానితో కేసీఆర్ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. పర్యటనలో భాగంగా ఆయన రాజకీయ సమాలోచనలు సైతం చేసే అవకాశం ఉంది.

గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ముఖకవళికల గుర్తింపు విధానాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి. చిత్రంలో పోలీసు ఉన్నతాధికారులు రవిగుప్తా, జితేందర్, బాలనాగాదేవి, సంజయ్‌కుమార్‌జైన్, రవీంద్ర

కుప్పకూలిన పాఠశాల వేదిక

(మొదటి పేజీ తరువాయి)

ఆసుపత్రికి తరలించగా.. మణికీర్తన, చందనాశ్రీలు అప్పటికే మృతి చెందారు. నరేష్ కోమాలోకి వెళ్లడంతో నగరంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. మిగతావారికి తీవ్ర గాయాలయ్యాయి. కుప్పకూలిన వేదిక పదిహేనేళ్ల క్రితం నిర్మించినది. నాణ్యత లేకుండా నిర్మించడం వల్లే దుర్ఘటన జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. బీమ్‌లు డొల్లతనంతో ఉండడంతోపాటు నిర్మాణ సమయంలో వాడిన స్టీలు కడ్డీలు పూర్తిగా కరిగిపోయి కన్పించాయి. ఒక్కో బీమ్ మీటరు వెడల్పుతో ఉండడం వల్ల కూడా బరువుకు తట్టుకోలేక కూలిపోయినట్లు తెలుస్తోంది. ఘటనా స్థలాన్ని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరికెపూడి గాంధీ, మాదాపూర్ డీసీపీ వెంకటేశ్వరరావు, ఏసీపీ భుజంగరావు తదితరులు సందర్శించారు. ఘటన జరిగినప్పటి నుంచి పాఠశాల యజమాని వెంకట్ పత్తా లేకుండా పోయారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కూకట్‌పల్లి పోలీసులు తెలిపారు.

న్యూసెంచరీ పాఠశాల ఆవరణలో కుప్పకూలిన వేదిక పైకప్పు

నేర పరిశోధనకు బ్రహ్మాస్త్రం

ఈనాడు, హైదరాబాద్: నేరానికి పాల్పడిన వారి ముఖ కవళికలు ఏం కొంచెం లభించినా వారిని ఇట్టే పట్టేస్తామని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఇతర రాష్ట్రాల వారు తెలంగాణలోకి వచ్చి నేరం చేసినా సులువుగా దొరికిపోతారన్నారు. నేర పరిశోధనలో తెలంగాణ పోలీసులకు బ్రహ్మాస్త్రం లాంటి ముఖ కవళికల గుర్తింపు విధానాన్ని(ఎఫ్ఆర్ఎస్) ఆయన గురువారం ఆవిష్కరించారు. ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేనివిధంగా తొలిసారి రాష్ట్ర పోలీసులకు క్షేత్రస్థాయిలో ఈవిధానం అందుబాటులోకి తెచ్చామన్నారు. నేరం జరిగిన ప్రాంతం నుంచే తమ చరవాణిలోని టీఎస్ కాప్ యాప్ ద్వారా ఎఫ్ఆర్ఎస్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు. నేర దర్యాప్తులో భాగంగా అనుమానితులందరినీ భౌతికంగా పరిశీలించే పనిలేదని, పూర్వాపరాలు పరిశీలించుకున్నాకే వారి జోలికి వెళ్లడానికి వీలు ఏర్పడిందన్నారు.

నేరం చేస్తే దొరికిపోతామన్న భయం వస్తుంది

గతంలో నేరం చేసిన వారి వేలిముద్రలు మాత్రమే అందుబాటులో ఉండేవి. ఫొటోలతో పోల్చుకునే వెసులుబాటు ఉన్నప్పటికీ ప్రతి స్టేషన్‌కు రిపోర్టు రాయాల్సి వచ్చేది. ఇప్పుడలా కాదు. ఒక్క ఫొటోను తీసి యాప్‌లో పెడితే దానిలోని సమగ్ర సమాచారంతో వెంటనే ఫలితం వస్తుందని డీజీపీ వివరించారు. మావోయిస్టుల గుర్తింపునకు కూడా వీలు ఏర్పడుతుందన్నారు. ఈ విధానాన్ని పోలీసులు దుర్వినియోగం చేసే అవకాశం ఉందన్న విలేకరుల ప్రశ్నకు స్పందిస్తూ.. అలా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసు ఉన్నతాధికారులు రాజీవ్‌రతన్, గోవింద్‌సింగ్, రవిగుప్తా, బాలనాగాదేవి, నాగిరెడ్డి, స్టీవెన్ రవీంద్ర, శివధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కికీ ఛాలెంజ్ అనుకరిస్తే చర్యలు తప్పవు

కికీ ఛాలెంజ్‌తో ఎదుటువారి ప్రాణాలకు కూడా ముప్పు ఉందని, ఈ తరహా నృత్యాలు చట్ట విరుద్ధమైనవని డీజీపీ హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి ప్రయత్నాలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

‘జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్’కు రాజ్యాంగ ప్రతిపత్తి

(మొదటి పేజీ తరువాయి)

ఏడాది ఏప్రిల్ 10న లోక్‌సభ ఆమోదించి, రాజ్యసభకు పంపించింది. జులై 31న రాజ్యసభ దీనిని ఆమోదించి. విపక్షాలు సూచించిన సవరణలతో తిరిగి లోక్‌సభకు పంపింది. బీసీల జాతీయ కమిషన్‌కూ రాజ్యాంగబద్ధత కల్పించడం బిల్లు ఉద్దేశం. ఫిర్యాదులపై విచారణలో సివిల్ కోర్టుకు ఉండే అధికారాలు ఈ కమిషన్‌కు ఉంటాయి.

ఎన్‌సీబీసీ అంటే...

‘జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్ చట్టం-1993’ ప్రకారం ఎన్‌సీబీసీని 1993 ఆగస్టు 14న కేంద్ర సామాజిక న్యాయం- సాధికారత మంత్రిత్వ శాఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఇంద్రా సాహ్ని తదితరులు కేంద్రంపై దాఖలు చేసిన రిట్ పిటిషన్లో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు ఇది ఆవిర్భవించింది. ఓబీసీల జాబితాలో కులాలను చేర్చాలంటూ/ తొలగించాలంటూ వచ్చిన అభ్యర్థనలను, జాబితాపై వచ్చే ఫిర్యాదులను పరిశీలించడం కమిషన్ ప్రధాన విధి. కేంద్ర ఓబీసీ జాబితాలో 5 వేల పైచిలుకు కులాలు ఉన్నాయి. వెనుకబడిన, బాగా వెనుకబడిన, అత్యంత వెనుకబడిన అనే మూడు వర్గాలుగా ఓబీసీల ఉప వర్గీకరణ జరగాలని ఎన్‌సీబీసీ ఇదివరకే సిఫార్సు చేసింది. ఓబీసీలకు ఉన్న 27% రిజర్వేషన్‌ను ఆయా వర్గాల జనాభాకు అనుగుణంగా విభజించాలనీ, కేవలం బలమైన వర్గాలే మొత్తం ప్రయోజనాలను కొట్టేయకుండా చూడాలనీ పేర్కొంది.

లెక్కలేనితనం

(మొదటి పేజీ తరువాయి)

పోవడంతో రూ.53 కోట్ల నష్టం వాటిల్లింది. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలో నీటిట్యాంకు పనులను 11 భాగాలుగా విడగొట్టడంతో రూ.24 లక్షలు వృథా అయింది. పెంజర్లలో పనులు విడగొట్టడం వల్ల రూ.18 లక్షలు వ్యయమైనా పంచాయతీ భవనం పనులు పూర్తికాలేదు. నిబంధనలకు విరుద్ధంగా పంచాయతీ కార్యదర్శులు రూ.లక్షలు వసూలు చేసి తిరిగి ఖజానాకు జమచేయకపోవడం గమనార్హం. ఖమ్మం జిల్లా వైరా పంచాయతీలో రూ.20 లక్షలు, పోలేపల్లిలో రూ.4.1 లక్షలు, మహబూబాబాద్ జిల్లా కురవిలో రూ.11.8 లక్షల నగదు ఉంచుకున్నట్లు గుర్తించారు. కరీంనగర్ జిల్లా మానకొండూరు, రేవల్లి, బూజ్నూరుల్లో భారీ మొత్తంలో నగదును ఉంచుకోవడం వెలుగుచూసింది. సంగారెడ్డిజిల్లా చిట్‌కుల్‌లో రూ.9 లక్షలు, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో రూ.11.4 లక్షలు నగదు ఉన్నట్లు పేర్కొన్నా ఈ మొత్తాలను తర్వాత ఆర్థిక సంవత్సరంలో నగదు నిల్వగా కూడా చూపలేదు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలో చర్ల పంచాయతీలో జమ చేయని మొత్తం రూ.10.72 లక్షలుగా గుర్తించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లో జూనియర్ అసిస్టెంట్ రూ.10.31 లక్షలు జమచేయలేదు. ఇదే పంచాయతీలో వసూలు చేసిన రూ.12.5 లక్షలు చిట్టా రిజిస్టర్‌లో చూపినా క్యాష్‌పుస్తకంలో లేవు.

ఒకే పనికి రెండుసార్లు బిల్లు: జగిత్యాల జిల్లా చెలగల్‌లో ఒకే పనికి రెండుసార్లు డబ్బు చెల్లించారు. పని విలువ రూ.1.03 లక్షలు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో రూ.1.31 లక్షలు, కందిలో రూ.2.66 లక్షలు ఇలాగే డ్రా చేశారు. కొల్లూరులో కొలతల పుస్తకం(ఎంబుక్)లో రికార్డు చేయకుండానే రూ.2.79 లక్షలు కాంట్రాక్టర్‌కు చెల్లించారు. నిర్మల్ జిల్లాలో డీఈఈ నర్సాపూర్‌లో రూ.3.4 లక్షలు, పర్దిలో రూ.1.23 లక్షల పనులకు ఎంబుక్‌లో నమోదు చేయకుండా బిల్లులు చెల్లించారు. ఎంబుక్‌లు, ఓచర్లు లేకుండానే రూ.14.3 లక్షలు వ్యయం చేసిన వ్యవహారం నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో వెలుగు చూసింది. మోర్తాడ్‌లో రూ.6 లక్షల పనులకు సంబంధించి ఎంబుక్‌లేదు. డోర్నకల్, దేవరకద్ర, మక్తల్ పంచాయతీల్లో కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ మొత్తం చెల్లించారు. బిల్లుల చెల్లింపు సమయంలో మినహాయించుకున్న మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కరీంనగర్ జిల్లా సీతారాంపురం పంచాయతీలో రూ.21 లక్షలు, రంగారెడ్డి జిల్లా మణికొండలో రూ.69 లక్షలు వసూలు చేసిన మొత్తాన్ని జమచేయలేదని గుర్తించారు. సిద్దిపేట జిల్లా నాగ్నూర్‌లో రూ.2.01 లక్షలు ఎక్కువ చెల్లించారు.

అవసరం లేకపోయినా..: ఆదిలాబాద్ జిల్లా లక్ష్మీపూర్‌లో రూ.2.63 లక్షలు, నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌లో రూ.5.36 లక్షల వ్యయానికి లెక్కలేదు. సిద్దిపేట జిల్లా ఇర్కోడే పంచాయతీలో రూ.8.03 లక్షలు డ్రా చేసినా లెక్కల్లేవు. శ్రీరాంపూర్, ఎస్లతక్కళపల్లి, కామారెడ్డి జిల్లా చద్మల్, నాగ్లూరు, నిర్మల్ జిల్లా దొడర్న, బీరనంది, ద్యానాపూర్‌లో నిధులను డ్రా చేసినా లెక్కల్లేవు.

- పటాన్‌చెరు పంచాయతీలో షాపుల అద్దె డిపాజిట్లు రూ.27.9 లక్షల చెల్లింపుల్లో అక్రమాలున్నాయి.
- భూపాలపల్లి జిల్లా చింతోరులో అవసరం లేకుండానే రూ.4.58 లక్షల ఆర్థిక సంఘం నిధులు డ్రా చేశారు. పస్రాలో రూ.5.9 లక్షల పంచాయతీ నిధుల అక్రమాలు జరిగాయి.
- వైరాలో దుకాణ సముదాయం నిర్మాణానికి అడ్వాన్స్ ఇచ్చిన రూ.24 లక్షలను తిరిగి రాబట్టలేదు.

ముఖ్యాంశాలివీ..

ఆడిట్ జరిగిన గ్రామపంచాయతీలు: 8,682
ఆర్థిక సంవత్సరం: 2016–17
అభ్యంతరాలు: 6,94,032
ముడిపడి ఉన్న మొత్తం: రూ.399.56 కోట్లు

ఆ సెక్షన్ సమానత్వ హక్కుకు విరుద్ధం

దిల్లీ: పరాయి పురుషుడి భార్యతో వివాహేతర సంబంధాల విషయంలో సెక్షన్-497 ఏకపక్షంగా ఉందనీ, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వ హక్కుకు ఇది విరుద్ధమనీ సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. వివాహితులైన స్త్రీని, పురుషుడిని ఈ చట్టం భిన్నంగా చూస్తోందనీ, ఇది విస్పష్టంగా కనిపిస్తోందనీ పేర్కొంది. పరాయి వివాహిత పురుషుడితో సంబంధం పెట్టుకునే విషయం ఆమె భర్త ‘సమ్మతి లేదా అర్ధాంగీకారం’పై ఆధారపడి ఉంటుందని చెప్పడం... వివాహిత మహిళను ఒక సొంత ఆస్తి/ గృహోపకరణంగా చూడడమేనని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం అభిప్రాయపడింది. రాజ్యాంగపరంగా సెక్షన్-497 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌పై బుధవారం మొదలైన ధర్మాసనం విచారణ గురువారమూ కొనసాగింది. 158 ఏళ్ల క్రితం రూపొందిన ఈ సెక్షన్‌పై కొన్ని వ్యాఖ్యలు చేసింది. భర్త సమ్మతి ఉంటే వివాహేతర సంబంధం నేరం కాదనే అంశాన్ని సూక్ష్మంగా విశ్లేషించింది. ‘వేరొకరి భార్య అని తెలిసినప్పుడు, లేదా అలా విశ్వసించేందుకు తగిన కారణాలు ఉన్నప్పుడు, అతని అనుమతి లేకుండా ఆమెతో పరాయి వివాహితుడు లైంగిక చర్యలో పాల్గొనడం వ్యభిచార నేరమే’ అని ఈ సెక్షన్ చెబుతోంది. ‘ఇక్కడ వివాహ వ్యవస్థ పవిత్రత కచ్చితంగా ఉంది. నిబంధన రూపొందించిన తీరు మాత్రం సమానత్వ హక్కుకు భిన్నంగా ఉంది. దీనిని ఆ కోణంలో పరిశీలిస్తాం’ అని తెలిపింది. వివాహేతర సంబంధాల్లో పురుషుడినే అపరాధిగా పరిగణించి, స్త్రీని విడిచిపెట్టేయడం తగదని పిటిషనర్ తరఫు న్యాయవాది కలీశ్వరం రాజ్ వాదించారు.

ఏమిటీ సెక్షన్ 497

“మరో పురుషుడి భార్య అని తెలిసీ.. ఆ పురుషుడి సమ్మతి లేకుండా సదరు స్త్రీతో లైంగిక చర్యలో పాల్గొంటే.. అది అత్యాచారం కాకపోతే.. దాన్ని వ్యభిచార నేరంగా పరిగణించాల్సి వస్తుంది. దీనికి పాల్పడిన పురుషుడికి 5 ఏళ్ల వరకూ జైలు శిక్ష, జరిమానా విధించొచ్చు. అయితే ఈ కేసులో స్త్రీని మాత్రం సహాయకారిగా శిక్షించటానికి లేదు.

విమర్శలు

- ‘భర్త సమ్మతి’ అనటం ద్వారా స్త్రీని భర్త ఆస్తిలా పరిగణించటం లింగ వివక్షకు తావిస్తోంది.
- వ్యభిచార నేరం కింద కేవలం పురుషుడిని మాత్రమే శిక్షార్హుడిని చేయటం కూడా వివక్షాపూరితమే.

రైల్వేలో 60 వేల ఉద్యోగాలు

దిల్లీ: రైల్వేలో అసిస్టెంట్ లోకో పైలెట్, టెక్నీషియన్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న లక్షలాది మంది అభ్యర్థులకు రైల్వేశాఖ తీపి కబురు చెప్పింది. ఆయా ఖాళీలను రెట్టింపునకు పైగా పెంచుతున్నట్లు వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రైల్వేశాఖ ఇచ్చిన ఉద్యోగ ప్రకటనలో 26,502 ఖాళీలున్నట్లు వెల్లడించగా.. ఆ సంఖ్యను తాజాగా 60,000కు పెంచినట్లు రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ గురువారం ప్రకటించారు. ఈ ఉద్యోగాలకు గాను తొలిదశగా ఆగస్టు 9న నిర్వహించనున్న కంప్యూటర్ ఆధారిత పరీక్షకు దేశవ్యాప్తంగా 47.56 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. రైల్వేమంత్రి తాజా ప్రకటనతో వారికి ఉద్యోగావకాశాలు చాలా మేర మెరుగవుతాయి. ఉద్యోగ ప్రకటన వెలువరించిన తర్వాత వివిధ రైల్వేజోన్లలో మరిన్ని ఖాళీలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష కేంద్రాల కేటాయింపునకు సంబంధించి అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. కొన్నిచోట్ల దూర ప్రాంతాల్లో కేంద్రాలను కేటాయించినట్లు అభ్యర్థుల నుంచి ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఈమేరకు వివరణ ఇచ్చింది. అభ్యర్థులకు రైల్వేశాఖ జులై 26నే ఆన్‌లైన్ లింక్‌ను అందుబాటులో ఉంచింది. పరీక్షకు 4రోజుల ముందు హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ద్విచక్ర వాహనాలకూ గూగుల్ మార్గసూచీ

(మొదటి పేజీ తరువాయి)

అని సంస్థ ప్రోగ్రామ్ మేనేజర్ అనల్ ఘోష్ తెలిపారు.

- గూగుల్ మ్యాప్స్‌కు సంబంధించిన ద్విచక్ర వాహన మోడ్‌ను భారత్‌లోనే తొలుత ప్రవేశపెడుతున్నారు. దేశంలోని రిజిస్టర్డ్ వాహనాల్లో 70 శాతం వాటా వీటిదే కావడం ఇందుకు కారణం. కార్లు, బస్సులు, ట్రక్కులు ప్రయాణించలేని దగ్గర దారులను ఈ మోడ్‌లో చూడొచ్చు.
- ఒక్కో వ్యక్తికి ప్రత్యేకమైన ట్రాఫిక్, ఆగమన సమయ అంచనాలనూ ఇది అందిస్తుంది.
- రైళ్లు, బస్సు, మెట్రో సమాచారాన్ని అందిస్తుంది. 12వేల రైళ్ల షెడ్యూళ్లను తెలియజేస్తుంది.
- దేశంలోని వివిధ నగరాల్లో ప్రజా మరుగుదొడ్ల వివరాలను తెలియజేసేందుకు కేంద్ర పట్టణ, గృహ నిర్మాణ శాఖతో గూగుల్ పని చేస్తోంది.

SI & కానిస్టేబుల్స్ VRO/Gr-IV/RPF
22 సం.లుగా వేలాది విద్యార్థులను SI కానిస్టేబుల్స్‌గా తీర్చిదిద్దిన భాగ్యకిరణ్ సార్ గైడెన్స్‌లో
New Batches 3-8-18 ప్రారంభం
భాగ్యకిరణ్ ఇనిస్టిట్యూట్ DSNR 9603290758

VRO/SI/CONSTABLE/GR-IV (For All TSPSC/APPSC Exams)
పర్యావరణం-సుస్థిరాభివృద్ధి By ప్రసన్న హరికృష్ణ
2 DAYS PROGRAMME Aug. 5th & 6th
ENGLISH డా॥ కొండా నాగేశ్వర్ 6 DAYS PROGRAMME
FREE DEMO Aug. 4th @ 5pm
Winners STUDY CIRCLE సహారా బేకరి ఎదురుగా అశోక్ నగర్, హైదరాబాద్ 9642006090

గురుకుల టీచర్స్
TGT/PGT/JL'S/DL'S
TET-DSC-TS AP-C-TET
Paper- I, II, SGT, SA(All Sub.), TPT, PET, HPT
GURUKUL-2017లో అన్ని సబ్జెక్ట్‌లలో స్టేట్ ర్యాంక్స్‌తో పాటు వేలాది మందిని TGT, PGT, TPT, PET, PD లుగా తీర్చిదిద్దిన సంస్థ మాదే.
మా ప్రత్యేకతలు:- డైలీ టెస్టులు నిర్వహించబడును, హాస్టల్ వసతి కలదు.
అత్యుత్తమ అధ్యాపక బృందంచే డైరెక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ సారథ్యంలో బోధన
FREE DEMO :05-8-2018@10.08AM
RAMAIAH Dilsukhnagar, HYDERABAD Cell:8885555202
Competitive Coaching Centre 9246208422, 040-66778422

సీట్లకు పాట్లే

- బీటెక్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న బ్రాంచి కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ). ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న సీఎస్ఈ సీట్లు కేవలం 400. సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లను కూడా పరిగణలోకి తీసుకుంటే మరో 170 అదనం. అంతా కలిపి 570 సీట్లు. విచిత్రమేమింటే ఒక్క కేశవ్ మెమోరియల్ కళాశాలలోనే 420 కంప్యూటర్ సైన్స్ సీట్లున్నాయి. అదే కళాశాలలో మరో 60 ఐటీ సీట్లున్నాయి. ఇక గోకరాజు రంగరాజు కళాశాలలోనే 360 కంప్యూటర్ సైన్స్ సీట్లు, 180 ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) సీట్లున్నాయి. అంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలల్లోని కంప్యూటర్ సీట్లన్నీ ఒక్క ప్రైవేట్ కళాశాలలో ఉండటం గమనార్హం.

(మొదటి పేజీ తరువాయి)

ప్రైవేట్ కళాశాలల్లో అయితే గరిష్ఠంగా రూ.2 లక్షలు చెల్లించాలి. 1929లో ప్రారంభమైన ఓయూ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలల్లో అన్ని బీటెక్ సీట్లు కలిపి కేవలం 420 మాత్రమే. జేఎన్‌టీయూహెచ్ గత 10 సంవత్సరాల్లో జగిత్యాల, పెద్దపల్లి, మెదక్ జిల్లాల్లో మూడు ఇంజినీరింగ్ కళాశాలలను నెలకొల్పింది. కాకతీయ వర్సిటీకి వరంగల్ రెండు కళాశాలలు, కొత్తగూడెంలో మరో ఇంజినీరింగ్ కళాశాల ఉన్నాయి. మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం, ఇతర వర్సిటీల్లో ఉన్న 14 కళాశాలల్లో కలిపి మొత్తం సీట్లు 3,055. విచిత్రమేమిటంటే పలు ప్రైవేట్ కళాశాలల్లో ఒక్కో దాంట్లో 1000కి పైగా సీట్లున్నాయి. రాష్ట్రంలోని 170 ప్రైవేట్ కళాశాలల్లో 87,900 ఇంజినీరింగ్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. అంటే ప్రభుత్వ సీట్ల కంటే 29 రెట్లు అధికంగా ప్రైవేట్ కళాశాలల్లో ఉన్నాయి. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉన్నదే అరకొర సీట్లు కాగా అందులోనూ 955 సీట్లు సెల్ఫ్ ఫైనాన్స్ విధానంలో ఉండటం గమనార్హం.

బోధనా రుసుములకు మాత్రం రూ.600 కోట్లు

ఇంజినీరింగ్ కన్వీనర్ కోటాలో ఏటా 60 వేల మంది వరకు చేరుతున్నారు. వారిలో 80 శాతంమంది బోధనా రుసుములు (ఫీజు రీఎంబర్స్‌మెంట్) పొందుతున్నారు. అంటే సుమారు 48,000 మందికి ప్రభుత్వమే బోధనా రుసుం చెల్లిస్తుంది. 10 వేల ర్యాంకు లోపు ఉన్న వారికి మొత్తం ఫీజు చెల్లిస్తారు. ఇలా ఏడాదికి రూ.550 కోట్ల నుంచి రూ.600 చెట్లు చెల్లిస్తున్నారు. వాటితో ఏటా రెండు ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు నెలకొల్పవచ్చు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత కొత్తగా ఒక్క ఇంజినీరింగ్ కళాశాల కూడా ప్రారంభించలేదు. బాసర ఆర్‌జేయూకేటీలో మాత్రం ఈ విద్యా సంవత్సరం 500 సీట్లు పెంచారు. బోధనా సిబ్బంది, నిధులే సమస్యని, రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తే సీట్లు పెంచవచ్చని వర్సిటీ ఉపకులపతులు చెబుతున్నారు.

తెలంగాణలోని ప్రభుత్వ కళాశాలలు, వాటిలోని సీట్ల పరిస్థితి

విశ్వవిద్యాలయం	కళాశాలలు	మొత్తం సీట్లు
జేఎన్‌టీయూ	4	1380
ఓయూ	2	420
కాకతీయ	3	825
మహాత్మాగాంధీ	1	180
జయశంకర్ వ్యవసాయ	2	70
పీవీ వెటర్నరీ వర్సిటీ	1	20
జేఎన్ఏఎఫ్	1	160
మొత్తం	14	3055

సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లు (మొత్తం 3,055 సీట్లలో)

విశ్వవిద్యాలయం/కళాశాల	సీట్లు
మహాత్మాగాంధీ వర్సిటీ (3 బ్రాంచీలు)	180
జేఎన్‌టీయూహెచ్ (అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్)	150
కేయూ మహిళా కళాశాల (4 బ్రాంచీలు)	240
కేయూ కొత్తగూడెం కళాశాల(2 బ్రాంచీలు)	120
మొత్తం	690

(గమనిక: వార్షిక రుసుం రూ. 35 వేలు)

గ్రహం అనుగ్రహం

3–8–2018 శుక్రవారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం
గ్రీష్మ రుతువు; ఆషాఢ మాసం; బహుళ పక్షం
షష్ఠి: ఉ. 7-44 తదుపరి సప్తమి
రేవతి: ఉ. 11-55 తదుపరి అశ్విని
అమృత ఘడియలు: ఉ. 8-47 నుంచి 10-26 వరకు తిరిగి తె. 4-14 నుంచి
వర్జ్యం: లేదు
దుర్ముహూర్తం: ఉ. 8-15 నుంచి 9-07 వరకు తిరిగి మ. 12-31 నుంచి 1-22 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.5-42; సూర్యాస్తమయం: సా.6-29

కాగజ్‌నగర్ బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జోగు రామన్న, ఎంపీ నగేష్, ఎమ్మెల్యేలు కోనప్ప, కోవ లక్ష్మి, దివాకర్‌రావు, ప్రభుత్వ సలహాదారు వివేక్, తదితరులు ★ సభకు హాజరైన ప్రజలు

పరిశ్రమల విస్తరణకు మూడంచెల వ్యూహం

- మూడు నెలల్లో కాగజ్‌నగర్ పేపర్ మిల్లులో ఉత్పత్తి
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ వెల్లడి
- పేపర్ మిల్లులో పునఃప్రారంభ పూజలు

ఈనాడు డిజిటల్, ఆసిఫాబాద్: సిర్పూర్-కాగజ్‌నగర్ పేపర్ మిల్లులో మూడు నెలల్లోగా కాగితం ఉత్పత్తి ప్రారంభించి, కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపుతామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. కుమురం భీం జిల్లాలోని కాగజ్‌నగర్‌లో గురువారం పేపర్ మిల్లు పునః ప్రారంభ పూజలతోపాటు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. యువతకు కొలువుల కల్పనే లక్ష్యంగా తెలంగాణ సరికొత్త పారిశ్రామిక విధానం టీఎస్ ఐపాస్ ద్వారా రూ.1.23 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. ఇందులో అధిక భాగం స్థానిక, గ్రామీణ ప్రాంత యువకుల ఉపాధికే కేటాయించనున్నట్లు వెల్లడించారు. రూ.30 వేల కోట్ల వార్షిక టర్నోవర్ కలిగిన జేకే సంస్థ ఆధ్వర్యంలో సిర్పూర్-కాగజ్‌నగర్ పేపర్‌మిల్లుకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. మిల్లు పునఃప్రారంభానికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బాగా కష్టపడ్డారని కొనియాడారు. రాష్ట్రంలో మూతపడిన పరిశ్రమలను తెరిపించడంతోపాటు, ఉన్న పరిశ్రమలను కాపాడుకుంటూ మరింత విస్తరించడానికి మూడంచెల వ్యూహాన్ని అమలు చేస్తున్నామన్నారు. మంచిర్యాల జిల్లాలో ఉన్న ఒరియంట్ సిమెంటు కర్మాగార అధిపతి బిర్లాను ఒప్పించి రూ.2 వేల కోట్ల పెట్టుబడులతో వేల మంది స్థానిక యువతకు ఉపాధి కల్పిస్తామని తెలిపారు. రామగుండం ఎరువుల కర్మాగారం, ఆదిలాబాద్‌లోని సీసీఐ సిమెంటు కర్మాగారం, జయశంకర్ జిల్లా కమలాపూర్‌లోని ఏపీరేయాన్స్(బిల్ట్) పరిశ్రమ ప్రారంభానికి జరుగుతున్న కృషిని మంత్రి కేటీఆర్ వివరించారు. ఇంటింటికి తాగునీరు అందించి, ప్రజల దాహార్తి తీర్చే మిషన్ భగీరథ పథకంలో తమకు నీళ్లు కనిపిస్తుంటే, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వారి నైజం ప్రకారం కమీషన్లు కనిపిస్తున్నాయని మంత్రి కేటీఆర్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గద్దె దించుతామంటున్న కాంగ్రెస్ పార్టీ నేతల వ్యాఖ్యలను దుయ్యబట్టారు. కార్మిక పక్షపాతిగా నిలవటంతో పాటు రూ.40 వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ పేదవాని మోములో చిరునవ్వుకు కారణమైనందుకు కేసీఆర్‌ను గద్దె దించుతారా అని నిలదీశారు. కాగజ్‌నగర్‌లో 480 రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేశామని గృహ నిర్మాణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి తెలిపారు. ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు ఉన్న గిరిజన రైతులకూ రైతుబీమా వర్తింపచేస్తామని, 2014 జూన్ 02 పూర్వం సాగు చేస్తున్న అటవీ భూముల జోలికి వెళ్లమని అటవీశాఖ మంత్రి జోగురామన్న వివరించారు.

హైదరాబాద్ చుట్టూ కూరగాయల విక్రయ కేంద్రాలు: మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ మహా నగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) స్థలాలు చూపితే నగరం చుట్టూ కూరగాయల విక్రయ కేంద్రాలు ఏర్పాటుచేస్తామని వ్యవసాయ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మార్కెటింగ్ శాఖ ద్వారా ఈ విక్రయ కేంద్రాలు ఏర్పాటవుతాయన్నారు. రైతులు తాము పండించిన కూరగాయలను అమ్ముకునేందుకు నేరుగా ఈ కేంద్రాలకు తెస్తారని.. వినియోగదారులకు తక్కువ ధరలకే దొరుకుతాయని, దళారుల బెడద ఉండదని చెప్పారు. గురువారం తన నివాసంలో ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు 30 కిలోమీటర్ల పరిధిలో కూరగాయల పంటకాలనీలు ఏర్పాటుచేస్తామన్నారు.

విద్యుత్ తాత్కాలిక కార్మికుల వేతనాల పెంపుపై పరిశీలన

ఉత్తర తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లో 'అన్‌మాన్డ్ డిస్ట్రిబ్యూషన్' పేరుతో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న 1650 మంది వేతనాల పెంపుపై విద్యుత్ సంస్థల యాజమాన్యాలు పరిశీలిస్తున్నాయి. వీరికి ప్రస్తుతం నెలకు రూ.4 వేల వేతనం ఇస్తున్నారు. వీరు చేసే పనులనే చేస్తూ ఆర్టిజన్ పేరుతో ఒప్పంద కార్మికులుగా పనిచేస్తున్న వారి వేతనాలను ఇటీవల పెంచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉత్తర డిస్కంలోని వారి వేతనాలను సైతం పెంచాలని విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘాలు కోరాయి. త్వరలో జరిగే 'రాష్ట్ర విద్యుత్ సమన్వయ కమిటీ' సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని అధికారులు చెప్పారని రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం నేత సాయిబాబు తెలిపారు.

CAT '18/19
2525*
T.I.M.E. students into the IIMs in CAT 2017
*Results validated by VSMB & Associates on 28/07/2018
• 300+ classroom teaching hours
• 5000+ pages of quality material
• AIMCATs - India's leading Mock CAT series
• Essay, Group Discussion & Interview Practice
Batches starting on 3rd & 4th August. Enrol Today!
T.I.M.E. Triumphant Institute of Management Education Pvt. Ltd.
Tel: 40088300/ 40088400
MAT batches are in progess. Enrol Today!

'అడ్వాన్స్‌డ్'లో అర్హత సాధించింది 18,138 మందే

- ప్రభుత్వ జోక్యంతో జాబితాను సవరించిన ఐఐటీ మండలి
- రాజ్యసభలో జావడేకర్ వెల్లడి

దిల్లీ: ఈ ఏడాది 18,138 మంది అభ్యర్థులు మాత్రమే ఐఐటీ-జేఈఈ(అడ్వాన్స్‌డ్) పరీక్షలో అర్హత సాధించారని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. దీంతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించిన సీట్లు భర్తీ అయ్యేలా ప్రభుత్వం జోక్యం చేసుకుందని వెల్లడించారు. రాజ్యసభలో గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో జావడేకర్ పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. గతేడాది 51,040 మంది అభ్యర్థులు ఐఐటీ-జేఈఈ(అడ్వాన్స్‌డ్) పరీక్షలో అర్హత సాధించారని.. ఈ ఏడాది ఆ సంఖ్య 18,138కి తగ్గిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు కేటాయించిన సీట్లు భర్తీ అయ్యేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఐఐటీ మండలిని తాము ఆదేశించినట్లు తెలిపారు. దీంతో 31,988 మందితో విస్తృత జాబితాను వారు విడుదల చేశారన్నారు. ప్రభుత్వ ముందుచూపుతో ఈ ఏడాది 11,961 సీట్లు భర్తీ అయ్యాయని.. గతేడాది కేవలం 10,876 సీట్లే నిండాయని వివరించారు. ఈ ఏడాది కేవలం 118 సీట్లు ఖాళీగా మిగిలాయని చెప్పారు. మరోవైపు, ఐఐటీల్లో మహిళల సంఖ్య పెరుగుతోందని జావడేకర్ తెలిపారు. గతేడాది ఐఐటీల్లో విద్యార్థినుల శాతం 9.15 శాతంగా ఉందని.. ఈ ఏడాది 15.29 శాతానికి పెరిగిందని వెల్లడించారు.

మార్చి 31లోగా బకాయిలన్నీ చెల్లిస్తాం: ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన పోస్ట్ మెట్రిక్ ఉపకారవేతనాలకు సంబంధించిన బకాయిలను ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు(2019 మార్చి 31)లోపు తప్పకుండా విడుదల చేస్తామని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతశాఖ సహాయమంత్రి విజయ్ సాంప్లా రాజ్యసభలో తెలిపారు.

శ్రీవారిని దర్శించుకున్న కేసీఆర్ కుటుంబ సభ్యులు



శైలిమకు శ్రీవారి తీర్థ ప్రసాదాలను అందచేస్తున్న తిరుమల జేఈవో శ్రీనివాసరాజు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి తెలంగాణ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు కుటుంబసభ్యులు గురువారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ ప్రారంభ దర్శన సమయంలో స్వామివారి సేవలో ముఖ్యమంత్రి కోడలు, తెలంగాణ మంత్రి కె.టి.రామారావు సతీమణి శైలిమ, మనవడు హిమాన్షు, మనవరాలు అలేఖ్య పాల్గొన్నారు. శ్రీవారి దర్శనానంతరం మందిరంలోని రంగనాయకుల మండపానికి చేరుకోగా ఇక్కడ పండితులు వేదాశీర్వచనం చేశారు. శ్రీవారి తీర్థ ప్రసాదాలను తిరుమల జేఈవో శ్రీనివాసరాజు అందచేసి సత్కరించారు.

తెలుగు మాధ్యమం డిగ్రీ విద్యార్థులు 10 శాతమే

- ఓయూ పరిధిలో ఇదీ పరిస్థితి
- రాష్ట్రవ్యాప్తంగా సగటూ 19 శాతమే

ఈనాడు, హైదరాబాద్: సంప్రదాయ డిగ్రీ కోర్సులైన బీఏ, బీకాం, బీఎస్సీలో తెలుగు మాధ్యమం ఎంచుకునే వారు కేవలం 19శాతమే ఉన్నారు. అత్యధికంగా పాలమూరు వర్సిటీ పరిధిలో దాదాపు 44% మంది ఉండగా అత్యల్పంగా ఓయూ పరిధిలో 10.21 శాతమే ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి దోస్త్ ద్వారా డిగ్రీ కళాశాలల్లో 2,00,065 మంది ప్రవేశాలు పొందారు. వారిలో ఉర్దూ, హిందీ, మరాఠీమాధ్యమంలో 1576మంది ఉన్నారు. ఓయూ పరిధిలో పాత హైదరాబాద్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని కళాశాలలున్నాయి. ఒక్క గ్రేటర్ హైదరాబాద్ పరిధినే పరిగణనలోకి తీసుకుంటే తెలుగుమాధ్యమంలో చేరేవారు నాలుగైదు శాతానికి మించరని అధికారుల అంచనా. ఇక దోస్త్ పరిధిలో లేని కళాశాలల్లో మరో 15వేల సీట్లుండగా వాటిల్లో అంతా ఆంగ్ల మాధ్యమమే. వాటిని కూడా కలిపి చూస్తే జీహెచ్ఎంసీ పరిధిలో ఒకటిరెండు శాతం లోపే తెలుగు మాధ్యమం విద్యార్థులు ఉంటారని చెబుతున్నారు.

వర్సిటీల వారీగా ఇదీ పరిస్థితి...

విశ్వ విద్యాలయం	ఆంగ్ల మాధ్యమం	తెలుగు మాధ్యమం	మొత్తం
ఓయూ	71,626(89.79)	8,138(10.21)	79,764
కేయూ	39,036(75.18)	12,884(24.82)	51,920
మహాత్మాగాంధీ	10,864(73.35)	3,947(26.65)	14,811
పాలమూరు	8,632(56.13)	6,745(43.87)	15,377
శాతవాహన	19,019(88.34)	2,510(11.66)	21,529
తెలంగాణ	11,776(78)	3,312(22)	15,088
మొత్తం	**1,60,953(81)**	**37,536(19)**	**1,98,489**

(గమనిక: బ్రాకెట్లలో పేర్కొంది శాతం.... ఉర్దులో 1522, హిందీ-49, మరాఠీ మాధ్యమంలో అయిదుగురు చేరారు)

నేడు శ్రీవారి ఆర్జిత సేవా టిక్కెట్ల విడుదల

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టిక్కెట్లను తితిదే శుక్రవారం విడుదల చేయనుంది. నవంబరు మాసానికి సంబంధించి వివిధ ఆర్జిత సేవా టిక్కెట్లను www.tirumala.org వెబ్‌సైట్ ద్వారా ఉదయం 10నుంచి అందుబాటులోకి తీసుకురానుంది. శ్రీవారి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన, నిజపాద దర్శనం టిక్కెట్లను డిప్ విధానంలో భక్తులను ఎంపిక చేసి కేటాయించనుంది. విశేషపూజ, కల్యాణోత్సవం, డోలోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం, వసంతోత్సవం, సహస్రదీపాలంకరణ సేవా టిక్కెట్లను మాత్రం వెంటనే బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది. సేవా టిక్కెట్లన్నీ కలిపి దాదాపు 50 వేలకుపైగా విడుదల చేయనుంది. తిరుమల అన్నమయ్య భవనం నుంచి శుక్రవారం ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్య డయల్ తితిదే ఈవో కార్యక్రమం జరగనుంది. భక్తులు తమ సందేహాలు, సూచనలు, సలహాలను 0877- 2263261 నెంబరుకు ఫోన్ చేసి దేవస్థానం ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో పంచుకోవచ్చు.

మెరుగైన న్యాయ పాలనకు 'సుప్రీం' మార్గదర్శకాలు

కోర్టు మాస్టర్లుగా ఎంబీఏ పట్టభద్రులను నియమిస్తే మేలు

దిల్లీ: దేశవ్యాప్తంగా కోర్టుల నిర్వహణను మెరుగుపరిచి, మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా పలు చర్యలు చేపట్టాలంటూ... రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీచేసింది. న్యాయస్థాన సముదాయాల్లో సీసీటీవీలు, దృశ్యమాధ్యమ విచారణకు ఏర్పాట్లు, జైళ్లతో అనుసంధానం తదితర సదుపాయాల కల్పన... కోర్టు మాస్టర్లుగా ఎంబీఏ పట్టభద్రుల నియామకం వంటి సూచనలు ఇందులో ఉన్నాయి. తదనుగుణ 'అభివృద్ధి ప్రణాళిక' రూపకల్పనకు ఓ కమిటీని ఏర్పాటుచేయాలనీ... హైకోర్టు అధికారి, న్యాయశాఖ కార్యదర్శి ఇందులో సభ్యులుగా ఉండాలని సూచిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు ఆదేశాలిచ్చింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఈ సూచనలు చేసింది.

ఆదివాసీలకు 'కేసీఆర్ కిట్' నిబంధనల సడలింపు

- గరిష్ఠంగా రెండు కాన్పుల షరతు ఎత్తివేత
- తెలంగాణ సర్కారు ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: అంతరించిపోతున్న కొన్ని ఆదివాసీ జాతుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం 'కేసీఆర్ కిట్' నిబంధనలను సడలించింది. గరిష్ఠంగా రెండు కాన్పులకే ఈ పథకం వర్తిస్తుందనే షరతును ఎత్తేసింది. సాధారణ ప్రజలతో.. వీరి జీవన విధానాన్ని పోల్చలేమనే కారణంతో ఈ వెసులుబాటు కల్పించినట్లు గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆదివాసీ జాతులను సంరక్షించుకోవడమే లక్ష్యంగా తక్షణమే ఈ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని వైద్యఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి శాంతికుమారి తెలిపారు. దీని వల్ల దాదాపు 22 వేల మందికిపైగా ఆదివాసీ మహిళలు లబ్ధి పొందనున్నారు. చెంచు, కొలాం, తోటి, కొండరెడ్డి తెగలకు ఈ సడలింపు వర్తిస్తుంది. కాన్పుల సంఖ్యతో సంబంధం లేకుండా ఎన్ని ప్రసవాలు జరిగినా.. ఈ పథకం కింద అబ్బాయి పుడితే రూ.12 వేలు, అమ్మాయి పుడితే రూ.13 వేల చొప్పున నాలుగు విడతలుగా గర్భిణి బ్యాంకు ఖాతాలోనే నేరుగా జమచేస్తారు. ప్రసవించిన ప్రతిసారీ తల్లీబిడ్డలకు 16 రకాల వస్తువులతో కూడిన కేసీఆర్ కిట్‌ను అందిస్తారు. లబ్ధిపొందనున్న వారి సమాచారాన్ని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

13 అంశాలను విచారిస్తాం

- ఒడిశా దావాలో సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఒడిశా దాఖలు చేసిన ఒరిజనల్ సూట్‌లో విచారణ అంశాలను సుప్రీంకోర్టు ఖరారు చేసింది. రాష్ట్రాలు, కేంద్రం ఇచ్చిన అంశాలను పరిశీలించిన జస్టిస్ మదన్ బిలోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాల ధర్మాసనం గురువారం 13 విచారణ అంశాలను ఖరారు చేసింది. తొలుత ప్రతులను అందరికీ ఇచ్చి మార్పులు చేర్పులు ఉంటే సూచించాలని ధర్మాసనం ఆదేశించింది. అన్ని పార్టీలు ధర్మాసనం సూచించిన విచారణ అంశాలతో దాదాపుగా ఏకీభవించాయి. రాష్ట్రం నుంచి మరికొన్ని దస్త్రాలు అందజేయడానికి అనుమతి ఇవ్వాలని ఒడిశా తరఫు సీనియర్ న్యాయవాది గోపాల సుబ్రహ్మణ్యం విజ్ఞప్తిని అంగీకరించిన ధర్మాసనం రెండు వారాలు గడువు ఇచ్చింది. రాష్ట్రాలు, కేంద్రం ఏవైనా దస్త్రాలు దాఖలు చేయాలనుకుంటే మరో రెండు వారాల్లోగా అందజేయాలని.. నాలుగు వారాల తర్వాత కేసు విచారణ తేదీ నిర్ణయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. పనుల నిలుపుదల ఉత్తర్వులపై పదేపదే స్టేను పొడిగించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఒడిశా తరఫు న్యాయవాది గోపాల సుబ్రహ్మణ్యం ఇంటర్‌లొక్యుటరీ అప్లికేషన్ దాఖలు చేశారు. దీనిపై మూడు వారాల్లోగా కౌంటరు దాఖలు చేయాలని ఏపీ ప్రభుత్వం, కేంద్రానికి ధర్మాసనం ఆదేశాలిచ్చింది. తెలంగాణ దాఖలు చేసిన లిఖితపూర్వక స్టేట్‌మెంట్‌పై కౌంటరు దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి ధర్మాసనం అనుమతిచ్చింది.

విచారణాంశాలు ఇవే..

- ఆర్టికల్ 262 ప్రకారం ఈ తరహా దావాలను విచారణకు తీసుకోకూడదా?
- విభజన చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం పోలవరం ప్రాజెక్టును ప్రశ్నించే అధికారం తెలంగాణకు లేదా?
- ప్రాజెక్టు ఎగువన నిర్మించే ఇచ్చంపల్లి, భూపాలపట్నం ప్రాజెక్టులు పోలవరంలో భాగమా? అయితే వాటి ప్రభావం ఎంత?
- పోలవరం ప్రాజెక్టుకి సీడబ్ల్యూసీ అనుమతి ఇచ్చిందా.. ఇస్తే అది అవార్డుకు లోబడి ఉందా లేదా ?
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలపై నిల్వ జలాల ప్రభావం అధ్యయనం చేయకుండానే నమూనా రూపొందించారా ?
- నీటి విడుదల సామర్థ్యం 36 లక్షల నుంచి 50 లక్షల క్యూసెక్కులకు పెంచుతూ సీడబ్ల్యూసీ ఇచ్చిన అనుమతి గోదావరి ట్రైబ్యునల్‌ను ఉల్లంఘన చేసినట్లా?
- నమూనా మార్చడం వల్ల మళ్లీ తాజాగా పర్యావరణ అనుమతులు తీసుకోవాలా ?
- నమూనా మార్చడం వల్ల అటవీ భూములు ఏమైనా తీసుకున్నారా? దీనివల్ల ఇతర రాష్ట్రాల్లోని గిరిజనులపై ప్రభావం చూపుతుందా?
- 1980 అటవీ చట్టం అనుమతి ఉందా ?
- పోలవరం ప్రాజెక్టు, ఇతరత్రా నిర్మాణాల వల్ల ఆయా రాష్ట్రాల భూభాగంలో పర్యావరణ ప్రభావం పడుతుందా.. ఒకవేళ పడితే దానికి ఏం చర్యలు తీసుకున్నారు ?
- ప్రభావిత ప్రాంతాల్లో బహిరంగ విచారణ జరపకుండా ప్రాజెక్టు అనుమతి ఇవ్వడం వల్ల ఏమైనా ప్రభావం ఉంటుందా?
- ☛ గోపాలకృష్ణన్ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నివేదిక దృష్ట్యా ఈ దావాను కొట్టివేయొచ్చా?

www.pnbhousing.com
pnb Housing Finance Limited
Ghar Ki Baat
FREEDOM TO OWN YOUR HOME WITH A MISSED CALL
902 901 36 36
HOME LOAN | LOAN AGAINST PROPERTY | FIXED DEPOSIT
SMS PNBHFL TO 56161

D.D. College
Affiliated to H.N.B Garhwal Central University
ADMISSION OPEN 2018-19
B.Sc. (Agriculture)
Fee Rs.24,000/ Per Semester
Hostel Available
25, NIMBUWALA, GARHI CANTT, DEHRADUN (U.K.)
0135-2750929, 7417555666
Web.: www.ddcollege.in

NEET PHYSICS
• 45 hrs. Planned Program (including study material & solutions)
• Daily 1hr. / Weekend / Complete week
• Batches Timings : 5am -10am OR 5pm-10pm (Students can choose any timings)
AVR GROUP OF INSTITUTIONS
9515124304, 9652636507

SREENIDHI INSTITUTE OF SCIENCE AND TECHNOLOGY
Yamnampet, Ghatkesar, Medchal - 501301
96406 66612 / 13, Website: www.sreenidhi.edu.in
ADMISSION NOTIFICATION FOR CATEGORY "B" SEATS FOR MBA, M.TECH COURSES FOR THE ACADEMIC YEAR 2018-19
Specialization (Intake) & Category "B" Seats
MBA (60)- 18, Electrical Power Engineering (18) - 5, Computer Science & Engineering (24) - 7, CAD/CAM (18) - 5, Computer Science (24) - 7, Thermal Engineering (24)- 7, Computer Networks & Information Security (24) - 7, Digital Systems & Computer Electronics (24) - 7
Applications are called for Admission into M.Tech Course under Category "B" for the Academic Year 2018-19 on or before 08.08.2018 in the college. Please bring originals along with Tuition Fee and Special fee. Please contact for details 98487 68681, 99515 06283.
Date: 02.08.2018 Secretary / Correspondent

VASAVI COLLEGE OF ENGINEERING
(Private Unaided Non-minority Autonomous Institution)
(Sponsored by Vasavi Academy of Education)
(Affiliated to Osmania University and Approved by the AICTE)
9-5-81, Ibrahimbagh, Hyderabad 500 031. Ph: +91-40-23146099, 23146107
SPOT ADMISSIONS
I Year B.E. TSEAMCET-2018
VACANCIES: Some seats are available in Mechanical Engineering. Interested candidates can report immediately for admission in the Admissions & Examinations Branch of the college. For other details in respect of original certificates required and tuition fee payable visit college website www.vce.ac.in.
Date: 03rd August, 2018 Principal

అతి పెద్ద అంతర్జాతీయ ప్లాస్టిక్స్ ఎక్స్‌పో
IPLEX '18 INTERNATIONAL PLASTICS EXPOSITION
AUGUST 3 4 5 6 2018 9th Edition
More than 250 Exhibitors
Live Demo of Running Machinery
AT HITEX EXHIBITION CENTRE, HYDERABAD
For details contact : IPLEX '18, 040-23203191 & 9030370464
www.iplex18.com

మీరు ధరించే ప్రతిదానికీ అతి మృదువైన సంరక్షణ.
BOSCH Invented for life
PowerWave
ప్రవేశపెడుతున్నాం కొత్త శ్రేణిలోని బాష్ టాప్‌లోడ్ వాషింగ్ మెషీన్స్. దీనిలోని Innovatively Designed Pulsator, మీ బట్టలని బాగా శుభ్రం చేసి, మీరు ప్రతిరోజూ ధరించే వాటికి నష్టం కలగకుండా చేస్తుంది.
www.bosch-home.in

ఒక బాష్ టాప్‌లోడ్ వాషింగ్ మెషీన్‌ని కొనండి, ఇక పొందండి:
Tickets worth ₹3,000* free bookmyshow
Testing Partner intertek
1-800-266-1880 (Customer Care) Monday-Saturday 8.00 am to 8.00 pm
Attractive Finance Offer Zero Down Payment^~ Zero cost on EMI
₹2,299/- pm onwards X 8 EMI^~
Other finance options with 12/4 EMI & 18/6 EMI
Available: Attractive finance schemes$ on select credit cards at no extra cost for 3, 6 and 9 months.
Available Range: Washing Machine | Washer Dryer | Tumble Dryer | Refrigerator | Dishwasher | Cooking Appliance
For Sales Enquiries Contact: Hyderabad: Anup Antony: 9966177088 / Nagaraj: 9885408989, Vijayawada: Sridhar Vedantam: 9848817174, Visakhapatnam: Rajasekhar: 8142089882, Rayalaseema: Nakul Kamat: 9177530066.
^~T&C of finance at sole discretion of Bajaj Finserv, Tata Capital Ltd., HDB Financial Services Ltd., Capital First, TVS Credit Services and Kotak Mahindra Prime Ltd. ~Available only on selected days. $T&C of credit card finance is available only on Pine Labs and worldline. Offer available at selected towns & outlets only. *+T&C Apply. Bookmyshow offer is not applicable on Bosch Topload Washing Machine – 6.5kg models.
BoschHomeIn

ఈనాడు
నకిలీ చదువులు

దేశంలో పలుచోట్ల యంత్ర(ఇంజినీరింగ్)విద్యకు నకిలీల తుప్పు పడుతోంది. లోకొసభలో ఒక ప్రశ్నకు కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాధానం, ఈ యదార్థాన్ని నిర్ధారిస్తోంది. అత్యంత నాణ్యమైన సాంకేతిక విద్యను అన్ని సామాజిక వర్గాల వారికి అందించి, అంతర్జాతీయ స్థాయిలో రాణించగల మానవ వనరులను రూపొందించడమే ధ్యేయంగా విద్యుక్త ధర్మమని అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ప్రస్తావించడం చాటుకుంటుంది. ఆ మండలి నుంచి అధికారికంగా అనుమతులేవీ పొందకుండానే యథేచ్ఛగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న 'నకిలీ' ఇంజినీరింగ్ కళాశాలలు దేశంలో 277 పోగుపడ్డాయన్నది కేంద్రం చెప్పినమాట. అందులో 66 కళాశాలలతో దేశరాజధాని దిల్లీదే పెద్దవాటా. తెలంగాణ(35), పశ్చిమబంగ(27), కర్ణాటక(23), యూపీ(22)లతో పాటు ఇరవై రాష్ట్రాలు ఆ జాబితాలో చోటుచేసుకున్నాయి. సాంకేతికంగా పట్టాలు ప్రదానం చేసే అధికారం, అవకాశం లేని ఇంజినీరింగ్ కళాశాలలు పుట్టగొడుగుల్లా మొలుచుకొస్తుంటే- నియంత్రణ వ్యవస్థ ఏం వెలగబెడుతున్నట్లు? గుర్తింపు లేని సంస్థల్లో చదివి పొందే సర్టిఫికెట్లు విద్యార్థులకు ఎందుకూ కొరగావు. అది తెలిసీ అసంఖ్యాక విద్యార్థుల భవిష్యత్తుతో, జీవితాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ సంస్థలపై- అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మానవ వనరుల శాఖామాత్యులు ఏఐసీటీఈని తాజాగా ఆదేశించారట! మూడేళ్లుగా అవి నిక్షేపంగా కార్యకలాపాలు చక్కబెట్టుకుంటున్నా పట్టించుకోని యంత్రాంగం ఇప్పుడు తీరిగ్గా రంగంలోకి దిగినా, ఆయా కళాశాలల్లోని విద్యార్థులకు వాటిల్లిన నష్టాన్ని ఎవరు ఎలా పూడ్చగలరు?

పద్ధతిగా అన్ని రకాల అనుమతులూ పొంది నిర్వహిస్తున్న అనేకానేక ఇంజినీరింగ్ కళాశాలల గతితీరుపైనా ధీమాగా ఉండే వీల్లేదని లెక్కకు మిక్కిలి బాగోతాలు చాటుతున్నాయి. దేశంలో విశ్వవిద్యాలయాల అనుబద్ధత (ఎఫిలియేషన్), నిర్దిష్ట అనుమతులు కలిగిన ఇంజినీరింగ్ కళాశాలలు మూడువేల మూడు వందలకుపైనే ఉన్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఏటా 15 లక్షల మంది వరకు యంత్ర విద్యా పట్టభద్రులు కళాశాలల ప్రాంగణాల నుంచి వెలికి వస్తున్నారంటున్నారు, వారిలో ఉద్యోగార్హత కలిగినవారు నాలుగోవంతేనని మెకిన్సే సంస్థ అధ్యయనం తూర్పారబట్టింది. ఎనభై శాతందాకా ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో ఉద్యోగ విధుల నిర్వహణకు అవసరమైన లక్షణాలు కరవని, 95శాతం సాఫ్ట్‌వేర్ కొలువులకు పనికిరారని 'యాస్పైరింగ్ మైండ్స్' నివేదిక నిగ్గుతేల్చింది. దేశీయంగా ఇంజినీరింగ్ చదువులు దిగజారడానికి కారణాలేమిటో నిశితంగా పరిశీలించిన ఆచార్య ఎం.ఎస్.అనంత్ కమిటీ- వృత్తివిద్యా కళాశాలల బోధన స్థాయి మెరుగుపడాలని, మేలిమి మౌలిక వసతులు సమకూర్చుకోవాలని ఏనాడో ఉద్బోధించింది. సంవత్సరాల తరబడి సరైన దిద్దుబాటు చర్యలు కొరవడిన పర్యవసానంగానే, నేటికీ సుమారు 70శాతం ఇంజినీరింగ్ కళాశాలల్లో నాణ్యమైన విద్య కొల్లబోతోంది. లక్షలమంది పట్టభద్రుల్లో ఆచరణాత్మక జ్ఞానం లోపిస్తోంది. భారత క్షీర విప్లవ పితామహుడు వర్గీస్ కురియన్, నలుగురు దశాబ్దాలకుపైగా ప్రఖ్యాత స్టాన్‌ఫోర్డ్-కార్నెగీ మెలన్ సంస్థల్లో విశిష్ట సేవలందించిన రాజ్ రెడ్డి, జల నిర్వహణ కళలో మిన్నంటిన కె.ఎల్.రావు ప్రభృత దిగ్గజాలను జాతికందించిన గిండీ ఇంజినీరింగ్ కాలేజీ నెలకొని 225 ఏళ్లయింది. అందుకు దీటుగా రాణించేందుకు పోటీపడాల్సింది పోయి అత్యధిక ఇంజినీరింగ్ కళాశాలలు అన్నింటాలా చతికిలపడటం, ప్రమాణాలరీత్యా పెను సంక్షోభాన్ని ప్రస్ఫుటీకరిస్తోంది.

సరైన అనుమతులు లేని కళాశాలల ఉదంతం నాణేనికి ఒక పార్శ్వమే. నిబంధనల అనుసారం గుర్తింపు కలిగిన విద్యాసంస్థల్లో రెండు మూడు చోట్ల సేవలందిస్తున్న బోగస్ అధ్యాపకులు, అడ్డదారిలో పీహెచ్‌డీలు సంపాదించిన ప్రబుద్ధుల జోరు- అంతటిలోనే, నిశ్చేష్టపరిచేదే. బోధన సిబ్బందిలో అటువంటి భ్రష్ట కళాప్రావీణ్యుల ఉనికి అంతిమంగా మేలిమి విద్యా ప్రమాణాల సాధనకు ప్రధాన ప్రతిబంధకమవుతుంది. ఇప్పటికే ఇంజినీర్లలో అల్ప ఉద్యోగిత దేశీయ ఉత్పత్తి రంగ అభివృద్ధిని కుంగదీస్తోంది. ప్రపంచ తయారీ కేంద్రంగా భారత్ ఆవిర్భవించాలంటే ఇక్కడి యంత్ర విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగుపడి తీరాలి. అందుకోసం యోగ్యులు, నిత్య ప్రయోగశీలురైన అధ్యాపక బృందం ప్రాణావసరం. కేంబ్రిడ్జ్, హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫోర్డ్ వంటి విశ్వ విద్యాలయాలు; కాల్టెక్, మసాచుసెట్స్ ప్రభృత సాంకేతిక విజ్ఞాన సంస్థలు- ఎందరెందరినో నోబెల్ పురస్కార గ్రహీతలుగా తీర్చిదిద్దుతున్నాయి. సివిల్, మినరల్-మైనింగ్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాల్లో అత్యుత్తమ బోధనకు నెలవులైన ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయాలు ప్రపంచం నలుమూలల నుంచీ చదువరులను సూదంటురాయిలా ఆకర్షిస్తున్నాయి. అటువంటి నిబద్ధత, సన్నద్ధత ఇక్కడేదీ? ఇంజినీరింగ్ పట్టభద్రుల్ని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామంటున్న ఏఐసీటీఈ ఏడాది క్రితం దశ సూత్రావళి ప్రకటించింది. విద్యార్థులు మౌలికాంశాలపై పట్టు సాధించి భాషా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని, అధ్యాపకులు స్వీయ ప్రతిభకు సానపట్టుకోవాలని, కళాశాలలు నవకల్పనలకు అంకుర కేంద్రాలకు ఆలవాలం కావాలని అది పిలుపిచ్చింది. నినాదాలు, నిర్దేశాలతోనే లక్ష్యాలు నెరవేరవు. సమున్నత ప్రమాణాలు అమాంతం సాకారమైపోవు. రంగాలవారీగా వాస్తవిక అవసరాలను, భావి సవాళ్లను ఎప్పటికప్పుడు మదింపు వేస్తూ అందుకనుగుణంగా వ్యూహాలు రూపొందించి అమలుపరచాలి. నిపుణ శక్తుల సృజనలో ఇంజినీరింగ్ కళాశాలలు నిర్ణాయక భూమిక పోషించే వాతావరణమే- చదువుల చెదరంగాన్ని ప్రక్షాళించగలిగేది!

పట్టెడన్నానికి పడరాని పాట్లు

'ప్రపంచంలో అత్యధికంగా ఆహార సమస్య కలిగిన దేశం భారత్. ఇక్కడ సుమారు 50 కోట్ల మందికి సరైన తిండి దొరకడం లేదు. చిన్న పిల్లలు సైతం క్షుద్బాధను ఎదుర్కొంటున్నారు. ఆహారం అందక అనారోగ్యం ఇతర సమస్యలతో చాలా మంది మరణిస్తున్నారు'- భారత దేశ ఆకలి సూచిక (ఇండియా స్టేట్ హంగర్ ఇండెక్స్) తాజా నివేదికలో నిగ్గుతేలిన నిష్ఠుర సత్యాలివి. ఆహారభద్రత చట్టం అమలులోకి వచ్చినా దేశంలో ఇంకా ఆకలి మంటలు చల్లారలేదని ఈ నివేదిక స్పష్టీకరించింది. అన్నపూర్ణగా పేరొందిన దేశంలో అన్నమో రామచంద్రా అంటూ పేదలు కాలే కడుపులతో గడపాల్సిన దుస్థితి నెలకొంది. పాలకుల వైఫల్యాలకిది నిదర్శనంగా నిలుస్తుంది.

కనీస అవసరాలపై కొరవడిన శ్రద్ధ

ఒక పక్క దేశ జనాభా, స్థూల జాతీయోత్పత్తి, తలసరి వినియోగం పెరుగుతున్నాయి. పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధి, ఆహారధాన్యాల ఉత్పత్తిలోనూ పెరుగుదల కనపడుతోంది. అదే సమయంలో మరోపక్క పట్టెడన్నం కోసం పేదలు పడరాని పాట్లు పడుతున్నారు. ఆకలితో అలమటించేవారి సంఖ్య ఇంతలింతలవుతోంది. ప్రజల కనీస అవసరాలుగా కూడు, గూడు, దుస్తుల్ని రాజ్యాంగం గుర్తించింది. స్వాతంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ఇప్పటికీ ప్రజలకు సరిగ్గా తిండి లేదు. 19 కోట్ల మందికి పైగా తీవ్రమైన పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది. ఆహారభద్రత ర్యాంకుల పరంగా భారత్ ప్రపంచంలో 97వ స్థానాన ఉంది. పల్లెలు, పట్టణాలు, నగరాల్లోని కొంతమంది ప్రజలకు కనీస ఆహారం అందడం లేదు. 12 కోట్ల మందికి రోజూ భోజనం లభించడంలేదు. పేదరికం, ధరల పెరుగుదల ఈ సమస్యకు ప్రధాన కారణాలు. భూమి, ఉపాధి లేని నిరుపేదలు కాయకష్టంపై ఆధారపడి జీవిస్తున్నారు. కూలి దొరికిన రోజే బియ్యం, గోధుమలు ఇతర వస్తువులను కొనుగోలు చేయగల పరిస్థితి వారిది. తిండి అవసరాలను తీర్చుకునేందుకు కొంత మంది యాచన చేస్తున్నారు. ఏజెన్సీ, అటవీ ప్రాంతాల్లోని గిరిజనులకు సరైన ఆహారం లేక దుర్భర జీవితాలు గడుపుతున్నారు. పళ్లు, ఇతర అటవీ ఉత్పత్తులతో కడుపు నింపుకోవలసిన దుస్థితిలో వారున్నారు.

కేంద్ర ప్రభుత్వం 40 కోట్ల మంది కడుపు నింపాలనే లక్ష్యంతో 2013లో జాతీయ ఆహారభద్రత చట్టం తీసుకువచ్చింది. దీని కింద రాయితీ సరకులను అందించాల్సి ఉంది. 2013 జులై నుంచి పథకం అమలులోకి వచ్చినా పరిస్థితుల్లో ఆశించిన మార్పులు రాలేదు. ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న (బీపీఎల్) వారికి బియ్యం, గోధుమలను అందజేసేందుకు అంత్యోదయ అన్న యోజన, అన్నపూర్ణ వంటి పథకాలను అమలు చేస్తోంది. పిల్లల్లో పౌష్టికాహార లోపం నివారించేందుకు 12.65 లక్షల బడుల్లోని 15 కోట్ల మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరుస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు, ఆరేళ్ల లోపు చిన్న పిల్లలకు ఉచిత భోజన సదుపాయాలు కల్పించాలని ఇందులో నిర్దేశించారు. 1975లో ప్రారంభమైన సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం (ఐసీడీఎస్) కింద 13.56 లక్షల అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఆహారభద్రత చట్టం అమలు బాధ్యతలను రాష్ట్రాలకు అప్పగించిన కేంద్రం ఇందుకోసం తన వాటా నిధులను అందజేస్తోంది. ఈ పథకాల అమలులో లోపాల కారణంగా ఎన్నో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ లొసుగుల మయంగా మారింది. ఈ పథకం కింద చౌక ధరలకు సరకులు పేదలకు అందాల్సి ఉండగా, అత్యధికం అవి నల్లబజారుకు చేరుతున్నాయి. సబ్సిడీ బియ్యం దళారుల పాలవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా మారింది. కేంద్రీకృత విధానం లేకపోవడం వల్ల రాష్ట్రాలు తమకు అనుగుణంగా ఉండే రీతిలో వాటిని మార్చుకుంటున్నాయి. పౌష్టికాహార లక్ష్యాలను ఈ పథకాలు నెరవేర్చడం లేదు. గర్భిణులు, బాలింతలకు అవసరమైన సమయంలో తగినంత మేరకు ఆహారం అందడం లేదు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో అనేక లోపాలు వెలుగు చూస్తున్నాయి. విద్యార్థులకు అందజేసే ఆహారంలో నాణ్యత కొరవడుతోంది. ఈ పథకం విద్యార్థుల కడుపు నింపడం లేదన్నది చేదు నిజం. ఆహారభద్రత కింద ప్రభుత్వాలు బియ్యం పంపిణీ చేస్తున్నప్పటికీ- పేదలకు కూరగాయలు, నూనెలు, ఇతర సరకుల కొనుగోలు భారంగా మారుతోంది. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పేదల ఆదాయాలు పెరగడం లేదు. కూలీకి వెళితే కనీస వేతనాలు లభించడం లేదు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆహార పదార్థాల కొనుగోలే ప్రధాన సమస్యగా ఉంది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో, పేదల బస్తీలు, కాలనీలు, ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, దేవాలయాలు, యాత్రాస్థలాల వద్ద ఆకలిలో అల్లాడుతున్న అభాగ్యులు ఎందరో కనిపిస్తున్నారు. ఆసుపత్రులకు

ఆహార భద్రత ఎండమావి

వెళితే రోగులకు మినహా సహాయకులకు భోజనాల సౌకర్యం లభించడం లేదు. ఉపాధి లేక, కుటుంబాలు గడవక, ఆకలి బాధలతో మరణించేవారి సంఖ్య పెరుగుతోంది. సరైన తిండి లేకపోవడం వల్లే అయిదు శాతం మరణాలు చోటుచేసుకుంటున్నాయని అంచనా.

ఆహార సమస్యలు అనారోగ్యానికి దారితీస్తున్నాయి. ప్రపంచ ఆహారభద్రత, పౌష్టికాహార సంస్థ నివేదిక ప్రకారం దేశ జనాభాలో 14.5 శాతం పౌష్టికాహారలోపాలతో సతమతమవుతున్నారు. 49 ఏళ్ల లోపు వారిలో 51.4శాతం రక్తహీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. 21 శాతం వృద్ధులు చాలా బలహీనంగా ఉన్నారు. 38 శాతం అయిదేళ్లలోపు పిల్లల్లో బరువు, ఎత్తు తక్కువ వంటి లోపాలున్నాయి. పౌష్టికాహార లోపం వల్ల పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గుతోంది. జ్వరాలు, శ్వాసకోశ వ్యాధులు, ఇతర సమస్యలు వారిని చుట్టుముడుతున్నాయి.



ఆధారం: అంతర్జాతీయ ఆకలి సూచి నివేదిక, 2017

బ్రెజిల్ తీరు ఆదర్శం

ఒకవైపు ఆహార కొరత దేశాన్ని వేధిస్తుండగా, మరోవైపు ఆహార నష్టం ఆందోళనకరంగా మారింది. ఆహారోత్పత్తిలో మూడింట ఒక వంతు వ్యర్థమవుతోంది. 40 శాతం పండ్లు, కూరగాయలు, 30 శాతం తృణధాన్యాలు వృథా అవుతున్నాయి. పంట క్షేత్రాలు, గోదాములు, మార్కెట్లలో వృథా ఎక్కువగా ఉంటోంది. గోదాముల్లో నిల్వ ఉంచిన బియ్యం నిల్వల వృథాను 2010లో సుప్రీంకోర్టు తప్పుపట్టింది. ఈ బియ్యాన్ని, గోధుమలను చౌక ధరకు లేదా ఉచితంగా పేదలకు పంపిణీ చేయాలని సూచించింది. విందులు, వినోదాలు, శుభకార్యాల సమయంలో ఆహార పదార్థాలు వృథా అవుతున్నాయి. దేశజనాభా 2030 నాటికి 150 కోట్లకు చేరుతుందని అంచనా. జనాభా పెరుగుదలతో పాటు ఆకలి సమస్య పెరిగే ప్రమాదం ఉంది. ప్రజల్లో 60 శాతం వ్యవసాయ ఆధారిత పంటల ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు. వ్యవసాయ రంగం ఇబ్బందుల్లో ఉంది. అందువల్ల వనరులను సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా సత్వర చర్యలు చేపట్టాలి. ఆహారకొరతను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాల్సి ఉంది. కేవలం పథకాలతోనే కాలం గడపకుండా ప్రణాళికాబద్ధ చర్యలను చేపట్టాలి. తమ దేశాన్ని ఆకలి రహిత (జీరో హంగర్) దేశంగా మార్చేందుకు బ్రెజిల్ బృహత్తర పథకాన్ని అమలు చేస్తోంది. పేద కుటుంబాల్లోని వారికి ఆహారభద్రత కోసం ప్రత్యక్షంగా ఆర్థిక సహాయం అందిస్తోంది. అక్కడి హోటళ్లు, రెస్టారెంట్లలో అతి తక్కువ ధరకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు. బ్రెజిల్ దారిలోనే వెనెజువెలా ప్రయాణిస్తోంది. దుకాణాల్లో రాయితీపై ఆహారాన్ని, సరకులను పంపిణీ చేస్తోంది.

ఆహార భద్రత కార్యక్రమాలను ప్రభుత్వాలు మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం కేంద్రం విరివిగా సాయం అందించాలి. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)కు దీన్ని అనుసంధానిస్తే మరిన్ని సంస్థలు ముందుకొచ్చే అవకాశం ఉంది. విదేశాల తరహాలో బియ్యం, కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులను చౌక దుకాణాల్లోనే గాక బహిరంగ మార్కెట్లోనూ తక్కువ ధరకు అందించే విధానం తీసుకురావాల్సిన అవసరం ఉంది. పేదల ఆహార వస్తువులపై వ్యాపార దృక్పథం పోవాలి. అక్రమ రవాణాలపై ఉక్కుపాదం మోపాలి. దళారుల బెడదను నివారించాలి. తక్కువ ధరకు ఆహార పదార్థాలను అందించేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. ప్రజా పంపిణీ వ్యవస్థతో పాటు ఇతర ఆహారభద్రత పథకాలను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడే ఆహారభద్రత వైపు అడుగులు పడేది!

– ఆకారపు మల్లేశం

తెలుగురాష్ట్రాల్లో చౌకధరలకు భోజనం

తమిళనాడు ప్రభుత్వం అమ్మ క్యాంటీన్లను ఏర్పాటు చేసి అతి తక్కువ ధరకు భోజన సదుపాయాన్ని కల్పిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం అయిదు రూపాయలకు భోజన పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. ఆసుపత్రులు, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, కూలీల అడ్డాలు, గ్రంథాలయాలు, రద్దీ ప్రాంతాలు, పేదల నివాసాల వద్ద వీటిని నిర్వహిస్తున్నారు. వసతిగృహాలతో పాటు పాఠశాలల విద్యార్థులకు సన్నబియ్యంతో ఆహారాన్ని అందిస్తున్నారు. యాచకుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టారు. కళాశాలలు, ఇతర ప్రభుత్వ విద్యా సంస్థల్లో మధ్యాహ్న భోజనం పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్ల పథకం ప్రారంభించింది. దీని కింద 203 కేంద్రాల్లో అయిదు రూపాయలకు భోజనాన్ని, మూడు రూపాయలకు అల్పాహారం అందిస్తోంది. తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో అమలవుతున్న ఈ పథకాలు ప్రజల ఆదరణ పొందుతున్నాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం పెళ్లిళ్లు, పేరంటాలు, శుభకార్యాలు, ఇతర సందర్భాల్లో మిగిలిపోయిన భోజనాన్ని పేదలకు పంపిణీ చేయాలనే చట్టం తెచ్చింది. అన్నదానాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం తాజాగా సేవా భోజ్ యోజన పథకాన్ని ప్రారంభించింది. దేశవ్యాప్తంగా అన్నదానం చేసే అలయాలు, గురుద్వారాలు, చర్చిలు, మసీదులు, దర్గాలు, మఠాలు, ధార్మిక ఆశ్రమాలకు చేయూతనిచ్చేందుకు కేంద్రం 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.150 కోట్లు కేటాయించింది. ఈ పథకం పేదల ఆకలి సమస్య తీర్చడానికి పరోక్షంగా దోహద పడుతుంది.

ఉరుముతున్న విద్వేషం

దేశంలో విద్వేష దాడులు విస్తరిస్తున్నాయి. గోరక్షకుల పేరిట వివిధ రాష్ట్రాల్లో కొందరు చేస్తున్న దాడులు భయాందోళనలకు అంటుకడుతున్నాయి. రాజస్థాన్‌లోని అల్వార్‌లో ఇటీవల రక్బర్ ఖాన్‌పై జరిగిన పాశవిక దాడి, తదనంతరం పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర విమర్శలను ఎదుర్కొన్నాయి. ఉన్మాద మూకల చేతిలో దెబ్బలు తిని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న రక్బర్ ఖాన్‌ను ఆస్పత్రికి తీసుకువెళ్ళే క్రమంలో పోలీసులు మూడున్నర గంటలు వృథా చేయడం, మధ్యలో నింపాదిగా టీ తాగేందుకు వాహనాన్ని నిలిపివేయడం వంటి చేష్టలు అతడి ప్రాణాన్నే బలిగొన్నాయి. అల్వార్ పరిణామాలను పరిశీలిస్తే- పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసి, ఖాన్ మృతికి కారణమైనట్లు స్పష్టమవుతుంది. ఖాన్ కొనుగోలు చేసిన రెండు ఆవులను విడిపించడం మీదే పోలీసులు శ్రద్ధ పెట్టారుగానీ, ఆయన ప్రాణాలను కాపాడాలన్న స్పృహ వారికి ఏ కోశానా లేకపోయింది. విడిపించిన ఆవులను పదికిలోమీటర్ల దూరంలోని గోశాలకు గంట వ్యవధిలో తరలించగలిగిన పోలీసులకు- ఖాన్‌ను ఆరు కిలోమీటర్ల దూరంలోని ఆస్పత్రికి తరలించేందుకు మాత్రం మూడున్నర గంటలకుపైనే పట్టింది! దేశంలో గోరక్షణ ఉద్యమం కొంతకాలంగా దారితప్పింది. ముస్లిములమీద దాడులు చేసేందుకు ఈ ఉద్యమాన్ని కొందరు ఉపయోగించుకుంటుండటం బాధాకరం!

ఓట్ల రాజకీయంతో చేటు

బహుళత్వ విలువలతో విరాజిల్లే భారతావనిని మహాత్మా గాంధీ స్వప్నించారు. జీవిత పర్యంతం ఆయన హిందూ-ముస్లిముల మధ్య సఖ్యతను ఆకాంక్షించారు, ఆ లక్ష్యం కోసమే పనిచేశారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సైతం మతాల మధ్య సుహృద్భావ సాధనకోసం కృషి చేశారు. విద్యా ఉద్యోగ సంస్థల దరఖాస్తుల్లో మతం అన్న మాటనే ఆయన తొలగించారు. హిందూ, ముస్లిముల మధ్య సన్నటి అడ్డుతెరను సృష్టించి- ఓట్లు దండుకునే రాజకీయం దేశంలో ఎప్పటినుంచో జరుగుతోంది. కొంతకాలంగా ఆ ఉద్ధృతి మరింత పెరిగింది. ఇరు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తినప్పుడు, శాంతి భద్రతలు అదుపు తప్పినప్పుడు ఎలా వ్యవహరించాలన్న విషయంలోనూ దేశంలోని మెజారిటీ పోలీసులకు అవగాహన ఉండటం లేదు. కొన్ని సందర్భాల్లో చట్టాన్ని కాపాడాల్సిన వారే ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. మతాల మధ్య అభద్రత పెరిగింది. దీంతో ఏ మతానికి ఆ మతం తమ గుర్తింపును కాపాడుకోవడం కోసం ప్రత్యేక విద్యా వ్యవస్థలను నిర్వహించుకుంటున్నాయి. ముస్లిములు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని బలంగా ప్రయత్నిస్తున్నారు. దేశంలో మదరసా విద్య బలపడటానికి కారణమదే! తొమ్మిదో దశకంలో రాజ్యసభ సభ్యుడిగా ఉన్నప్పుడు నేను ఈ విషయాలను సభలో ప్రస్తావించాను. స్వాతంత్ర్యానంతరం దేశాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీని నేరుగా ఎక్కుపెట్టి నేను విమర్శలు గుప్పించాను. నా ప్రశ్నలకు జవాబులు ఇవ్వడానికి బదులు- కాంగ్రెస్‌లో ఆనాడు సీనియర్ నాయకులుగా ఉన్న ప్రణబ్ ముఖర్జీ సభనుంచి అర్ధాంతరంగా లేచి వెళ్ళిపోయారు. నేను ప్రస్తావించిన అంశాలు బహుశా ఆయనకు రుచించలేదేమో!

బహుళత్వ విలువలకు తూట్లు

దేశ విభజన సమయంలో పాకిస్థాన్ 'ఇస్లామిక్ మార్గం' ఎంపిక చేసుకొంటే- సర్వమత సమభావన తత్వాన్ని అందిపుచ్చుకొని భారత్ ముందుకు సాగింది. కాలక్రమంలో భారత్‌లోని ముస్లిం వర్గంలో అభద్రత మొగ్గతొడిగింది. కొన్ని వర్గాల మధ్య అభద్రత నెలకొన్నప్పుడు లౌకికవాద భావనకు కట్టుబడి, వాటి మధ్య సామరస్యానికి కృషి చేయాల్సిన బాధ్యత రాజకీయ పక్షాల మీద ఉంటుంది. అయితే ఆ క్రమంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ సారథ్యంలో ఏర్పాటైన భారతీయ జన్ సంఘ్ భిన్నమైన బాటలో నడిచింది. జయప్రకాశ్ నారాయణ్ నేతృత్వంలో ప్రారంభమై జనతా పార్టీ లౌకిక, సామ్యవాద భావజాలానికి కట్టుబడి ప్రస్థానించింది. జన్‌సంఘ్ మలిగిపోయి భారతీయ జనతా పార్టీ ఏర్పడిన తరవాత వాజ్‌పేయీ వంటి నాయకులు ఆ పార్టీకి కీలకమైన దిశానిర్దేశం గావించారు. అన్ని రాజకీయ పక్షాల నాయకులనూ కలుపుకొని లాహోర్‌కు వాజ్‌పేయీ సాగించిన బస్సు యాత్ర చరిత్రాత్మకమైనది. భారత్‌లోని ముస్లిములలో ఎంతో విశ్వాసం నింపిన చర్య అది. లాహోర్‌లో ఘనస్వాగతం అందుకున్న తరవాత వాజ్‌పేయీ చేసిన ప్రసంగం పాకిస్థానీలను విపరీతంగా ఆకట్టుకొంది. ఆ సందర్భంగా పాక్ అధినేత నవాజ్ షరీఫ్ నాతో మాట్లాడారు. అప్పటికప్పుడు పాకిస్థాన్‌లో ఎన్నికలు జరిగితే వాజ్‌పేయీకి ఆ దేశంలోని అన్ని స్థానాల్లోనూ ఘన విజయం సాధించగల స్థాయి ఉందని ఆయన నాతో జరిపిన సంభాషణలో సరదాగా వ్యాఖ్యానించారు. వాజ్‌పేయీ సారథ్యం ముగిశాక భాజపాలో చాలా మార్పులు వచ్చాయి.

మాటలకు, చేతలకు మధ్య అగాధం

ప్రధాని నరేంద్ర మోదీ సైతం పాకిస్థాన్‌తో స్నేహ సంబంధాల విషయంలో సానుకూలంగా వ్యవహరిస్తున్నారు. అయితే వాజ్‌పేయీ చరిష్మా వేరు! ఆయన తన నిబద్ధ ప్రయత్నాలతో కాంగ్రెస్ వాదులనూ ఆకట్టుకునేవారు. నేను లండన్‌లో భారత హై కమిషనర్‌గా ఉన్నప్పుడు వాజ్‌పేయీ ఆ నగరాన్ని సందర్శించారు. అప్పట్లో దేశ విదేశాల్లో ఎక్కడికి వెళ్ళినా 'బాబ్రీ మసీదు అంశం' ప్రధాన చర్చనీయాంశంగా ఉండేది. 'రామ భక్తులంతా అయోధ్యకు, దేశ భక్తులంతా ఇక్కడికి వచ్చారు' అని ఆ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు మరచిపోలేనివి. ప్రధాని నరేంద్ర మోదీ 'అందరితో కలిసి... వికాసం దిశగా ప్రస్థానించాల'న్న విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారు. అయితే అల్వార్ తరహా ఘటనలు ప్రభుత్వాల మాటలకూ, చేతలకూ మధ్య అగాధం ఉందన్న అనుమానాలను కలిగిస్తాయి. దేశ బహుళత్వాన్ని కాపాడటమే లక్ష్యంగా భాజపా సహా దేశంలోని రాజకీయ పక్షాలన్నీ నిబద్ధంగా ప్రయత్నించినప్పుడే... సుస్థిర భారతం సాకారమవుతుంది!

– ఎస్.దీపాంకర్

ఆనంద స్వరూపం

సత్యం, ధర్మం, న్యాయం అన్న పదాలు అనాదిగా వినిపిస్తున్నాయి. సత్యం కానిది అసత్యం అని, న్యాయం జరగనప్పుడు అన్యాయం అని ఖండిస్తారు. ధర్మానికి విరుద్ధం అధర్మం అంటున్నప్పుడు ఏది ముందు, ఏది వెనక అన్న అనుమానం కలుగుతుంది. అసలు ఇది సత్యం, ఇది ధర్మం, ఇది న్యాయం అని ఎవరు చెప్పారు? ఈ ప్రశ్నకు సమాధానం- శాస్త్రం. శాస్త్రం అంటే శాసించేది. ఈ సృష్టిని శాసించే అధికారం ఆ పరమాత్మకే ఉన్నది. ఆయన పలికిన రుక్కులు వేద వాక్కులు. శ్రుతులు, స్మృతులు, శాస్త్రాలు అన్నింటికీ పుట్టిల్లు- వేదవాఙ్మయం. వేదానికి అర్థం చెప్పగల సమర్థుడు ఆ పరమాత్మ. ఏదైతే ఎల్లకాలం ఉంటుందో అదే సత్యం. అలా ఉండకపోతే అసత్యం.

సృష్టిలో చరాలు, అచరాలు- కదిలేవి, కదలనివి ఉన్నాయి. ప్రకృతి స్వభావం చలనం. దానికి సహజమైన సత్వ, రజస్, తమో గుణాలు జీవరాశుల్ని ప్రభావితం చేస్తున్నాయి. క్షణక్షణం మారుతున్న ప్రకృతిని అసత్యం అనే వీల్లేదు. కనుక 'మాయ' అనే ముసుగు తొడగాల్సి వచ్చింది. రాత్రి- పగలు; మంచి-చెడు వంటి పరస్పర వ్యతిరేకతలు సృష్టి ఆది నుంచీ ఉన్నట్లు భావించటం సమంజసం. అహింస అనే పదం హింస అనే పదానికి ముందు పుట్టిందా, వెనక వచ్చిందా చెప్పడం కుదరదు. హింసను చూశాక, జీవహింస తగదని తథాగతుడు అహింస అనే పదాన్ని సృష్టించాడనుకుందాం. అదే పరమ ధర్మం అయితే ముందు జరిగినదంతా హింసాత్మకమైన అధర్మమే అనుకోవాలి. సృష్టి ఆదినుంచీ పులి లేడిని చంపుతున్నది- అది పులి సహజ ప్రవృత్తి. ఇది ప్రకృతి ధర్మం అయినప్పుడు అధర్మం అంటే ఎలా కుదురుతుంది. ఈ చిక్కుముడిని విప్పడానికి వేరే దారులే లేవా?

ఈ సమస్యకు పరిష్కార మార్గాలు మూడు. త్రిమతాచార్యులు తమదైన బాణీలో ఆత్మ, పరమాత్మ తత్వాన్ని ఆవిష్కరించారు. జీవాత్మ, పరమాత్మ ఒకటేనని శంకరులంటే- ఆ రెండూ ప్రకృతి అంటూ రామానుజులు; వేర్వేరని మధ్వులు తమకు అనుకూలంగా వేదాలను, ఉపనిషత్తులను మలచుకొని ప్రతిపాదనలు చేశారు. కనిపించేది సత్యం అనాలా, కనిపించనిది సత్యం అని

అంతర్యామి

నమ్మాలా అన్న మీమాంస మాత్రం మిగిలిపోయింది.

జీవాత్మ, పరమాత్మ వేరు అయితే, ఏది సత్యమైంది, ఏది అసత్యమైందో ఎలా చెప్పడం? ఏది నిత్యమో అది నిత్య సత్యం; కేవలం రూపం మార్చితే అది అనిత్యం అవుతుంది కానీ, అసత్యం కాదు. నీళ్ళు బాగా చల్లబడితే మంచుగడ్డ అవుతుంది. వేడి చేస్తే ఆవిరి అవుతుంది. శీతోష్ణ స్థితులను బట్టి రూపం మారినా, నీటి మౌలిక ధర్మం మారదు. ప్రకృతి ధర్మం, జీవధర్మం- ఒకే వృక్షానికి చెందిన రెండు కొమ్మలు. పరమాత్మ, ప్రకృతి, వ్యక్తి- వీటిని ఏకం, అనేకం అంటూ కూడికలు, తీసివేతలు, చేయటం కన్నా మూడింటిని మూడు స్థితులుగా, స్థాయులుగా గుర్తిస్తే పరిష్కారం లభిస్తుంది.

అద్వితీయమైన పరమాత్మ తప్ప- విశ్వంలో, వ్యక్తిలో, తారతమ్యాలున్నాయి. అలా ఉండటానికి అవి అద్వితీయాలు కాకపోవడమే కారణం. మతం అంటే మన మనసుకు, హృదయానికి సంబంధించిన ఒక చింతన. అందువల్ల అందరికీ కాకపోయినా, ఎక్కువమందికి సమ్మతమై ఉండాలి. అందరం కోరుకునేది ఆనందం. అది ఎంత సులభంగా అందుకోగలిగితే అంత చక్కగా ఆ మతాన్ని ఆదరిస్తాం. తాను భక్తసులభుడినని పరమాత్మ చెప్పాడు. భక్తి ప్రభావాన్ని బట్టి భగవద్భక్తులకు ఆనంద రసాస్వాదన అందుబాటులో ఉంటుంది. భగవంతుడి అసలు స్వరూపం ఆనందం. ఆ రసామృతమే మోక్షం.

పరమాత్మ సృష్టి చేయగలడు, సర్వాంతర్యామి. జీవాత్మకు ఈ గుణాలు లేవు. అదే జీవాత్మ, పరమాత్మల మధ్య భేదం. అది మన బుద్ధికి అందుబాటులో లేని చింతన. భేదం ఉందా లేదా అని చెప్పడం కుదరదు. ఈ విధంగా ద్వైతం తారతమ్యం చెబుతూనే, అందరికీ వీలైన భక్తిమార్గాన్ని చూపుతుంది. స్వరూపానందాన్నే మోక్షంగా చెబుతుంది. భక్తి లేనిది ముక్తి లేదు. మధ్వాచార్యులు పూర్ణప్రజ్ఞులని, ఆనందతీర్థులని, హరిగురువుల సేవలో తరించవచ్చునని మధ్వులు విశ్వసిస్తారు.

– ఉప్పు రాఘవేంద్రరావు

చిన్నారులకు బడిగండం..!

- ప్రమాదాలతో ఏటా పలువురు విద్యార్థుల మృత్యువాత
- వందలాది మంది గాయాలపాలు
- జాగ్రత్తలు తీసుకోని పాఠశాలల యాజమాన్యాలు
- పట్టించుకోని విద్యాశాఖ

ఈనాడు - హైదరాబాద్

పాఠశాలల్లో చిన్నారుల భద్రతకు సంబంధించి జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఎన్‌సీపీసీఆర్) మార్గదర్శకాలు జారీ చేసినా, వాటిని చాలామంది పాటించడంలేదు. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఏటా బడుల్లో కనీసం పది మంది విద్యార్థులు ప్రమాదాలబారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. పదుల సంఖ్యలో గాయాలపాలవుతున్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కాకముందే విద్యుదాఘాతంతో ఒక విద్యార్థి చనిపోయాడు. బడి బస్సుల కింద పడి అయిదుగురు మృతి చెందారు. ఇక వర్షాలు ముమ్మరమైతే బడుల్లో మరిన్ని ప్రమాదాలు జరుగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. విద్యాశాఖ కనీస పర్యవేక్షణ చేయడం లేదనే విమర్శలున్నాయి. బడులు సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని గత ఏడాది ఎన్‌సీపీసీఆర్ మార్గదర్శకాలు జారీ చేసింది. దాంతోపాటు సీబీఎస్‌ఈ, నేషనల్ బిల్డింగ్ కోడ్, కేంద్ర మానవ వనరుల శాఖ తదితర మార్గదర్శకాలు, నిబంధనలను పరిశీలించి పాఠశాలల్లో పిల్లల భద్రతపై తెలంగాణ పాఠశాల విద్యాశాఖ గత ఏడాది మార్చిలో జీఓ 36 జారీ చేసింది. అయినా పరిస్థితి మారలేదు. భవనాలు పటిష్ఠంగా ఉండాలని, విద్యుత్ పరికరాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి పరిశీలించాలని, అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, బావులు, నీటి నిల్వ ట్యాంకుల వద్ద మూత, కంచె ఉండాలని మార్గదర్శకాలున్నాయి. ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి.

- శివకుమార్ అనే చిన్నారి ఈ విద్యాసంవత్సరమే బడిలో ఒకటో తరగతిలో చేరాడు. పాఠశాల ఆవరణలో ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్‌కు వేలాడుతున్న కరెంటు తీగను పట్టుకున్నాడు. విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మండలం బాకారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో జూన్ 9న జరిగింది.
- రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని ఇన్‌ఫాంట్ జీసెస్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఎల్‌కేజీ విద్యార్థి హిత్వేష్(4) అపరిశుభ్రంగా ఉన్న తరగతి గదిలో జారి పడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. బాలుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తరగతి గదిలో జారిపడి గాయపడిన బాలుడు

- నారాయణఖేడ్ మండలంలో ఇటీవల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడిపడటంతో 5వ తరగతి విద్యార్థి తలకు తీవ్ర గాయాలయ్యాయి.
- అదే జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని పాఠశాలలో పైకప్పు పెచ్చులూడుతోందని ఉపాధ్యాయులు హెల్మెట్లు ధరించి పాఠాలు బోధిస్తూ నిరసన తెలిపారు. అయినా మార్పు లేదు.
- బరువైన పుస్తకాల సంచితో పాఠశాల మెట్లు ఎక్కుతూ 9వ తరగతి విద్యార్థిని బడిలోనే కుప్పకూలి చనిపోయింది. గత ఏడాది వరంగల్ జిల్లా కరీమాబాద్‌లో ఇది జరిగింది.
- స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరవేసేందుకు ఇనుప స్తంభాన్ని నిలబెడుతుండగా పాఠశాల ఆవరణలో పైన ఉన్న విద్యుత్‌లైన్‌కు తగిలి విద్యుదాఘాతంతో ఉపాధ్యాయురాలు ప్రభావతి మృత్యువాతపడ్డారు. పక్కనే ఉన్న నలుగురు విద్యార్థులు ఆమెను రక్షించాలని వెళ్లి తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన 2016 ఆగస్టు 14న రంగారెడ్డి జిల్లా కోడూరు మండలం మేడికొండ గ్రామంలో చోటుచేసుకుంది.

పాఠశాలను ఆనుకునే ఉన్న విద్యుత్ నియంత్రిక

ఆదేశాలే.. ఆచరణేదీ?

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1,600 సర్కారు బడుల్లో శిథిల భవనాలను తొలగించాలని విద్యాశాఖ ఆదేశాలు ఇచ్చింది తప్ప క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదు. పలు బడుల్లో విద్యుత్ శాఖ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసింది. కొన్ని చోట్ల కంచె కూడా లేదు. బడుల ఆవరణ ద్వారా విద్యుత్ స్తంభాలు, కరెంట్ తీగలు పోతున్నాయి. కొన్నిచోట్ల విద్యుత్ తీగలు, స్తంభాలను తొలగించాలని ఉపాధ్యాయులు మొరపెట్టుకుంటున్నా ట్రాన్స్‌కో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. అవి చిన్నారుల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి.

రామగుండం మేయర్, డిప్యూటీ మేయర్లపై నెగ్గిన అవిశ్వాసం

- అనుకూలంగా చేతులెత్తిన 36 మంది కార్పొరేటర్లు
- ఎక్స్ అఫిషియో సభ్యుడిగా హాజరైన ఆర్టీసీ ఛైర్మన్

గోదావరిఖని, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా రామగుండం నగరపాలక సంస్థ మేయర్ కొంకటి లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ సాగంటి శంకర్‌లపై పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. వీరిద్దరిపై అవిశ్వాసం ప్రకటిస్తూ 39 మంది కార్పొరేటర్లు జులై 6న పెద్దపల్లి జిల్లా పాలనాధికారి శ్రీదేవసేనకు నోటీసు అందజేశారు. గురువారం నగరపాలక సంస్థ పాలకవర్గ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 36 మంది కార్పొరేటర్లు శిబిరం నుంచి కార్యాలయానికి చేరుకున్నారు. ఎక్స్ అఫిషియో సభ్యుడిగా స్థానిక ఎమ్మెల్యే, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ హాజరయ్యారు. తెరాసకు చెందిన 8 మంది, కాంగ్రెస్‌కు చెందిన 13 మంది, స్వతంత్రులు 14 మంది, ఒక భాజపా సభ్యుడు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించినట్లు ఎన్నికల అధికారిణి, జిల్లా సంయుక్త పాలనాధికారి వనజాదేవి తెలిపారు. ఇద్దరిపైనా 36 మంది కార్పొరేటర్లతో పాటు ఎక్స్ అఫిషియో సభ్యుడు అవిశ్వాసానికి మద్దతు ప్రకటించడంతో నెగ్గినట్లు ప్రకటించారు. 2014లో జరిగిన ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికైన కొంకటి లక్ష్మీనారాయణ ఫలితాల అనంతరం తెరాసలో చేరి మేయర్‌గా ఎన్నికయ్యారు.

బెల్లంపల్లి పురపాలిక సంఘంలోనూ అదే తంతు

బెల్లంపల్లి, న్యూస్‌టుడే: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ పసుల సునీతారాణి(తెరాస) మీద 32 మంది సభ్యులు అవిశ్వాసం ప్రకటించడంతో ఆమె పదవిని కోల్పోయారు. మొత్తం 34 మంది సభ్యులున్న బల్దియాలో 29 మందితో అసమ్మతివర్గం నాయకుడు మునిమంద రమేష్ 40 రోజులుగా రహస్య శిబిరం నిర్వహించారు. గురువారం బెల్లంపల్లి ఉపపాలనాధికారి పి.ఎస్.రాహుల్‌రాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. దీనికి వివిధ పార్టీలకు చెందిన 32 మంది సభ్యులు హాజరయ్యారు. వీరంతా సునీతారాణిపై అవిశ్వాసం ప్రకటిస్తూ చేతులు పైకెత్తారు. దీంతో ఆమె ఛైర్‌పర్సన్ పదవిని కోల్పోయారు. మరోసారి నూతన ఛైర్‌పర్సన్ ఎన్నిక కోసం తేదీని ప్రకటిస్తామని ఉపపాలనాధికారి రాహుల్‌రాజ్ తెలిపారు. పరిస్థితులు అనుకూలిస్తే 'పుర' అధ్యక్షురాలిగా మునిమంద రమేష్ భార్య 21వ వార్డు కౌన్సిలర్ స్వరూప (తెరాస)ను వరించే అవకాశాలున్నాయి. కాగా బుధవారం సాయంత్రం పుర అధ్యక్షురాలిగా సునీతారాణి రాజీనామా లేఖను సమర్పించిన సంగతి తెలిసిందే.

1740 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత వానాకాలం(ఖరీఫ్) పంటలకు విద్యుత్ డిమాండు భారీగా పెరుగుతున్నందున అదనంగా 1,740 మెగావాట్ల విద్యుత్‌ను డిస్కంలు కొనుగోలు చేశాయి. రోజంతా(24 గంటలూ) కొనుగోలు చేస్తామనే ఒప్పందంతో 810 మెగావాట్లు, రోజులో 9 గంటలు మాత్రమే తీసుకుంటామనే షరతుతో మరో 930 మెగావాట్లను కొన్నాయి.

రిజర్వేషన్లపై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి: ఎంపీ కవిత

ఈనాడు, హైదరాబాద్: రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని ఎంపీ కవిత గురువారం విమర్శించారు. ఒకవైపు తెలంగాణ కాంగ్రెస్ నేతలు రిజర్వేషన్లను రాష్ట్రమే అమలు చేయాలని కోరుతుండగా, దిల్లీ నాయకులు రాష్ట్రాలకు అధికారం ఇవ్వవద్దంటూ లోక్‌సభలో అడ్డుకున్నారన్నారు. జాతీయ బీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించేందుకు ఉద్దేశించిన సవరణ బిల్లుపై చర్చ సందర్భంగా రిజర్వేషన్లపై రాష్ట్రాలకు నిర్ణయాధికారం ఉండాలని తెరాస కోరిందని, దీనికి బీజేడీ, వైకాపా, ఎన్సీపీ, ఏఐడీఎంకే మద్దతివ్వగా, కాంగ్రెస్ వ్యతిరేకించిందన్నారు. తెలంగాణలో ఎస్టీ, ముస్లింలకు రిజర్వేషన్లు పెంచాలనే రాష్ట్ర ప్రభుత్వ యత్నాలకు దిల్లీలో గండి కొట్టేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని విమర్శించారు.

బాలికలను దాచేందుకు నేలమాళిగలు

- వ్యభిచార గృహాల్లో గుర్తించిన పోలీసులు
- హార్మోన్ ఇంజక్షన్లు ఇచ్చిన ఆర్‌ఎంపీ అరెస్టు
- మరో నలుగురు బాలికలకు విముక్తి

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: మనుషుల అక్రమ రవాణా, వ్యభిచారం వ్యవహారంలో మరిన్ని విస్తుగొలిపే అంశాలు వెల్లడయ్యాయి. వ్యభిచార గృహాల్లో బాలికలను, విటులను దాచేందుకు ఏర్పాటైన నేలమాళిగలు వెలుగు చూశాయి. బాలికలను త్వరగా వ్యభిచార వృత్తిలోకి దించేందుకు వీలుగా వారికి ఓ ఆర్‌ఎంపీ హార్మోన్ గ్రోత్ ఇంజక్షన్లు ఇస్తున్నట్లు వెల్లడయింది. యాదగిరిగుట్ట పట్టణంలో అనురాధ నర్సింగ్ హోం నడుపుతున్న ఆర్‌ఎంపీ నర్సింహ కార్యకలాపాలపై సమాచారం అందుకున్న ఎస్వోటీ పోలీసులు ఆసుపత్రిలో సోదాలు నిర్వహించి 43 ఇంజక్షన్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. అక్కడ నిబంధనలకు విరుద్ధంగా హెర్నియా, ట్యూబెక్టమీ, తదితర శస్త్రచికిత్సలూ నిర్వహిస్తున్నట్లు కనుక్కున్నారు. నర్సింహను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో రాచకొండ పోలీస్ కమిషనర్ మహేష్ భగవత్ ఆదేశాలతో పోలీసులు చురుగ్గా వ్యవహరిస్తున్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో మరోమారు వ్యభిచార గృహాలపై దాడులు నిర్వహించారు. దాడుల సమయంలో విటులు, బాలికలను దాచేందుకు వారి నివాసాల్లో నేలమాళిగలనూ ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించి విస్తుపోయారు. ఆరుగురిని అరెస్టు చేసి, నలుగురు బాలికలకు విముక్తి కల్పించారు. ఈ విషయాలను యాదాద్రి డీసీపీ రాంచంద్రారెడ్డి యాదగిరిగుట్ట ఠాణాలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సోమవారం నిర్వహించిన దాడులలో తప్పించుకున్న కంసాని నాగలక్ష్మి, నరేష్, స్వప్నలతో పాటు కొత్తగా కంసాని కుమారి, రజనీ, ఎల్లయ్యలను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. నలుగురు బాలికలను గుర్తించి, విచారించడంతో కంసాని శంకర్ అనే వ్యక్తి రూ.లక్ష, రూ.2 లక్షల చొప్పున వారిని తనకు అమ్మినట్లు తెలిపారని వెల్లడించారు. ఈ కేసులో 15 మంది బాలికలను రక్షించామని, వారిని సంరక్షణ కేంద్రానికి తరలించామని వెల్లడించారు. గతంలో తప్పిపోయిన పిల్లల కేసుల వివరాలను విచారించి, ఫొటోలు, డీఎన్‌ఏ ఆధారంగా వారి రక్తసంబంధీకులకు అప్పగించే ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కేసుల్లో నిందితులుగా ఉన్న 15 మందిని విచారించి, ఇతర కేసులు కూడా నమోదై ఉంటే పీడీ చట్టాన్ని నమోదు చేస్తామని తెలిపారు. యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రంలో వ్యభిచారం పూర్తిగా నిర్మూలించే వరకు దాడులు కొనసాగుతూనే ఉంటాయని తెలిపారు.

పోలీసులకు పట్టుబడిన ఆర్‌ఎంపీ నర్సింహ, ఇతర నిందితులు

6 నుంచి రైతుబీమా పత్రాలు పంపిణీ

ఈనాడు, హైదరాబాద్: రైతుబీమా ధ్రువపత్రాలు సిద్ధమవుతున్నాయి. మొత్తం 27.95 లక్షల మంది రైతులకు అందజేసేందుకు చకచకా ముద్రిస్తున్నారు. వీరి తరఫున ప్రీమియం సొమ్ము కింద రూ.636 కోట్లను ఎల్ఐసీకి ఆర్థికశాఖ చెల్లించింది. ఈ పత్రాలను ఈ నెల 6లోగా గ్రామాలకు పంపేందుకు వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 6 నుంచి 14 వరకూ పత్రాల పంపిణీ జరుగుతుందని వ్యవసాయశాఖ ప్రకటించింది. 18 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు వారికే బీమా వర్తిస్తుందని ఎల్ఐసీ తెలిపినందున ఇప్పటికి 27.95 లక్షల మంది నామినీల వివరాలు సేకరించి వారి పేర్లతో పత్రాలు ముద్రిస్తున్నారు. సదరు పత్రంపై ఈ నెల 14 నుంచి ఏడాది పాటు రూ.5 లక్షల బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. వయసు ఎక్కువ లేదా తక్కువగా ఉండటంతో 7 లక్షల మందికి పైగా రైతులు అనర్హులయ్యారు. బీమా పత్రాలపై పూర్తి ఆధార్ సంఖ్యను ముద్రిస్తుండటంతో రైతు వివరాలు దుర్వినియోగమయ్యే ప్రమాదముందని ముద్రణ ప్రారంభమైన తరవాత ప్రభుత్వం గుర్తించింది. ఈ క్రమంలో బీమా పత్రాన్ని ప్రతి రైతుకు వ్యక్తిగతంగా అందజేయాలనీ, ఒకరిది మరొకరికి ఇవ్వొద్దంటూ ఆదేశాలివ్వాలని నిర్ణయించింది. భవిష్యత్తులో ముద్రించే పత్రాలపై ఆధార్‌ను పూర్తిగా నమోదు చేయకుండా చివరి 4 అంకెలు మాత్రమే వచ్చేలా చూడాలని యోచిస్తోంది. రైతు మరణిస్తే 10 రోజుల్లోపు పరిహారం అందుకోవడానికి ఏయే పత్రాలు ఎల్ఐసీకి అందజేయాలనే వివరాలను దీనిపై ముద్రించారు. మరణ ధ్రువీకరణ పత్రం, సంబంధిత రైతు గ్రామానికి చెందిన 'వ్యవసాయ విస్తరణ అధికారి' (ఏఈఓ) ధ్రువీకరించే పత్రం, రైతు, నామినీ ఆధార్ కార్డు నకళ్లు, రైతు బ్యాంకు పాసుపుస్తకం నకలు పత్రాలు అడిగితే ఇవ్వాలని ఎల్ఐసీ పేర్కొంది. రైతుల వివరాలను సేకరిస్తున్నామనీ వ్యవసాయశాఖ తెలిపింది.

EDUCATION
*B.P.Ed- Fee: 17,000/- U.G.D.P.Ed.
Ph: 92931 33596, 98856 00300.

తెలంగాణ ప్రభుత్వము :: జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ కార్యాలయము (పి.ఆర్.) పి.ఐ.యు. మేడ్చల్-మల్కాజిగిరి

టెండర్ నోటీస్ సంఖ్య: T5/11/2018-19, Dt. 31.07.2018

మేడ్చల్ జిల్లాలో (06) పనులకు రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి టెండర్లు ఆహ్వానించనైనది. పనులు: 06 పనులు. అంచనా విలువ: రూ. 36.50 లక్షలు. దరఖాస్తు తీసుకొనుటకు చివరి తేదీ: 13.08.2018 సా. 5.00 గంటల వరకు. టెండర్ షెడ్యూల్ పొందుటకు చివరి తేదీ: 14.08.2018. టెండరు వేయు తేదీ: 16.08.2018 సా. 3.00 గంటల వరకు. టెండరు తెరచు తేదీ: 16.08.2018 సా. 3.30 గంటలకు. మరిన్ని వివరాలు ఈ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ప్రదర్శించబడిన టెండర్ నోటీస్‌లో లభించును.

సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్ (పి.ఆర్) పి.ఐ.యు. మేడ్చల్- మల్కాజిగిరి

DIPR 1362DP/ CL/Advt/1/2018-19

తెలుగు నగరాలకు ఆకర్షణ



* ప్రాజెక్టుల విలువ రూ.కోట్లలో

నగరం	మొత్తం ప్రాజెక్టులు	ప్రాజెక్టుల విలువ	నాలుగేళ్లలో విడుదలైన నిధులు
కరీంనగర్	45	1,721	20
వరంగల్	75	3,143	94

నగరం	మొత్తం ప్రాజెక్టులు	ప్రాజెక్టుల విలువ	నాలుగేళ్లలో విడుదలైన నిధులు
అమరావతి	41	1,874	24
కాకినాడ	83	2,779	196
తిరుపతి	36	1,528	196
విశాఖపట్నం	51	1,772	196

- గురువారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేష్, తెరాస ఎంపీ డి.శ్రీనివాస్ సంయుక్తంగా అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి హర్‌దీప్‌సింగ్ పూరీ ఈ వివరాలు వెల్లడించారు.
- మనదేశంలో ఆకర్షణీయ నగరాల పథకానికి ఎంపిక చేసిన నగరాల సంఖ్య - 100 ● ఈ నగరాల్లో చేపట్టిన ప్రాజెక్టులు - 5,151 ● మొత్తం ప్రాజెక్టుల విలువ - రూ.2.05 లక్షల కోట్లు

ఏళ్లు 14.. బరువు 185 కిలోలు!

- పశ్చిమ బెంగాల్ బాలికకు ఉచితంగా బేరియాట్రిక్ సర్జరీ
- 10 రోజుల్లో 20 కిలోలు తగ్గిన బాలిక

విజయవాడ, న్యూస్‌టుడే: అధిక బరువు(185 కిలోలు)తో నడవలేని స్థితికి చేరుకున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన 14 ఏళ్ల బాలికకు విజయవాడలో నిర్వహించిన శస్త్రచికిత్స విజయవంతమైంది. 10 రోజుల్లో 20 కిలోలు బరువు తగ్గింది. సూర్యారావుపేటలోని ఎండోకేర్ ఆసుపత్రిలో గురువారం విలేకరులకు డాక్టర్ కొంగర రవికాంత్ బాలికకు చేసిన శస్త్రచికిత్స వివరాలను వెల్లడించారు. పశ్చిమబెంగాల్‌లోని బిర్‌భుమ్ మండలం మాటియాలా గ్రామానికి చెందిన జలాలుద్దీన్‌ఖాన్ చిన్న కుమార్తె సుమన్ ఖాటూన్ మూడో ఏట నుంచి అనూహ్యంగా బరువు పెరిగింది. 14 ఏళ్లు వచ్చేసరికి 185 కిలోల బరువుకు చేరుకుని నడవలేని స్థితికి చేరుకుంది. విజయవాడలో బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ కొంగర రవికాంత్ వద్దకు వచ్చారు. ఆయన బాలికను పరీక్షించి సుమన్ ఖాటూన్ లెప్టిన్(కడుపునిండిన భావనను కలిగించే హార్మోన్) లోపంతో బాధపడుతోందని గుర్తించారు. డాక్టర్ రవికాంత్ ఆమెకు ఉచితంగా జులై 20న బేరియాట్రిక్ సర్జరీ చేశారు.

చికిత్స వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రవికాంత్.. శస్త్రచికిత్సకు ముందు బాలిక

తెలంగాణ ప్రభుత్వము :: అటవీ శాఖ, నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

Rc. No. 1020/2018/WS/NZP/HYD, తేదీ: 31–7–2018

NIT No. 02,05/2018-19, పని పేరు: 2018-19 కాలానికి నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్‌నకు ఆటోమేటిక్ ఛార్జర్‌తో పాటు బ్యాటరీతో నడిచే వాహనాలు (10) యొక్క ప్రొక్యూర్‌మెంట్ మరియు బ్యాటరీతో నడిచే వాహనాల కొరకు డ్యూరో తయారీ ట్యూబ్‌లెస్ టైర్ల యొక్క ప్రొక్యూర్‌మెంట్. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేదీ: 2–8–2018, సా. 5 గం.ల నుండి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్‌కు ముగింపు తేదీ: 16–8–2018, సా. 4 గం.లు. హార్డ్ కాపీల దాఖలుకు తేదీ: 17–8–2018, ఉ. 11 గం.లు. టెక్నికల్ బిడ్ తెరుచు తేదీ: 17–8–2018, ఉ. 11.30 గం.లు. ఫోన్ నెం. 040-24477355, ఫ్యాక్స్ నెం. 24473253, ఇమెయిల్: nehruzoopark1@gmail.com.

సం/- క్యూరేటర్, నెహ్రూ జూలాజికల్ పార్క్, హైదరాబాద్

DIPR No. 1366-DP/CL/ADVT/1/2018-19

తెలంగాణ ప్రభుత్వము
సమాచార మరియు పౌర సంబంధాల శాఖ: హైదరాబాద్

No.005597/VE/2017 టెండరు తేదీ: 1–8–2018

కమీషనర్, I & PR వారు అవసరమైనప్పుడు మరియు అవసరమైన విధంగా వేదికల నుండి నిరంతర ప్రత్యక్ష ప్రసార సౌకర్యం-లైవ్ ఈవెంట్ కవరేజ్‌ని ఏర్పాటు చేయుట నిమిత్తం ప్రతిపాదన కొరకు అభ్యర్థన (RFP) ని ఆహ్వానిస్తున్నారు. ఆసక్తిగల ఏజెన్సీలు అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, I & PR డిపార్ట్‌మెంట్, గవర్న్‌మెంట్ ఆఫ్ తెలంగాణ, హైదరాబాద్ వారి పేరిట ఏదేని జాతీయ బ్యాంక్ నుండి రూ. 10,000/-లకు తీసిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను చెల్లించడం ద్వారా తేది: 3–8–2018 నుండి తేది: 23–8–2018 వరకు ఏదేని పని దినమున ఉ. 10.30 గం.ల నుండి సా. 5.00 గం.ల వరకు కమీషనర్ కార్యాలయము, మొదటి అంతస్తు, సంచార్ భవన్, AC గార్డ్స్, హైదరాబాద్ నుండి RFP ని పొందవచ్చును. RFP దాఖలుకు చివరి తేది: 24–8–2018, మ. 3.00 గం.లు.

DIPR No. 1358 DP/CL/ADVT/1/2018-19. సం/- కమీషనర్

'కొత్త' సంబురం

- రాష్ట్రంలో 4,378 పంచాయతీలు నూతనంగా ఆవిర్భావం
- నృత్యాలు, బాణాసంచా మోతలతో సందడి

ఈనాడు- హైదరాబాద్: కొత్త పంచాయతీల ఆవిర్భావంతో తెలంగాణ పల్లెల్లో పండగ వాతావరణం నెలకొంది. రాష్ట్రంలో గురువారం 4,378 కొత్త పంచాయతీలు ఆవిర్భవించాయి. శివారు పల్లెలుగా ఉంటూ అభివృద్ధి ఫలాలకు పెద్దగా నోచని ఆయా గ్రామాల ప్రజలు చిన్న పంచాయతీలతో తమ చింతలు తీరతాయనే సంతోషంతో పంచాయతీ కార్యాలయాలకు తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యేలు, నేతలు అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. కొత్త పంచాయతీ కార్యాలయాలను అందుబాటులో ఉన్న భవనాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేయటంతో ప్రత్యేక అధికారులు బాధ్యతలు చేపట్టారు.

- ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని డోంగరగాం గ్రామం పాత పంచాయతీ కేంద్రానికి 8 కి.మీ. దూరంలో ఉండేది. ఇప్పుడు అది పంచాయతీగా అవతరించటంతో స్థానిక గోండు గిరిజనులు ఆనందంతో రేలా నృత్యాలను నిర్వహించారు. తుమ్మగూడ పంచాయతీ గిరిజనులు సంప్రదాయ డోలు వాయిద్యంపై దరువేస్తూ ఊరేగింపు తీశారు.
- నల్గొండ జిల్లాలో ఉమ్మడి చందంపేట మండలంలో ఒకేసారి 28 లంబాడీ తండాలు పంచాయతీలుగా ఆవిర్భవించాయి. అక్కడి గుర్రంగూడ లంబాడీలు తమ సంప్రదాయ దుస్తుల్లో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు.

ఇంద్రవెల్లి మండలంలోని తుమ్మగూడలో సంప్రదాయ డోలు దరువుల మధ్య పంచాయతీ ఆవిర్భావం

- కరీంనగర్‌జిల్లా రామడుగు మండలంలోని పందిగుంట పంచాయతీవాసులు బాణసంచా కాల్చి మిఠాయిలు పంచారు.
- వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం రసూల్‌పల్లి గ్రామస్థులు తమ ఎమ్మెల్యేను ఊరేగింపుగా తీసుకెళ్లారు.

అక్కడక్కడా నిరసనలు: అన్ని అర్హతలు ఉన్నా తమ గ్రామాన్ని పంచాయతీగా ప్రకటించలేదంటూ కొన్నిచోట్ల నిరసనలూ చోటుచేసుకున్నట్లు సమాచారం. నల్గొండ జిల్లా నేరేడుగుమ్మ మండలంలోని చర్ల తండా పంచాయతీగా ఆవిర్భవించడంతో పక్కనే ఉన్న తోడుబాయి తండావాసులు వచ్చి కార్యక్రమాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డిపేట పంచాయతీని మూడు ముక్కలుగా విభజించడాన్ని వ్యతిరేకిస్తూ గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న గోపాల్‌పేట గ్రామపంచాయతీ స్వాగత బోర్డులను తొలగించారు. అధికార పార్టీ ఫ్లెక్సీలను తగలబెట్టారు.

ఆ బాలుడిని కర్కశంగా చంపేశారు

- అజాద్ ఖాన్‌ది బూటకపు ఎన్‌కౌంటరే
- తేల్చిన సుప్రీంకోర్టు నిజ నిర్ధారణ కమిటీ

దిల్లీ: 2009లో సంచలనం సృష్టించిన 12 ఏళ్ల బాలుడు ఆజాద్‌ఖాన్ ఎన్‌కౌంటర్ కేసులో... సైన్యాధికారి మేజర్ విజయ్‌సింగ్ బల్హారా, మరో ఏడుగురు సిబ్బందిని సీబీఐ నిందితులుగా పేర్కొంది. బాలుడిని దారుణంగా కొట్టి చంపారని సుప్రీంకోర్టు నిజనిర్ధారణ కమిటీ తేల్చిన నేపథ్యంలో- సీబీఐ ఈ కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. ఆజాద్‌ఖాన్‌ది మణిపూర్‌లోని వాంగోయ్ ప్రాంతం. 2009, మార్చి 4న అక్కడి ఫౌబాక్చో ఉన్నత పాఠశాలలో 7వతరగతి చదువుతున్నప్పుడు... అసోం రైఫిల్స్ మేజర్‌గా ఉన్న విజయ్‌సింగ్ నేతృత్వంలోని సైనిక బృందం బాలుడిని మట్టుబెట్టింది. పీపుల్స్ యునైటెడ్ లిబరేషన్ ఫ్రంట్‌కు చెందిన ఆజాద్ గ్రామంలో వసూళ్లకు తెగబడుతున్నాడనీ, తాము అడ్డుకోగా కాల్పులకు పాల్పడ్డాడనీ, అందువల్లే ఎదురుకాల్పులకు దిగామని ఆ బృందం పేర్కొంది. ఇది ముమ్మాటికీ హత్యేనని ప్రత్యక్ష సాక్షులు, గ్రామస్థులు పేర్కొనడంతో సుప్రీంకోర్టు కలుగజేసుకుని... విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సంతోష్ హగ్డే నేతృత్వంలో నిజనిర్ధారణ కమిటీని నియమించింది. ప్రత్యక్ష సాక్షులు, అసోం రైఫిల్స్‌ను విచారించి, ఇటీవలే కమిటీ నివేదికను సుప్రీంకోర్టుకు అందజేసింది.

యూఏఈలో క్షమాభిక్ష

- స్వదేశానికి వచ్చే కార్మికులకు తెలంగాణ ప్రభుత్వ చేయూత

ఈనాడు, హైదరాబాద్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ) ప్రభుత్వం ఆగస్టు 1 నుంచి అక్టోబరు 31 వరకు ప్రవేశపెట్టిన క్షమాభిక్ష పథకం కింద స్వరాష్ట్రానికి రావాలనుకునే కార్మికులను ఆదుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. యూఏఈలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్న వారికి, వీసాల గడువు ముగిసిన వారికి, పాస్‌పోర్టులు లేకుండా ఉన్నవారికి జరిమానా లేకుండా దేశం విడిచి వెళ్లడానికి అక్కడి ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. దీనికింద అత్యవసర ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తారు. యూఏఈలో క్షమాభిక్ష నేపథ్యంలో మంత్రి కేటీఆర్ మంగళవారం తమ కార్యాలయంలో ప్రవాస విభాగం అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దుబాయ్, అబుదాబి, షార్జా ప్రాంతాల్లో దాదాపు 25 వేల మందికి పైగా ధ్రువీకరణపత్రాలు లేకుండా తెలంగాణ వారున్నారని భావిస్తున్నారు. స్వరాష్ట్రానికి రావాలనుకునే ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని మంత్రి ఆదేశించారు. దీనికోసం ప్రవాస విభాగం ఆధ్వర్యంలో సచివాలయంలో ప్రత్యేక ఫోన్ నంబర్‌తో సహాయ కేంద్రం ప్రారంభిస్తారు. ఒకట్రెండు రోజుల్లో ఫోన్ నంబర్‌ను ప్రకటిస్తారు. యూఏఈలోని రాయబార కార్యాలయంలోనూ ఫోన్ నంబర్ ఏర్పాటు చేయిస్తారు. రాష్ట్రకార్మికులను ఆదుకోవడానికి రాయబార కార్యాలయ అధికారుల సాయాన్ని కోరాలని మంత్రి ఆదేశించారు. బాధితులకు విమాన టికెట్లను కొనేందుకు నిధులను విడుదల చేయాలని ఆర్థికశాఖను ఆదేశించారు. యూఏఈలోని కార్మికులను ఆదుకోవడానికి తెలంగాణ సంఘాల సాయం కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. గల్ఫ్‌కార్మిక అవగాహన వేదిక అధ్యక్షుడు దోనికేని కృష్ణ, ఇతర నేతలు వంశీ, నర్సింహ దుబాయ్‌లోని క్షమాభిక్ష కేంద్రంలో భారతీయ కాన్సులేట్ జనరల్ విపుల్‌ను కలిశారు.

TELANGANA STATE MINERAL DEVELOPMENT CORPORATION LTD.
(A Telangana State Government Undertaking)

SHORT E-PROCUREMENT TENDER

The Telangana State Mineral Development Corporation Limited (TSMDC) invites through Short E-Procurement Tender for the following works as per the details given below.

Tender No. TSMDC/SAND/ABDULLAPURMET/2018 Dtd.03-08-2018

Name of the work: 50000CBM of sand for Transportation of sand from Various locations in the State of Telangana to Abdullapurmet Stockyard unload and loading into Lorries at Abdullapur (Stockyard) Village, Hayathnagar Mandal, Ranga Reddy District, Telangana State.

The Prospecting Bidder shall participate through online https://tender.telangana.gov.in website. The details of above Tender schedules along with terms and conditions of tenders can be downloaded from the above website.

The TSMDC reserves the right to reject all or any of the tenders without assigning any reasons whatsoever.

Sd/-
(Dr.G. MALSUR)
Date: 02.08.2018 Vice Chairman & Managing Director

Matchless Opportunity to Develop/Operate & Maintain Prime Tourism Projects of Sunrise State of Andhra Pradesh

(I) Development of MICE, 3* Hotels under Land Lease Policy at (1) Endada (3.06 Acres), Visakhapatnam (2) Mangalagiri (6 Ac.), Guntur Dt.

(II) Looking for Brand Hotel Chain Operation & Maintenance of 3* Hotels (Proposed) at (1) Tirupathi, Chittoor Dt., (2) Horseley Hills, Chittoor Dt.

(III) Agency for Operation & Maintenance of Beach shacks at Rushikonda, Visakhapatnam.

Propspective Bidders can download and participate in the Bids at "https://tender.apeprocurement.gov.in."
Important Dates : Downloading of RFPs: From 03.08.2018 (11 AM) to 07.09.2018 (Upto 2 PM), Prebid meeting: 17.08.2018 (3 PM), Uploading of RFPs: 07.09.2018 (Upto 4.00 PM), Opening of Bids: 07.09.2018 (4.30 PM).

aptdc For Further Details: Ph: 0866-2552969 (Office), 9542008882 (Srinivas), Fax: 0866 - 2552964
Tender Reference No.7/APTDC/2017-18 Sd/- Managing Director

మార్కెటింగ్ అధికారులతో సమీక్ష జరుపుతున్న మంత్రి హరీశ్‌రావు

నలుగురు ఉద్యోగుల సస్పెన్షన్

- జనగామ మార్కెట్‌లో నిధుల దుర్వినియోగం
- ఆగ్రహం వ్యక్తం చేసిన మంత్రి హరీశ్‌రావు

ఈనాడు, హైదరాబాద్: జనగామ మార్కెట్ కార్యదర్శి సహా నలుగురు ఉద్యోగులను తక్షణం సస్పెండ్ చేయాలని మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ అధికారులతో గురువారం తన కార్యాలయంలో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పంటల అమ్మకాలపై మార్కెట్ రుసుం పేరుతో వసూలు చేసిన రూ.5.22 లక్షలను జనగామ మార్కెట్‌లో దుర్వినియోగం చేసిన అంశంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. నిధులు దుర్వినియోగం చేసిన మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్, సూపర్‌వైజర్లు రమేష్, ఎండీ పాషా, అటెండర్ మహ్మద్ అలీను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులివ్వాలని మార్కెటింగ్ శాఖ సంచాలకురాలు లక్ష్మీభాయిని ఆదేశించారు. వచ్చేనెల ఒకటి నుంచి మార్కెటింగ్ శాఖ లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేయాలని సూచించారు. హైదరాబాద్ కూకట్‌పల్లి రైతుబజారును రూ.10 కోట్లతో ఆధునికీకరణకు శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేయనున్నట్లు హరీశ్‌రావు చెప్పారు. తాత్కాలికంగా ఈ రైతుబజారును హైటెక్ సిటీ ఫ్లైఓవర్ వద్ద ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గడ్డి అన్నారం మార్కెట్‌కు మెట్రో స్టేషన్ వల్ల ఇబ్బందులు వస్తున్నందున కోహెడ వద్దకు మార్చాలన్నారు. అక్కడ 178 ఎకరాల్లో రూ.164 కోట్ల అంచనాతో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ పనులకు వెంటనే టెండర్లు పిలిచి పనులు వేగంగా జరిగేలా చూడాలన్నారు. ఆల్వాల్ రైతుబజారును ఆధునికీకరించేందుకు పనులు చేపడతామన్నారు. ఇందుకు అవసరమైన స్థలం కోసం రైల్వే, కంటోన్మెంట్, రోడ్లు, భవనాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ విభాగాల స్థలాలు రైతుబజారుకు ఆనుకుని ఉన్నందున వాటిపై వెంటనే సర్వే చేయాలన్నారు. హరితహారం పథకంలో భాగంగా గోదాములు, వ్యవసాయ మార్కెట్ల ఆవరణలో లక్ష మొక్కలను నాటాలని మంత్రి సూచించారు. రెండు మీటర్ల ఎత్తు వరకు ఉండే మంచి మొక్కలు, ఫలాలు వచ్చే వాటిని పెంచాలన్నారు. నాటిన వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

రైతు కుటుంబ సభ్యులకు.. పాసు పుస్తకం, చెక్కు!

ప్రభుత్వ పరిశీలనలో దస్త్రం

విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న భూ యజమానుల కుటుంబ సభ్యులకు పట్టా పాసుపుస్తకాలు, రైతుబంధు చెక్కులు ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ప్రభుత్వం మే నెల పదో తేదీ నుంచి కొత్త పట్టా పాసు పుస్తకాలు, రైతు బంధు చెక్కులను పంపిణీ చేసింది. ఈ సందర్భంగా దాదాపు 3.24 లక్షలు పంపిణీ కాకుండా నిలిచిపోయాయి. భూ యజమాని స్వయంగా హాజరైతేనే పట్టా పాసుపుస్తకం, రైతు బంధు చెక్కును రెవెన్యూ, వ్యవసాయ శాఖలు అందజేశాయి. ఈ సందర్భంగా తమ కుటుంబ యజమాని స్థానికంగా లేరని, తమ భూమికి సంబంధించిన చెక్కులు, పుస్తకాలు ఇవ్వాలని జిల్లాల్లో కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున అధికారులకు విజ్ఞప్తి చేశారు. రైతే స్వయంగా ఉండాలని నిబంధనలు సూచిస్తుండటంతో అధికారులు ఏ నిర్ణయం తీసుకోలేక పోయారు. దీనివల్ల సాగు చేసుకుంటున్న రైతుల కుటుంబ సభ్యులు వానాకాలం పంటకు పెట్టుబడిని కోల్పోగా, పట్టా పాసుపుస్తకాలు లేని కారణంగా బ్యాంకు రుణాలు పొందలేక పోయారు. ఈ నేపథ్యంలో నిబంధనల్లో కొన్నింటిని సడలించి, షరతులతో రైతుల కుటుంబ సభ్యులకు వాటిని పంపిణీ చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి దస్త్రం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు రెవెన్యూ విభాగానికి చెందిన ఉన్నతాధికారి 'ఈనాడు'కు తెలిపారు. త్వరలోనే ఉత్తర్వులు వచ్చే అవకాశమున్నట్లు పేర్కొన్నారు.

'లెక్క' తప్పిన వాన

- ఈ సీజన్‌లో సాధారణ వర్షపాతం అని ముందే చెప్పిన వాతావరణశాఖ
- జిల్లాలవారీగా చూస్తే వర్షాభావం
- రెండు వారాలుగా చినుకు లేదు
- వర్షాధార భూముల్లో సాగు చేసిన పైర్లు ఎండుముఖం

ఈనాడు – హైదరాబాద్

ఈ మహిళా రైతు పేరు యాదమ్మ. రంగారెడ్డి జిల్లా యాచారంలో 12 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేసింది. కొన్ని విత్తనాలు మొలక రాలేదు. వచ్చిన మొక్కలు కూడా వర్షాల్లేక ఇలా ఎండిపోతున్నాయి.



ఎవరి లెక్క వారిదే..

10 జిల్లాల్లో తీవ్ర వర్షాభావం

వాతావరణ శాఖ 10 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉందని ప్రకటించింది. మెదక్ జిల్లాలో 42 శాతం, సంగారెడ్డిలో 40, వికారాబాద్‌లో 38, హైదరాబాద్‌లో 33, మేడ్చల్‌లో 33, రాజన్న సిరిసిల్లలో 30, కామారెడ్డిలో 25, జోగులాంబ గద్వాలలో 23, నాగర్‌కర్నూలులో 22, మహబూబ్‌నగర్‌లో 20 శాతం లోటు ఉన్నట్లు తెలిపింది.

16 జిల్లాల్లో వర్షాభావం

వాతావరణ శాఖ ప్రకటించిన 10 జిల్లాలతో పాటు మరో 6 జిల్లాల్లోనూ వర్షపాతం లోటు ఉందని ప్రణాళికాభివృద్ధి సొసైటీ పేర్కొంది.

18 జిల్లాల్లో లోటు

వాతావరణ శాఖ ప్రకటించిన 10 జిల్లాలే కాదు మరో 8 జిల్లాల్లోనూ లోటు వర్షపాతమే అంటోంది వ్యవసాయశాఖ. ఆ శాఖ రోజువారి నివేదికల ప్రకారం 18 జిల్లాల్లో వర్షపాతం లోటు ఉంది.

వర్షపాతం 'లెక్క' తప్పింది. ప్రస్తుత వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో సాధారణ స్థాయిలో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ సీజన్‌కు ముందే మే నెలలో ప్రకటించింది. జూన్ 1 నుంచి జులై ఆఖరు వరకూ రెండు నెలల్లో... రాష్ట్ర సగటు సాధారణ వర్షపాతంకన్నా 3 శాతమే తగ్గిందని, ఇది సాధారణ వర్షపాతమేనని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ రెండు నెలల్లో రాష్ట్ర సగటు సగటు సాధారణ వర్షపాతంకన్నా 15 శాతం తగ్గిందని వ్యవసాయశాఖ రోజువారీ పంటల సాగు నివేదికలో ప్రకటించింది. మరో వైపు రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి సొసైటీ తన వెబ్‌సైట్‌లో రాష్ట్ర వర్షపాతం లెక్కలపై రోజువారీ నివేదికలను పెడుతోంది. దీని ప్రకారం సగటు సాధారణ వర్షపాతంకన్నా 16 శాతం తగ్గింది. వర్షాలు లేక కరవు ఏర్పడిందని ప్రకటించాలంటే కేంద్ర ప్రభుత్వం భారత వాతావరణ శాఖ ఇచ్చే నివేదికనే ప్రామాణికంగా తీసుకుంటుంది. దాని ప్రకారం 3 శాతమే లోటు ఉన్నందున తెలంగాణలో సాధారణ స్థాయిలో వర్షాలు పడినట్లు అర్థం. కానీ వ్యవసాయశాఖ, ప్రణాళికాభివృద్ధి సొసైటీలు దానిని అంగీకరించడం లేదని వాటి నివేదికలే చెబుతున్నాయి.

పలు మండలాల్లో కరవు ఛాయలు

వాతావరణ శాఖకు చాలాచోట్ల వర్షపాతం కొలిచే ఏర్పాట్లు లేవు. దీంతో రాష్ట్ర, జిల్లా స్థాయి సగటును తీసుకుని వర్షపాతం లెక్కలను విడుదల చేస్తుంది. ప్రణాళికాభివృద్ధి సొసైటీ రాష్ట్రం నలుమూలల నుంచి ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాల్లో నమోదయ్యే వాతావరణ వివరాలతో రోజువారీ నివేదికలను విడుదల చేస్తోంది. జిల్లా, మండలాల వారీగా చూస్తే రాష్ట్రంలో పలుచోట్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి.

12 జిల్లాల్లో నూరుశాతం వానలు

సాధారణ వర్షపాతం అంటే వంద శాతం కురవాలి. 81 శాతం వరకూ కురిసినా సాధారణ వర్షాలు పడినట్లు వాతావరణశాఖ ప్రకటిస్తుంది. 100 శాతం కురిసిన జిల్లాలు 12 మాత్రమేనని వాతావరణశాఖ నివేదికలో తెలిపింది. కానీ నాలుగు (ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భద్రాద్రి) జిల్లాల్లో మాత్రమే వంద శాతం వర్షపాతం నమోదయిందని ప్రణాళికాభివృద్ధి సొసైటీ, వ్యవసాయశాఖ తెలిపాయి. మరింత లోతుకెళ్లి మండలాల వారీగా చూస్తే రాష్ట్రంలో సగానికి పైగా మండలాల్లో సాధారణంకన్నా తక్కువ వర్షం కురిసింది. కొన్ని మండలాల్లో కనీసం 50 శాతం వర్షాలైనా పడకపోవడంతో దుర్భిక్ష ఛాయలున్నాయి. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ అధికారి రాజారావు తెలిపారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే తప్ప భారీ వర్షాలు పడే అవకాశాలు లేవు.

ప్రస్తుతం నైరుతి రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నందున వర్షాలు తగ్గిపోయాయి. ఎండల వేడి పెరగడంతో పైర్లు వాడుముఖం పడుతున్నాయి. పూర్తిగా వర్షాధార పంటలు ఎండిపోతున్నాయి.

100 శాతం సాగయిన పత్తి

రాష్ట్రంలో ఇప్పటివరకూ సాగు కావాల్సిన సాధారణ పంటల విస్తీర్ణం 32.63 లక్షల హెక్టార్లలో 33.82 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. గతేడాది ఇదే సమయానికి 32.17 లక్షల హెక్టార్లకన్నా కాస్త పెరిగింది. బీటీ పత్తి ఒక్కటే వందశాతం విస్తీర్ణంలో వేశారు. మొత్తం ఖరీఫ్ సీజన్ పంటల విస్తీర్ణంలో వరినాట్లు 56, ఆహారధాన్యాలు 68, పప్పుధాన్యాలు 83, నూనెగింజల పంటలు 71 శాతం విస్తీర్ణంలో వేసినట్లు వ్యవసాయశాఖ తాజా నివేదికలో తెలిపింది.

జూన్, జులైల్లో సాధారణ వర్షపాతం లెక్కల్లో తేడాలు (మిల్లీమీటర్లు)

శాఖ	రాష్ట్ర సాధారణ వర్షపాతం	కురిసింది	లోటు శాతం	20% పైగా లోటున్న జిల్లాలు
వాతావరణశాఖ	374.6	384.8	–3	10
వ్యవసాయశాఖ	378.1	319.7	–15	18
ప్రణాళికాభివృద్ధి సొసైటీ	378.2	314.9	–16	16

సీతారామ ఎత్తిపోతల సవరించిన అంచనాకు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: సీతారామ ఎత్తిపోతల పథకానికి సవరించిన అంచనాకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ పని అంచనా రూ.7926.147 కోట్ల నుంచి రూ.13057.98 కోట్లకు పెరిగింది. ఈ మొత్తానికి పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కె.జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన రాజీవ్ దుమ్ముగూడెం, ఇందిరా దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకాల స్థానంలో సమీకృత దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టిన ప్రభుత్వం దీనికి సీతారామ ఎత్తిపోతల పథకంగా పేరు పెట్టింది. ఈ పనికి రూ.7926.147 కోట్లతో పరిపాలనా అనుమతి ఇవ్వడంతో పాటు టెండర్లు పిలిచి పనులు కూడా చేపట్టింది. పనిలో జరిగిన మార్పుల వల్ల అంచనా వ్యయం ఏకంగా రూ.13057.98 కోట్లకు పెరిగింది. ఇందుకు గల కారణాలను కూడా ఉత్తర్వులో పేర్కొంది. దీని ప్రకారం..

- ◆ ప్రాథమిక డీపీఆర్‌లో ఐదు లక్షల ఎకరాల ఆయకట్టుగా పేర్కొనగా, సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం మొదటి దశ ఆయకట్టు 6.74 లక్షల ఎకరాలు. ఇందులో 3.28 లక్షల ఎకరాలు కొత్తది కాగా, 3.45 లక్షల ఎకరాలు స్థిరీకరణ.
- ◆ ప్రధాన కాలువ సామర్థ్యం 4545 క్యూసెక్కుల నుంచి తొమ్మిది వేల క్యూసెక్కులకు పెరిగింది. దీనికి తగ్గట్లుగా కాలువ పనులు పెరిగాయి. పంపింగ్ స్టేషన్ల సామర్థ్యం పెరిగింది.
- ◆ ప్రాజెక్టుకు అవసరమైన భూమి, అటవీ ప్రాంతం 5800 హెక్టార్ల నుంచి 7402 హెక్టార్లకు పెరిగింది.

రూ.9886.19 కోట్లకు వరద కాలువ..

శ్రీరామసాగర్ వరద కాలువ అంచనా వ్యయం రూ.9886.19 కోట్లకు పెరిగింది. గతంలో రూ.4729.26 కోట్లకు పరిపాలనా అనుమతి ఇవ్వగా, పునరాకృతిలో భాగంగా రిజర్వాయర్ల సామర్థ్యం పెంపు తదితర కారణాల వల్ల అంచనా వ్యయం పెరిగింది. ఇటీవల జరిగిన మంత్రివర్గం దీనికి ఆమోదం తెలిపింది. సవరించిన అంచనాకు పరిపాలనా అనుమతి ఇస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జోషి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరోగ్య, పారిశుద్ధ్య వస్తు సామగ్రి సరఫరాకు హైకోర్టు అనుమతి

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థినులకు ఆరోగ్య, పారిశుద్ధ్య వస్తు సామగ్రిని(హెల్త్, హైజీన్ కిట్స్) అందజేసేందుకు గురువారం హైకోర్టు అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు సబ్బులు, షాంపు, తలనూనె, టూత్‌పేస్ట్ తదితర వస్తుసామగ్రిని అందజేసేందుకు 'మా యార్న్, ఫైబర్స్' సంస్థకు టీఎస్ఈడబ్ల్యుఐడీసీ టెండరు కట్టబెట్టడాన్ని సవాలు చేస్తూ 'లైట్ హౌస్ ప్రమోషన్స్' సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై సరఫరాను నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని సవాలు చేస్తూ 'మా యార్న్, ఫైబర్స్ సంస్థ' అప్పీలు దాఖలు చేసింది. దీనిపై గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీబీఎన్ రాధాకృష్ణన్, జస్టిస్ వి.రామసుబ్రమణియన్‌ల ధర్మాసనం స్టేను తొలగిస్తూ వివాదాన్ని సింగిల్ జడ్జి ముందు తేల్చుకోవాలని ఆదేశించింది.

విదేశీయుల వివరాలు వెల్లడించండి

త్వరలో దేశవ్యాప్తంగా బీసీల వర్గీకరణ: కిషన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి తెలంగాణకు వచ్చిన విదేశీయుల వివరాలను వెల్లడించాలని భాజపా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రం నిరాకరించినా నాలుగువేల మంది రోహింగ్యాలు హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారన్నారు. అక్రమ వలసదారులకు ఎంఐఎం అండగా ఉంటుందని విమర్శించారు. ఓ సంస్థ వారికి గుర్తింపు కార్డులు, నివాస ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో చెప్పాలని ప్రశ్నించారు. అక్రమ చొరబాటుదారులపై ఎన్ఆర్‌సీ ఇచ్చిన ముసాయిదాను ఆసరా చేసుకొని విపక్షాలు రెండు రోజులుగా పార్లమెంట్‌ను స్తంభింపజేయడం దారుణమన్నారు. కాంగ్రెస్ పార్టీ గత అరవై ఏళ్లుగా దేశాన్ని చిన్నాభిన్నం చేస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం విషయంలో సుప్రీం ఇచ్చిన తీర్పును భాజపా ప్రభుత్వానికి అంటకట్టాలని చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని మరింత పటిష్ఠం చేస్తోందని, త్వరలోనే దేశవ్యాప్తంగా బీసీల వర్గీకరణ సైతం చేపడుతుందని కిషన్‌రెడ్డి తెలిపారు.

కాలిపోయిన బస్సును పరిశీలిస్తున్న ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ

ఆర్టీసీ వరంగల్ 1 డిపోలో భారీ అగ్నిప్రమాదం

- రూ.50 లక్షల వరకు ఆస్తి నష్టం
- విచారణ చేయిస్తాం: మంత్రి మహేందర్‌రెడ్డి

వరంగల్, న్యూస్‌టుడే: ఆర్టీసీ వరంగల్ రీజియన్ పరిధిలోని వరంగల్ 1 డిపోలో బుధవారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. తొలుత డిపోలోని రాజధాని బస్సులో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. గమనించిన భద్రతాసిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొనే సమయానికి నాలుగు బస్సులు కాలిపోయాయి. డిపోలో దాదాపు 80 బస్సులు పక్క పక్కనే ఉండటంతో భారీ నష్టం జరిగింది. సిబ్బంది ఒక్కో బస్సును బయటకు తీసుకొచ్చినప్పటికీ మొత్తంగా ఐదు బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. రాజధాని ఏసీ బస్సు, ఎక్స్‌ప్రెస్ బస్సు పూర్తిగా కాలిపోగా మరో మూడు పల్లెవెలుగు బస్సులు సగానికి పైగా కాలిపోయాయి. రూ.50లక్షల వరకు నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు. విషయం తెలుసుకున్న రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ వరంగల్ చేరుకొని ప్రమాదం జరిగిన తీరును అధికారులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ప్రమాద ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. సోమారపు సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యుదాఘాతంతోనే ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు తెలిపారు.

అగ్నిమాపక శాఖకు 306 పోస్టులు మంజూరు

ఈనాడు, హైదరాబాద్: అగ్నిమాపక శాఖకు వివిధ కేటగిరిల్లో 306 పోస్టులను మంజూరు చేస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తగా ఏర్పాటు చేయనున్న 18 అగ్నిమాపక కేంద్రాలకు వీటిని కేటాయించనున్నారు. చెన్నూరు, చొప్పదండి, మానకొండూరు, వేములవాడ, నిజామాబాద్ (గ్రామీణ), పాలకుర్తి, భూపాలపల్లి, వర్ధన్నపేట, పాలేరు, వైరా, దేవరకద్ర, కొడంగల్, ఆలేరు, ఖానాపూర్, మోత్కూరు, జడ్చర్ల, యాకూత్‌పుర, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లలో కొత్త అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. కొత్తగా మంజూరైన పోస్టుల్లో ఫైర్‌మన్ -180; డ్రైవర్, ఆపరేటర్ - 54, లీడింగ్ ఫైర్‌మన్- 36, స్టేషన్ ఫైర్ ఆఫీసర్- 18, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు 18 ఉన్నాయి. రాష్ట్ర హోంశాఖ ప్రతిపాదనల మేరకు ఈ పోస్టులు మంజూరు చేస్తున్నట్లు ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి శివశంకర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెలంగాణకు ప్రత్యేక హోదా సాధన కోసం పార్టీ ఆవిర్భావం

సోమాజిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించడమే లక్ష్యంగా 'మన తెలంగాణ రాష్ట్ర సమైక్య పార్టీ'ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు అశోక్‌చంద్ర పోతు తెలిపారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో పార్టీ ఆవిర్భావ గోడపత్రిక, జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్క రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తే తమకెలాంటి అభ్యంతరం లేదని మన పెద్ద మనిషి చెబుతున్నారని.. మరి ఈ రాష్ట్రానికి అవసరం లేదా అని ప్రశ్నించారు. పక్క రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తే ఉన్న కంపెనీలు పోయి యువత ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడుగా రమేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా నవీన్ సర్కార్‌ను ప్రకటించారు.

13, 14 తేదీల్లో రాహుల్ పర్యటన

- రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లో రోడ్ షోలు
- రెండు జిల్లాల నేతలతో నేడు, రేపు కాంగ్రెస్ ముఖ్యనేతల భేటీ
- తర్వాత పర్యటన వివరాలు అధికారికంగా వెల్లడి

హైదరాబాద్, న్యూస్‌టుడే: అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తెలంగాణ పర్యటన ఖరారైంది. ఈ నెల 13, 14 తేదీల్లో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో జరిగే ప్రజాచైతన్య బస్సుయాత్ర(రోడ్ షో)లో ఆయన పాల్గొననున్నారు. 13న ఉదయం శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుని రంగారెడ్డి జిల్లాలో ఏర్పాటు చేసిన బస్సుయాత్ర, ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆ రోజు రాత్రికి హైదరాబాద్‌లో బస చేస్తారు. అక్కడే పార్టీ ముఖ్య నేతలతో భేటీ నిర్వహించి.. తెలంగాణలో అధికార పార్టీ పనితీరు, ఎన్నికల హామీల అమలుపై ఆరా తీస్తారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకత్వానికి దిశా నిర్దేశం చేయనున్నారు. తర్వాత రాహుల్ మీడియాతోనూ మాట్లాడే అవకాశం ఉంది. 14న హైదరాబాద్‌లో జరిగే బస్సుయాత్ర, ఇతర కార్యక్రమాల్లో పాల్గొని అదే రోజు రాత్రి దిల్లీకి బయలుదేరి వెళ్తారు. రాహుల్ రాక కోసం రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఎప్పటినుంచో ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణ 4వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 1న వరంగల్ లేదా హైదరాబాద్‌లో దళిత గిరిజన ఆత్మగౌరవ సభ పేరిట భారీ బహిరంగసభ ఏర్పాటు చేయాలని భావించారు. కాగా అప్పుడు వివిధ రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో ఉన్నందున రాహుల్ సమయం ఇవ్వలేదు. చివరికి ఎట్టకేలకు ఆయన పర్యటన ఖరారైంది. అధినేత రాష్ట్ర పర్యటన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర కాంగ్రెస నేతలు భావిస్తున్నారు. ఓయూలో విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఏ రాజకీయ పార్టీకి సంబంధంలేని పౌరసంస్థలు, చిన్న తరహా పరిశ్రమల యజమానులతో రాహుల్ సమావేశమయ్యేలా టీపీసీసీ నేతలు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రైతులు, మహిళా సంఘాలు, డ్వాక్రా గ్రూపులతోనూ ఆయన భేటీ అవుతారు. పోలీసులు అనుమతిస్తే పాతబస్తీలోనూ రాహుల్ పర్యటన ఉండే అవకాశం ఉంది. పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఖరారు చేయడానికి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల డీసీసీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలతో శుక్ర, శనివారాలు గాంధీభవన్‌లో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జన సమీకరణ, మార్గసూచీ ఎలా రూపొందించాలి అనే అంశాలపై వారితో చర్చించిన తర్వాత పర్యటన వివరాలు అధికారికంగా ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

టీపీసీసీ ఐటీ విభాగం ఛైర్మన్‌గా మదన్‌మోహన్‌రావు

తెలంగాణ పీసీసీ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ(ఐటీ) విభాగం ఛైర్మన్‌గా కె.మదన్‌మోహన్‌రావును నియమిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని పార్టీ కార్యక్రమాలను మరింత వేగం చేయాలనే ఉద్దేశ్యంతో ఐటీ విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. మండలిలో విపక్షనేత షబ్బీర్‌అలీ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్ యాదవ్, తదితరులతో కలిసి ఉత్తమ్ గురువారం గాంధీభవన్‌లో మాట్లాడారు. పార్టీ సందేశాలు సులువుగా పార్టీ శ్రేణులకు చేరేలా, కార్యక్రమాలు కార్యకర్తలకు అందుబాటులో ఉండే విధంగా ఐటీ విభాగం పని చేస్తుందన్నారు.

- ◆ కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా సాధించాలనే చిత్తశుద్ధి తెలంగాణ ప్రభుత్వానికి లేదని మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ మొదలు పెట్టిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును యథావిధిగా నిర్మిస్తే ఇప్పటికే జాతీయ హోదా వచ్చేదన్నారు.
- ◆ ముఖ్యమంత్రి ఎవరనే విషయాన్ని పక్కనపెట్టి తెలంగాణ కాంగ్రెస్ నేతలు పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని ఏఐసీసీ కార్యదర్శి వి.హన్మంతరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని యథాతథంగా ఉంచేందుకు కేంద్ర మంత్రివర్గం బిల్లును ఆమోదించడంపై భాజపా రాష్ట్ర కార్యాలయం వద్ద అంబేద్కర్, మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో భాజపా నేతలు కె.లక్ష్మణ్, కిషన్‌రెడ్డి, ఎన్.రాంచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి అర్చక ఉద్యోగుల సమ్మె

మడికొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు అందజేస్తామని జీవో 577 జారీ చేసి ఏడాది అవుతున్నా.. అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గంగు భానుమూర్తి ప్రకటించారు. వరంగల్ అర్బన్ జిల్లా మడికొండ మెట్టుగుట్ట క్షేత్రంపై అర్చక జేఏసీ రాష్ట్ర కార్యవర్గ అత్యవసర సమావేశాన్ని జిల్లా కన్వీనర్ డీవీఆర్.శర్మ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుమూర్తి మాట్లాడుతూ.. ఆలయాల్లో తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్నవారిని జీవో 121 ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. అర్చక ఉద్యోగుల డిమాండ్ల సాధనకు శుక్రవారం దేవదాయశాఖ కమిషనర్‌కు సమ్మె నోటీసులు అందజేస్తామని తెలిపారు.

భవిష్యనిధి రికవరీ 16 శాతానికి పెంచాలి: టీఎంయూ

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: సంఘటిత రంగంలో ఉద్యోగుల "టేక్ హోం సాలరీ" పెంపు పేరుతో భవిష్యనిధి(పీఎఫ్)ని 10శాతానికి తగ్గించాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన అర్థ రహితమని ఆర్టీసీ ఎన్ఎంయూ ఛైర్మన్ నాగేశ్వరరావు అన్నారు. పదవీ విరమణపై మెరుగైన ఆర్థిక వృద్ధి చేకూరేలా ప్రస్తుతం మూల వేతనంలో రికవరీ అవుతున్న 12 శాతం పీఎఫ్‌ను 16 శాతానికి పెంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

7వ తేదీ నుంచి బీసీ రాజకీయ చైతన్య యాత్ర

తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రానున్న సాధారణ ఎన్నికల్లో బీసీల వాటా బీసీలే పొందేందుకు, పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా సగభాగం దక్కించుకోవాలన్న ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం 'రాజకీయ చైతన్య యాత్ర'ను నిర్వహించనుంది. ఈ నెల 7 నుంచి 36 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టి బీసీలను చైతన్యం చేయనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ వివరించారు. యాత్రకు సంబంధించిన గోడపత్రికను గురువారం హైదరాబాద్‌లో పలు బీసీ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. పాలమూరు (గ్రామం) నుంచి పట్నం వరకు అనే నినాదంతో చేపడుతున్న యాత్రను పంచాయతీరాజ్ శాఖ మంత్రి నియోజకవర్గమైన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి ఈనెల 7న మొదలు పెడుతున్నట్లు పేర్కొన్నారు. 80 నియోజకవర్గాల్లో యాత్ర నిర్వహించి సెప్టెంబరు 11న హైదరాబాద్‌లో సభ ద్వారా ముగియనుందన్నారు.

సహకార ఎన్నికలు వాయిదా

- పాలకవర్గాల పదవీకాలం మరో 6 నెలల పొడిగింపు
- వచ్చే ఫిబ్రవరిదాకా ఎన్నికలు లేనట్టేనా?

ఈనాడు, హైదరాబాద్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(ప్యాక్స్) ఎన్నికలను మరికొంతకాలం వాయిదా వేయాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. వీటి పాలకవర్గాల పదవీకాలం మరో ఆరునెలలు పొడిగిస్తూ వారినే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా నియమిస్తూ సహకార శాఖ తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. గత ఫిబ్రవరి ఒకటిన పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ముగిసిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఆరునెలల పాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఈ గడువు కూడా గత నెలాఖరుతో ముగిసింది. ఈలోగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం నుంచి సహకార శాఖకు ఆదేశాలేమీ రాలేదు. ఎన్నికలు నిర్వహిస్తారా లేక పదవీకాలం పొడిగించాలా అని సహకార రిజిస్ట్రార్ గత నెలలో ప్రభుత్వాన్ని అడగ్గా పొడిగించాలనే ఆదేశాలిచ్చింది. ఈ మేరకు సహకార రిజిస్ట్రార్ వీరబ్రహ్మయ్య జిల్లా సహకార అధికారులకు ఉత్తర్వులు జారీచేశారు. వచ్చే ఫిబ్రవరి వరకు పాత పాలకవర్గాలనే పర్సన్ ఇన్‌ఛార్జిలుగా కొనసాగిస్తారు. వచ్చే మే నెలలో శాసనసభ, లోక్‌సభలకు సాధారణ ఎన్నికలు జరగాల్సి ఉంది. అప్పటిలోగా ప్యాక్స్‌కు ఎన్నికలు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తుందా అన్నదానిపై రాజకీయపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటివరకు ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం నుంచి సహకార శాఖకు ఎలాంటి సంకేతాలూ రాలేదు.

సిద్ధం కాని ఓటర్ల జాబితాలు: రాష్ట్రంలో సహకార సంఘాల ఎన్నికలన్నీ ఇక 'రాష్ట్ర సహకార ఎన్నికల సంఘం' ఆధ్వర్యంలోనే జరగాలని ప్రభుత్వం 3 నెలల క్రితం ఉత్తర్వులిచ్చింది. ప్యాక్స్‌లో రైతులు సభ్యులుగా ఉంటారు. వీరిని ఓటర్లుగా గుర్తిస్తూ వారి ఫొటోలు, వివరాలతో ఓటరు జాబితాలు సిద్ధం చేసిన తర్వాత జిల్లా, రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ ఆమోదం పొందాలి. ఇప్పటివరకు రాష్ట్ర సహకార రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్యాక్స్‌ల నుంచి ఫొటో ఓటరు జాబితాలేమీ రాలేదు. ఫొటో ఓటరు జాబితాల ద్వారా ప్యాక్స్‌ల్లో పారదర్శకత తెచ్చి పక్కాగా ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఆంధ్రకు ప్రత్యేక హోదా ఇవ్వాలి

తెలంగాణ కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి

తిరుమల, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారిని ఆయన గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చేలా పాలకుల కళ్లు తెరిపించాలని వేంకటేశ్వరస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. పార్లమెంటు సాక్షిగా ఎంపీ కవిత ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరిన విషయాన్ని కోమటిరెడ్డి గుర్తుచేశారు. తెలంగాణకు విభజన చట్టాలు అమలు చేయాలని కోరారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ తన వైఖరిని తెలపాలన్నారు. తెలంగాణలో తెదేపాతో పొత్తు పెట్టుకుంటారా? అని అడగ్గా.. దానిపై పార్టీ జాతీయ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయం తీసుకుంటారని సమాధానమిచ్చారు.

రయ్ రయ్
autopage@eenadu.in
ఈనాడు
హైదరాబాద్, శుక్రవారం ఆగస్టు 3, 2018
మా చిరునామా: **రయ్ రయ్..** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

పాలసీ మధ్యలో మార్చొచ్చా?

వాహన సురక్ష

ఆరేళ్లుగా ఒకే సంస్థ నుంచి నా బైక్‌కి బీమా పాలసీ తీసుకుంటున్నాను. ఎప్పుడూ బీమా క్లెయిం చేసుకోలేదు. ఈమధ్య ఈ బండికి చిన్న ప్రమాదం జరిగింది. సాయం అడిగితే బీమా సంస్థ సరిగా స్పందించలేదు సరికదా.. దానికోసం చాలా డాక్యుమెంట్స్ అడిగి సతాయించారు. వారి తీరు నాకు నచ్చలేదు. ఇప్పుడు నేను ఆ కంపెనీ బీమా పాలసీ ఉపసంహరించుకొని వేరే కంపెనీకి మారాలనుకుంటున్నాను. ఇలా చేయడం సాధ్యమేనా? - **దిలీప్,** కర్నూలు

పాలసీ వ్యవధి అమల్లో ఉన్న సమయంలో ఒక బీమా సంస్థ నుంచి వేరొక సంస్థకు మారే అవకాశం ఉంది. కానీ అది మీకు అసౌకర్యం కలిగించవచ్చు. ముందు మీరు మారబోయే సంస్థ నుంచి తాజా పాలసీ తీసుకోవాలి. తర్వాత అమల్లో ఉన్న పాలసీని రద్దు చేయాలని ప్రస్తుత ఇన్సూరెన్స్ కంపెనీకి దరఖాస్తు చేసుకోవాలి. ఇది పూర్తయ్యాక మీకు చెల్లించే రిఫండ్ ప్రో-రేటా ప్రాతిపదికన ఉంటుంది. కాబట్టి మీరు బీమా సంస్థ మారదల్చుకుంటే దానిని తదుపరి ఏడాది పాలసీ పునరుద్ధరణ సమయంలో మాత్రమే మార్చుకుంటే బాగుంటుంది.

- **సజ్జా ప్రవీణ్‌చౌదరి,** వాహన బీమా హెడ్, www.policybazaar.com

మెరుగులద్దే.. యాక్సెసరీలు

సమాచారం

ఎన్నాళ్లుగానో ఎదురుచూసిన బీఎండబ్ల్యూ 310ఆర్, 310జీఎస్ మోడళ్లు విడుదలయ్యాయి. పదిరోజుల్లోనే ఆర్డర్లు పదివేలు దాటాయి. మోడల్ కొత్తది, ఖరీదైంది పైగా డీలర్‌షిప్‌లు తక్కువ. మరి దీనికి తగ్గ యాక్సెసరీస్ కావాలంటే ఎలా? బెంగేం అక్కర్లేదండీ. బీఎండబ్ల్యూ మోటోరాడ్ నుంచి కొనుక్కోవచ్చు. ఏమేం దొరుకుతున్నాయి అంటే... జీ 310ఆర్ బైక్ సీటు ఎత్తు 785మిమీలు. ఇది బాగా ఎత్తు.. సౌకర్యవంతంగా ఉండాలని భావించేవాళ్లు 770మిమీల ఎత్తున్న సీటు కొనుక్కోవచ్చు. ఇంధన ట్యాంకు మీద ఉండే 'ట్యాంకు రక్సాక్'కి 12వోల్టుల సాకెట్ జత చేయవచ్చు. ద్విచక్రవాహనానికి మరింత వెలుతురు కావాలనుకుంటే అదనంగా అమర్చుకునే ఎల్ఈడీ ఇండికేటర్లు కొనుక్కోవచ్చు. మనం ఎక్కడున్నాం? ఎక్కడికి వెళ్తున్నాం? వెళ్లబోయే దారి ఈ వివరాలన్నీ కచ్చితంగా చూపించే నావిగేషన్ డివైజ్ కూడా అందుబాటులో ఉంది.

పరిచయం

ఎంపిక మీదే

చేతిలో పైకం.. బైక్ కొనాలనుకునే ఆశ ఉన్నవారికి ఇప్పుడు పెద్ద చిక్కే వచ్చి పడింది. వరుసపెట్టి ద్విచక్రవాహనాలు మార్కెట్‌ని ముంచెత్తుతున్నాయి. ఏవి ఎంచుకోవాలో తెలియని అయోమయం. అయినా మార్కెట్లోకి వచ్చినవి, రేపోమాపో రాబోతున్నవి నాలుగింటి వివరాలు ఇస్తున్నాం సంక్షిప్తంగా. ఛాయిస్ మీదే.

హీరో డ్యూయెట్ 125

ధర: రూ. 58,000

'ది రైడ్ ఆఫ్ టుమార్, హియర్ టుడే' నినాదంతో హీరో డ్యూయెట్ 125 దూసుకొచ్చింది. 124.6సీసీ, సింగిల్ సిలిండర్ ఫోర్‌స్ట్రోక్ ఇంజిన్. ఇంజిన్ ఆన్‌లో ఉండి, బండి పరుగులు పెట్టనపుడు ఆటోమేటిగ్గా ఆఫ్ అయ్యే ఐ3ఎస్ టెక్నాలజీ దీని ప్రత్యేకం. 6,750ఆర్‌పీఎం 8.7బీహెచ్‌పీని విడుదల చేస్తుంది. సీటు కింద స్టోరేజీ ఎక్కువ. సెమీ డిజిట్ స్పీడో కన్‌సోల్, మొబైల్ ఛార్జింగ్ పాయింట్ సదుపాయం ఉంది. టెలిస్కోపిక్ ఫోర్క్స్, హైడ్రాలిక్ షాక్అబ్జార్బర్లు మేటి సస్పెన్షన్‌నిస్తాయి. ఇంటిగ్రేటెడ్ బ్రేకింగ్ సిస్టమ్ ఉంది.

హోండా ఏవియేటర్

ధర: రూ.55,157

యాక్టివా-ఐకి మెరుగులద్దిన వెర్షన్. ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్. లోపల ఏవియేటర్ సిగ్నేచర్. ముఖ్యభాగాలకు రక్షణగా మెటల్ మఫ్లర్ ప్రొటెక్టర్ ఉంది. స్టాండర్డ్, అల్లాయ్ డ్రమ్, అల్లాయ్ డిస్క్ వేరియంట్లలో దొరుకుతోంది. మూడు రంగుల్లో లభ్యమవుతోంది. 110సీసీ, ఫోర్‌స్ట్రోక్ ఇంజిన్. 8బీహెచ్‌పీ సామర్థ్యం దీని సొంతం.

హీరో కరిజ్మా

ధర: రూ. 1.08లక్షలు

ఒకానొక సమయంలో దేశంలో అత్యధికంగా అమ్ముడైన మోడల్ హీరో కరిజ్మా జడ్ఎంఆర్. 2017లో బీఎస్-4 నిబంధనలు అమల్లోకి వచ్చాక ఆపేశారు. ఇప్పుడు బీఎస్-4 నిబంధనలకనుగుణంగా ఉన్న పవర్‌ట్రెయిన్‌తో వస్తోంది.. పాత మోడల్‌కి కొద్దిపాటి మార్పులు చేశారు. 223సీసీ సింగిల్ సిలిండర్, 9000ఆర్‌పీఎం మీద 20బీహెచ్‌పీ శక్తి విడుదలవుతుంది. డిజిటల్ కన్‌సోల్, డైనమిక్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, టెయిల్‌ల్యాంప్‌లు ఆకర్షణలు. అత్యధిక వేగం 129కిమీలు/గం.

వెస్పా నోట్టె 125

ధర: రూ.68,845

గతంలో వచ్చిన వెస్పా ఎస్ఎక్స్ఎల్, వీఎక్స్ఎల్‌లకి ఇది కొనసాగింపు. లిమిటెడ్ ఎడిషన్‌గా తీసుకొచ్చారు. మ్యాటే బ్లాక్ రంగు డిజైన్, నలుపు రంగు లెదర్ సీటు, 11 అంగుళాల రిమ్‌లు, రేయర్‌వ్యూ అద్దాలు.. అన్నీ నలుపే. 125సీసీ సింగిల్ సిలిండర్, 7500 ఆర్‌పీఎంతో 9.5బీహెచ్‌పీ శక్తి, సీవీటీ గేర్‌బాక్స్.. ఎన్నో ప్రత్యేకతలున్నాయి. వెస్పా, ఏప్రిలియా డీలర్‌షిప్‌ల్లో రూ. 8,999 కట్టి బుకింగ్ చేసుకోవచ్చు.

(ధరలు: దిల్లీ ఎక్స్‌షోరూం)

కారు బయటికి తీయాలంటే ట్రాఫిక్ బాధ... బయటికి తీసిన కారు అద్దం దించితే కాలుష్య భయం... అందుకే అద్దాలు దించి ఎంచక్కా ఏసీ ఆన్ చేసేసుకుంటాం... నిశ్చింతగా ప్రయాణంలో మునిగిపోతాం... ఇంతటితో మనం సేఫ్‌నా? కానే కాదు! అద్దాలు వేసినా అంతర్గత కాలుష్యం వెంటాడుతుంది... ఏమరపాటుగా ఉంటే అలర్జీలు పొంచి ఉంటాయ్ అంటున్నారు నిపుణులు... రోడ్డుప్రమాదాలు.. వాహన నిర్వహణల్లాగే ఇన్-కారు కాలుష్యం పట్ల జాగ్రత్తగా ఉండాలంటున్నారు... అందుకోసం మనమేం చేయాలంటే?

కాలుష్యం కారుల్లో చిక్కుకోవద్దు!

కారంటే ఒకప్పుడు విలాసం. భవిష్యత్తులో అవసరంగా మారబోతోంది. కారున్న ఓనరు సగటున రోజుకి 101 నిమిషాలు కారులోనే గడుపుతారు అంటోంది హార్వర్డ్ హెల్త్ వాచ్ అధ్యయనం. అంటే ఏడాదికి 25 రోజులు. అంత ముఖ్యమైన వాహనం పట్ల చాలానే జాగ్రత్తలు తీసుకుంటాం. సమయానికి సర్వీసింగ్ చేయిస్తాం. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడతాం. ఇది సరే. అంతర్గత కాలుష్యమూ హాని కారకమే అన్న విషయం చాలామందికి తెలియదు. దానిపై దృష్టి పెట్టాల్సిందే.

ఇవీ కారణం

లోపల కూర్చుంటాం. హాయిగా ఏసీ వేసుకుంటాం. ఇంకెక్కడి కాలుష్యం? ఇది చాలామంది సందేహం. కానీ ఇక్కడే తప్పటడుగు వేస్తాం. అందం కోసం సీట్లకు రంగురంగుల డిజైన్ల కవర్లు తొడుగుతాం. మనకు మట్టి అంటకుండా మ్యాట్లు వేసుకుంటాం. వాటి నిర్వహణ సరిగా ఉండకపోతే ఇవే చెడు బ్యాక్టీరియా కేంద్రాలవుతాయి. ఫంగస్‌కి చిరునామాగా మారతాయి. దాంతో జలుబు, దగ్గుల్లాంటి జబ్బులొస్తాయి. చర్మవ్యాధులు, అలర్జీలకు కారణమవుతాయి. నిర్లక్ష్యం ఎక్కువైతే శ్వాసకోస ఇబ్బందులూ తప్పవు. మనకి చల్లదనం అందించే ఏసీ కూడా అంతర్గత కాలుష్యానికి కారణం అన్న సంగతి చాలామందికి తెలియదు. ఏసీని వెదజల్లే ఎయిర్ వెంట్‌లు సూక్ష్మక్రిములకు కేంద్రాలు. ఎయిర్‌వెంట్ వెనకాల ఉండే ఎయిర్‌కండీషనింగ్ ఫిల్టర్లలో సైతం ధూళి విపరీతంగా పేరుకొని పోయి ఉంటుంది. గాలితోపాటు ఇది కారు లోపలికి వ్యాప్తి చెందుతుంది. దుర్వాసన వెదజల్లుతుంది. పెద్దస్థాయిలో దుమ్ము పేరుకొనిపోతే ఎయిర్ క్యాబిన్ ఫిల్టర్ గాలి రాకుండా అడ్డుపడుతుంది. ఫంగస్ ఏర్పడి అలర్జీలకు కారణం అవుతుంది. ఇక మనం ట్రాఫిక్‌లో వెళ్తున్నపుడు కారు కిందిభాగం నుంచి, డోరు అద్దాలు తెరిచినపుడు కాలుష్యం, దుమ్ము లోపలికి వస్తుంది. కిటికీ అద్దాలు మూసినా లోపలి ఫ్యాన్ తిరుగుతూ ఉన్నా లోపలంతా పరుచుకుంటుంది. రకరకాల ఇంధనాల్లో ఏవైనా లీకేజీలున్నా ఆ వాసన లోపలికొస్తుంది. ఇవి కాకుండా సిగరెట్ తాగడం, వ్యర్థాలు పడేయడం, మట్టి కాళ్లతో లోపలికి రావడం, కాలం చెల్లిన కారు వాడకం.. ఇవి మన ప్రమేయంతో జరిగే అంతర్గత కాలుష్య కారకాలు. వీటితోనూ రకరకాల దీర్ఘకాలిక శ్వాసకోశ జబ్బులొస్తాయి.

మరేం చేయాలి?

- బ్యాక్టీరియా ఎక్కువగా ఉండే, ఫంగస్ పోగయ్యే సీట్ల మూలలు, కార్పెట్లు, మ్యాట్‌ల కింద తరచూ వాక్యూమ్ క్లీనర్‌తో శుభ్రం చేయాలి. కార్ల కోసమే తయారైన పోర్టబుల్ వాక్యూమ్ క్లీనర్లు మార్కెట్లో దొరుకుతున్నాయి.
- తిండి పదార్థాలు, అరటి తొక్కలు, వ్యర్థాలు లోపల పడకుండా చూసుకోవాలి. వీటితోపాటు నీరు ఒలకబోసినపుడు చెమ్మ కారణంగా ఫంగస్ తయారవుతుంది. అలర్జీలకు కారణమవుతుంది.
- డ్యాష్‌బోర్డు, స్టీరింగ్ వీల్, కంట్రోల్‌ప్యానెల్, సీటుబెల్టులు, డోర్‌హ్యాండిళ్లు, సన్‌విజర్లు, అద్దాలపై ధూళి ఎక్కువగా పేరుకుంటుంది. వీటిపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలి.
- కారు అంతర్భాగాలను అప్పుడప్పుడు స్టీమ్ క్లీనింగ్ చేయించాలి. అత్యధిక వేడి ఉండే దీని ద్వారా అలర్జీ కారకాలు నశిస్తాయి.
- వాహనం అడుగుభాగం, ఏసీ వెనకభాగం నుంచి కాలుష్య ఉద్గారాలు క్యాబిన్‌లోకి వస్తాయి. ఏసీ ఆన్ చేసినపుడు లోపలంతా వ్యాపిస్తాయి. ఇది తగ్గాలంటే ముందు వెళ్తున్న వాహనాలకు దూరం పాటించాలి.
- సిగ్నల్ పడినప్పుడు స్వచ్ఛమైన గాలి కోసమని అద్దాల్ని దించుతాం. అప్పుడే ఇతర వాహనాలు వదిలే పొగ, దుమ్ము మన కారు లోపలికి వస్తుంది. అందుకే కూడళ్లలో అద్దాలు తెరవొద్దు.
- ట్రాఫిక్ లేనపుడు, బయట ఎండగా ఉన్నప్పుడు అద్దాలు తెరిచిపెట్టాలి. దీంతో లోపలి గాలి బయటికి వెళ్లి, స్వచ్ఛమైన గాలి లోనికి వస్తుంది.
- ఎయిర్ ఫ్రెషనర్లు, డియోడరైజర్లు సువాసనలు వెదజల్లినా వాయు కాలుష్యానికి కారణమవుతాయి. వాటిని వాడొద్దు. లోపల సిగరెట్ కాల్చితే దాని ప్రభావం కొన్ని గంటల వరకూ ఉంటుంది.
- దుమ్ము ఎక్కువగా చేరే కార్పెట్లు, మ్యాట్‌లపై బేకింగ్ సోడా చల్లి శుభ్రం చేయొచ్చు.

కొత్త కారుతో జాగ్రత్త

కొత్త కారు కొనగానే చాలామంది గర్వంగా ఫీలవుతారు. దాన్నుంచి వెలువడే ఒకరకమైన వాసనని కొందరు ఆస్వాదిస్తుంటారు కూడా. కానీ ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదని పరిశోధనల్లో నిరూపితమైంది. ఇందులో వోలటైల్ ఆర్గానిక్ కంపౌండ్స్ (వీఓసీ) అనే ప్రమాదకర రసాయనాలు ఉంటాయి. తోలు సీట్లు, జిగుర్లు, సీలంట్‌లు, రంగులు, బెంజీన్, టోల్యూన్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్, జిగుర్లు, వినైళ్లు, ప్లాస్టిక్‌ల నుంచి ఈ వీఓసీలు, వాయువులు వెలువడుతుంటాయి. పాత కారుకన్నా కొత్త కారులో 35 రెట్లు అధికంగా వీఓసీలుంటాయి. నాలుగైదు నెలలపాటు ఈ ప్రభావం ఉంటుంది. ఎక్కువ సమయం ఈ కారులోనే గడిపితే నీరసం, నిస్సత్తువ ఆవహిస్తుంది. తరచూ తలనొప్పి వస్తుంది. గొంతులో గరగర, ఛాతిలో అసౌకర్యంగా ఉంటుంది. గుండె నాడీ లయ దెబ్బతినే ప్రమాదం ఉంది. ఆస్తమా వచ్చే అవకాశాలున్నాయి. ఈ దుష్ఫలితాల నుంచి తప్పించుకోవాలంటే కొత్త కారుని రోజుకి రెండు, మూడు గంటలపాటు డోర్లు తెరిచి ఉంచాలి. నేరుగా ఎండ తగిలేచోట వాహనాన్ని పార్కింగ్ చేయొద్దు. అంతర్గత కాలుష్యాన్ని తగ్గించే హెపా ఎయిర్ ప్యూరిఫయర్‌లను వాడాలి.

వీటితో శుభ్రం

కారు లోపలి వాతావరణాన్ని శుద్ధి చేసేవీ, అలర్జీ కారకాలను అరికట్టేవీ ఎయిర్ ప్యూరిఫయర్లు. అంతర్గత కాలుష్యం తగ్గించడానికి చాలామంది వీటిని వాడుతున్నారు. రెండున్నర వేల నుంచి పదివేల రూపాయల మధ్యలో దొరుకుతున్నాయి. యూఎస్‌బీ, సాకెట్ ద్వారా డాష్‌బోర్డ్, రేయర్ ట్రే ఎక్కడైనా బిగించుకోవచ్చు. అత్యధికంగా అమ్ముడవుతున్న వాటిలో కొన్ని.

హనీవెల్ మూవ్‌ప్యూర్

లోపలి గాలిని స్వచ్ఛంగా చేయడమే కాదు.. 2.5పీఎం (వెంట్రుక మందంలో యాభయ్యో వంతు) ఉన్న అతి సూక్ష్మ ధూళి కణాలను సైతం అడ్డుకుంటుంది. ఇందులోని రెండు పొరల యాక్టివేటెడ్ కార్బన్ ఫిల్టర్ సిగరెట్ పొగ, ప్రమాదకర వీఓసీ వాయువుల్ని శుభ్రం చేస్తుంది. అలర్జీ కారక బ్యాక్టీరియా, వైరస్‌లను చంపేస్తుంది.

ఫిలిప్స్ గోప్యూర్ కాంపాక్ట్ 110

కాలుష్య కారకాలు, ధూళిని మూడు పొరల్లో వడకడుతుంది. 2.5పీఎం సామర్థ్యంతో పని చేస్తుంది. పదిహేను నిమిషాల్లో ఎలాంటి దుర్వాసనలైనా తగ్గించి స్వచ్ఛమైన గాలి అందిస్తామంటోంది ఫిలిప్స్. ఇంజిన్ స్టార్ట్ కాగానే ఆటోమేటిగ్గా ఇది స్టార్ట్ అయి పని చేయడం దీని ప్రత్యేకత.

షార్ప్ ప్లాస్మాక్లస్టర్ ఎయిర్‌ప్యూరిఫయర్

నాలుగైదు నిమిషాల్లోనే లోపలి గాలిని శుభ్రం చేస్తుందట. 10 పీఎం ధూళి కణాలను అడ్డుకుంటుంది. అలర్జీ కారకాలు, చెడు బ్యాక్టీరియాలను చంపేస్తుంది. యూఎస్‌బీ అడాప్టర్‌తో అనుసంధానించవచ్చు. అయితే దీన్ని వాడనప్పుడు కూడా కనెక్ట్ చేసి ఉంచాలి.

క్రూసేడర్స్ సీఎఫ్-100

యాక్టివ్ కార్బన్ ఫిల్టర్, హెపా (హై ఎఫీషియెన్సీ పార్టిక్యులేట్ అరెస్టాన్స్)లతో పనిచేస్తుంది. నిమిషాల్లో 60-70 చదరపు అడుగుల వైశాల్యంలో గాలిని స్వచ్ఛంగా మార్చుతుంది. ఇది లిథియం-అయాన్ బ్యాటరీతో పనిచేస్తుంది. చిన్న పరిమాణంలో, తేలికగా పెట్ బాటిల్‌లా ఉంటుంది.

జూక్ జేఎంటీ-ప్యూర్ సెన్స్

తక్కువ ధరలో ఎక్కువ సమర్థమంతంగా పనిచేసే గాలిశుద్ధి యంత్రం. 2.5పీఎం సామర్థ్యం. డబుల్ లేయర్ యాక్టివేటెడ్ కార్బన్ ఫిల్టర్‌తో పని చేస్తుంది. చెడు, ఇంధనం లీకేజీ వాసనలు అరికడుతుంది. అలర్జీ కారకాలను చంపేస్తుంది.

లోగోట్టు

షేక్‌హ్యాండిచ్చే హ్యుందాయ్

ఇండియాలో అత్యధికంగా కార్లను అమ్ముతున్న కంపెనీల్లో హ్యుందాయ్‌ది రెండోస్థానం. ప్రపంచంలోని టాప్ కంపెనీల్లో ఒకటి. ఇంత పెద్ద కంపెనీ అయినా దాని లోగో మాత్రం చూడ్డానికి సింపుల్‌గా ఉంటుంది. సంస్థ పేరులోని మొదటి అక్షరం మీదుగా 'హెచ్' ఉంటుంది. కానీ జాగ్రత్తగా గమనిస్తే అందులో ఇద్దరు వ్యక్తులు ఉంటారు. ఒకరికొకరు కరచాలనం చేసుకుంటుంటారు. ఒకరు వినియోగదారుడు అయితే రెండో వ్యక్తి హ్యుందాయ్ కంపెనీ ప్రతినిధి.

చిట్కా

మాత్రతో బ్యాటరీ ఛార్జ్

బ్యాటరీ డెడ్ అయిన కారు స్టార్ట్ అవడం కష్టమే. సర్వీస్‌సెంటర్ దూరంలో ఉంటే ఇక ఆ బాధలు వర్ణనాతీతం. అదిగో అలాంటి విపత్కర పరిస్థితుల్లో ఓ చిట్కా పాటిస్తే కారు కొద్దిదూరమైనా కదులుతుందండోయ్. ఇంతకీ మనం ఏం చేయాలంటే తలనొప్పికి వాడే యాస్పిరిన్ మాత్రలు కొన్నింటిని బ్యాటరీలో వేయాలి. ఆ ఔషధంలో ఉండే రసాయనాలు బ్యాటరీ కొంతమేర ఛార్జ్ అయ్యేలా చేస్తాయి. దీంతో ఇంజిన్ స్టార్ట్ అయ్యి దగ్గర్లోని గ్యారేజీ వరకు వెళ్లిపోవచ్చు.

ఈనాడు సినిమా

అనుపమ పరమేశ్వరన్

ఈ వయసులో ఇంతేనేమో!

ఇప్పుడిప్పుడే కథా నాయికగా ఎదుగుతోంది అనుపమ పరమేశ్వరన్. సినిమా సినిమాకీ ఆమె నటనలో పరిపక్వత కనిపిస్తోంది. తనకు తగిన కథలనే ఎంచుకుంటోంది. విజయాలూ దక్కించుకొంటోంది. మీ కథల ఎంపిక వెనుక ఉన్న రహస్యం ఏమిటి? అని అడిగితే ''పెద్దగా రహస్యాలేం లేవు. నిజం చెప్పాలంటే, ఏ కథలు ఎంచుకోవాలో, వేటిని వదులుకోవాలో నాకే అర్థం అవ్వడం లేదు. అన్ని కథలూ నచ్చేస్తున్నాయి. బహుశా సినిమానీ, నటనని అంతగా ప్రేమిస్తున్నానేమో. అదృష్టవశాత్తూ మంచి ఫలితాలు వస్తున్నాయి. ఈ వయసులో ప్రతీ అమ్మాయికీ చిన్న పాటి గందరగోళాలు ఎదురవుతుంటాయి. నాకూ అంతేనేమో. పరిశ్రమలోకి వచ్చి ఇంత కాలమైనా, ఇన్ని సినిమాలు చేసినా ఇంకా ఆ కన్ఫ్యూజన్ వదలడం లేదు. అయితే ఓ కథ వినగానే ఇంట్లోవాళ్లతోనూ, అత్యంత సన్నిహితులతోనూ చర్చిస్తుంటా. ఓ విధంగా అది నాకు బాగా సహాయపడుతోంది'' అంటోంది అనుపమ.

'బాహుబలి'కి ముందు ఏం జరిగింది?

'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: కన్‌క్లూజన్'... రెండూ తెలుగు సినీ ప్రియుల జ్ఞాపకాల నుంచి ఇంకా చెదిరిపోలేదు. ఆ సినిమా గురించీ, రికార్డుల గురించీ ఇంకా మాట్లాడుకుంటూనే ఉన్నాం. 'బాహుబలి' బ్రాండింగ్ కూడా అలానే కొనసాగుతోంది. 'బాహుబలి' పాత్రల్ని గుర్తు చేస్తూ బొమ్మలు, వీడియో గేములూ రూపొందాయి. పుస్తకాలు వచ్చాయి. ఇప్పుడు వెబ్ సిరీస్ రాబోతోంది. 'బాహుబలి: ది బిగినింగ్'కి ఓ విధంగా ఇది ప్రీక్వెల్ అన్నమాట. ఆనంద్ నీలకంఠన్ అనే రచయిత 'బాహుబలి'కి ముందు ఏం జరిగిందో ఊహిస్తూ, 'ది రైజింగ్ ఆఫ్ శివగామి' అనే పుస్తకం రచించారు. దాని ఆధారంగానే ఈ వెబ్ సిరీస్ రూపుదిద్దుకొంటోంది. ఎస్.ఎస్.రాజమౌళితో సహా దేవా కట్టా, ప్రవీణ్ సత్తారు ఈ వెబ్ సిరీస్‌కు దర్శకత్వం వహిస్తారు. బాహుబలి, కట్టప్ప, శివగామి, బిజ్జల దేవ, భళ్లాలదేవ... ఈ పాత్రల గురించి మరింత క్షుణ్నంగా ఈ వెబ్ సిరీస్‌లో చూపించబోతున్నారు. యేడాది నుంచీ ఈ వెబ్ సిరీస్‌కి సంబంధించిన స్క్రిప్టు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం అవన్నీ ఓ కొలిక్కి వచ్చాయి. అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా, బాహుబలి స్థాయిని గుర్తు తెచ్చేలా ఈ వెబ్ సిరీస్ రూపొందిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఎస్.ఎస్.రాజమౌళి

పంచ్ డైలాగ్

మా అమ్మ ఎవరు అని అడిగితే లోకం జాలిపడుతుంది. అదే మా నాన్న ఎవరు అని అడిగితే అదే లోకం నవ్వుతుంది.

చిత్రం: కాశీ

– పంపినవారు: జి.వి.మురళీ మోహన్, ముచ్చుమిల్లి

నా జీవితం ఇక రాజకీయాలకే!

విశ్వనటుడు కమల్‌హాసన్. ఏ పాత్ర ఇచ్చినా... అందులో తన విశ్వరూపం చూపించే వరకూ నిద్రపోడు. అందుకే కమల్‌ని నటనకు పర్యాయపదంగా చూపిస్తుంటారు. నటుడిగా ఎవ్వరికీ అందనంత ఎత్తుకు ఎదిగిన కమల్... దర్శకుడిగా, నిర్మాతగానూ తనని నిరూపించుకునే ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. అందులో భాగంగానే 'విశ్వరూపం' రూపుదిద్దుకుంది. ఈ చిత్రం.. ఎన్నో వివాదాలకు కేంద్రబిందువైంది. విజయాన్నీ అందుకుంది. ఇప్పుడు 'విశ్వరూపం 2' విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా హైదరాబాద్ వచ్చిన కమల్ గురువారం విలేకరులతో ముచ్చటించారు.

తొలి భాగానికీ, రెండో భాగానికీ మధ్య చాలా విరామం వచ్చేసినట్టుంది..?

అవునండీ.. కానీ ఈ గ్యాప్‌కి బాధ్యులం మేం కాదు. రాజకీయ కారణాలు కొన్నయితే.. పరిస్థితులు కొన్ని. ఇప్పటికి అవన్నీ అనుకూలించాయి. 'నాలుగేళ్లయిపోయింది కదా? ప్రేక్షకులు ఎలా స్వీకరిస్తారో' అనే భయాలు ఉండేవి. ఎందుకంటే... సినిమా జీవిత కాలం ఇప్పుడు మూడు వారాలే. ఆ తరవాత దాని గురించి మర్చిపోతారు. కానీ ఇన్నేళ్లయినా 'విశ్వరూపం' గుర్తుందంటే, 'విశ్వరూపం 2' గురించి ప్రేక్షకులు ఎదురుచూస్తున్నారంటే... ఆనందంగానూ గర్వంగానూ అనిపిస్తోంది.

'విశ్వరూపం' కథకు ఇది కొనసాగింపేనా?

నూటికి నూరుశాతం. 'విశ్వరూపం' ఆలోచన వచ్చినప్పుడే దాన్ని రెండు భాగాలుగా చెప్పాలని అనుకునే రంగంలోకి దిగాం. పార్ట్ 2 కూడా నాలుగేళ్ల క్రితమే పూర్తయిపోయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు మాత్రం యేడాది క్రితం మొదలయ్యాయి. సాంకేతికత పరంగా ఈతరం సినిమాలానే ఉంటుందని మాటిస్తున్నా.

నాలుగేళ్లయ్యింది కదా.. కథలో ఏమైనా మార్పులు చేశారా?

ఏం లేవు. చిన్న చిన్న ప్యాచ్ వర్క్ చేశామేమో. ఓ పాటని మాత్రం ఆమధ్యే పూర్తి చేశాం. 'విశ్వరూపం' విదేశాల్లో జరిగే కథ. 'విశ్వరూపం 2' మాత్రం ఇండియాలోనే జరుగుతుంది.

తొలిభాగం వివాదాలకు కేంద్రబిందువు అయ్యింది. ఈసారీ ఆ భయాలున్నాయా?

తొలిభాగంలో కూడా వివాదాస్పద అంశాలేం లేవండీ. ఆ విషయం సినిమా చూసిన వాళ్లెవరైనా చెబుతారు. పనిగట్టుకుని వివాదాలు సృష్టించారంతే. ఇప్పుడు అలాంటి పనులు ఆపేశారు కాబట్టి.. ఆ భయాలేం వేయడం లేదు.

ఓ కళాకారుడిగా చెప్పండి.. మన దగ్గర క్రియేటివ్ ఫ్రీడమ్ ఎంత వరకూ ఉంది?

అది కాస్త తక్కువగానే ఉంది. సెన్సార్ బోర్డు ఉండకూడదు, కేవలం సర్టిఫికెట్ బోర్డు మాత్రమే ఉండాలి అని పోరాడాం. అయితే ఆ అలవాటు ఇంకా పోలేదు. ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్ అంటే ఇంకా నేర్చుకోవాలి.

దేశభక్తి, జాతీయ సమైక్యత.. ఇలాంటి విషయాలపై మీ సినిమాల్లో సీరియస్‌గా చర్చ సాగుతుంటుంది. వ్యక్తిగతంగా వీటిపై మీ అభిప్రాయం ఏమిటి?

దేశభక్తి, జాతీయ సమైక్యత అనే పదానికి అర్థాలు ప్రతీ వంద కిలోమీటర్లకు ఒకలా మారిపోతుంటుంది. వాటిపై చాలా డిబేట్లు జరుగుతున్నాయి. దేశభక్తి.. అంటే ఏమిటో నాకు తెలుసు. కానీ నీలో ఎంత ఉంది? ఎలా ఉంది? అనే ప్రశ్నలు మాత్రం అడక్కండి.

'విశ్వరూపం 3' తీసే ఆలోచనలున్నాయా?

రెండు భాగాలు తీస్తే.. మా పని పూర్తయినట్టే అనుకున్నాం. మరో అడుగు గురించి ఇంకా ఆలోచించలేదు.

రాజకీయ నాయకుడిగా మీ ఐడియాలజీ ఎలా ఉండబోతోంది?

మనకు స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలైంది. అయితే.. మనం ఇంకా 1948 దగ్గరే ఉన్నామనుకోవాలి. మళ్లీ ముందు నుంచి మన ప్రయాణం మొదలెట్టాలి. ఆ మార్పులో మనమంతా భాగస్వాములు కావాలి. ఆ సమయం వచ్చేసింది. ఒక్కో అడుగు వేసుకుంటూ మన గమ్యం చేరుకోవాలి. అలాంటి మార్పుని చూడాలనుకుంటున్నా. ఈ దేశం కోసం మరో సత్యాగ్రహం చేయాలి. ఇన్నేళ్ల ప్రయాణంలో నేనో ఆయుధంలా తయారయ్యాను. సమాజం దాన్ని ఉపయోగించుకునే సమయం ఆసన్నమైంది.

రాజకీయాల్లోకి వెళ్లారు. మరి సినిమాల మాటేంటి?

నా పూర్తి జీవితం ఇక రాజకీయాలకే. ఎందుకంటే ప్రజలు నాకు ఇచ్చారు. ఈ డబ్బు, హోదా, పేరు వాళ్లిచ్చిందే. తిరిగి వాళ్ల రుణం తీర్చుకోవాలి కదా?

మరి మీ కథలు, మీరు చేయాల్సిన పాత్రలు...

దేశ జనాభా నూట ఇరవై కోట్లు. వాళ్లలో నాలాంటి ప్రతిభావంతులు వేలల్లో ఉంటారు. కమల్ హాసన్ అనే పేరు ఉండదేమో.. ప్రతిభ మాత్రం నాకంటే ఎక్కువే ఉంది. 'కళకు అంతం లేదు' అని 'సాగర సంగమం' శుభం కార్డు వేసినప్పుడు చూపించాం. అది ఒక మనిషితో ముగిసిపోదు.

నటుడు, దర్శకుడు, నిర్మాత.. ఈ మూడు విభాగాల్లో అత్యంత సంతృప్తినిచ్చిందేది?

ఓ సినిమా చేశాక.. ప్రేక్షకుల మధ్యలో కూర్చుని, వాళ్ల స్పందన స్వయంగా తెలుసుకోవడమే గొప్ప అనుభూతి. పారితోషికం అందుకున్నట్టో, అడ్వాన్స్ చెక్కు ఇచ్చుకున్నట్లో అనిపిస్తుంటుంది.

తాతయ్య కోరిక ఇలా తీరనుంది...

''నిన్ను కథానాయకుడిగా చూడాలనేది నా కోరిక అని మా తాతయ్య అనేవారు. అది నెరవేరకుండానే వెళ్లిపోయారు. ఇప్పుడాయన ఆశీర్వదించడం వల్లనే కథానాయకుడిని కాగలిగాను. తాతయ్య కోరిక ఇలా తీరింది'' అని చెప్పారు రాజేష్ శ్రీచక్రవర్తి. ప్రముఖ సంగీత దర్శకుడు చక్రవర్తి మనవడాయన. చక్రవర్తి తనయుడైన సంగీత దర్శకుడు శ్రీ కుమారుడు. రాజేష్ శ్రీచక్రవర్తి కథానాయకుడుగా నటించిన చిత్రం 'శివకాశీపురం'. ప్రియాంక శర్మ కథానాయికగా నటించింది. హరీష్ వట్టికూటి దర్శకుడు. మోహన్‌బాబు పులిమామిడి నిర్మాత. శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో **రాజేష్ శ్రీచక్రవర్తి** విలేకర్లతో మాట్లాడారు.

❖ ''పల్లెటూరి నేపథ్యంలో సాగే కుటుంబ కథా చిత్రం. మంచిర్యాల సమీపంలోని కాశీపురం ఊళ్లో నిజంగానే ఓ కోట నేపథ్యంలో జరిగిన కొన్ని సంఘటనల ఆధారంగా అల్లిన కథతో తెరకెక్కింది. నేను మానసికంగా ఇబ్బంది పడే ఆటో డ్రైవర్‌గా నటించాను. ఆ కోటలో దాగిన అమ్మనీ, ప్రేమించిన ప్రియురాల్నీ ఎలా దక్కించుకున్నాననేదే ఆసక్తికరం. హారర్ సినిమా కాదు. నాలుగు పాటలున్నాయి. పవన్ శేషా స్వరాలు ఆకట్టుకుంటున్నాయి''.

❖ ''నేను బీకామ్ చదివాను. తాత, నాన్న సంగీత దర్శకులయినా నాకు ఆ వైపు ఆసక్తి లేదు. సినిమా గురించి సాంకేతికంగా తెలుసుకోవాలనే ఉద్దేశంతో 'కల్యాణ వైభోగమే' సినిమాకి నందినీ రెడ్డి వద్ద దర్శకత్వశాఖలో పనిచేశా. సత్యానంద్ మాస్టారు వద్ద నటన సంబంధిత అంశాల్లో శిక్షణ పొందా. 'నువ్వు చాలా హాట్ గురూ' లఘు చిత్రంలో నటించా. ఇప్పుడు కథానాయకుడిగా అవకాశాలు వస్తున్నాయి. ఈ సినిమా విడుదల తర్వాత ఎలాంటివి చేయాలో నిర్ణయించుకుని ముందుకు సాగుతా. కథానాయకుడిగానే కాదు, మంచి పాత్రలు ఎలాంటివి వచ్చినా వదులుకోను''.

గీతోపదేశం

పతి దేవుని మురిపించే వలపుల వీణ
జీవితమే పండించే నవ్వుల వాన
కష్టసుఖాలలో తోడూనీడగా
తల్లిని మరిపించే ఇల్లాలి ఆదరణ
మగువేగా మగవానికి
మధుర భావన

గీతం: ఆలయాన వెలసిన ఆ దేవుని రీతి...

చిత్రం: దేవత

రచన: వేటూరి

– పంపినవారు: చల్లా అంజలి, హైదరాబాద్



ఎంత బావున్నారో...!

సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్....బాలీవుడ్‌లో ఓ క్రేజీ కాంబినేషన్. ఈ జంట వెండితెరపై కలిసి ఆడి పాడితేనే ప్రేక్షకులు ఫిదా అయిపోతున్నారు. ఈ ఇద్దరూ ఏకంగా చేయి చేయి పట్టుకొని ర్యాంప్‌పై నడిచారు. దీంతో ఇద్దరి అభిమానులు సల్మాన్, కత్రినా ఎంత బావున్నారో అంటూ సంబరపడిపోతున్నారు. దిల్లీలో జరిగిన ఓ ఫ్యాషన్ షోలో ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్ర రూపొందించిన దుస్తులు ధరించి సందడి చేసిందీ జంట. నల్ల రంగు పఠానీ సల్వార్, కుర్తాలో సల్మాన్, మెరిసిపోయే లెహంగాలో కత్రినా మెరిసిపోయారు. ప్రస్తుతం వీరు 'భారత్'లో కలిసి నటిస్తున్నారు.

బేబీ సింగ్‌ని కిడ్నాప్ చేసిన 'ఫన్నేఖాన్'!

బాలీవుడ్ నుంచి మరో ఆసక్తికరమైన మల్టీస్టారర్ చిత్రం ప్రేక్షకులను అలరించడానికి వచ్చేస్తోంది. అదే 'ఫన్నే ఖాన్'. అందాల తార ఐశ్వర్యరాయ్, సీనియర్ కథానాయకుడు అనిల్ కపూర్, విలక్షణ నటుడు రాజ్‌కుమార్ రావ్ ప్రధాన పాత్రల్లో నటించారు. కొత్త దర్శకుడు అతుల్ మంజ్రేకర్ సంగీతభరిత హాస్య ప్రధాన చిత్రంగా దీన్ని తెరకెక్కించారు. ప్రముఖ దర్శకుడు రాకేష్ ఓం ప్రకాష్ మెహ్రాతో కలసి అనిల్ కపూర్ నిర్మించారు. 2000లో ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో ఆస్కార్ నామినేషన్ పొందిన బెల్జియన్ చిత్రం 'ఎవ్రీబడీస్ ఫేమస్'కు రీమేక్‌గా ఈ చిత్రం రూపొందింది. ఈ శుక్రవారం 'ఫన్నేఖాన్' థియేటర్లలోకి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.

'ఫన్నే ఖాన్'

బాలీవుడ్‌లో మల్టీస్టారర్ చిత్రాలు తరచుగానే వస్తుంటాయి. అయితే 'ఫన్నేఖాన్' మీద మాత్రం చాలా ఆసక్తి నెలకొంది. సుదీర్ఘ విరామం తర్వాత ఐశ్వర్యరాయ్, అనిల్ కపూర్ కలసి నటించడం ఒక కారణమైతే, వారికి రాజ్‌కుమార్ రావ్ లాంటి ప్రతిభావంతుడైన యువ నటుడు తోడవడం మరో కారణం. 18 ఏళ్ల క్రితం 'హమారా దిల్ ఆప్‌కే పాస్ హై'లో కలసి నటించారు అనిల్ కపూర్, ఐశ్వర్యరాయ్. ఇప్పుడు మళ్లీ 'ఫన్నేఖాన్'తో తెరను పంచుకున్నారు. 'న్యూటన్', 'ట్రాప్డ్' లాంటి చిత్రాలతో మెప్పించిన రాజ్‌కుమార్‌కు అనిల్, ఐశ్వర్యలతో కలసి నటించడం ఇదే తొలిసారి. పైగా ఓ ఆస్కార్ నామినేటెడ్ చిత్రాన్ని అధికారికంగా రీమేక్ చేస్తుండటంతో మంచి అంచనాలేర్పడ్డాయి.

కథేంటి: ఫన్నే ఖాన్ (అనిల్ కపూర్) 28 ఏళ్ల క్రితం ఓ ఆర్కెస్ట్రాలో గాయకుడిగా పనిచేస్తుంటాడు. కిషోర్ కుమార్ అంతటి పెద్ద గాయకుడు కావాలని కలలు కంటాడు. కానీ కొన్ని పరిస్థితుల వల్ల అతని కోరిక నెరవేరదు. ప్రస్తుతానికొస్తే తన కూతురు లతాను లతా మంగేష్కర్ అంత గొప్ప గాయకురాలిని చేసి తన కలను తీర్చుకోవాలని తపిస్తుంటాడు. లతకు కూడా పాడటంపై ఆసక్తి ఉంటుంది కానీ తను చాలా లావుగా ఉంటుంది. దాంతో ప్రదర్శనలకు వెళ్లినప్పుడు అవమానాలు ఎదురవుతుంటే కుమిలిపోతుంటుంది. తండ్రిలాగే తానూ గాయకురాలిగా గుర్తింపు తెచ్చుకోలేనని బాధపడుతుంటుంది. కూతురి ప్రతిభను తెలియజెప్పేందుకు ఆమెతో ఓ ఆల్బమ్ రూపొందించాలనుకుంటాడు ఫన్నేఖాన్. కానీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించవు. అప్పుడే అతనికి ప్రముఖ పాప్ గాయకురాలు బేబీ సింగ్(ఐశ్వర్యరాయ్) గురించి తెలుస్తుంది. ఒక్కో పాటకు రూ.లక్షల్లో పారితోషికం తీసుకునే ఆమెను కిడ్నాప్ చేయాలనుకుంటాడు. దానికి ఆదిర్(రాజ్‌కుమార్ రావ్) సాయం తీసుకుంటాడు. ఇద్దరూ కలసి బేబీని ఒక చోట బంధిస్తారు. ఇంతకీ ఫన్నేఖాన్ ఎందుకు బేబీని కిడ్నాప్ చేశాడు? బేబీ మాయలో పడ్డ ఆదిర్ ఏం చేశాడు? ఆ తర్వాత ఎలాంటి మలుపులు చోటు చేసుకున్నాయి? కూతురిని పెద్ద గాయకురాలిని చేయాలన్న ఫన్నేఖాన్ కోరిక నెరవేరిందా? అనే విషయాలకు చిత్రాన్ని చూడాల్సిందే.

విస్కోస్ వర్ణరంజితంగా

ఫ్యాషన్ ఫ్యాషన్

అందంగా, హుందాగా కనిపించాలనుకుంటారు ఆధునిక మగువలు. అలాంటి వారికే ప్రత్యేకం ఈ చీరలు. సరికొత్త ప్రింట్లూ... వైవిధ్యమైన డిజైన్లతో రూపొందిన ఈ చీరలు ధరిస్తే చాలు... సొగసూ, సౌకర్యం సొంతమవుతాయి.

నగలు, దుస్తులు:
KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld
సైఫాబాద్: 040-23231147/23423440
జూబ్లీహిల్స్:040-23540862, కూకట్‌పల్లి: 040-23152323
విజయవాడ:0866-2496464, 0866-2498189
తిరుపతి:0877-2238820
వైజాగ్:0891-2577905

జియోమెట్రిక్ ప్రింట్లూ, టాజిల్స్ సొగసుతో చక్కగా తీర్చిదిద్దిన విస్కోస్ చీర.

డిజిటల్ హంగులూ... జియోమెట్రిక్ గీతల కలబోతగా రూపొందిన చీర... ధరిస్తే ధగధగలే.

వర్ణరంజితమైన చీరకు అందం తెచ్చిన ఏనుగు మోటిఫ్‌లు... ఆకట్టుకునే అంచూ, కొంగు.

సలాడ్ రుచికి బాదం

సలాడ్ ఏదయినా సరే... రుచిగా, ఆకట్టుకునేలా ఉంటేనే కదా తినగలం. ఈ జాగ్రత్తలు తీసుకుని చూడండి. రుచితోపాటూ పోషకాలు కూడా అందుతాయి.

- వేయించిన పదార్థాలు సలాడ్‌లో కలపడం వల్ల ప్రయోజనం ఉండదు. అందుకే బాదం, వేయించి పొట్టుతీసిన పల్లీలను సలాడ్ అంతా తయారయ్యాక పైన వేయండి. ఆరోగ్యానికి మేలే కాదు రుచీ బాగుంటుంది. కావాలనుకుంటే గుమ్మడి విత్తనాలూ, నువ్వులూ, అవిసెగింజల్ని కూడా దోరగా వేయించి కలుపుకోవచ్చు.
- సలాడ్ అయినంత మాత్రాన కొవ్వుపదార్థాలు మానేయాలని లేదు. కాబట్టి ఫెటా చీజ్, టోఫు పనీర్ లాంటివీ కొద్దిమొత్తంలో వేయడం వల్ల మాంసకృత్తులు అందుతాయి.
- అప్పుడప్పుడూ సలాడ్ తియ్యగా ఉండేలా కూడా చేసుకోవచ్చు. ఇందుకోసం చక్కెర వాడాలని లేదు. కిస్‌మిస్ పలుకులూ, ఖర్జూరాల ముక్కలు వాడొచ్చు. అలాగే కమలా ఫలం, పియర్, పైనాపిల్ యాపిల్‌ని సన్నగా తరిగి వేసినా రుచి పెరుగుతుంది.
- సలాడ్ అంటే ఎప్పుడూ ఒకేలా కాకుండా రకరకాల రంగుల కూరగాయలు కలిపి కూడా చేసుకోవచ్చు. బజార్లో దొరికే డ్రెసింగే వేయాలని లేదు. వెనిగర్, మిరియాలపొడీ, ఉప్పూ, ఛాట్‌మసాలా వేసినా చాలు. రుచి పెరుగుతుంది.

పొడిచర్మానికి నలుగు ఉందా?

నాది పొడి చర్మం. సబ్బు వాడకుండా కేవలం నూనెలు మాత్రమే రాస్తున్నా. ఈ క్రమంలో చర్మంపై టాన్ పేరుకుపోయింది. నలుగూ, సబ్బులు లేకుండా స్నానం అంటే చాలా ఇబ్బందిగా అనిపిస్తోంది. నాలాంటివారికి ఉపయోగపడే నలుగు ఏదయినా ఉందా. ఇంట్లోనే చర్మంపై పేరుకునే టాన్ పొట్టుకునే మార్గాలు ఏమైనా ఉన్నాయా - ఓ సోదరి

డియర్ వసుంధర

డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

మీరు చేస్తున్నది మంచి పనే. ఎక్కువ నూనెలు వాడటం వల్ల జిడ్డుగా, టాన్ పట్టినట్టు అనిపించడం సహజమే. మీరు తరచూ సహజ క్లెన్సర్లతో చర్మాన్ని శుభ్రం చేసుకోవచ్చు. బయటకు వెళ్లినప్పుడు ఎండబారిన పడకుండా గొడుగు వేసుకోవాలి. సన్‌స్క్రీన్ తప్పకుండా రాసుకోవాలి. లేదంటే చర్మం ఇంకా నల్లగా మారుతుంది. కొన్నాళ్లకి కాలినట్లు అయి కమిలిపోతుంది కూడా. ఒకవేళ మీకు బండి నడిపే అలవాటు ఉంటే గనుక బయటకు వెళ్తున్నప్పుడు మాస్క్, స్కార్ఫ్, చలువ కళ్లద్దాలూ, హెల్మెట్, గ్లవుజులు వాడుకోవాలి. ఆహారం, జీవనశైలిలోనూ మార్పులు చేసుకోవాలి. రోజూ తప్పనిసరిగా అరగంటపాటు ఏదో ఒక వ్యాయామం చేయాలి. విశ్రాంతి తీసుకోవాలి. వేళకు నిద్రపోవాలి. చక్కెరా, క్రాష్ డైట్, నూనె పదార్థాలూ, జంక్‌ఫుడ్ జోలికి వెళ్లకూడదు. పండ్లరసాలూ, తాజా పండ్లూ, గ్రీన్ టీ, తృణధాన్యాలూ, పప్పు ధాన్యాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. నీళ్లు ఎక్కువ తాగాలి. ముఖ్యంగా ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ లభించే చేపలూ, అవిసె గింజలూ వాల్‌నట్లూ, కొబ్బరి తీసుకోవాలి. ఇవన్నీ చర్మంలో సహజ నూనెల్ని ఉత్పత్తి చేసి పొడిబారకుండా చేస్తాయి.

వీటన్నింటితోపాటు వేడి వేడి నీళ్లతో స్నానం చేసే అలవాటు ఉంటే మానేయాలి. ఈ నీళ్లలో గాఢత అధికంగా ఉన్న క్యాల్షియం కార్బొనేట్, డోలోమైట్ అనే మినరళ్లు ఉంటాయి. వీటివల్ల చర్మ గ్రంథులు మూసుకుపోయి నూనెలు స్రవించే అవకాశం ఉండదు. కొలాజిన్ ఉత్పత్తీ తగ్గుతుంది. కొన్నిసార్లు దురదలూ బాధించొచ్చు. అందుకే గోరువెచ్చటి నీళ్లు ఉపయోగించడం మంచిది.

ఇంట్లోనే చేద్దామిలా: పై జాగ్రత్తలతోపాటు వంటింటి పదార్థాలతోనే నలుగు, స్క్రబ్‌లు తయారు చేసుకోవచ్చు. అవేంటంటే.. యాంటీఆక్సిడెంట్లు లభించే నిమ్మరసంలో కొద్దిగా చక్కెరా, బ్రౌన్ షుగర్, కాసిని నీళ్లు కలిపి ముఖానికి పూతలా వేసుకోవాలి. పావుగంటయ్యాక కడిగేస్తే మృతకణాలు తొలగిపోతాయి. నలుపు సమస్యా క్రమంగా తగ్గిపోతుంది. నిమ్మరసం యాంటీసెప్టిక్‌లా పనిచేసి చర్మ సమస్యల్ని దూరం చేస్తుంది. మేనిఛాయను అందిస్తుంది. చెంచా చొప్పున తేనె, నిమ్మరసం కలిపి రెండు రోజులకోసారి ముఖానికి రాసుకుని ఆరాక కడిగేయాలి. అలాగే గుడ్డులోని తెల్లసొనలో చెంచా తేనె, మూడు చెంచాల ఓట్స్ పొడి కలిపి ఒళ్లంతా నలుగులా రాసుకుని మర్దన చేసుకోవాలి. ఇరవై నిమిషాల తరవాత స్నానం చేయాలి. ఇలా వారానికోసారి నలుగు పెట్టుకుంటే టాన్ క్రమంగా తగ్గుతుంది. చెంచా చొప్పున చాక్లెట్‌పొడీ, తేనె, ఓట్స్ పొడి కలిపి పూతలా వేసుకుని కాసేపయ్యాక కడిగేయాలి. చెంచా బాదం పొడిలో కాసిని పాలూ, కొద్దిగా టొమాటో గుజ్జు కలిపి ముఖమంతా మర్దన చేయాలి. పావుగంటయ్యాక కడిగేసుకుంటే సరిపోతుంది. కొబ్బరినూనె, తేనె సమపాళ్లలో తీసుకుని అందులో చెంచా పాలపొడి చేర్చి ముఖం, మెడకి రాయాలి. అరగంటయ్యాక శుభ్రం చేసుకోవాలి. ఇవన్నీ చర్మానికి తేమనందించి పొడిబారకుండా చూస్తాయి. నలుపు సమస్య కూడా తగ్గుతుంది.

– మీ సందేహాలను, సమస్యల్ని vasubeauty@eenadu.net కు పంపించగలరు.

బంగారం వెండి

2న ముగింపు-క్రితం



తమిళనాడు (రూ. లలో)		
ఆర్నమెంట్ (గ్రా)	2,832	2,843
వెండి (గ్రా)	41.20	41.30

	హైదరాబాద్		విజయవాడ		ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం		విశాఖపట్నం	
బంగారం(24క్యా)	30,500	30,700	30,850	30,800	30,830	30,830	30,585	30,672	30,400	30,510
ఆర్నమెంట్	28,540	28,700	28,600	28,550	28,550	28,550	28,310	28,386	28,280	28,380
వెండి(కిలో)	38,860	39,050	39,400	39,400	39,100	39,100	38,900	39,000	39,900	39,900

నేను ఒంటరిని కాదు

సంకల్పం ఉంటే సాధించలేనిదేమీ లేదు... కష్టమైనా విజయతీరాలకు చేరుకోగలం. భర్త ఆశయాలకోసం పసుమర్తి మాధవి కూడా అలానే ఆలోచించారు. ఒడిదొడుకులను ఓడిస్తూ... ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తూ కుటుంబాన్ని నిలబెట్టుకున్నారు. వేలమంది విద్యార్థుల్ని తీర్చిదిద్దుతున్నారు. ఇదిగో చదవండి ఆమె విజయగాథ

నా కథ

మా పెద్దమ్మాయి దివ్యకి ఉద్యోగం వచ్చింది. ఈ నెల ఎనిమిదో తారీఖున చేరబోతోంది. అది నాకు సంతోషాన్ని కలిగించే విషయమే అయినా ఆ రోజంటే నాకు భయం. మావారు 2010లో ఆరోజునే ఆసుపత్రిలో చేరారు. ఒక్కమాటలో చెప్పాలంటే జీవితం మలుపు తిరిగింది ఆరోజునే.

నాకు చిన్నతనం నుంచి చదువంటే ఇష్టం. అందుకే ఎమ్మెస్సీ (ఐటీ), ఎంఏ, చేశా. ఓ సంస్థలో రీసెర్చ్ అసోసియేట్‌గా పని చేస్తున్నప్పుడే పెళ్లైంది. మావారు అప్పటికే కాలీఫోర్నియాలో ఉద్యోగం చేస్తుండటంతో అక్కడి వెళ్లిపోయాం. నేను ఖాళీగా ఉండకుండా నెట్‌వర్కింగ్ కోర్సులు నేర్చుకున్నా. ఇంతలో పాప పుట్టింది. కానీ కొన్నాళ్లకి ఆయన ఉద్యోగరీత్యా... భారత్‌కి వచ్చేశాం.

డిప్రెషన్‌లోకి వెళ్లా: ఆ తరువాత ఓ సాఫ్ట్‌వేర్ కోర్సులో చేరా. అది చాలా కష్టమైంది. ఆ పరీక్షలో నెగ్గితేనే సర్టిఫికెట్ వస్తుంది. ఉద్యోగావకాశాలూ బాగుంటాయి. కష్టపడి చదువుకుని పాసయ్యా. ఓ సాఫ్ట్‌వేర్ సంస్థలో ఉద్యోగం వచ్చింది. కానీ మా అత్తగారు ఒప్పుకోకపోవడంతో ఎదురు చెప్పలేక ఇంటికే పరిమితమయ్యా. ఆ సమయంలో నా మనసుకు నేను సమాధానం చెప్పుకోలేక డిప్రెషన్‌కి లోనయ్యా. ఎందుకంటే చాలా కష్టపడి సర్టిఫికెట్ సంపాదించుకున్నా. ఆ బాధా, ఆ ఆలోచనలతో మూడేళ్లు గడిపా. ఇంతలో రెండో పాప.

అయితే ఒక రోజు నా గురించి తెలుసుకున్న ఓ స్నేహితురాలు తాను పని చేస్తోన్న స్కూల్‌కి తీసుకెళ్లింది. ఓ దరఖాస్తు ఇచ్చి పూర్తి చేసిమ్మంది. దాన్ని చూసిన స్కూల్ యాజమాన్యం అక్కడ నన్ను ప్రిన్సిపల్‌గా పనిచేయమని అడిగింది. ఒక్కక్షణం నా కళ్లు చెమ్మగిల్లాయి. మరేం ఆలోచించకుండా ఉద్యోగంలో చేరిపోయా. అక్కడ స్టాఫ్, విద్యార్థులు పంచిన ప్రేమ ఇప్పటికీ మర్చిపోలేను. అయితే పదినెలల తరువాత ఆయన మళ్లీ విదేశాలకు వెళ్లాల్సి వచ్చి మానేశా. ఏడాదిన్నరయ్యాక మళ్లీ హైదరాబాద్ వచ్చి స్కిల్‌ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ పెట్టి వారాంతంలో తరగతులు నిర్వహించేవాళ్లం.

గూగుల్, వెరిజాన్, మరికొన్ని పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థల ఉద్యోగులకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టాం. రెండు వారాలు తిరగక ముందే ఆయన కార్డియాక్ మయోపతితో ఆసుపత్రి పాలయ్యారు. ఆ రోజు ఆగస్టు ఎనిమిది. ఆయన ఐసీయూలో.. పిల్లలు ఇంట్లో, మరో వైపు ట్రైనింగ్. ఒకే సమయంలో ఎవ్వరికీ ఇబ్బంది కలగకుండా చూసుకునేదాన్ని

బాధను దాచుకుని: నేను బాధపడుతున్నానని తెలిస్తే ఆయనా, పిల్లలు తట్టుకోలేరని మౌనంగా లోలోపల ఏడ్చేదాన్ని. కొన్నిరోజులకు డిశ్చార్జి అయి, ఇంటికే పరిమితమయ్యారు. ఆయనకి లెక్కలంటే చాలా ఇష్టం. అందుకే చిన్నారులకు ట్యూషన్ సెంటర్ పెట్టారు. మా ఇంట్లో హాల్‌లో హర్షిణి అనే అమ్మాయితో అది మొదలైంది. క్రమంగా వందకుపైనే విద్యార్థులయ్యారు. కొన్నాళ్లకి ట్యూషన్ పేరు ఛాలెంజర్స్ అకాడమీ అని పెట్టుకున్నారు. మరోవైపు క్రమంగా ఆయన ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. చూపిద్దామని ఆసుపత్రికి తీసుకెళితే అక్కడే ప్రాణం పోయింది. నేనేమో పిల్లల్ని చూసుకునేవారు లేక ఇంట్లోనే ఉన్నా. చివరిక్షణంలో ఆయన పక్కన లేనని ఇప్పటికీ బాధపడుతుంటా. ఆ సమయంలో చేతిలో చిల్లిగవ్వ లేదు. బ్యాంకు ఖాతా లేదు. మా సంప్రదాయం ప్రకారం పెద్దకార్యం రోజున చేతిలో డబ్బులు పెడతారు. అలా వచ్చిన ఇరవై వేలే నా ఆస్తి అప్పుడు. వాటితోనే ఖాతా తెరిచా. ఆ డబ్బుతోనే కొన్నాళ్లు జాగ్రత్తగా గడిపా. పిల్లల స్కూలు ఫీజులు చాలా ఎక్కువ. అందుకే నేను ట్యూషన్లు చెప్పడం మానలేదు. అయితే ఆ డబ్బులూ సరిపోయేవి కాదు. నెలలో ఓ పదిరోజులు పిల్లలకి కూరలు కాకుండా మజ్జిగ చారుతో భోజనం పెట్టేదాన్ని. ఆటో ఎక్కితే డబ్బులు అవుతాయని ఎంత దూరమైనా నడిచే వెళ్లేదాన్ని. అమ్మానాన్నలూ చాలా మధ్యతరగతి వాళ్లు. వాళ్లు మానసికంగా ఎప్పుడూ అండగా ఉండేవారు. ఒక్కోసారి నాకే పరిస్థితులు అగమ్యగోచరంగా అనిపించి ఆత్మహత్య ఆలోచనలూ వచ్చేవి. అయినా మనసు బలహీనంగా కాకుండా ఎప్పటికప్పుడు ధృఢంగా చేసుకునేదాన్ని.

ధైర్యం చేశా: ఆ తరవాత అకాడమీని ఇంకా విస్తరిద్దామని మా పక్క ఇల్లు ఖాళీ అవ్వడంతో అద్దెకు తీసుకున్నా. ఇంటర్ విద్యార్థులకూ ట్యూషన్లు చెప్పడం మొదలుపెట్టా. పిల్లలు ఇచ్చే ఫీజులతోనే వారికి కుర్చీలు కొన్నా. క్రమంగా ఒక్కోటి సమకూర్చుకున్నా. అయినా ఆర్థిక ఇబ్బందులు ఉండేవి. కష్టాలెన్ని ఉన్నా మా వారి ఆలోచనల్లో పుట్టిన ఛాలెంజర్స్ అకాడమీని ఇంకా పెద్దది చేయాలని 2014లో ధైర్యం చేసి ఇన్‌స్టిట్యూట్‌ని రిజిస్టర్ చేయించా. క్రమంగా పిల్లలు పెరుగుతూ వచ్చారు. ఇప్పుడు కాలేజీ స్థాయికి తీసుకొచ్చా. పిల్లలకి పాఠాలు చెప్పడమే కాదు... వారికి చదువు మీద ఇష్టం పెరిగేలా బోధన పద్ధతుల్ని మార్చా. సైకాలజీ పాఠాలూ, మెదడుకి పదును పెట్టే ఆటల్ని ఆడించడం మొదలుపెట్టా. కేవలం చదువు అని ఒత్తిడి తెస్తే విద్యార్థులు మొండిగా తయారవుతారు. అందుకే మనసు తెలుసుకుని పాఠాలు చెబుతూ... ఉత్తీర్ణతను పెంచేందుకు ప్రయత్నించా. ప్రస్తుతం హాస్టల్ కూడా ఏర్పాటు చేశా. ఎంత కష్టమైనా ఇంకా దీన్ని అభివృద్ధి చేస్తా. ఇది ఉన్నంత కాలం నేను ఒంటరి అనే భావం నాకు రాదు. అలానే మహిళలు నేను ఒంటరిగా ఉన్నా, నాకెవరూ లేరు అని బాధపడకూడదు. కష్టంలో అయినాసరే మనల్ని మనం వెతుక్కుంటే.. ఎంతో సాధించగలం.



vihari@eenadu.in

"ఏదైనా పుణ్యక్షేత్రానికైతే వస్తా!!" ఇది ఇంట్లో పెద్దవారి మాట. జలపాతాలు, సరస్సులు చూపిస్తానంటేనే వస్తామంటారు పిల్లలు. ట్రెక్కింగులు, కయాకింగులు ఉంటేనే ఓటేస్తారు యువకులు. పచ్చదనం, చల్లదనం అందరూ కోరుకుంటారు. ఇవన్నీ ఒకేచోట ఉన్నాయంటే.. భలే భలే అనాల్సిందే! అవన్నీ ఆస్వాదించాలంటే.. కృష్ణానది జన్మస్థానమైన మహాబలేశ్వర్ వెళ్లాల్సిందే!

కృష్ణమ్మ పుట్టిల్లు

మహాభలేశ్వర్

ఆ తల్లి అడుగుపెట్టిన చోటల్లా పచ్చదనమే. తెలుగింట ధాన్యరాశులు కురిపించిన కృష్ణమ్మ ఒడ్డున పుణ్యక్షేత్రాలెన్నో! పర్యాటక విశేషాలెన్నెన్నో!! ఆ నది జన్మించిన మహాబలేశ్వర్ యాత్రాస్థలిగా, వినోద కేంద్రంగా పర్యాటకులను అలరిస్తోంది. ఆరు రుతువుల్లోనూ ఇక్కడ ఆమని తిష్టవేస్తుంది. వేసవిలో చల్లదనాన్ని, శీతాకాలంలో ఆహ్లాదాన్ని అందించే మహాబలేశ్వర్ వానాకాలంలో పచ్చదనంతో పలకరిస్తుంది. కొండల అంచులను ఒరుసుకుంటూ కదలిపోతున్న మేఘమాలికలు.. పరవశంతో ప్రణయగీతాన్ని ఆలపించేలా చేస్తాయి. మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఉన్న పర్వత ప్రాంతం మహాబలేశ్వర్. ఈ సుందర ప్రదేశం సముద్ర మట్టానికి 4,718 అడుగుల ఎత్తులో ఉంటుంది. సహ్యాద్రి పర్వత సానువుల్లో నెలకొని ఉన్న ఈ ఆధ్యాత్మిక కేంద్రానికి చారిత్రక ప్రాశస్త్యం కూడా ఉంది.

కొండపై కోట

శతాబ్దాలకు పూర్వం సింగన్ అనే రాజు ఈ ప్రాంతాన్ని పాలించాడు. ఇక్కడి మహాబలేశ్వరుడి దేవాలయం కూడా ఆయన హయాంలోనే నిర్మించారు. 17వ శతాబ్దంలో మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహాబలేశ్వర్‌ను కైవసం చేసుకున్నాడు. 1656లో ప్రతాప్‌గఢ్ కోటను కట్టించాడు. ఇది మహాబలేశ్వర్‌కు 24 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. కొండపై కోటలో భవానీదేవి, మహాదేవ ఆలయాలు ఉన్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు కోటలోకి అనుమతిస్తారు.

చూడచక్కని వ్యూపాయింట్లు

హిల్‌స్టేషన్‌గా పేరున్న మహాబలేశ్వర్‌లో దాదాపు 30 వ్యూపాయింట్లు ఉన్నాయి. విల్సన్ పాయింట్ అత్యంత ఎత్తయిన ప్రదేశం. ఆ తర్వాతి స్థానం కొన్నాట్ శిఖరానిది. ఆర్థర్స్ సీట్ పాయింట్, హెల్సెన్ పాయింట్ ఇలా రకరకాల వ్యూ పాయింట్ల నుంచి మహాబలేశ్వర్ సౌందర్యాన్ని 360 డిగ్రీల కోణంలో ఆస్వాదించొచ్చు. ఏనుగు తల ఆకారంలోని పర్వతాన్ని ఎలిఫెంట్ హెడ్ పాయింట్‌గా పిలుచుకుంటారు. ఈ వ్యూపాయింట్ నుంచి చుట్టుపక్కల ప్రాంతాలు చూడొచ్చు. సూర్యాస్తమయం సమయానికి పర్యాటకులు ఎక్కువగా ఇక్కడికి చేరుకుంటారు. ముంబయి పాయింట్ నుంచి కూడా మలి సంధ్య మనోహరంగా కనిపిస్తుంది. సాహసయాత్రికుల కోసం పలు వ్యూపాయింట్ల దగ్గర ట్రెక్కింగ్ అందుబాటులో ఉంది. స్థానికంగా ఉన్న అడ్వెంచర్ క్లబ్‌లు ట్రెక్కింగ్, ర్యాపెలింగ్ క్రీడలు నిర్వహిస్తుంటాయి.



జలపాతాల సోయగాలు

ఐదునదుల పుట్టినిల్లు మహాబలేశ్వర్ పరిసరాల్లో అద్భుతమైన మూడు జలపాతాలున్నాయి. 600 అడుగుల ఎత్తు నుంచి దుమికే లింగమల జలపాతం ప్రధానమైనది. మహాబలేశ్వర్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో ధోబీ జలపాతం ఉంటుంది. దీనిని చూసేందుకు యాత్రికులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. చైనామన్స్ జలపాత సోయగాలు చూపరులను కట్టిపడేస్తాయి. 18వ శతాబ్దంలో బ్రిటిష్ వాళ్లు.. చైనా, మలేసియాకు చెందిన ఖైదీలను ఇక్కడ బందీలుగా ఉంచేవారట. వారు స్ట్రాబెర్రీ తోటలను సాగు చేసేవారు. నేటికీ ఇక్కడ స్ట్రాబెర్రీ తోటలు ఉండటం విశేషం. ఇక వెన్నా సరస్సులో బోటింగ్ ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ కయాకింగ్ పోటీలు జరుగుతుంటాయి.

ఆధ్యాత్మిక సౌరభాలు

మహాబలేశ్వర్‌లో పరమశివుడు స్వయంభువుగా వెలిశాడని స్థలపురాణం. పరమేశ్వరుడికి ప్రీతిపాత్రమైన రుద్రాక్ష ఆకారంలో ఇక్కడ లింగం దర్శనమిస్తుంది. ఆలయంలో స్వామివారి కోసం పడక కూడా ఉంటుంది. ప్రతిరోజూ రాత్రి పరమేశ్వరుడు దీనిపై శయనిస్తాడని భక్తులు విశ్వసిస్తారు. అందుకు తగ్గట్టుగానే ఆలయం మూసివేసే సమయంలో ఏమాత్రం నలగకుండా ఉండే పక్క.. తెల్లారేసరికి చెదిరి కనిపించడం విశేషం. మహాబలేశ్వరుడి ఆలయ సమీపంలో కృష్ణానది జన్మస్థానంలో కృష్ణాబాయి ఆలయం ఉంటుంది.

త్రిమూర్తులే నదులుగా

సాక్ష్యాత్తు విష్ణుమూర్తే ఇక్కడ కృష్ణానదిగా ఉద్భవించాడని అంటారు. దీనికి సంబంధించి పౌరాణిక గాథ ఒకటి ప్రచారంలో ఉంది. పూర్వం మహావిష్ణువు సూచన మేరకు పరమశివుడి పర్యవేక్షణలో బ్రహ్మదేవుడు ఒక యజ్ఞాన్ని నిర్వహించాలనుకున్నాడట. యజ్ఞ సమయానికి సరస్వతీదేవి రాకపోవడంతో మరో స్త్రీమూర్తితో క్రతువు నిర్వహణకు పూనుకున్నాడట బ్రహ్మ. అదే సమయంలో అక్కడికి చేరుకున్న సరస్వతి తన స్థానంలో మరో మహిళ ఉండటాన్ని చూసింది. ఆగ్రహంతో త్రిమూర్తులను నదులుగా మారిపొమ్మని శపించిందట. అప్పుడు విష్ణుమూర్తి కృష్ణానదిగా, రుద్రుడు వెన్నా నదిగా, బ్రహ్మ కొయినా నదిగా మారారని కథ. ఈ మూడు నదులతో పాటు సావిత్రి, గాయత్రి నదులు కూడా ఇదే ప్రాంతంలో జన్మించాయి. ఐదు నదులు సంగమించే ప్రదేశం.. పంచగంగ. ఇక్కడ మహాదేవుడి ఆలయం ఉంది.

ఎలా వెళ్లాలంటే?

- పుణె నుంచి మహాబలేశ్వర్ 120 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. హైదరాబాద్ నుంచి పుణెకు విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడ నుంచి రైళ్లు ఉన్నాయి. పుణె నుంచి బస్సులు, ట్యాక్సీల్లో మహాబలేశ్వర్ చేరుకోవచ్చు.
- సొంత వాహనంలో వెళ్తే.. హైదరాబాద్ నుంచి మహాబలేశ్వర్ సుమారు 590 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. జహీరాబాద్, హుమ్నాబాద్, సోలాపూర్, పండరీపూర్, ఫల్టణ్ మీదుగా మహాబలేశ్వర్ చేరుకోవచ్చు. పండరీపూర్ నుంచి పుణె మీదుగా కూడా వెళ్లొచ్చు.

దిక్సూచి

మన వంట మనదే!

విహార కేంద్రాల్లో విలాసవంతమైన విడిది కావాలంటే కాస్త ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అందుబాటు ధరలో అనువైన చోటు దొరకాలంటే వీధి వీధి తిరగాలి. ఊరుగాని ఊరు వచ్చిన పర్యాటకులకు ఇలాంటి తిప్పలు లేకుండా విహార కేంద్రాల్లో హాస్టళ్లు వెలుస్తున్నాయి. తక్కువ ధరలో మంచి ఆతిథ్యం అందిస్తున్నాయి. ఉత్తరాదిలోని ప్రముఖ పర్యాటక కేంద్రాల్లో ముస్టాచ్ హాస్టల్స్ యాత్రికులను సాదరంగా ఆహ్వానిస్తున్నాయి. ఆగ్రా, జైపూర్, జైసల్మేర్, పుష్కర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, మనాలి, రుషీకేశ్, వారణాసిలో ముస్టాచ్ హాస్టళ్లు ఉన్నాయి. సింగిల్ బెడ్ నుంచి డీలక్స్ గదుల వరకు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. అద్దె రూ.300 నుంచి రూ.2,000 వరకు ఉంటుంది. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. యాత్రికులకు స్వయంగా వంట చేసుకునే అవకాశమూ ఉంది. మరిన్ని వివరాలకు www.moustachehostel.com వెబ్‌సైట్ చూడండి.

వారాంతంలో..

గండికోట రహస్యమిదే!

పెన్నా నది ప్రశాంతంగా ప్రవహిస్తూ ఉంటుంది. చిత్రావతి చిన్నగా ఉరకలేస్తుంటుంది. ఎప్పుడో గాని ఈ నదులు ఉధృతంగా ప్రవహించవు. అందుకే కాబోలు.. శతాబ్దాలు గడుస్తున్నా.. గండికోట చెక్కుచెదరక నిల్చుంది. కోటలోని రహస్యాలు పదిలంగా ఉన్నాయి. రెండో హంపీగా పేరున్న గండికోటలో పాగా వేసేందుకు ఎందరో రాజులు ఎన్నెన్నో యుద్ధాలు చేశారు. పెన్నాలో నెత్తురు పారించారు. ఇప్పుడదే కోటకు కులాసాగా చేరిపోవచ్చు. దిలాసాగా విహరించవచ్చు. పెన్నా లోయ సోయగాలు మనసారా ఆస్వాదించవచ్చు.

అందమైన లోయలు, శత్రుదుర్భేద్యమైన కోట, ప్రాచీన కట్టడాలు, ఎటు చూసినా అబ్బురపరిచే దృశ్యాలు.. గండికోట రహస్యమిదే! కడప జిల్లా జమ్మలమడుగు నుంచి 11 కిలోమీటర్ల దూరంలో పెన్నానది ఒడ్డున ఉంటుందీ కోట. పూర్వం ఈ ప్రాంతాన్ని గిరిదుర్గం అనేవారు. పెన్నా, చిత్రావతి నదులు కలిసే చోట కొండల మధ్య భారీ గండి ఏర్పడింది. ఆ సమీపంలో కోటను నిర్మించడంతో దీనికి గండికోట అని పేరొచ్చింది. సుమారు ఐదు కిలోమీటర్ల పొడవున్న లోయ గుండా పెన్నా నది వయ్యారాలు ఒలకబోస్తూ ప్రవహిస్తుంటుంది.

ఎందరో రాజులు..

11వ శతాబ్దంలో కళ్యాణి చాళుక్య రాజు త్రైలోక్యమల్లకు సామంతుడుగా ఉన్న కాకరాజు ఈ కోటను నిర్మించారు. విజయనగర రాజుల ఏలుబడి తర్వాత గండికోటపై పెమ్మసాని

పాలకుల ఆధిపత్యం కొనసాగింది. పదహారో శతాబ్దంలో గోల్కొండ నవాబు అబ్దుల్ కులీకుతుబ్ షా ప్రధాని, సైన్యాధికారి మీర్‌జుమ్లా గండికోటను ముట్టడించాడు. తర్వాత హైదర్ అలీ, టిప్పుసుల్తాన్ స్వాధీనపరుచుకున్నారు. టిప్పు సుల్తాన్ మరణం తర్వాత స్వాతంత్ర్యం వచ్చే వరకు ఇక్కడ ఆంగ్లేయుల పెత్తనం కొనసాగింది. 1980లో కేంద్ర పురాతత్వ శాఖ గండికోటను తమ అధీనంలోకి తీసుకుంది.

పునాదుల్లేని కోట..

గండికోట చుట్టూ మూడు రాతి ప్రాకారాలు ఉన్నాయి. పునాదులు లేకుండానే కొండలపై కోట గోడలను నిర్మించడం విశేషం. నిర్మాణంలో ఎర్రటి నున్నటి రాళ్లను వినియోగించారు. 1,200 మీటర్ల పొడవు, 800 మీటర్ల వెడల్పు ఉన్న కోట చుట్టూ 101 బురుజులు ఉన్నాయి. కోటలో 21 దేవాలయాలు ఉన్నాయి. 55 స్తంభాలతో, అరుదైన శిల్పకళతో మాధవరాయస్వామి ఆలయం అత్యద్భుతంగా ఉంటుంది. ఇక్కడి రంగనాయక ఆలయ స్తంభాలపై రామాయణ, భాగవత గాథలు దర్శనమిస్తాయి. ఆలయ మూలవిరాట్టు రంగనాయకస్వామి విగ్రహం ప్రస్తుతం మైలవరం పురావస్తు మ్యూజియంలో ఉంది. కోటలో జుమ్మా మసీదు ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది. ఇవేగాక కారాగారం, ఎర్రకోనేరు, ధాన్యాగారం, రామబాణపు బురుజు, రాయలచెరువు, రంగమహల్, ఆయుధ కర్మాగారం, వ్యాయామశాల ఇలా సందర్శనీయ స్థలాలెన్నో ఉన్నాయి.

–యస్. మహమ్మద్ ఆరీఫ్, న్యూస్‌టుడే, జమ్మలమడుగు

ఇలా వెళ్లొచ్చు..

- కడప నుంచి గండికోట 86 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్టణం ఇతర ప్రధాన నగరాల నుంచి కడపకు బస్సులు, రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.
- గండికోటకు సమీపంలో (32 కి.మీ) ఉన్న రైల్వేస్టేషన్ ముద్దనూరు. హైదరాబాద్ నుంచి తిరుపతి వెళ్లే వెంకటాద్రి, రాయలసీమ, తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లు ముద్దనూరు మీదుగా వెళ్తాయి. ఇక్కడి నుంచి గండికోటకు బస్సులు, ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. విజయవాడ నుంచి నేరుగా జమ్మలమడుగు వెళ్లే రైలు ఉంది. అక్కడి నుంచి సులభంగా గండికోటకు చేరుకోవచ్చు.

గాల్లో తేలిపోతుంటే..

విదేశీ విశేషం

టర్కీలోని కేపడోషియా ప్రాంతం అరుదైన పర్యాటక కేంద్రం. కొండలు, గుట్టలు, చారిత్రక పట్టణాలు, భూగర్భ నగరాలతో భలేగా ఉంటుంది. ఇక్కడి గోరెమి నగర శివారులో నిర్వహించే హాట్ బెలూన్ సఫారీ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. సూర్యోదయానికి ముందే బెలూన్లు గాల్లోకి తేలిపోతాయి. వందల అడుగుల ఎత్తుకు చేరుకుంటాయి. నీలాకాశంలో విభిన్న రంగులతో ఇంద్రధనుస్సును మరిపిస్తాయి. గగన వీధుల్లో యాత్రికులను తిప్పేస్తాయి. వారికి మరచిపోలేని అనుభూతిని మిగులుస్తాయి. అందుకే బెలూన్ సఫారీ కోసమే టర్కీకి వచ్చే పర్యాటకులూ ఉంటారు.

ఏ దేశమేగినా.. సొంతంగా షి'కారు'

కారు రెంటల్ సంస్థ అవిస్ ఇండియా విదేశాలకు వెళ్లే భారతీయ పర్యాటకులు కారులో సొంతంగా షికారు చేసే అవకాశం కల్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 170 దేశాల్లో.. 5,500 పైగా కారు అద్దె కేంద్రాలను ప్రారంభించింది. మొబైల్ యాప్ (avis) ద్వారా కారు బుక్ చేసుకోవచ్చు.

బుకింగ్‌లో 'పే-లేటర్' అనే ఆప్షన్ కూడా ఉంది. దీనిని ఎంపిక చేసుకుంటే.. అడ్వాన్స్ బుకింగ్ సందర్భంగా ముందస్తు రుసుము చెల్లించాల్సిన పని ఉండదు. కారులో షికారుకు ముందు డబ్బు ఇస్తే సరిపోతుంది. విదేశాల్లో విహారానికి వెళ్తున్న భారతీయులు సెల్ఫ్-డ్రైవ్‌పై ఆసక్తి కనబరుస్తుండటంతో ఈ సేవలు అందుబాటులోకి తెచ్చామని చెబుతున్నారు సంస్థ ప్రతినిధులు.

ఏపీలో కొలువుల పండగ

20వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి మంత్రిమండలి ఆమోదముద్ర

ఈనాడు, అమరావతి: ఒకవైపు నిరుద్యోగ భృతికి శ్రీకారం చుట్టిన రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు భారీగా ఉద్యోగాల భర్తీకీ సిద్ధమైంది. దాదాపుగా 20వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి గురువారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపింది. దీంతో రానున్న నెలల్లో ఉద్యోగ ప్రకటనలు రానున్నాయి. కొలువుల పండగ వాతావరణం నెలకొననుంది. భర్తీ చేసే పోస్టుల్లో వివిధ ప్రభుత్వ విభాగాల్లో 10వేలు, విద్యాశాఖలో 9,698 ఉన్నాయి. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం నుంచి చేపట్టనున్న యూనివర్సిటీల సందర్శన, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమానికి 'జ్ఞానభేరి'గా నామకరణం చేశారు. రాష్ట్ర యువజన విధానానికీ మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

'ఉస్మానియా'లో బీసీ విద్యార్థులకు శిక్షణ కేంద్రం

ఈనాడు, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రాష్ట్ర, కేంద్ర ఉద్యోగ పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం(ఓయూ)లో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. అందుకు అవసరమయ్యే నిధులను బీసీ సంక్షేమశాఖ కేటాయిస్తుంది. ఏడాదిన్నర క్రితం వరకు యూజీసీ నిధులతో ఓయూలో సమాన అవకాశాల విభాగం(ఈఓసీ) ఆధ్వర్యంలో వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేవారు. ఇప్పుడు అది మూతపడింది. ఈ క్రమంలో ఇటీవల సమావేశమైన శాసనసభ బీసీ సంక్షేమ కమిటీ.. బీసీ విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి ఉద్యోగాలకు అధిక సంఖ్యలో ఎంపికయ్యేలా ఓయూలో శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రంజీవ్ ఆచార్య, ఓయూ ఉపకులపతి రామచంద్రానికి సూచించింది. దానికి అవసరమైన నిధులను కేటాయిస్తామని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే రాష్ట్రస్థాయిలో టీఎస్‌పీఎస్‌సీతోపాటు యూపీఎస్‌సీ, స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ)లు నిర్వహించే పరీక్షలకు కూడా శిక్షణ ఇచ్చేలా విశ్వవిద్యాలయంలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని ఓయూ వీసీ రామచంద్రం తెలిపారు. దీనికి సంబంధించి కొద్ది రోజుల్లో బీసీ సంక్షేమశాఖతో పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకోనున్నామని ఆయన చెప్పారు. విదేశీ విద్యకు అవసరమైన టోఫెల్, ఐఈఎల్‌టీఎస్, జీఆర్ఈ తదితర వాటికి శిక్షణ ఇవ్వాలా? లేదా? అన్న దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేదన్నారు.

జిల్లావారీగా పంటల దిగుబడి లక్ష్యాలు

వ్యవసాయశాఖకు సీఎస్ జోషి ఆదేశాలు

ఈనాడు, హైదరాబాద్: జిల్లా, పంటవారీగా వ్యవసాయ భూములు, దిగుబడి, ఉత్పాదకతలపై ఐదేళ్లలో సాధించాల్సిన లక్ష్యాలను నిర్దేశిస్తూ ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఎస్కే జోషి ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన, సహకార శాఖల అధికారులతో గురువారం ఆయన సచివాలయంలో సమీక్ష జరిపారు. ఈ శాఖల ముఖ్య కార్యదర్శి పార్థసారథి, వ్యవసాయ కమిషనర్ జగన్మోహన్, సహకార రిజిస్ట్రార్ వీరబ్రహ్మయ్య, ఉద్యాన సంచాలకుడు వెంకట్రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఎస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 59.67 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూములున్నాయని, పంటవారీగా ఉత్పాదకత పెంపు, సేంద్రీయ వ్యవసాయం అభివృద్ధి, నాణ్యమైన విత్తనాల సరఫరా, యూరియా వినియోగం తగ్గింపు తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. పంట సాగు ఖర్చు తగ్గించడంతో పాటు ఆదాయం పెరిగేలా ప్రణాళికలు ఉండాలన్నారు.

ఘనవ్యర్థాల నిర్వహణ ముసాయిదాపై పునఃపరిశీలించాలి

పురపాలకశాఖ కార్యదర్శి అర్వింద్‌కుమార్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఘనవ్యర్థాల నిర్వహణ నిబంధనలను కొత్తగా ఏర్పాటవుతున్న 68 పురపాలక సంఘాలను కూడా దృష్టిలో ఉంచుకుని రూపొందించాలని రాష్ట్ర పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ సూచించారు. ఘనవ్యర్థాల నిర్వహణ నిబంధనల ముసాయిదాపై గురువారం ఆయన సమీక్షించారు. ఈ సమీక్షలో పురపాలకశాఖ డైరెక్టర్ టి.కె.శ్రీదేవి, ఆస్కి ప్రొఫెసర్ శ్రీనివాసచార్య పాల్గొన్నారు. ఘనవ్యర్థాల నిర్వహణ నిబంధనల ముసాయిదాను పునః పరిశీలించాలని తెలిపారు. కొత్త పురపాలక సంఘాల్లోనూ చెత్త ఏర్పడే ప్రదేశంలోనే చెత్తను వేరు చేయడం, రవాణా, ప్రాసెస్ చేయడం వంటివాటిపై దృష్టి సారించాలన్నారు. ఇంటింటినుంచి చెత్త సేకరణ, తడిచెత్త, పొడిచెత్త వేరు చేయడం వంటివాటికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. బయోమెడికల్ వ్యర్థాల శుద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని పట్టణ స్థానిక సంస్థలను ఆదేశించాలన్నారు. ఇప్పటికే 40 పురపాలక సంఘాల్లో కంపోస్ట్ ఎరువు తయారీ చేస్తున్నట్లు పురపాలకశాఖ డైరెక్టర్ శ్రీదేవి వివరించారు.

సగం మందికే ప్రాంగణ అర్హత

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో బీటెక్‌లో ఏటా 75 వేల మంది వరకూ ప్రవేశాలు పొందుతున్నా వారిలో దాదాపు సగం మంది మాత్రమే ప్రాంగణ నియామకాల్లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తున్నారు. కంపెనీలు విధించే నిబంధనల్ని అందుకోలేక పోతుండడం దీనికి ప్రధాన కారణం. ఇంజినీరింగ్ కళాశాలల్లో రెండు వారాల కిందటే ప్రాంగణ నియామకాల సందడి మొదలైంది. 2015-16 విద్యాసంవత్సరంలో బీటెక్‌లో చేరి ఇప్పుడు చివరి సంవత్సరం ప్రథమ సెమిస్టర్‌లోకి ప్రవేశించిన వారికి ఆయా పరిశ్రమలు ప్రాంగణ నియామకాలు జరుపుతున్నాయి. కొన్ని కంపెనీలు ఒకట్రెండు సబ్జెక్టుల్లో తప్పినా రాత పరీక్షలు రాసేందుకు అనుమతిస్తున్నాయి. ఉద్యోగంలో చేరే నాటికి బీటెక్ డిగ్రీ పట్టా పొంది ఉండాలని చెబుతాయి. మైక్రోసాఫ్ట్, గూగుల్, ఫేస్‌బుక్, పెగా సిస్టమ్స్ లాంటి పలు పరిశ్రమలు మాత్రం మూడో సంవత్సరం వరకు అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణులై ఉండాలని, మూడేళ్లలో ఒక్కసారి కూడా తప్పి ఉండరాదని నిబంధనలు విధిస్తుంటాయి. ఇక కనీసం ప్రథమ శ్రేణి మార్కులు సాధిస్తేనే వడపోత పరీక్షలు రాయడానికి అనుమతిస్తాయి.

ఉత్తీర్ణతే సమస్య



ఉద్యోగాల పోటీలో పాల్గొనాలంటే తప్పనిసరిగా 60% మార్కులు రావాలి. ఉత్పత్తి తరహా ప్రముఖ కంపెనీలైతే కనీసం 70% ఉండాలంటున్నాయి.

- చాలా మందికి ఈ స్థాయి మార్కులు రావడం లేదు.
- ఒకవేళ ప్రాంగణ నియామకాలకు ఎంపికైనా.. పలువురు బీటెక్ చివరి ఏడాదిలో పాసవడం లేదు.

సగం మందే..

- 2014-15లో తెలంగాణలో బీటెక్ చేరిన విద్యార్థులు: 75 వేల మంది.
- బీటెక్ పాసైనవారు 37,349 మంది.

జేఎన్‌టీయూహెచ్ పరిధిలో బీటెక్ ఉత్తీర్ణత పరిస్థితి (2018 జూన్ ఫలితాలు)

చివరి ఏడాది పరీక్షలకు హాజరైన వారు	60,717
ఉత్తీర్ణులు	
ఉత్తమ శ్రేణి (80%, ఆపైన)	6,479
ప్రథమ శ్రేణి	19,370
ద్వితీయ శ్రేణి	3,853
మొత్తం ఉత్తీర్ణత శాతం (నాలుగేళ్లు పాసైనవారు)	48.9%

"మూడో సంవత్సరం తర్వాత ప్రాంగణ నియామకాల్లో ఉద్యోగాలకు ఎంపికైన వారిలో కనీసం 5% మంది బీటెక్ అన్ని సబ్జెక్టులు పూర్తి చేయడం లేదు. వారిలో చాలామంది సప్లిమెంటరీ పరీక్షల్లో పాసై ఆయా కంపెనీల్లో చేరుతున్నారు' – జేఎన్‌టీయూ ఉన్నతాధికారి.

ఏపీలో నిరుద్యోగుల 'నేస్తం'

- ప్రతి నెలా రూ.వెయ్యి చొప్పున భృతి
- 10 నుంచి 12 లక్షల మందికి లబ్ధి
- ఆమోదించిన మంత్రి మండలి
- 12న పథకాన్ని ప్రారంభించే అవకాశం

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని నిరుద్యోగులకు శుభవార్త. వారికి ఉద్యోగం దొరికేవరకూ అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ప్రతి నెలా నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిర్ణయించింది. గురువారం అమరావతిలో సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం నిరుద్యోగ భృతికి సంబంధించిన విధివిధానాలకు ఆమోదముద్ర వేసింది. ఈ పథకానికి 'ముఖ్యమంత్రి యువ నేస్తం'గా పేరును ఖరారు చేసింది. నిరుద్యోగులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏటా రూ.1400 కోట్లకుపైగా ప్రభుత్వం ఖర్చు చేయనుంది. ఈనెల 12న అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పథకాన్ని ప్రారంభించే విషయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ నెల మూడో వారంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కానుంది. మంత్రులు కాలవ శ్రీనివాసులు, కొల్లు రవీంద్రలతో కలిసి ఐటీ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల మంత్రి లోకేశ్ సచివాలయంలో నిరుద్యోగ భృతికి సంబంధించిన వివరాలను విలేకరులకు వెల్లడించారు.

పథకం: ముఖ్యమంత్రి యువ నేస్తం

అర్హులెవరు?: డిగ్రీ, పాలిటెక్నిక్ చేసిన నిరుద్యోగ యువత

వయస్సు: 22 నుంచి 35ఏళ్ల లోపు

నెలకు ఇచ్చే భృతి: రూ.1,000

ఎందరు ఉంటారని అంచనా: 10 లక్షల నుంచి 12 లక్షలు

దరఖాస్తు చేయడం ఎలా: ఈ నెల 3, 4 వారాల్లో ప్రభుత్వం ప్రత్యేకంగా వెబ్‌సైట్ ప్రారంభిస్తుంది. ప్రజాసాధికార సర్వేలో నమోదైన వారంతా ఆన్‌లైన్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవచ్చు.

అర్హులా, అనర్హులా వెంటనే తెలిపే విధానం: ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసిన వెంటనే నిరుద్యోగ భృతి తీసుకోవడానికి అర్హులా? అనర్హులా? అనేది తెలిసిపోతుంది.

బ్యాంకు ఖాతాల్లోకి భృతి: అర్హులకు ప్రతి నెలా మొదటి వారంలో బ్యాంకు ఖాతాల్లో భృతి జమయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పీఎఫ్ ఉంటే అనర్హులే: ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేస్తూ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ప్రతి నెలా చెల్లిస్తున్న వారంతా నిరుద్యోగ భృతికి అనర్హులు.

రూ.50 వేలకు మించి సబ్సిడీ తీసుకున్నా: వివిధ సంక్షేమ పథకాల కింద ప్రభుత్వం తరఫున రూ.50 వేలకు మించి సబ్సిడీ తీసుకున్న వారంతా నిరుద్యోగ భృతికి అనర్హులు.

ఎప్పుడైనా నమోదు చేసుకునే వెసులుబాటు: పథకం ప్రారంభించే నాటికి వయసు తక్కువ ఉన్న యువత 21 ఏళ్లకు చేరాక ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ నమోదుకు తుది గడువు విధించలేదు.

ఉపాధి కల్పించే ఏర్పాట్లు: నిరుద్యోగ భృతి తీసుకునే వారందరికీ అర్హత మేరకు వివిధ పరిశ్రమల్లో ఉపాధి లభించేలా అప్రెంటిషిప్ కార్యక్రమాన్ని ప్రభుత్వం రూపొందిస్తోంది. ఈ మేరకు పరిశ్రమల వివరాలు, వీటిలో అవసరాలను గుర్తించి నిరుద్యోగ యువతకు అప్రెంటిషిప్ ఇప్పించేలా కార్యాచరణ రూపొందించారు.

సుదీర్ఘ చర్చ...

నిరుద్యోగ భృతిపై మంత్రి మండలి సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగింది. పథకానికి ఏ పేరు పెట్టాలన్నపుడు మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు 'చంద్రన్న నిరుద్యోగ భృతి' అంటే బాగుంటుందని సూచించారు. చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకొని 'ముఖ్యమంత్రి యువ నేస్తం' పేరును ప్రస్తావించగా మంత్రులంతా బాగుందన్నారు. ఉత్తరప్రదేశ్‌తోపాటు మరికొన్ని రాష్ట్రాల్లో నిరుద్యోగ భృతి విఫలమైన విషయాన్ని అధికారులు కొందరు ప్రస్తావించగా... రాష్ట్రంలో పక్కాగా అమలు చేసేలా ఏర్పాట్లు చేశామని మంత్రి లోకేశ్ తెలిపారు. అన్ని కోణాల్లోనూ పరిశీలించిన తరువాతే విధివిధానాలను రూపొందించామని వివరించారు.

ఆయుష్మాన్ భారత్‌కు మన సాఫ్ట్‌వేరే

- ఐటీ భాగస్వామిగా తెలంగాణ ప్రభుత్వం
- ఇక్కడి ఆరోగ్యశ్రీ సాఫ్ట్‌వేర్‌నే అమలు చేస్తున్న కేంద్రం
- 4, 5 తేదీల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్న రాష్ట్రాల అధికారులకు శిక్షణ

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న ప్రతిష్ఠాత్మక 'ఆయుష్మాన్ భారత్' పథకం అమలులో ఉపయోగించనున్న సాఫ్ట్‌వేర్ తెలంగాణలో ఇప్పటికే ఉపయోగిస్తున్న ఆరోగ్యశ్రీ పథకానిదే కావడం విశేషం. ఆయుష్మాన్ భారత్‌కు ఐటీ భాగస్వామిగా రాష్ట్రప్రభుత్వంతో కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాల్లో ఆరోగ్య పథకాల అమలుకు మన సాఫ్ట్‌వేర్‌నే వినియోగిస్తుండగా.. తాజాగా ప్రతిష్ఠాత్మక పథకమైన ఆయుష్మాన్ భారత్‌లోనూ తెలంగాణ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించడానికి రాష్ట్రప్రభుత్వం 'కాపీరైట్స్'ను కేంద్రానికిచ్చింది. పథకం అధికారిక వెబ్‌సైట్‌లోనూ తెలంగాణ ప్రభుత్వ చిహ్నాన్ని ప్రదర్శించాలని నిర్ణయించినట్లు వైద్యవర్గాలు తెలిపాయి. దీనికి సంబంధించిన పరస్పర అవగాహన ఒప్పందం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కుదిరినట్లు పేర్కొన్నాయి.

దీని ప్రత్యేకత: ఆసుపత్రిలో రోగి సమాచారాన్ని నమోదు మొదలుకొని.. పరీక్షలు, ఔషధాలు, చికిత్స, చికిత్సానంతర సంప్రదింపులు, చెల్లింపులు ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతుంటాయి.

- చెల్లింపుల విధానం ప్రత్యేకమైంది. తొలుత ఏ ఆసుపత్రిలో ఎవరైతే చికిత్స పొందుతారో.. వారికి సంబంధించిన చెల్లింపులే మొదట జరుగుతాయి. ఒత్తిడి చేసి చెల్లింపుల క్రమాన్ని తప్పించి, ఇతర ఆసుపత్రికి చెల్లించడమనేది ఈ విధానంలో కుదరదు.
- రోగికి చికిత్స సమయంలో చేసే పరీక్షల సమాచారాన్ని పరిశీలించే తృతీయ వైద్య బృందానికి(థర్డ్ పార్టీ) కూడా ఆన్‌లైన్‌లోనే నిర్ధారణ పరీక్షల నమూనాలందుతాయి.
- రోగులు కూడా తమవైపు నుంచి సమాచారం అందించాలన్నా సులువుగా సమాచారం అందించడానికి ఆన్‌లైన్, 24 గంటల టోల్‌ఫ్రీ నెంబరు విధానాన్ని అమలుచేస్తారు.
- ఈ సాఫ్ట్‌వేర్ అమలుతీరుపై ఈనెల 4, 5 తేదీల్లో దిల్లీలో రాష్ట్రాల ఉన్నతాధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ నిర్వహిస్తోంది.
- రాష్ట్రప్రభుత్వం ఇప్పటి వరకూ ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి చేరడంపై తన అంగీకారాన్ని తెలపలేదు. రాష్ట్రంలో దీని అమలుపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది.

గాల్లోకి కాల్పులు జరిపిన స్థిరాస్తి వ్యాపారి

ఆర్థిక లావాదేవీల్లో వివాదమే కారణం

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: ఓ స్థిరాస్తి వ్యాపారి గాల్లోకి కాల్పులు జరిపిన సంఘటన శంషాబాద్‌లో కలకలం రేపింది. కాల్పులకు తెగబడిన వ్యాపారితోపాటు ఆయన అనుచరులు పది మందిపై పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. సంఘటనకు సంబంధించి ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం... బహదూర్‌గూడలో 110 ఎకరాల వివాదాస్పద వ్యవసాయ భూములను దండమూరి బయోటెక్ సంస్థ కొనుగోలు చేసింది. ఆ భూములను లే అవుట్లుగా మార్చి, అభివృద్ధి చేయడానికి డ్రీమ్ ఇండియా ప్రాజెక్టు సంస్థతో దండమూరి బయోటెక్ ప్రతినిధులు ఒప్పందం చేసుకున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు బహదూర్‌గూడలో చేపట్టిన సమగ్ర భూసర్వేలో ఆ 110 ఎకరాలు... ప్రభుత్వ భూమి అని నిర్ధరించారు. అప్పటి నుంచి ఆర్థిక లావాదేవీల విషయంలో రెండు సంస్థలు గొడవ పడుతున్నాయి. గత నెల 31న సాయంత్రం డ్రీమ్ ఇండియా ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ రఫీ ఇసాక్... 10 మంది అనుచరులతో కలిసి బహదూర్‌గూడ భూముల దగ్గరకు వచ్చాడు. దండమూరి బయోటెక్ సంస్థలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న మహమ్మద్ అల్తాఫ్‌తో గొడవకు దిగాడు. ఇరు వర్గాల మధ్య మాటామాటా పెరగడంతో కోపోద్రిక్తుడైన ఇసాక్ తన దగ్గర ఉన్న రివాల్వర్‌తో గాల్లోకి కాల్పులు జరిపి అక్కడి వారిని భయభ్రాంతులకు గురిచేశాడు. ఈ విషయాన్ని అల్తాఫ్ తన యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

కంచెపై పడిన మృతదేహాలు

మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం చిల్వేర్ గ్రామ శివారులో ఓ రైతు మామిడితోటకు వేసిన కంచె మీదుగా మరో రైతు పంట పొలంలోని బోరు మోటారుకు విద్యుత్తు కనెక్షన్ ఇచ్చారు. తీగ నాసిరకంగా ఉండటమే కాకుండా.. అక్కడక్కడ లోని తీగలు తేలి ఉన్నాయి. బుధవారం సాయంత్రం చిల్వేర్‌కు చెందిన సంగమేశ్వర్ గౌడ్ (45) షహనావాజ్ (16) ఈత వనాలకు వెళ్లేందుకు కంచె దాటే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో షహనావాజ్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఇది గమనించి సంగమేశ్వర్ గౌడ్ కాపాడే ప్రయత్నం చేయగా ఇద్దరూ అక్కడికక్కడే మరణించారు. ఈ సంఘటన గురువారం ఉదయం వెలుగుచూసింది.

– న్యూస్‌టుడే, అల్లాదుర్గం

నేనూ జగన్‌ను అనొచ్చు

- కానీ వారింట్లోని ఆడపడుచులు గుర్తొస్తారు
- పవన్ కల్యాణ్ వ్యాఖ్య

ఈనాడు, అమరావతి: 'నన్ను ఎవరైనా వ్యక్తిగతంగా విమర్శించినా.. తిట్టినా పట్టించుకోను. జగన్ ఈ మధ్యన నా వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడారు. నేనూ అదే స్థాయిలో అనొచ్చు. కానీ నాకు వారింట్లోని ఆడపడుచులు, తల్లీబిడ్డలు గుర్తొస్తారు. నేను జగన్‌ను వ్యక్తిగతంగా అంటే వారెంత బాధపడతారో గ్రహించగలను' అని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. గురువారం హైదరాబాద్‌లోని జనసేన కార్యాలయంలో జరిగిన రెండు తెలుగు రాష్ట్రాల వీర మహిళా విభాగం సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సేవా రంగంలోకి వచ్చే మహిళలకు సామాజిక వెన్నుదన్ను అవసరం. మీ ఇల్లు, పిల్లల బాధ్యతలు వదిలి రావొద్దు. అవి చూసుకుంటూ వీలు చిక్కిన సమయంలో ప్రణాళికాబద్ధంగా పార్టీ కోసం పని చేయండి' అని మహిళా కార్యకర్తలకు సూచించారు. 'సింగపూర్ లాంటి నగరం నిర్మిస్తా. సింగపూర్ తరహా నిర్మాణాలు చేపడతానని చెప్పే ముఖ్యమంత్రి చంద్రబాబు అక్కడిలాగే పాలన అందిస్తానని మాత్రం చెప్పరు' అని పవన్ విమర్శించారు. సింగపూర్ లాంటి పాలనైతే విధి నిర్వహణలో ఉన్న మహిళా అధికారిపై దాడి చేసిన ఎమ్మెల్యే జైలులో ఉండేవాడని వ్యాఖ్యానించారు. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్యకు పవన్ కల్యాణ్ ఘన నివాళులర్పించారు.

జనసేన సంకల్పం తెలియజేసేలా 'శతఘ్ని': జనసేన సంకల్పం ఏమిటనేది ప్రతివారికీ తెలియజేసేలా పార్టీ తరఫున 'శతఘ్ని' పక్ష పత్రికను తీసుకొస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. పార్టీ శ్రేణులకు సిద్ధాంతాలపై అవగాహన కల్పించడంతోపాటు వారికి దిశానిర్దేశం చేసేలా రూపొందించిన కరదీపికనూ ఆయన గురువారం ఆవిష్కరించారు. డిసెంబరు నెలాఖరుకు పార్టీ సభ్యత్వం 50 లక్షలకు చేరుకుంటుందని పార్టీ ప్రధాన కార్యదర్శి తోట చంద్రశేఖర్ తెలిపారు. ఈ నెలలో 'వాడవాడలా జనసేన జెండా' అనే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పవన్ కల్యాణ్ ఎడిటర్ ఇన్ చీఫ్, తోట చంద్రశేఖర్ ఎడిటర్‌గా 'శతఘ్ని' తొలి సంచికను ఆవిష్కరించారు.

ఉద్యోగ అవకాశాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్
ఫోన్ నెం. 0866-2532833, 2530833, E-మెయిల్: apurbangreening@gmail.com
Notice No. 505(P)/APUG&BCL/2016 తేది. 2.8.2018
ప్రకటన
www.urbangreening.ap.gov.in
DIPR No. 310PP/CL/Advt/1/1/2018-19 సం/- మేనేజింగ్ డైరెక్టర్ APG&BC

GEPIL PROTECTING FUTURE
Gujarat Enviro Protection & Infrastructure Ltd Drives Walk - in Interview on 5 August 2018 – SUNDAY at Hyderabad
Luthra is a group of companies with independent and multifarious businesses. GEPIL is the most promising business vertical of Luthra group. We are into environment and waste management, industrial infrastructure development and consultancy work and operating on PAN India base.
At GEPIL We Think Green
GEPIL is seeking professionals who would like to be part of a high-growth environment

Positions	Qualifications & Experience
Sr. Manager Commercial (Hyderabad & Ranipet –Vellore)	10 years + experience in Budgeting ,Costing, MIS ,SAP ,Variance Analysis (Qualification - CA, ICWA ,MBA-Finance)

Time- 10.00 AM TO 3.00 PM
Venue : Hotel Abode – 6-1-74 ,Beside HDFC Bank Lakdikapul Hyderabad - 500004
Priyanka.billore@luthraindia.com | Contact No: 7799909682 | Website - www.gepil.in
Candidates are requested to carry resume, educational & experience certificates and last 3 months Salary slips

URGENTLY REQUIRED FOR LEADING CO. BASED IN KSA FOR THEIR ARAMCO PROJECT
• SITE TECHNICAL OFFICE MANAGERS • PROJECT MANAGERS
• CONSTRUCTION MANAGERS • QA/QC MANAGERS
• PROCUREMENT MANAGERS • HSE MANAGERS
• COMMUNICATION FIELD ENGINEERS • PLANNING ENGINEERS
• SUPERINTENDENT ENGINEERS (Civil, Architecture, Mech., Elect.)
• FIELD ENGINEERS (Civil, Architecture, Mechanical, Electrical)
• QA/QC ENGINEERS (Civil, Architecture, Mechanical, Electrical)
• TECHNICAL ENGINEERS (Civil, Architecture, Mechanical, Electrical)
ALL THE ABOVE CANDIDATES MUST HAVE BE DEGREE & 10 TO 15 YEARS' EXP. AFTER COMPLETION OF DEGREE – ARAMCO EXPERIENCE IS MUST.
• SUPERVISORS (Civil, Architecture, Mechanical, Electrical)
• FOREMEN (Civil, Architecture, Mechanical, Electrical)
• SCAFFOLDING SUPERVISORS • QUANTITIES SURVEYORS
• PERMIT RECEIVERS • LAND SURVEYORS • DRAFTSMANS
ALL THE ABOVE CANDIDATES MUST HAVE DIPLOMA & 08 TO 10 YEARS' EXPERIENCE AFTER COMPLETION OF DIPLOMA
• SECURITY GUARD • LIGHT DRIVERS (With GCC Lic.)
• HEAVY EQUIPMENT OPERATOR
VACANCY IN LARGE NO / SPOT SELECTION / READY VISA.
Service Charge will be as per rules set by MOIA only through demand draft
Salary as per MRW prescribed by MOIA (Further Negotiable)
AL HUDAIF HR CONSULTANCY
Reg no: B-0745/MUM/COM/1000+/5/9107/2014 (Validity 29.01.2021) ARN: Pt6059710
CLIENT INTERVIEW IN HYDERABAD ON 7TH AUGUST 2018
Venue : PASHA CHAMBERS, 36 B/1, 1ST Floor, Raghava Ratna Towers, Besides Medwin Hospital, Nampally, Hyderabad-500001.
Contact No : 9951704565 / 9030666891 Email : cvhudaif@gmail.com

WANTED
PMR CONSTRUCTIONS INDIA PVT. LTD, a fast Growing EPC company requires the following candidates for Telengana & Andhrapradesh.
Project Coordinators / Project Managers - Transmission (Location-Hyderabad)
B.E/Diploma - EEE with 4 to 10 years experience in handling of Substations & Transmission Line projects of 132 KV, 220 KV & above.
Site Engineers / Site Managers - Transmission (Location-Site)
B.E/Diploma-EEE with 4 to 8 years experience in execution of Substations & Transmission Lines of 132 KV, 220 KV & above.
Site Engineers / Site Managers - Distribution (Location-Site)
B.E/Diploma - EEE with 3 to 8 years experience in execution of 33/11 KV Substations, distribution lines & HVDS projects.
Purchase / Procurement (Location - Hyderabad)
B.E-EEE / Mech with 5 to 10 years experience in similar industry.
Senior Manager - Accounts (Location - Hyderabad)
M.Com / CA Candidates with 8 to 15 years experience in Construction / Infrastructure industries.
Eligible candidates shall apply to "pmrcipl.hr@gmail.com". Freshers and candidates who possess experience in other fields need not apply.

NAGARJUNA CEMENT
NCL Industries Ltd., Hyderabad, a listed company engaged in the manufacture of Cement and Cement Bonded Particle Boards, is seeking applications for the following positions for its TRANSPORT Division:

Position	Location	Qualifications	Experience
Senior Manager (Finance & Accounts)	Huzur Nagar (Near Kodada – Suryapet District)	CA Inter / M. Com / MBA (Finance)	Minimum 8 Years' experience in managing Finance & Accounting function, out of which he should have spent 5 years in logistics/transport industry
Senior Officer (Finance & Accounts)		M.Com / MBA (Finance)	Minimum 6 Years' experience in managing Finance & Accounting function, out of which he should have spent 3 years in logistics/transport industry
Stores Assistant		Graduate	Minimum 3 Years' experience in automobile workshop stores management
Executive (Finance & Accounts)	Huzur Nagar & Kondapalli (Near Vijayawada)	M.Com / MBA (Finance)	Minimum 3 Years' experience in managing Finance & Accounting function, preferably in logistics/ transport industry
Executive (Fleet Operations)		Graduate	Minimum 3 Years' experience in managing field transport operations in logistics / transport industry

Interested candidates who meet the above criteria and interested in the specified location, may send their resumes to careers@nclind.com or send to NCL Industries Limited, 4th Floor, Vaishnavi's Cynosure, Near Gachibowli Flyover, Gachibowli, Hyderabad, within 7 days of this advertisement.

A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
సోమాజిగూడ, హైదరాబాద్.
Cell: 80086 11131

Pai International Electronics Ltd
Fastest Growing Leading Retailer of South India
For Electronics, Appliances, Mobiles, Laptops & more...
Pai International, is the leading multi-brand retail chain in South India for Electronics, Appliances, Mobiles and IT products. It has already made its presence felt in Hyderabad with 23 Electronics stores & 11 Mobile Stores and many more coming up soon. For our upcoming Mega Electronics stores and Pai MOBILE stores in HYDERABAD, we invite professionals to become part of the happy and growing Pai Parivar in the following positions / departments
• SALES MANAGERS / CATEGORY HEAD (Electronics & Appliances)
High salary + High Incentive + PF + ESIC + Yearly Bonus
Eligibility: Passion to sell in competitive retail market, good communicator, smart worker, result oriented. Experience of durable industry will be added advantage. Qual.: 10th class and above. Exp.: 2 years and above. Age: 22 to 32 years
• CASHIERS / DATA OPERATORS (15 Posts)
Eligibility: Candidates having 1 to 2 Years Experience in Accounts / Cashier profile. Good Speaking ability, Knowledge of FOCUS ERP System will be added advantage. Good Salary. Qual.: Intermediate and above. Exp.: 2 years and above. Age: 25 to 35 years
Pai MOBILES
• STORE IN-CHARGE, SALES MANAGERS & SALES EXECUTIVES
Mobile Phones & Accessories
High salary + High Incentive + PF + ESIC + Yearly Bonus
Eligibility: Passion to sell in competitive retail Mobile market, good communicator, smart worker, result oriented. Experience of Mobile industry is essential. Qual.: 10th class and above. Age: 22 to 32 years. Exp.: 2 years and above.
• CUSTOMER CARE EXECUTIVES (Female - 15 Posts)
7 Hrs Shift - High salary + Incentive + PF + ESIC + Yearly Bonus + Bus Pass
Eligibility: Pleasant personality, excellent communicator, extrovert, self-starter. Qual.: Intermediate and above. Exp.: 1 year and above. (Fresher can also apply). Age: up to 35 years.
Attractive Salary + Best in Industry Incentives + PF + ESIC + BONUS ...
WALK-IN INTERVIEWS
2nd, 3rd & 4th August 2018 from 11am to 4pm at
Maharaja Hall, THE COUNTRY CLUB, Begumpet Metro Station, Hyderabad
Contact: 9849766544, 9849766344. Helpline: 040-42484343
Fresher can walk-in for Trainee Post with Stipend | Special Desk for MBA / BBA / BBM / B. Tech Graduates | Candidates should come with resume and passport size photo

సెన్సెక్స్ ▼356 **37165** | నిఫ్టీ ▼102 **11245** | డోజోన్స్ 25333 ▼01 | నాస్‌డాక్ 7792 ▲85 | రూపాయి 68.70 ▼ 27 పైసలు (ఒక అమెరికా డాలరుకు) | ముడి చమురు 73.69 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)

అమెరికా కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

ఘనం (+)

నిఫ్టీ	2న	మార్పు%
LUPIN	864.85	2.45
DR. REDDYS LAB	2227.85	2.40
POWER GRID	188.70	2.17
HPC	292.50	1.79
BPCL	401.80	1.46
INDIABULLS HSG FIN	1298.55	1.11
INDUSIND BANK	2023.05	1.08

గ్రహణం (-)

నిఫ్టీ	2న	మార్పు%
BHARTI AIRTEL	373.00	-2.99
KOTAK MAHINDRA	1280.20	-2.48
MARUTI SUZUKI	9142.40	-2.13
RELIANCE INDU	1168.35	-2.01
M&M LTD	911.30	-1.98
HDFC	1931.95	-1.94
VEDANTA	214.15	-1.86

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	62.13	72.04	బహ్రెయిన్ దీనార్	168.15	192.39
పౌండ్ స్టెర్లింగ్	81.42	94.45	కువైట్ దీనార్	186.50	232.16
యూరో	72.39	83.94	ఒమన్ రియాల్	164.67	188.49
జపనీస్ యెన్/100	55.65	64.54	సౌదీ రియాల్	16.52	19.58
ఆస్ట్రేలియా డాలరు	45.91	53.15	యూఏఈ దిర్హమ్	16.91	19.76
సింగపూర్ డాలరు	45.53	53.94	మలేషియా రింగిట్	14.94	18.37
థాయ్ బాత్/100	187.13	223.94	చైనీస్ యువాన్	7.08	11.51

గురువారం నిఫ్టీ కదలికలు



ఓఎన్‌జీసీ లాభం రూ.6,144 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) రూ.6,143.88 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన రూ.3,884.73 కోట్లతో పోలిస్తే ఇది 58 శాతం అధికం. కార్యకలాపాల ఆదాయం రూ.19,073.54 కోట్ల నుంచి రూ.27,212.83 కోట్లకు పెరిగింది. అయితే ఇతర ఆదాయం మాత్రం రూ.903.74 కోట్ల నుంచి రూ.649.88 కోట్లకు తగ్గింది. మొత్తం ఆదాయం రూ.19,977.28 కోట్ల నుంచి రూ.27,862.71 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు రూ.14,039.51 కోట్ల నుంచి రూ.18,255.96 కోట్లకు పెరిగాయి. ఒక్కో షేరుపై ఆర్జన (ఈపీఎస్) రూ.3.03 నుంచి రూ.4.79కి పెరిగింది.

బ్యారెల్‌కు 71.48 డాలర్లు: ఏప్రిల్-జూన్ మధ్యకాలంలో ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేసిన ప్రతి బ్యారెల్ ముడి చమురుకు 71.48 డాలర్ల చొప్పున ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలంలో ఆర్జించిన 48.42 డాలర్లతో పోలిస్తే ఇది 47.6 శాతం ఎక్కువ. ఒక మిలియన్ బ్రిటీష్ థర్మల్

యూనిట్ (ఎంఎంబీటీయూ) సహజ వాయువుకు 2.48 డాలర్ల నుంచి 3.06 డాలర్లు ఆర్జించింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో ముడి చమురు ఉత్పత్తి 5.3 శాతం (5 మిలియన్ టన్నులు) తగ్గింది. ఇదే సమయంలో సహజ వాయువు ఉత్పత్తి 3.4 శాతం పెరిగింది.

బీఎస్ఈలో షేరు 0.42 నష్టంతో రూ.166 వద్ద ముగిసింది.

అమ్మకాలు వెల్లువెత్తాయ్

- మళ్లీ తెరపైకి వాణిజ్య భయాలు
- 356 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్
- 11300 దిగువకు నిఫ్టీ

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు మళ్లీ తెరపైకి రావడంతో అమ్మకాలు వెల్లువెత్తాయి. అంతర్జాతీయ కరెన్సీలపై ఆర్‌బీఐ హెచ్చరికలు ఇందుకు తోడయ్యాయి. ఫలితంగా నాలుగు నెలల్లోనే సూచీలు అత్యధిక ఒకరోజు నష్టాన్ని మూటగట్టుకున్నాయి. ఆర్‌బీఐ రెపో రేటు పెంపు నేపథ్యంలో రేట్ల ఆధారిత వాహన, బ్యాంకింగ్, స్థిరాస్తి షేర్ల నష్టాలు కొనసాగాయి. అమెరికా సుంకాల పెంపునకు ప్రతిచర్యలు ఉంటాయని చైనా పునరుద్ఘాటించడంతో ఆసియా మార్కెట్లు కుదేలయ్యాయి. ఐరోపా షేర్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 37,529.69 పాయింట్ల వద్ద స్తబ్దుగా ప్రారంభమైంది. వెంటనే నష్టాల్లోకి జారుకున్న సూచీ.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఒకానొకదశలో 37,128.99 పాయింట్ల వద్ద కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. చివరకు 356.

46 పాయింట్ల నష్టంతో 37,165.16 పాయింట్ల వద్ద ముగిసింది. మార్చి 23 (410 పాయింట్లు) తర్వాత సెన్సెక్ ఒక రోజులో మూటగట్టుకున్న అత్యధిక నష్టమిదే కావడం గమనార్హం. ఇక నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 11,234.95 పాయింట్ల వద్ద కనిష్ఠానికి పడిపోయింది. చివరకు 101.50 పాయింట్లు కోల్పోయి 11,244.70 దగ్గర స్థిరపడింది.

- జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో నికర లాభం 65 శాతం క్షీణించడంతో గోద్రెజ్ ప్రోపర్టీస్ షేరు డీలాపడింది. ఒకానొకదశలో 4.11 శాతం పడిపోయిన షేరు.. చివరకు 2.50 శాతం నష్టంతో రూ.724.55 వద్ద ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 20 నష్టాలు చవిచూశాయి. భారతీ ఎయిర్‌టెల్ 2.79%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.54%, మారుతీ సుజుకీ 1.97%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.91%, హెచ్‌డీఎఫ్‌సీ 1.90%, వేదాంతా 1.83%, ఎం అండ్ ఎం 1.81%, టాటా మోటార్స్ 1.51%, ఏషియన్ పెయింట్స్ 1.34%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.30%, టీసీఎస్ 1.24% చొప్పున డీలాపడ్డాయి. పవర్‌గ్రిడ్ 2.25%, కోల్ ఇండియా 1.07%, హిందుస్థాన్ యునిలీవర్ 0.92% మేర రాణించిన వాటిలో ఉన్నాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం అత్యధికంగా 1.47 శాతం కోల్పోయింది. స్థిరాస్తి, బ్యాంకింగ్, ఐటీ, యంత్ర పరికరాలు, ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు అదే బాటలో నడిచాయి. ఆరోగ్య సంరక్షణ, మౌలిక, విద్యుత్, లోహ స్క్రిప్‌లు రాణించాయి.

ఐబీ హౌసింగ్ ఫైనాన్స్ లాభం రూ. 1049 కోట్లు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.1,048.68 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో సంస్థ ఆర్జించిన నికర లాభం రూ.804.89 కోట్లతో పోలిస్తే ఇది 30 శాతం అధికం. మొత్తం ఆదాయం రూ.3,288.24 కోట్ల నుంచి రూ.4,071.32 కోట్లకు పెరిగింది. స్టాండలోన్ ప్రాతిపదికన నికర లాభం రూ.749.99 కోట్ల నుంచి 29 శాతం వృద్ధితో రూ.967.95 కోట్లకు చేరింది. ఆదాయం రూ.3,115.59 కోట్ల నుంచి రూ.3,789.45 కోట్లకు పెరిగింది. రుణ పుస్తకం రూ.94,450.70 కోట్ల నుంచి 33.4 శాతం పెరిగి రూ.1,25,962.90 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) రూ.1,400 కోట్ల నుంచి 22.1 శాతం పెరిగి రూ.1,690 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 0.80 శాతం నుంచి 0.78 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు 0.34 శాతం నుంచి 0.59 శాతానికి పెరిగాయి. జూన్ 30తో ముగిసిన కాలానికి కంపెనీ ఆస్తి-అప్పుల పట్టిక (బ్యాలెన్స్‌షీట్) రూ.1,06,611.80 కోట్ల నుంచి 29.7 శాతం వృద్ధితో రూ.1,38235.90 కోట్లకు చేరింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో రుణ మార్కెట్ల నుంచి సంస్థ రూ.13,000 కోట్ల నిధులను సమీకరించింది. రెండో త్రైమాసికంలోనూ ఇంతే మొత్తంలో నిధుల సమీకరణకు సిద్ధమవుతోంది.

బీఎస్ఈలో షేరు 1.22 శాతం లాభంతో రూ.1301.15 వద్ద ముగిసింది.

స్వల్పంగా తగ్గిన కాగ్నిజెంట్ లాభం

దిల్లీ: ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో కాగ్నిజెంట్ నికర లాభం 2.97% తగ్గి 45.7 కోట్ల డాలర్లకు పరిమితమైంది. కిందటేడాది ఇదే సమయంలో 47 కోట్ల డాలర్ల లాభాన్ని ఆర్జించింది. మరోవైపు ఆదాయం 360 కోట్ల డాలర్ల నుంచి 400 కోట్ల డాలర్లకు పెరిగింది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాల నిర్వహిస్తోన్న కాగ్నిజెంట్ జనవరి- డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా పాటిస్తోంది.

మూడో త్రైమాసికంలో ఆదాయం 406- 410 కోట్ల డాలర్ల శ్రేణిలో నమోదుకావచ్చని కంపెనీ అంచనా వేసింది. పూర్తి ఆర్థిక సంవత్సరానికి 1605- 1630 కోట్ల డాలర్లు రావచ్చని తెలిపింది. 'డిజిటల్ సేవలు, సొల్యూషన్ల విషయంలో మా ప్రణాళిక వేగంగా అమలు చేస్తున్నాం. రెండో త్రైమాసిక ఫలితాలే ఇందుకు నిదర్శనమ'ని కాగ్నిజెంట్ సీఈఓ, వైస్ ఛైర్మన్ ఫ్రాన్సిస్కో డిసౌజా తెలిపారు. ఆర్థిక లక్ష్యాలను సాధించేందుకు, వృద్ధికి పెట్టుబడుల పెట్టే విషయంలో పూర్తి విశ్వాసంతో కంపెనీ ఉందని పేర్కొన్నారు. ఏప్రిల్- జూన్‌లో కొత్తగా 7,500 మంది ఉద్యోగుల చేరికతో మొత్తం సిబ్బంది సంఖ్య 2,68,900కి చేరిందని కంపెనీ వెల్లడించింది.

రాణించిన మోల్డ్ టెక్ ప్యాకేజింగ్

ఈనాడు, హైదరాబాద్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి మోల్డ్ టెక్ ప్యాకేజింగ్ ఏకీకృత ప్రాతిపదికన రూ.8.2 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఏడాది క్రితం ఇదే కాలం నికర లాభం రూ.7.10 కోట్లతో పోలిస్తే 15.4 శాతం పెరిగిందని కంపెనీ వెల్లడించింది. ఇదే కాలానికి మొత్తం ఆదాయం రూ.98.93 కోట్ల నుంచి రూ.102.71 కోట్లకు పెరిగింది.

భారత జీడీపీ వృద్ధి 7.5%

- 2018-19పై మోర్గాన్ స్టాన్లీ అంచనా

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో భారత జీడీపీ వృద్ధి 7.5 శాతం పెరగొచ్చని అంతర్జాతీయ ఆర్థిక సేవల దిగ్గజం మోర్గాన్ స్టాన్లీ నివేదిక అంచనా వేసింది. వృద్ధి పుంజుకోవడం బలంగా ఉండొచ్చని, వినియోగం, ఎగుమతులు పెరగడం ఇందుకు దన్నుగా నిలవొచ్చని అభిప్రాయపడింది. గత ఆర్థిక సంవత్సరం జనవరి-మార్చి త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి 7.7 శాతంగా నమోదైంది. ఏడు త్రైమాసికాల్లోనే ఇది వేగవంతమైన వృద్ధి. తయారీ, సేవా రంగాలతో పాటు వ్యవసాయోత్పత్తి పెరగడం కలిసొచ్చింది.

గత ఆర్థిక సంవత్సరం (2017-18)లో జీడీపీ వృద్ధి 6.7 శాతంగా నమోదు కాగా.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో అది 7.5 శాతానికి పుంజుకోవచ్చని మోర్గాన్ స్టాన్లీ విశ్లేషించింది. ద్రవ్యల్బోణం, కరెంటు ఖాతా లోటు వంటి కీలకమైన సంకేతాలు అదుపులో ఉన్నాయని వెల్లడించింది. సీపీఐ ఆధారిత ద్రవ్యోల్బణం లక్ష్యమైన 4 శాతం ఎగువకు కొద్దిగా చేరొచ్చని.. కరెంటు ఖాతా లోటు జీడీపీలో 2.5 శాతం కంటే తక్కువగానే ఉండొచ్చని అంచనా వేసింది. తక్కువ వర్షపాతం, కనీస మద్దతు ధర పెంపు అమలు చేయడంతో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని మోర్గాన్ స్టాన్లీ పేర్కొంది. దేశ వృద్ధిపై చమురు ధరల పెరుగుదల, అమెరికా వడ్డీ రేట్ల పెంపు, డాలర్ బలపడటం, ప్రైవేట్ పెట్టుబడులు పుంజుకోవడంలో జాప్యం, తక్కువ వర్షపాతం వంటివి ప్రతికూల ప్రభావం చూపొచ్చని వెల్లడించింది.

7-8% తగ్గిన బాష్, సీమెన్స్ ధరలు

- వాషింగ్ మెషీన్లు, ఫ్రిడ్జ్‌లు చౌక

ముంబయి: దేశీయంగా బాష్, సీమెన్స్ బ్రాండ్ల కింద గృహోపకరణాలను విక్రయిస్తున్న ఐరోపా కంపెనీ బీఎస్‌హెచ్ హౌస్‌హోల్డ్ అప్లయెన్సెస్ ధరలు తగ్గించింది. తమ వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజరేటర్లు, మిక్సర్ గ్రైండర్ల ధరలను 7-8 శాతం తగ్గిస్తున్నట్లు బీఎస్‌హెచ్ హౌస్‌హోల్డ్ ప్రకటించింది. తక్షణమే ధరల తగ్గింపు అమల్లోకి వస్తుందని తెలిపింది. వాషింగ్ మెషీన్లు, ఫ్రిడ్జ్, లాండ్రీ మెషీన్లు, ఫుడ్ గ్రైండర్లు సహా 15 వస్తువులపై ప్రభుత్వం ఇటీవల జీఎస్‌టీ రేటును 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడంతో కంపెనీలు ఆ మేరకు ప్రయోజనాన్ని వినియోగదార్లకు బదిలీ చేశాయి. బాష్, సీమెన్స్‌ల గృహోపకరణాల ధరల తగ్గింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు బదలాయించడం హర్షణీయమని బీఎస్‌హెచ్ హౌస్‌హోల్డ్ అప్లయెన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గుంజన్ శ్రీవాస్తవా పేర్కొన్నారు. పండగల సీజన్ నేపథ్యంలో ధరల తగ్గింపు వల్ల గిరాకీ పెరిగే అవకాశం ఉందని అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ 30-35 శాతం మేర వృద్ధి సాధించామని తెలిపారు. ఇప్పటికే శామ్‌సంగ్, పానసోనిక్, గోద్రెజ్ అప్లయెన్సెస్‌లు ధరల కోత ప్రకటించిన విషయం తెలిసిందే.

మార్కెట్ కబుర్లు

- అర్హత గల సంస్థాగత మదుపర్లకు 1.28 కోట్ల షేర్లను జారీ చేయడం ద్వారా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.2775 కోట్ల నిధులను సమీకరించనుంది.
- శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్‌లో 2 శాతం వాటాను రూ.255 కోట్లకు ఈస్ట్ బ్రిడ్జ్ క్యాపిటల్ మాస్టర్ ఫండ్ కొనుగోలు చేసింది. ఎన్ఎస్ఈలోని బల్క్ డీల్ గణాంకాల ప్రకారం.. 13.27 లక్షల షేర్లను బహిరంగ విపణిలో దక్కించుకుంది.
- మధ్యప్రదేశ్‌లో నార్తర్న్ కోల్‌ఫీల్డ్(ఎన్‌సీఎల్)కు చెందిన గనుల ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాజెక్టుకు అతి తక్కువ మొత్తం(రూ.717.45 కోట్లు)తో బిడ్డింగ్ వేసిన సంస్థగా దిలీప్ బిల్డ్‌కాన్ నిలిచింది.
- ముంబయికి చెందిన డెలివరీ సదుపాయాల సంస్థ స్కూట్సీని ఆహార డెలివరీ సంస్థ స్విగ్గీ కొనుగోలు చేసింది. తద్వారా తన నెట్‌వర్క్‌లోని రెస్టారెంట్ల సంఖ్యను మరింత పెంచుకుంది.
- వారణాసిలోని రైల్ వికాస్ నిగమ్ నుంచి రూ.362.16 కోట్ల విలువైన ఆర్డర్లను జీపీటీ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ దక్కించుకుంది. ఈ ప్రాజెక్టును 24 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది.
- దుబాయ్ వరల్డ్ ఎక్స్‌పో 2020లో భారత పెవిలియన్‌ను నిర్మించే నిమిత్తం వాణిజ్య మంత్రిత్వ శాఖ నుంచి రూ.400 కోట్ల ప్రాజెక్టును పొందినట్లు ఎన్‌బీసీసీ తెలిపింది.
- షేర్లను తిరిగి కొనుగోలు చేసే ప్రతిపాదనను పరిశీలించడం కోసం ఐటీ సంస్థ ఎంఫసిస్ ఆగస్టు 7న బోర్డు సమావేశం నిర్వహించనుంది. అయితే బైబ్యాక్‌కు సంబంధించిన వివరాలను కంపెనీ వెల్లడించలేదు.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలలకు ఎన్‌సీసీ రూ.4,357.8 కోట్ల విలువైన పనులను పొందింది. ఒక్క జులై నెలలోనే రూ.689 కోట్ల ఆర్డర్లు లభించాయి.

జీఎంఆర్ ఏరో టెక్నిక్‌కు ఎఫ్ఏఏ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: విమానాల నిర్వహణ, మరమ్మతు, ఓవర్‌హాల్ (ఎంఆర్‌ఓ) సేవలను అందించే విషయంలో జీఎంఆర్ హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చెందిన జీఎంఆర్ ఎయిరో టెక్నిక్ (జీఏటీఎల్)కు ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్ఏఏ) నుంచి అనుమతి లభించింది. దీంతో బీ737, ఏ320లాంటి నారోబాడీ విమానాలకు అధీకృత ఎంఆర్‌ఓ సేవలను అందించేందుకు జీఏటీఎల్‌కు వీలవనుంది. వీటితోపాటు సీ చెక్, ఎఫ్ఏఏ దగ్గర నమోదైన అన్ని బీ737, ఏ320 విమానాలకు ఎన్‌డీటీ (నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్)లను కూడా నిర్వహించనుందని జీఎంఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. విమానాలకు ఎంఆర్‌ఓ సేవలను అందించేందుకు ఎఫ్ఏఏ సర్టిఫికేషన్‌తో జీఏటీఎల్‌కు కొత్త అవకాశాలు పెరిగేందుకు అవకాశం ఉంది. భారత్‌లో విమానాల లీజులు పెరుగుతున్న నేపథ్యంలో ఎంఆర్‌ఓ సేవల అవసరం రానున్న రోజుల్లో అధికంగా ఉంటుందని అంచనా. దక్షిణాసియా ప్రాంతంలో

ఎంఆర్‌ఓ సేవలను అందించేందుకు ఎఫ్ఏఏ అనుమతి పొందిన తొలి సంస్థ కావడంతో ఈ ప్రాంతం నుంచి ఈ సేవల కోసం తమదగ్గరకు వచ్చే విమానాల సంఖ్య పెరుగుతుందని జీఎంఆర్ ఆశిస్తోంది. కేంద్ర ప్రభుత్వ భారత్‌లో తయారీ లక్ష్యానికి అనుగుణంగా జీఏటీఎల్ తన వ్యాపారాన్ని విస్తరిస్తోందని, ఇందులో భాగంగా విభిన్న రకాల విమానాలకు ఎంఆర్‌ఓ సేవలను అందించేందుకు జీఏటీఎల్ ఎప్పటికప్పుడు సిద్ధం అవుతోందని సంస్థ డైరెక్టర్, జీహెచ్ఐఏఎల్ సీఈఓ ఎస్‌జీకే కిషోర్ తెలిపారు.

నేటి మార్కెట్

అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధ మేఘాలు ఆవరించడంతో నేడు మార్కెట్లు నేలచూపులు చూడొచ్చని డీలర్లు అంచనా వేస్తున్నారు. ప్రామాణిక సూచీలు దిద్దుబాటు ధోరణికి వెళ్లవచ్చని.. రక్షణాత్మక రంగమైన ఔషధ విభాగంలో తప్ప మిగతా రంగాల్లో స్తబ్దత కనిపించవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. నిఫ్టీ 11,205-11,350 పాయింట్ల మధ్య కదలాడే అవకాశం ఉంది. 11,200 స్థాయి వద్ద కొనుగోలు మద్దతు లభించొచ్చని బ్రోకరేజీ సంస్థలు అంచనా వేస్తున్నాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్‌ల వడ్డీ రేట్ల నిర్ణయాలను కూడా సునిశితంగా పరిశీలించవచ్చు. విశ్లేషకుల అంచనాలకు దూరంగా ఫలితాలను వెల్లడించిన కారణంగా ఓఎన్‌జీసీ షేర్లలో కొంత బలహీనతలు కనిపించవచ్చు.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2018–19	నికర లాభం/(నష్టం) 2017–18	మొత్తం ఆదాయం 2018–19	మొత్తం ఆదాయం 2017–18
మహీంద్రా లాజిస్టిక్స్	24.31	15.11	931.07	854.46
గోద్రెజ్ ప్రాపర్టీస్	34.30	99.17	1066.73	896.71
జీఈ పవర్ ఇండియా	2.40	10.58	467.32	388.39
కామధేను	5.92	2.76	399.83	235.96
అక్జోనోబెల్	43.51	41.27	724.83	728.61
ఫైజర్	91.84	57.17	512.31	432.59
ఎమ్ఓఐఎల్	113.40	97.70	360.98	381.66
హెచ్ఈజీ	770.00	(8.43)	1587.38	213.71
మన్‌పసంద్ బెవరేజెస్	36.37	35.90	340.06	392.94
మారికో	260.13	235.93	2050.80	1714.53
టొరెంట్ ఫార్మా	163.00	188.00	1872.00	1362.00
జియోజిత్ ఫైనాన్షియల్	12.70	16.22	------	------
క్యాపిటల్ ఫస్ట్	101.55	65.40	601.70	460.30
జేకే లక్ష్మీ సిమెంట్	13.75	28.30	934.44	1013.37

నేటి బోర్డు సమావేశాలు: నెస్లే ఇండియా, టైటన్, సెయిల్, యూడ్ ల్యాబ్స్, బర్జర్ పెయింట్స్, సీజీ పవర్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, మంగళం సిమెంట్, లారస్ ల్యాబ్స్, నేషనల్ ఫెర్టిలైజర్స్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, తాజ్ జీవీకే హోటల్స్, టైమెక్స్, వీఐపీ ఇండస్ట్రీస్

2న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	370	వరంగల్	372
చిల్లరగా (ఒక గుడ్డు)	4.30	విశాఖపట్నం	395
బెంగళూరు	435	చెన్నై	460
3వ తేదీకి...		చిత్తూరు	453
విజయవాడ/గోదావరి	395	నమక్కల్	450

ఎన్‌ఎస్ఈ

గురువారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 399.15 (399.00) 2966243
ASIAN PAINTS 1418.40 (1437.20) 836564
AXIS BANK LT 547.25 (545.15) 6495837
BAJAJ AUTO L 2678.60 (2680.90) 617961
BAJAJ FINANC 2683.85 (2722.80) 781173
BAJAJ FINSER 6903.35 (6990.15) 123608
BHARTI AIRTE 373.00 (384.50) 5575854
BHARTI INFRA 291.15 (293.25) 1228980
BPCL 401.80 (396.00) 4192400
CIPLA 638.50 (639.15) 3974559
COAL INDIA L 273.55 (270.65) 4956127
DR. REDDYS 2227.85 (2175.70) 1039641
EICHER MOTOR 26960.85 (27298.70) 95894
GAIL 377.65 (375.35) 2662318
GRASIM IND 1014.20 (1030.35) 644959
HCL TECH 960.50 (978.65) 1600353
HDFC 1931.95 (1970.15) 2595747
HDFC BANK 2130.20 (2158.70) 2226426
HERO MOTOCOR 3263.70 (3280.40) 352679
HINDALCO IND 207.90 (208.00) 12829967
HINDUSTAN UN 1748.50 (1734.30) 1127209
HPCL 292.50 (287.35) 4024775
ICICI BANK 298.55 (299.30) 14089168
INDIABULLS H 1298.55 (1284.35) 2108620
INDIAN OIL 168.70 (168.00) 8159282
INDUSINDBANK 2023.05 (2001.35) 1278375
INFOSYS LTD 1353.65 (1354.05) 2970371
ITC 299.20 (301.60) 9847568
KOTAK MAHIND 1280.20 (1312.70) 2065057
LARSEN & TOU 1282.40 (1298.00) 1415162
LUPIN 864.85 (844.20) 3951505
M&M 911.30 (929.75) 1652795
MARUTI SUZIK 9142.40 (9341.60) 875157
NTPC LTD 155.40 (155.35) 3245983
ONGC 166.40 (167.20) 7825776
POWER GRID C 188.70 (184.70) 6921901
RELIANCE IND 1168.35 (1192.35) 6248975
SBI 293.90 (295.10) 15665209
SUN PHARMA 580.40 (574.65) 5898107
TATA CONSULT 1948.40 (1976.50) 1509287
TATA MOTORS 260.85 (265.05) 17421472
TATA STEEL L 554.30 (555.80) 9493099
TECH MAHINDR 669.00 (681.10) 1958340
TITAN IND 921.50 (917.35) 2313020
ULTRATECH 4183.50 (4193.05) 135635
UPL LIMITED 636.75 (641.85) 1806144
VEDANTA LIMI 214.15 (218.20) 14319624
WIPRO 279.10 (277.35) 3003757
YES BANK LTD 361.80 (365.85) 8365895
ZEE ENTERTAI 518.40 (526.45) 1038569

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1204.95 (1213.00) 33647
ACC 1541.10 (1531.35) 456730
ADITYA BIRLA 145.50 (147.20) 1688538
AMBUJA CEMEN 228.80 (234.00) 1820808
ASHOK LEYLAN 120.25 (118.90) 46700886
AUROBIND PHA 614.80 (599.70) 3191427
AVENUE SUPER 1656.35 (1669.70) 368789
BANK OFBAROD 147.25 (150.20) 14029282
BEL 116.85 (117.10) 7630856
BHEL 73.70 (73.55) 5908968
BOSCH LTD 18646.85 (18840.10) 6531
BRITANNIA 6457.40 (6489.85) 116150
CADILA HEALT 376.10 (377.50) 1169194
COLGATE PALM 1115.30 (1122.75) 146412
CONTAINER 647.75 (662.25) 558912
CUMMINS INDI 661.25 (668.20) 428915
DABUR INDIA 428.90 (432.25) 3356054
DLF LIMITED 187.75 (193.35) 4912319
EMAMI LIMITE 568.95 (567.50) 496327
GENERAL INS 364.20 (363.80) 97212
GODREJ CONSU 1326.75 (1319.60) 623701
HAVELLS INDI 637.05 (632.20) 1584825
HINDUSTAN ZI 280.80 (277.70) 1245965
ICICI PRU LI 413.70 (420.00) 854010
IDEA CELLULR 54.40 (53.55) 17221943
INTERGLOBE A 965.35 (924.70) 1832699
JSW STEEL LT 332.05 (327.55) 4410584
L&TFIN.HOLD 175.00 (176.20) 4067404
LIC HOUS.FIN 529.50 (520.55) 1135166
MARICO LIMIT 351.40 (368.50) 6861034
MCDOWELL 598.20 (592.85) 930237
MOTHERSON 304.05 (314.60) 4435855
MRF 78372.95 (79578.85) 5254
NHPC LTD 23.90 (23.55) 2623816
NMDC LTD 106.80 (106.95) 2997731
OIL INDIA 212.05 (213.45) 886762
ORACLE FIN S 3870.45 (3856.90) 35172
P&G HYG&HEAL 10279.85 (10121.10) 5950
PETRONET LNG 233.90 (234.10) 3523775
PIDILITE IND 1100.80 (1130.45) 1112545
PIRAMAL ENTE 2850.85 (2806.30) 2409694
PNB 85.15 (87.40) 38618382
POWER FIN CO 85.45 (86.65) 5608020
RURAL ELEC C 113.65 (115.50) 4685414
SAIL 79.95 (76.85) 19762943
SBI LIFE INS 695.20 (695.35) 156616
SHREE CEMENT 17401.70 (17260.05) 11531
SHRIRAM TRAN 1392.55 (1394.60) 812381
SIEMENS 996.90 (1003.60) 216611
SUN TV LTD 799.30 (792.60) 1835396

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 6.36 (6.06) 45
AISHWARYA TE 3.21 (3.31) 640
ALPHAGEO 687.35 (713.70) 379
AMAR RAJA BA 812.05 (822.75) 16050
ANDHRA BANK 35.15 (35.35) 251139
ANDHRA CEMEN 8.88 (9) 9968
ANDHRA PAPER 383.55 (361.40) 192624
ANDHRA PETRO 63.55 (62.25) 91002
ANDHRA SUGAR 380.60 (378.20) 1610
ANJANI PORTL 149.45 (149) 639
ASTRA MICROW 98.45 (100.30) 45545
AUROBINDO PH 612.50 (598.95) 146396
AVANTEL SOFT 301.55 (297.65) 4633
AVANTI FEEDS 479.75 (485.15) 75395
AVON ORG 8.25 (7.90) 4349
BALAJI AMIN 570 (581.90) 2761
BARTRONICS 9.43 (9.47) 3303
BHAGIRA CHEM 471.90 (449.75) 95733
BHAGYA NAG 39.80 (40.40) 6090
BN RATHI SEC 36.50 (35.25) 400
BRILLIANT SE 2.65 (2.76) 218952
CAMBRIDGE TE 51.55 (51.35) 311
CIL SECURI 20.75 (20.45) 103
COMBAT DRUGS 24.90 (26.20) 10
CONT COFFEE 261.20 (265.05) 2549
COROMAN FERT 421.50 (427) 3705
CUBEX TUB 15.95 (15.60) 325
CYBERMATE 1.93 (1.99) 33075
CYIENT LIMIT 696.10 (694.45) 6548
DECCAN CEMEN 462 (457.50) 370
DIVI'S LAB 1200.40 (1161.65) 39878
DIVYA GRANIT 78.45 (78.70) 52
DR REDDY 2225.80 (2171.25) 80407
FOUR SOFT 44.65 (44.85) 440
GATI CORPN 110.65 (114.70) 419656
GAYATRI PROJ 207.65 (205.30) 5122
GMR INFRASTR 18.25 (17.95) 21471334
GOLDST INFRA 166.65 (158.75) 21298
GOLDSTONE EN 15.45 (14.72) 5993
GRANULES (I) 105.60 (101.90) 486320
GSS AMERICA 92.50 (83.55) 125712
GVK POWER 11.08 (10.97) 267935
HBL NIFE POW 35.20 (35.60) 29167
HERITAGE FOO 614.35 (606.25) 348
HIL LTD 2238.85 (2220.75) 7688
HIND FLUROCA 10.30 (10.51) 1398
IDL INDUSTRS 404.80 (389.80) 385
IKF SOFT 0.49 (0.47) 115472
ILFS ENGINEE 23.15 (23.40) 7666
INCAP 52.35 (55.10) 472
IVRCL INFRAS 1.45 (1.41) 493851
JEEVAN SCIEN 31.40 (30.85) 2615
KAKATIYA CEM 260.30 (263.10) 11079
KAKATIYA TEX 2.80 (2.80) 1
KALLAM SPG 27.95 (25) 63900
KARUNA CABLE 0.14 (0.14) 2000
KAVERI SEED 596.60 (619.10) 36713
KCP LTD 104.05 (104.95) 3086
KERNEX MICRO 28.15 (27.80) 538
KNR CONSTRUC 226.15 (227.20) 7682
KREBS BIO 113.45 (116.35) 1238
LANCO INDUS 228.30 (220.90) 26249
LANCO INFRAT 0.73 (0.74) 1252690
LAURUS LABS 468 (458.40) 1409
LOKESH MACH 61.50 (62.65) 13555
MADHUCON PRO 11.39 (10.85) 25125
MEDINOVA DIA 18.70 (17.85) 50
MEGA SOFT 8.09 (8.50) 6802
MIC ELECTRON 2.98 (3.06) 9437
MOLD-TEK.TEC 50.75 (51.65) 360873
MOLDTK PLA 300.55 (308.35) 4878
MSR INDIA LT 19.30 (17.60) 17880
NAGARJAGRICH 36.85 (38.20) 3667
NATCO PHARMA 784.10 (795.40) 5076
NAVA BH VENT 132.40 (132.90) 64627
NCC 93.90 (91.15) 1554305
NCL IND 168 (169.15) 341
NEHA INTER 4.80 (4.82) 53491
NETTLINX 45.60 (45.80) 10226
NEULAND LAB 693.95 (693.35) 867
NIHAR INFO 10.40 (10.04) 1120
NILE 510.90 (486.85) 3212
OIL COUNTRY 20.35 (20.50) 3735
PANKAJ POLY 5.76 (6.06) 700
PANYAM CEMEN 22.45 (22.60) 5963
PENNER IND 47.90 (49.30) 40148
PHYTOCHEM I 52.30 (51.25) 858
PIONEER DIST 224.10 (213.45) 10044
PITTI LAMIN 80.95 (82.15) 8173
POKARNA 160.70 (159.75) 3057
PRAJAY ENGS 8.56 (8.40) 205
PREMIER EXPL 264.45 (269.75) 817
PRISM CEMENT 105.60 (106.20) 97925
PRUDENTL PHA 4.98 (4.91) 452142
RAIN INDUSTR 199.20 (189.75) 199686
RAJ PACKAGIN 30.05 (31.90) 18510
RAM INFORMAT 45.70 (46.05) 11883
SAGAR CEM 816 (816.65) 247
SAMKRG PIST 255.35 (263.20) 2096
SAMPRE NUTRI 48 (49.25) 1524
SMS PHARMA 72.90 (73.10) 10163
SOUTH BIO TE 1.14 (1.17) 2
SREE RAYAL A 35 (35.20) 30069
SRINIVASA SH 49.20 (49.35) 14933
STARCHIK SP 29.40 (29.40) 120
STEEL EXCHAN 20.50 (20.80) 945
SUJANA METAL 0.75 (0.75) 2425
SUJANA TOWER 2.32 (2.21) 7301
SUJANA UNIVE 0.46 (0.47) 54242
SURANA STRIP 1.60 (1.67) 1000
SURANA TELE 5.10 (5.07) 4591
SURYALAKSH.C 50.10 (50.25) 430
SURYALATA SP 130 (129) 200
SUVEN PHARMA 222.45 (221.10) 46230
TAJ GVK HOTE 238.50 (233.60) 10498
TANLA 39.60 (39.80) 39838
TERA SOFTWAR 36 (36.50) 793
TRANS BIOTEK 2.11 (2.09) 23628
VAMSHI RUBB 43.55 (44.30) 311
VBC FERRO 44.95 (44.10) 611
VICEROY HOTE 7.48 (7.14) 80289
VIJAY TEXTIL 49.45 (50.05) 3860
VIMTA LABS 219 (219) 1433
VISAKA IND 609.85 (591.90) 25692
VISTA PHARMA 37.05 (37.55) 28731
VIVIMED LABS 53.80 (56.35) 96948
VJIL CONSULT 20.15 (21.10) 265
VST INDUS 2655 (2700) 383
XL TELENE 1.19 (1.19) 998
YBRANT DIGIT 4.64 (4.77) 164886
ZENOTECH LAB 34.35 (33.30) 17554
ZENTECH 86 (83.20) 7804

ఆర్‌బీఐ.. కాస్త నోరు విప్పవోయి..!

సాధారణంగా పరపతి సమీక్ష విధాన ప్రకటన రోజున ఆర్‌బీఐ విలేకర్ల సమావేశం ఏర్పాటు చేస్తూ ఉంటుంది. రేట్ల కోతలపై, ఇతరత్రా ఆర్‌బీఐ విధానాలు, నిర్ణయాలపై విలేకర్ల ప్రశ్నలకు ఆర్‌బీఐ గవర్నర్, డిప్యూటీ గవర్నర్లు సమాధానాలు ఇస్తుంటారు. బుధవారం కూడా ఇదే విధంగా ఆర్‌బీఐ విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో ఐసీఐసీఐ బ్యాంక్ వంటి ప్రైవేటు బ్యాంకుల్లో కార్పొరేట్ పాలన గురించి ఒక విలేకరి ప్రశ్నించారు.

మామూలుగా అయితే ఈ ప్రశ్న అడిగిన వెంటనే.. దాన్ని ఒక సావకాశంగా భావించి ఐసీఐసీఐ బ్యాంక్ పరిణామాలను వివరించొచ్చు. ఎందుకంటే ఇప్పటికే ఆ బ్యాంకు ఎండీ, సీఈఓ చందాకొచ్చర్‌పై అంతర్గత విచారణే కాకుండా.. సెబీ వంటి నియంత్రణ సంస్థలూ రంగంలోకి దిగాయి. అదే సమయంలో యాక్సిస్ బ్యాంక్ ఎండీ శిఖా శర్మకు పూర్తి కాల పదవిని ఎందుకు నిరాకరించాల్సి వచ్చిందో కూడా ఇదే సందర్భంలో ఆర్‌బీఐ వివరించి ఉండొచ్చు.

ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌ల అంశాలపై ప్రజలకు బహిరంగంగా తెలియజెప్పడానికి ఆర్‌బీఐకి నిజంగా ఇది మంచి అవకాశమే. అయితే దాన్ని వదిలేసుకుంది. ఆర్‌బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ ఆ ప్రశ్నను డిప్యూటీ గవర్నర్ ఎన్.ఎస్. విశ్వనాథన్‌కు మళ్లించారు. ఆయనేమో.. 'ఏదైనా నిర్దిష్ట బ్యాంకుకు సంబంధించిన ప్రశ్నకు మేం సమాధానం చెప్పలేం. బ్యాంకింగ్ వ్యవస్థలో పరిణామాల పట్ల మేం జాగ్రత్తగా ఉన్నామ'ని అంత పెద్ద అంశాన్ని సైతం చిన్న ముక్కలో తేల్చేశారు.

భారత బ్యాంకింగ్ వ్యవస్థలో ప్రస్తుతం పలు అంశాలపై ప్రజలకు ఆందోళనలు, అనుమానాలున్న మాట వాస్తవం. ముఖ్యంగా ప్రైవేటు బ్యాంకులపైనా కొన్ని నీలినీడలు కమ్ముకున్నాయి. అవి కార్పొరేట్ పాలన విషయంలో వెనకబడుతున్నాయి. ఐసీఐసీఐ బ్యాంక్‌లో కార్పొరేట్ పాలన అంశాలే కాకుండా.. పీఎన్‌బీ వంటి ఇతర బ్యాంకుల్లో కుంభకోణాలూ కూడా ఆందోళన కలిగించాయి. ఆర్‌బీఐ ఈ విషయాల్లో స్పందించకపోవడం లేదా నిశ్శబ్దంగా ఉండడాన్ని యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ కూడా విమర్శించింది. ఈ కమిషన్ ఐసీఐసీఐ బ్యాంక్ కేసులో బోర్డు, యాజమాన్య ప్రవర్తనను పరిశీలిస్తున్న సంగతి తెలిసిందే.

పాత గవర్నర్లయిన రఘురామ్ రాజన్, దువ్వూరి సుబ్బారావు, వైవీ రెడ్డిలతో పోలిస్తే ఉర్జిత్ పటేల్ ఆధ్వర్యంలోని ఆర్‌బీఐ వ్యవహార తీరు(బయటి ప్రపంచంతో)కు చాలా విభిన్నంగా ఉందని విశ్లేషకులు తేల్చిచెబుతున్నారు. అప్పట్లో జరిగే విలేకర్ల సమావేశంలో రేట్ల నిర్ణయం వంటి విధాన పరమైన ప్రశ్నలకే కాక బ్యాంకింగ్, పాక్షిక బ్యాంకింగ్, మార్కెట్లు, అంతర్జాతీయ పరిణామాలపై ఆర్‌బీఐ పలు వ్యాఖ్యలు చేసేది. తద్వారా బ్యాంకింగ్ వ్యవస్థలో పాటు ఆర్థిక వ్యవస్థలోని కీలక అంశాలను పరిష్కరించడం జరిగేది. లేదంటే కనీసం ఉదహరించడం అంటూ ఒకటి జరిగేది. తద్వారా ఆ అంశాలపై కాస్త అవగాహన అయినా వచ్చేది.

కానీ ఈ సారి విలేకర్ల సమావేశం కేవలం 20 నిమిషాలకే పరిమితమైంది. అందులోనూ పటేల్, డిప్యూటీ గవర్నర్ల ముందస్తు ప్రసంగమే ఎక్కువ భాగం ఉంది. ప్రశ్నోత్తరాలకు అసలు సమయమే లేదు. అంతక్రితం అయితే రాజన్, అతని బృందం విడిగా ఇంటర్వ్యూలు కూడా ఇచ్చేది. పటేల్ ఇంటర్వ్యూలకూ చాలా దూరంగా ఉంటారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత కొన్ని వారాలకు ఒకట్రెండు ముఖాముఖిల్లో కనిపించారంతే. అన్నిటికంటే ముఖ్యంగా ఆర్‌బీఐ చాలా వరకు అంశాలపై చర్చాపత్రాలను ప్రవేశపెట్టి వాటిపై అభిప్రాయాలను సేకరించేది. తద్వారా కొన్ని మార్పులపై మార్కెట్లు ముందస్తుగా సంసిద్ధంగా ఉండడానికి వీలయ్యేది. కానీ పటేల్ హయాంలో అతిపెద్ద లోటు ఈ చర్చలు లేకపోవడమే.

ఈ ఏడాదిలో ఆర్‌బీఐ నుంచి కేవలం నాలుగు ప్రసంగాలు మాత్రమే వెలువడ్డాయి. అందులోనూ కొన్ని అసలు మీడియాకు ప్రవేశమే లేదు. అంటే చర్చలకు, స్పష్టతకు వీలుండదన్న మాట. ఈ ప్రసంగాలు కూడా ఏదైనా పరిణామం చోటు చేసుకున్న కొన్ని నెలల తర్వాత వెలువడ్డవే.

ఇటీవల చోటు చేసుకున్న ఒక పరిణామం కూడా ఆర్‌బీఐ నిశ్శబ్దానికి ప్రతీకగా నిలిచింది. ఐడీబీఐ బ్యాంక్‌లో 51 శాతం వాటాను ఎల్ఐసీ కొనుగోలు చేయడానికి వీలు కల్పించే చర్యలు జరుగుతున్న సంగతి అందరికీ తెలిసిందే. అంటే ఒక ప్రభుత్వ రంగ బ్యాంకును ఒక ప్రైవేటు రంగ బ్యాంకుకు మారుస్తున్నారన్నమాట. ఇటువంటి అంశంలో బీమా నియంత్రణాధికార సంస్థ(ఐఆర్‌డీఏ) కూడా స్పందించింది. ప్రభుత్వం కూడా తన ఆలోచనలు పంచుకుంది. విచిత్రంగా ఆర్‌బీఐ నుంచి మాత్రం ఎటువంటి స్పందనా రాలేదు.

రెండు నెలలకోసారి జరిగే పరపతి విధాన సమీక్ష నిర్ణయాలకు వెల్లడించడానికే ఆర్‌బీఐ పరిమితమైతే ఎలా? ఇపుడు మళ్లీ రెండు నెలల వరకు ఆర్‌బీఐ ఏమీ మాట్లడదా? బ్యాంకుల గురించి ముఖ్యంగా అందులోని డిపాజిటర్ల ప్రయోజనాల గురించి బయటకు వెల్లడించదా? కేవలం పరపతి విధాన నిర్వహణ ఒకటే ఆర్‌బీఐ చేసే ఉద్యోగమా? బ్యాంకుల పర్యవేక్షణ వంటి ఇతర బాధ్యతలపై చర్చలు ఉండవా?

బ్యాంకింగ్ సేవలు అందరికీ అందుబాటులో లేని భారత్ వంటి దేశంలో ఆర్‌బీఐ కేవలం పరపతి విధానానికే పరిమితం కాకుండా.. మిగతా బాధ్యతలనూ సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ సంస్థల్లో ఒకటైన ఆర్‌బీఐ.. దేశ ప్రజలను నేరుగా ప్రభావితం చేసే బ్యాంకింగ్ అంశాలపై తన ఆలోచనలను దాచుకుంటే మంచిదా? ఆర్‌బీఐ ఇప్పటికైనా మాట్లాడుతుందా?

ఈనాడు బిజినెస్

పసిడికి డాలర్ పోటు!

- అంతర్జాతీయంగా ధర తక్కువ
- రూపాయి ప్రభావంతో దేశీయంగా ఎక్కువ
- ఏప్రిల్-జూన్‌లో గిరాకీ 187 టన్నులే
- పునర్వినియోగం పెరుగుతోంది

అధిక ధరలకు తోడు సీజన్ వారీ అననుకూలతల వల్ల ఈ ఏడాది ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో బంగారానికి గిరాకీ తగ్గింది. ఇందుకు ప్రధాన కారణం అధిక ధర. దేశంలో గనులు లేనందున, విదేశాల నుంచి దిగుమతిపైనే ఆధారపడుతున్నాం. ఇందుకోసం డాలర్లలో చెల్లించాల్సి వస్తోంది. డాలర్‌తో పోలిస్తే, రూపాయి మారకపు విలువ తగ్గడం వల్ల, తక్కువ బంగారానికే రూపాయల్లో అధికంగా చెల్లించాల్సి వచ్చింది. తొలకరి పడగానే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు గ్రామీణులు తమ దగ్గర నగదు నిల్వ ఉంచుకుంటారు. తమ సంతానానికి విద్యాసంస్థల్లో రుసుముల కోసం అధికులు నగదు కూడబెట్టుకుంటారు. పండుగలు కూడా ఏమీ ఉండవు కనుక, ఈ త్రైమాసికంలో సాధారణంగానే బంగారం కొనరు. గతేడాది ఇదే కాలం కంటే కూడా గిరాకీ తగ్గేందుకు 'ఇతర ప్రాధాన్యతల' కోసం డబ్బు అట్టేపెట్టుకోవడం ప్రధాన కారణంగా చెప్పొచ్చు.

2017 ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 202.6 టన్నుల పసిడికి గిరాకీ ఏర్పడగా, ఈసారి ఇదే త్రైమాసికంలో 8 శాతం తక్కువగా 187.2 టన్నులకు పరిమితమైంది. విలువ పరంగా చూస్తే, రూ.52,750 కోట్ల నుంచి దాదాపు సమానంగా రూ.52,692 కోట్లుగా నమోదైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ నివేదిక ప్రకారం..

- ఆభరణాలకు గిరాకీ 161 టన్నుల నుంచి 8 శాతం తగ్గి 147.9 టన్నులకు పరిమితమైంది. విలువ పరంగా చూస్తే, ఇది రూ.41,925 కోట్ల కంటే 1 శాతమే తగ్గి రూ.41,631 కోట్లకు పరిమితమైంది.
- పెట్టుబడులు 41.6 టన్నుల నుంచి 5 శాతం తగ్గి రూ.39.3 టన్నులకు చేరాయి. విలువ పరంగా చూస్తే రూ.11,061 కోట్ల నుంచి 2 శాతం తగ్గి రూ.10,825 కోట్లకు చేరింది.
- ఇదే సమయంలో పాత బంగారాన్ని ఇచ్చి, కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం (పునర్వినియోగం) పెరిగింది. ఇది 29.6 టన్నుల నుంచి 8 శాతం అధికమై 32 టన్నులకు చేరింది.
- జనవరి-జూన్ నెలలకు గిరాకీని చూసినా 2017 కంటే 6 శాతం, పదేళ్ల సగటు కంటే 13 శాతం తగ్గింది.
- సాధారణ దుకాణాల నుంచి గొలుసుకట్టు, పెద్ద విక్రయశాలలకు కొనుగోళ్లు మరలుతున్నాయి. పారదర్శకత పెరిగేందుకు ఇది దోహదం చేస్తుందని, దీర్ఘకాలంలో పరిశ్రమకు మంచిదేనని భావిస్తున్నారు.

అంతర్జాతీయంగా ఏడాదిలోనే ధర తక్కువ.. కానీ ఇక్కడేమో..

అంతర్జాతీయంగా చూస్తే ఔన్సు (31.10 గ్రాములు) మేలిమి బంగారం ధర 1214 డాలర్లకు చేరింది. ఏడాది కాలంలో ఇది కనిష్ఠం. కానీ డాలర్ మారకపు విలువ రూ.68 పైనే ఉండటంతో, దేశీయంగా మాత్రం 10 గ్రాముల మేలిమి బంగారం రూ.30,000 పైనే ఉంటోంది. గురువారం దిల్లీలో రూ.365 తగ్గి, రూ.30,045 కు చేరింది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లోని బులియన్ వ్యాపారుల వద్ద రూ. 30,560గా ఉంది. ఆభరణాల బంగారం 10 గ్రాములు రూ.28,300గా ఉంది. వెండి కూడా కిలోకు రూ.50 తగ్గి, రూ. 39,000 పలుకుతోంది.

దిగుమతుల్లో భారీ తేడా

గతేడాది జులై నుంచి వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వస్తున్నందున, ముందస్తుగా ఏప్రిల్-జూన్‌లో పసిడి కొనుగోళ్లు ఎక్కువగా జరిగాయి. అందువల్లే 2017 రెండో త్రైమాసికంలో 274 టన్నుల పసిడి దేశంలోకి దిగుమతి అయింది. ఈసారి ఇది 38 శాతం క్షీణించి, 170 టన్నులకు పరిమితమైంది. జనవరి-జూన్ నెలల్లో చూసినా 555 టన్నుల నుంచి 13.51 శాతం తగ్గి, 480 టన్నులకు చేరింది.

అధికమాసం.. అధిక ధరలే దెబ్బతీశాయ్: ఈసారి అక్షయ తృతీయకు తోడు వివాహాలు అధికంగా సాగడం సానుకూల అంశాలు. అయితే అధికమాసం రావడంతో, ఆ నెలలో బంగారాన్ని కొనరు. ఇక అంతర్జాతీయంగా ధరలు తగ్గినా, డాలర్ మారకపు విలువ పెరిగి, దేశీయంగా ధర అధికం కావడం వల్ల పుత్తడికి గిరాకీ మందగించిందని డబ్ల్యూజీసీ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సోమసుందరం తెలిపారు.

పండుగ సీజన్ కలిసొస్తుందా?

దేశీయంగా చూస్తే, బంగారు ఆభరణాలను రైతులు అధికంగా కొనుగోలు చేస్తుంటారు. జులై-సెప్టెంబరు లోనూ వ్యవసాయ పనులకు పెట్టుబడులు అవసరమవుతాయి కనుక ఇటువైపు రారు. అయితే రుతు పవనాలు సాధారణ స్థాయిలో ఉండటం వల్ల, దిగుబడులు వచ్చాక గ్రామీణ గిరాకీ పెరుగుతుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. దీపావళి పండుగల సమయంలో కొనుగోళ్లు బాగా జరుగుతాయి కనుక, ఏడాది మొత్తం మీద చూస్తే 700 టన్నుల పసిడికి గిరాకీ ఏర్పడవచ్చన్నది డబ్ల్యూజీసీ అంచనా.

లక్ష కోట్ల డాలర్ల యాపిల్

- అమెరికాలో సరికొత్త రికార్డు సృష్టించిన షేర్లు
- మదుపరులకు లాభాల పంట

ఐఫోన్‌ను సృష్టించిన యాపిల్ అమెరికా స్టాక్ మార్కెట్లో చరిత్ర సృష్టించింది. తొలి సారిగా 1 ట్రిలియన్ (లక్ష కోట్ల) డాలర్ల (సుమారు రూ.68 లక్షల కోట్లు) మార్కెట్ విలువ సాధించిన తొలి కంపెనీగా గుర్తింపు సాధించింది. గురువారం నాస్‌డాక్‌లో, ట్రేడింగ్ ప్రారంభంలోనే యాపిల్ షేర్ 207.05 డాలర్ల ధరను తాకింది. దీంతో 1 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ విలువను ఆ సంస్థ సాధించినట్లు అయింది.

- ఈ ఏడాది జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి యాపిల్ రూ. 78,000 కోట్ల (11.5 బిలియన్ డాలర్లు) నికర లాభాన్ని ప్రకటించింది. దీంతో స్టాక్‌మార్కెట్లో యాపిల్ షేర్లపై మదుపరులకు ఆసక్తి పెరిగింది.
- 1980లో ఈ సంస్థ పబ్లిక్ ఇష్యూకు వచ్చింది. అప్పటి నుంచి యాపిల్ షేర్ ధర 50,000 శాతం పెరిగింది. ఈ నాలుగు దశాబ్దాల్లో 'ఎస్అండ్‌పీ 500' నమోదు చేసిన వృద్ధి 2,000 శాతం మాత్రమే. దీంతో పోల్చితే యాపిల్ షేర్ మదుపరులకు అద్భుతమైన లాభాలు అందించినట్లు స్పష్టమవుతోంది.
- వాస్తవానికి అమెరికాలో ఈ ప్రత్యేకతను ముందుగా అమెజాన్ సాధిస్తుందని అనుకున్నారు. కానీ ఆ సంస్థ 879 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ దగ్గరే ఆగిపోయి రెండో స్థానంలో ఉంది.
- యాపిల్ వ్యవస్థాపకుల్లో స్టీవ్ జాబ్స్ ఒకరు. 1976లో ఆయన గ్యారేజీలో యాపిల్ సంస్థ ప్రాణం పోసుకుంది. అప్పటి నుంచి అద్భుతమైన సాంకేతిక నైపుణ్యంతో వినూత్న ఉత్పత్తులు అందిస్తూ, విభిన్నమైన మార్కెట్ వ్యూహాలతో పర్సనల్ కంప్యూటర్లు, మొబైల్ ఫోన్ల మార్కెట్‌ను శాసించే స్థాయికి ఎదిగింది.
- పర్సనల్ కంప్యూటర్ల తయారీతో యాపిల్ ప్రస్థానం మొదలైంది. 'ఐఫోన్'తో మొబైల్ ఫోన్ల మార్కెట్లో అడుగుపెట్టాక, సంస్థ ప్రగతి అనూహ్య వేగాన్ని అందుకుంది. 2007లో సంస్థ ఐఫోన్‌ను ఆవిష్కరించింది. ఆ తర్వాత ఆకాశమే హద్దుగా ఈ కంపెనీ విస్తరించింది.
- ఐఫోన్‌ను విడుదల చేయక ముందు 2006లో యాపిల్ అమ్మకాల ఆదాయం 20 బిలియన్ డాలర్లు కాగా, నికర లాభం 2 బిలియన్ డాలర్లు మాత్రమే. ఇప్పుడు ఒక త్రైమాసికంలోనే 11 బిలియన్ డాలర్లకు పైగా నికర లాభాన్ని ఆర్జించే స్థాయికి పెరిగింది.
- అమెరికాలో అత్యధిక మార్కెట్ విలువను సాధించడమే కాక, ప్రపంచవ్యాప్తంగా అత్యంత విలువైన బ్రాండ్ కూడా 'యాపిల్' కావడం ప్రత్యేకత.
- ఏ కంపెనీకి లేనంత అత్యధిక లాభాలు యాపిల్‌కు ఉన్నాయి.
- తమ వ్యాపార అవసరాలకు తగినంత సొమ్ములేక ఎన్నో కంపెనీలు ఇబ్బందులు పడుతూ ఉంటాయి. కానీ యాపిల్ సమస్యే వేరు. దీనికి ఎంత ఖర్చు చేసినా తరగనంత నగదు నిల్వలు ఉన్నాయి. యాపిల్ వద్ద 178 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12,10,400 కోట్లు) నగదు ఉంది. ఈ సొమ్ముతో అమెరికాలో ప్రతి కార్ల కంపెనీని కొనుగోలు చేయవచ్చు.

మొబిస్టార్ నుంచి 5 ఫోన్లు

ఈనాడు, హైదరాబాద్: అందుబాటు ధరల్లో స్మార్ట్‌ఫోన్లను విక్రయించే వియత్నాంకు చెందిన మొబిస్టార్ భారత విపణిలోకి కొత్తగా 5 ఫోన్లను విడుదల చేసింది. ఇప్పటికే ఈ సంస్థ నుంచి 2 ఫోన్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండగా.. ఈ కొత్త ఫోన్లను దేశవ్యాప్తంగా రిటైల్ స్టోర్లలో విక్రయించబోతున్నట్లు మొబిస్టార్ సీఈఓ కాల్ నో తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లోకి ఆయన ఈ ఫోన్లను విడుదల చేశారు. భారత్‌లో రూ.10వేల లోపు స్మార్ట్ ఫోన్ల మార్కెట్ 50శాతం వరకూ ఉందనీ, ఈ విభాగంలో ఏడాదిలో మొదటి 5 సంస్థల్లో తాముండాలనే లక్ష్యంతో ఈ కొత్త ఫోన్లను విడుదల చేశామని చెప్పారు. ముఖ్యంగా స్వీయ చిత్రాలను ఇష్టపడేవారికి నచ్చుతాయని పేర్కొన్నారు. తొలిసారి స్మార్ట్‌ఫోన్ కొనాలనుకునే వారితోపాటు, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లోని వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 600మంది పంపిణీదారులను నియమించుకున్నట్లు తెలిపారు. ఏపీ, తెలంగాణలో ఇప్పటికే 225 మంది ఉద్యోగులను తీసుకున్నట్లు, 64 సర్వీస్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కొత్తగా విడుదల చేసిన ఫోన్లను ప్రదర్శిస్తున్న మొబిస్టార్ సీఈఓ కాల్ నో

'ఎక్స్1 డ్యూయల్' ఫోన్ 5.7అంగుళాల తెర, 3జీబీ ర్యామ్, 32 జీబీ అంతర్గత మెమోరీ, 13, 8 ఎంపీ కెమేరాలతో లభిస్తోంది. దీని ధర రూ.10,400. 'ఈ1 సెల్ఫీ' 5.45అంగుళాలు, ముందూ వెనకా 13 ఎంపీ కెమేరాలు, 3జీబీ ర్యామ్, 32 జీబీ అంతర్గత మెమోరీతో రూ.8,400లకు లభిస్తోంది. 'సీ2' ఫోను 5.34అంగుళాల తెరతో 8, 8 ఎంపీ కెమేరాలు, 2జీబీ ర్యామ్, 16జీబీ మెమోరీతో రూ.6,300లకు అందుబాటులోకి వచ్చింది. 'సీ1' ఫోను 5.34 అంగుళాల తెరతో, 2జీబీ ర్యామ్, 16 జీబీ మెమోరీతో లభిస్తోంది. ముందుభాగంలో 8, వెనకాల 8 ఎంపీ కెమేరాలను అమర్చారు. ధర రూ.5,400. ఇక 5.34 అంగుళాల తెరతో 1జీబీ ర్యామ్, 8జీబీ అంతర్గత మెమోరీ, ముందూవెనకా 5 ఎంపీ కెమేరాలతో ఉన్న 'సీ1 లైట్' రూ. 4,340కి అందుబాటులోకి వచ్చింది.

బ్లాక్‌బెర్రీ ఎవాల్వ్ స్మార్ట్‌ఫోన్లు

ధరల శ్రేణి రూ.24,990-34,990

దిల్లీ: బ్లాక్‌బెర్రీ సంస్థ కొత్తగా ఎవాల్వ్, ఎవాల్వ్ ఎక్స్ స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించింది. నోయిడాలోని తమ భాగస్వామి ఆప్టిమస్ ప్లాంటులో రూపకల్పన (డిజైన్) చేసి, వీటిని తయారు చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. 4000 ఎంఏహెచ్ బ్యాటరీ కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్లు, ఆండ్రాయిడ్ ఓరియో ఆపరేటింగ్ సిస్టమ్‌పై పనిచేస్తాయి. వేగంగా ఛార్జింగ్ చేసుకోవచ్చు. క్వెర్టీ కీప్యాడ్ లేకుండా ఉన్న ఈ స్మార్ట్‌ఫోన్లు ఈ నెలాఖరు, సెప్టెంబరు మధ్య నుంచి విపణిలో లభిస్తాయి. డేటా భద్రతకు అధిక ప్రాధాన్యత ఇస్తామని సంస్థ తెలిపింది.

ఎవాల్వ్ ధర రూ.24,990 కాగా, 6 అంగుళాల తెర, 6 జీబీ ర్యామ్, 64 జీబీ అంతర్గత మెమొరీ (ఎస్‌డీ కార్డుతో పెంచుకోవచ్చు), స్నాప్‌డ్రాగన్ 450 చిప్‌సెట్, 1.8 గిగాహెర్ట్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్, ముందు 16 మెగాపిక్సెల్-వెనుక 13+13 మెగాపిక్సెల్ కెమేరాలున్నాయి.

ఎవాల్వ్ ఎక్స్ ధర రూ.34,990 కాగా, 6 అంగుళాల తెర, స్నాప్‌డ్రాగన్ 660 చిప్‌సెట్, 2.2 గిగాహెర్ట్జ్ ఆక్టాకోర్ ప్రాసెసర్, 6 జీబీ ర్యామ్, 64 జీబీ అంతర్గత మెమొరీ (ఎస్‌డీ కార్డుతో 256 జీబీ వరకు పెంచుకోవచ్చు), ముందు 16 మెగాపిక్సెల్-వెనుక 13+13 మెగాపిక్సెల్ కెమేరాలున్నాయి.

హెచ్‌డీఎఫ్‌సీ రుణాలపై వడ్డీ రేట్ల పెంపు

ముంబయి: హౌసింగ్ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (హెచ్‌డీఎఫ్‌సీ) 0.2 శాతం వడ్డీ రేట్లు పెంచింది. ఈ పెంపు ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చిందని వెల్లడించింది. మహిళలకు రూ.30 లక్షల్లోపు రుణాలకు 8.7%, రూ.30 లక్షలకుపైన రుణాలకు 8.8 శాతం వడ్డీ రేటు చొప్పున రుణాలు అందజేస్తున్నట్లు తెలిపింది.. మిగతా వినియోగదారులకు 0.05 శాతం వడ్డీ రేటు అధికం. రిజర్వ్ బ్యాంక్ తాజా పరపతి విధాన సమీక్షలో రెపో రేటును 0.25% పెంచుతూ ప్రకటన విడుదల చేసిన మరుసటి రోజే హెచ్‌డీఎఫ్‌సీ వడ్డీ రేట్ల పెంపు నిర్ణయాన్ని ప్రకటించింది.

నిధుల మళ్లింపుపై ఆడిటర్ దర్యాప్తు

ఆమ్రపాలి గ్రూప్ కేసులో సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ: ఫ్లాట్ల కోసం కొనుగోలుదారులు ఇచ్చిన రూ.2,765 కోట్ల మొత్తాన్ని ఆమ్రపాలి గ్రూప్ కంపెనీలు వేరే అవసరాల కోసం మళ్లించడంపై ఆడిటర్ దర్యాప్తునకు సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ నిధులు ఎక్కడకు బదిలీ అయ్యాయో తేల్చాలని నిర్దేశించింది. తమ గ్రూప్‌లోని 40 సంస్థల డైరెక్టర్ల బ్యాంక్ ఖాతాల వివరాలను సమర్పించాలని ఆమ్రపాలి గ్రూప్‌ను కోరింది. సరైన సమాచారం కనుక ఇవ్వకపోతే, కోర్టు ధిక్కార నేరం నమోదు చేస్తామని న్యాయమూర్తులు జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ యు.యు.లలిత్‌లతో కూడిన బెంచ్ ఆమ్రపాలి గ్రూప్ న్యాయవాది గౌరవ్ భాటియాను హెచ్చరించింది. 3 రోజుల్లోగా వాటిని సమర్పిస్తామని భాటియా తెలిపారు. ఇల్లు/ఫ్లాట్ కొనుగోలుదార్లు ఇచ్చిన నిధులను, స్థిరాస్తి అభివృద్ధిదారులు వేరే అవసరాలు/ఇతర ప్రాజెక్టుల పూర్తికి మళ్లించడం ఒక రోగంగా మారిందని, ఇలాంటి వ్యవహారాలకు ఇంతటితో ముగింపు పలికేలా చేస్తామని కోర్టు బుధవారం హెచ్చరించిన సంగతి విదితమే. ఈ విషయమై గురువారం విచారణకు ఇద్దరు చార్టర్డ్ అకౌంటెంట్లు హాజరయ్యారు. వీరిద్దరు ఆమ్రపాలి గ్రూప్‌తో 2008 నుంచి 2015 వరకు పనిచేశారు. 'మీరు సీఏ. అంటే నిధులకు కాపలాదారుగా వ్యవహరించాలి. ఈ గ్రూప్‌నకు కొనుగోలుదార్లు ఇచ్చిన రూ.2765 కోట్ల నగదును, గ్రూప్ వేరే ప్రాజెక్టులకు ఎలా మళ్లించింది/బదిలీ చేసిందో తేల్చాలి' అని బెంచ్ పేర్కొంది. తదుపరి విచారణను సెప్టెంబరు 4కు వాయిదా వేసింది.

అసంపూర్తి ప్రాజెక్టులు చేపడతాం.. ఎన్‌బీసీసీ: కొనుగోలుదార్లకు 42,000 ఫ్లాట్లు అందించడంలో విఫలమైన ఆమ్రపాలి గ్రూప్ ప్రాజెక్టులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని నేషనల్ బిల్డింగ్స్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ (ఎన్‌బీసీసీ) కోర్టుకు తెలిపింది. ప్రైవేటు అభివృద్ధిదార్లకు అప్పగించడం కంటే, ఈ పనులను ఎన్‌బీసీసీ చేపట్టడమే తమకు సమ్మతమని ఫ్లాట్ల కొనుగోలుదార్ల తరఫున హాజరైన న్యాయవాది కోర్టుకు నివేదించారు. నోయిడా, గ్రేటర్ నోయిడా, యమునా ఎక్స్‌ప్రెస్ వే ప్రాంతాల్లోని ఇళ్ల కొనుగోలుదార్లకు సంబంధించి నిర్వహించే సమావేశాలకు, కోర్టు సమ్మతి లేకుండా ఆమ్రపాలి గ్రూప్ ప్రతినిధిని ఆహ్వానించవద్దని గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి దుర్గాశంకర్ మిశ్రాను కోర్టు ఆదేశించింది. కోర్టు ధిక్కరించాలనే ఉద్దేశం తన నేతృత్వంలోని కమిటీకి లేదని, ఇళ్ల కొనుగోలుదార్లకు మేలు జరగాలనే ప్రయత్నిస్తున్నామని మిశ్రా విన్నవించారు. నివాస సముదాయాల ప్రాజెక్టులు ఎలా పూర్తిచేస్తారనే విషయమై, 30 రోజుల్లోగా పూర్తిస్థాయి ప్రణాళికతో రావాలని ఎన్‌బీసీసీ ఛైర్మన్ డాక్టర్ అనూప్ కుమార్ మిత్తల్‌ను కోర్టు ఆదేశించింది.

ఛాంపియన్స్

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారులు పి.వి.సింధు, సైనా నెహ్వాల్‌ల జోరు కొనసాగుతోంది. సింధు, సైనా క్వార్టర్‌ఫైనల్లోకి దూసుకెళ్లి పతకానికి అడుగు దూరంలో నిలిచారు. పురుషుల సింగిల్స్‌లో భమిడిపాటి సాయిప్రణీత్, మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజు-అశ్విని పొన్నప్ప క్వార్టర్స్ చేరుకుని పతకంపై ఆశలు రేకెత్తి స్తున్నారు. ఐతే పతకం గెలుస్తా డునుకున్న స్టార్ ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు.


సైనా

పతకానికి అడుగు దూరంలో..!

క్వార్టర్స్‌లో సైనా, సింధు

- సాయిప్రణీత్, సాత్విక్ జోడీ ముందంజ
- శ్రీకాంత్ నిష్క్రమణ ● ప్రపంచ ఛాంపియన్‌షిప్

నాంజింగ్ (చైనా)

ప్రతిష్టాత్మక టోర్నీలో గురువారం భారత క్రీడాకారులు సత్తాచాటారు. మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో మూడో సీడ్ సింధు 21-10, 21-18తో 9వ సీడ్ సుంగ్ హ్యున్ (కొరియా)ను మట్టికరిపించింది. 42 నిమిషాల పోరులో సుంగ్‌పై సింధుదే పూర్తి ఆధిపత్యం. 9-0 ఆధిక్యంతో తొలి గేమ్‌ను ఆరంభించిన సింధు.. 18-8తో మరింత ముందంజ వేసింది. అదే జోరులో 21-10తో తొలి గేమ్‌ను గెల్చుకుంది. రెండో గేమ్ భిన్నంగా ఆరంభమైంది. సింధు 2-9తో వెనుకబడింది. వెంటనే పుంజుకున్న భారత స్టార్ ప్రత్యర్థి ఆధిక్యాన్ని 8-10కి తగ్గించింది. ఈ సమయంలో అనవసర తప్పిదాలు సింధును వెనక్కి నెట్టాయి. సుంగ్ 15-9తో ఆధిక్యం సంపాదించింది. స్మాష్‌లు, క్రాస్‌కోర్ట్ షాట్‌లతో విరుచుకుపడిన సింధు వరుసగా 7 పాయింట్లు సాధించి 16-14తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 18-17 పాయింట్ల వరకు ఇరువురు పోరాడినట్లు కనిపించినా అప్పటికే మ్యాచ్ సింధు నియంత్రణలోకి వచ్చింది. సుంగ్‌కు మరో అవకాశం ఇవ్వకుండా 21-18తో రెండో గేమ్ నెగ్గింది సింధు. సుంగ్‌పై తన గెలుపోటముల రికార్డును 8-5కు పెంచుకుంది. పదో సీడ్ సైనా నెహ్వాల్ 21-16, 21-19తో నాలుగో సీడ్ ఇంతానన్ రచనోక్ (థాయ్‌లాండ్)పై గెలుపొందింది. 47 నిమిషాల మ్యాచ్‌లో తొలి గేమ్‌లో 4-8తో వెనుకబడిన సైనాకు ఆధిక్యం సంపాదించడానికి ఎంతోసేపు పట్టలేదు. మంచి ప్లేసింగ్స్‌తో వరుసగా పాయింట్లు రాబట్టి 12-8తో ఆధిక్యంలోకి వెళ్లింది. అదే జోరులో 21-16తో తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సైనాకు గట్టి పోటీ ఎదురైంది. 18-13తో స్పష్టమైన ఆధిక్యంలో సైనాను రచనోక్ తీవ్రంగా ప్రతిఘటించింది. వరుసగా 4 పాయింట్లతో సైనాను సమీపించింది. ఒక పాయింటు నెగ్గి 19-17తో సైనా ముందంజ వేయగా.. 2 పాయింట్లు సాధించిన రచనోక్ 19-19తో స్కోరును సమం చేసింది. ఒక్కసారిగా ఉత్కంఠ పెరిగిపోయింది. ఈ సమయంలో కోచ్ పుల్లెల గోపీచంద్ ఇచ్చిన సలహాలు సైనాకు కలిసొచ్చాయి. గోపీ వ్యూహాన్ని ఆచరణలో పెట్టిన సైనా.. వరుసగా 2 పాయింట్లు గెల్చుకుని ఉత్కంఠకు తెరదించింది. 21-19తో రెండో గేమ్‌ను కైవసం చేసుకుంది. పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాయిప్రణీత్ 21-13, 21-11తో హన్స్ క్రిస్టియన్ (డెన్మార్క్)పై సునాయాసంగా విజయం సాధించాడు. ప్రపంచ ఆరో ర్యాంకర్ శ్రీకాంత్ 18-21, 18-21తో డారెన్ ల్యూ (మలేసియా) చేతిలో ఓటమి చవిచూశాడు. మిక్స్‌డ్ డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో సాత్విక్- అశ్విని 20-22, 21-14, 21-6తో సూన్ హువాత్- షెవోన్ జెమీ (మలేసియా)పై గెలిచారు.

సింధు

శుక్రవారం జరిగే క్వార్టర్‌ఫైనల్స్ అధిగమిస్తే భారత క్రీడాకారులకు పతకాలు ఖాయమైనట్లే. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో సెమీస్‌లో ఓడినా కాంస్య పతకం వస్తుంది. ఐతే మహిళల సింగిల్స్‌లో భారత క్రీడాకారిణులకు కఠిన సవాల్ ఎదురుకానుంది. క్వార్టర్స్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ నొజొమి ఒకుహర (జపాన్)తో సింధు, ఒలింపిక్స్ స్వర్ణ పతక విజేత కరోలినా మారిన్ (స్పెయిన్)తో సైనా తలపడనున్నారు. పురుషుల సింగిల్స్ క్వార్టర్స్‌లో ఏడో ర్యాంకర్ కెంటొ మొమొట (జపాన్)తో 26వ ర్యాంకర్ సాయిప్రణీత్ పోటీపడతాడు. వీరిద్దరు రెండు సార్లు ముఖాముఖి ఎదురవగా.. రెండింట్లోనూ సాయిప్రణీత్ విజయాలు సాధించడం విశేషం. ఐతే ఈ రెండు మ్యాచ్‌లు 2013లో జరిగాయి. ప్రస్తుతం మంచి ఫామ్‌లో ఉన్న మొమొటను ఓడించాలంటే సాయిప్రణీత్ చెమటోడ్చాల్సిందే. మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్- అశ్విని జోడీకి అతిపెద్ద పరీక్ష ఎదురవనుంది. ప్రపంచ రెండో ర్యాంకర్, టాప్ సీడ్ హువాంగ్- జెంగ్ సీవీ (చైనా)తో సాత్విక్- అశ్విని తలపడనున్నారు. ర్యాంకింగ్స్‌లో 40వ స్థానంలో సాత్విక్- అశ్విని జోడీకి టాప్ సీడ్ జంటను నిలువరించడం కష్టమే!

పోరాడి ఓడిన అమ్మాయిలు

- క్వార్టర్స్‌లో ఐర్లాండ్ చేతిలో భారత్ ఓటమి
- హాకీ ప్రపంచకప్

లండన్: హాకీ ప్రపంచకప్‌లో భారత అమ్మాయిల పోరాటం ముగిసింది. సుదీర్ఘ విరామం సెమీఫైనల్ చేరాలనుకున్న భారత కల భగ్నం అయింది. గురువారం హోరాహోరీ సాగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ షూట్ ఆఫ్‌లో 1-3తో తేడాతో ఐర్లాండ్ చేతిలో ఓడింది. ఈ మ్యాచ్‌లో నిర్ణీత సమయంలో గోల్స్ సాధించడంలో ఇరు జట్లు విఫలమయ్యాయి. భారత్‌కు కొన్ని అవకాశాలు లభించినా అవి గోల్స్‌గా మారలేదు.. దీంతో మ్యాచ్ షూట్ ఆఫ్‌కు దారి తీసింది.

అవకాశం చేజారింది...: షూట్ ఆఫ్‌లో భారత్‌కు మంచి అవకాశాలు లభించాయి. కానీ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో అమ్మాయిలు విఫలమయ్యారు. నికోలా కొట్టిన తొలి షాట్‌ను అడ్డుకున్న భారత్ షూట్ ఆఫ్‌ను గొప్పగా ప్రారంభించింది. అయితే కెప్టెన్ రాణి రాంపాల్ బంతిని గోల్‌లోకి పంపడంలో విఫలం కావడంతో తొలి అవకాశం పోయింది. ఆ తర్వాత అనా కొట్టిన షాట్‌ను కీపర్ సవిత అడ్డుకోవడంతో భారత్‌కు మళ్లీ ఆధిక్యంలోకి వెళ్లే అవకాశం దొరికింది. కానీ ఈసారి మోనిక గోల్ చేయలేకపోయింది. మూడో ప్రయత్నంలో ఐర్లాండ్ (ఆప్టన్) గోల్ కొట్టగా.. నవ్‌జ్యోత్ షాట్‌ను ఐర్లాండ్ గోల్‌కీపర్ మెక్‌ఫెరాన్ అడ్డుకోవడంతో ఐర్లాండ్ 1-0 ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ వెంటనే అలిసన్ చేసిన గోల్‌తో ఐర్లాండ్ ఆధిక్యాన్ని రెట్టింపు చేసుకుంది. నాలుగో ప్రయత్నంలో భారత్ తరఫున రీనా గోల్ చేసినా.. ఆ వెంటనే గోల్ కొట్టిన ఐర్లాండ్ గెలుపు సొంతం చేసుకుంది.

22 టెస్టుల్లో విరాట్ శతకాలు

1 ఇంగ్లాండ్ గడ్డపై అతనికిదే తొలి సెంచరీ

3 కెప్టెన్‌గా అత్యధిక టెస్టు సెంచరీలు సాధించిన ఆటగాళ్లలో కోహ్లి (15)ది మూడో స్థానం. ఈ జాబితాలో గ్రేమ్ స్మిత్ (25) ముందున్నాడు.

విరాట్ కోహ్లి
149
225 బంతుల్లో
22×4, 1×6

విరాట్ అద్భుత శతకం

50-1, 54-2, 59-3, 100-4, 100-5

గత పర్యటనల చేదు జ్ఞాపకాలను గుర్తు చేస్తూ వందకే సగం జట్టు ఖాళీ అయిందిలా. ఇంగ్లాండ్ పేసర్లు విజృంభిస్తున్న వేళ.. కుప్పకూలడమిక ఖాయమే అనిపించింది. ఆ పతనం వేగంతో మరో పేలవ సిరీస్‌కు బీజం పడ్డట్లేనని అనుకున్నారంతా! కానీ ఆతిథ్య జట్టు ఆశలను ఆవిరి చేస్తూ.. విరాట్ కోహ్లి ఒక్కడు నిలిచాడు. విపత్కర పరిస్థితుల్లో అసాధారణ పోరాటంతో, అద్వితీయ శతకంతో టీమ్‌ఇండియాని నిలబెట్టాడు.పేస్‌కు తలవంచుతూ మిగతా బ్యాట్స్‌మెన్ తడబడ్డ అదే చోట కోహ్లి పట్టుదలతో పాతుకుపోయి ఉండకపోతే, ఆపద్బాంధవుడిగా నిలిచి ఉండకపోతే రెండో రోజే ఇంగ్లాండ్ పట్టుబిగించేదే! గత పర్యటనంతా కలిపి 134 పరుగులే చేసిన కోహ్లి.. ఈ ఒక్క ఇన్నింగ్స్‌లోనే 149 పరుగులు చేయడం విశేషం. కేవలం 13 పరుగుల ఆధిక్యం సంపాదించిన ఆతిథ్య జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లో 9 పరుగులకే ఓ వికెట్ చేజార్చుకుంది.

ఒకడే ఒక్కడు మొనగాడు

- 100/5 నుంచి 274కు టీమ్‌ఇండియా
- ఇంగ్లాండ్‌కు స్వల్ప ఆధిక్యం

బర్మింగ్‌హామ్

కెప్టెన్ విరాట్ కోహ్లి అద్భుత పోరాటపటిమను ప్రదర్శించిన వేళ.. ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో టీమ్‌ఇండియా పెద్ద ప్రమాదాన్ని తప్పించుకుంది. పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయినా అతడి అద్వితీయ శతకంతో కోలుకుంది. మ్యాచ్ రెండో రోజు, గురువారం తొలి ఇన్నింగ్స్‌లో 100కే ఐదు వికెట్లు కోల్పోయిన భారత్.. విరాట్ కోహ్లి (149; 225 బంతుల్లో 22×4, 1×6) భారీ శతకంతో 274 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 287 పరుగులకు ఆలౌటైన ఇంగ్లాండ్ కేవలం 13 పరుగుల ఆధిక్యంతో సరిపెట్టుకుంది. ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో ఓపెనర్ కుక్ (0) వికెట్ కోల్పోయి 9 పరుగులు సాధించింది.

కోహ్లి ఒక్కడు..: మ్యాచ్‌లో భారత్ ఇంకా నిలిచింది అంటే, ఇంకా ఆశలు కోల్పోలేదంటే కారణం ఒకే ఒక్కడు.. కెప్టెన్ విరాట్ కోహ్లి! ఓ వైపు ఇంగ్లాండ్ బౌలర్లు ఒత్తిడి తెస్తున్నా.. వికెట్లు పోతున్నా అతడు సహనంగా నిలబడ్డాడు. బాధ్యతనంతా భుజాలపై వేసుకుని జట్టును నడిపించాడు. లేదంటే 100 పరుగులకే ఐదు వికెట్లు చేజార్చుకున్న టీమ్‌ఇండియా.. ఏ 120 పరుగులకో ఆలౌటై రెండో రోజే ఆతిథ్య జట్టుకు మార్గం సుగమం చేసేదే. జట్టు స్కోరు 54 వద్ద క్రీజులోకి వచ్చిన కోహ్లి స్వింగ్‌ను, సీమ్‌ను జాగ్రత్తగా గమనిస్తూ పోరాటాన్ని కొనసాగించాడు. పట్టుదలతో క్రీజులో పాతుకుపోయాడు. నిజానికి అతడికి ఎవరి నుంచి పెద్దగా సహకారం లభించలేదు. ఎన్నో బంతులను వదిలేశాడు. లోపలికి దూసుకొచ్చిన బంతులను అద్భుతంగా డిఫెన్స్ ఆడాడు. కొన్ని సార్లు బంతులు ఎడ్జ్‌లను తాకాయి. ఆఫ్‌స్టంప్ లోగిలిలో బంతులతో అండర్సన్.. కోహ్లిని ఇబ్బంది పెట్టడానికి ప్రయత్నించాడు. కానీ విజయవంతం కాలేకపోయాడు. కోహ్లి మొండిగానే నిలబడ్డాడు. అక్కడక్కడా గతి తప్పిన బంతులను బౌండరీ దాటించాడు. కరన్, స్టోక్స్‌లనూ అతడు సమర్థంగానే ఎదుర్కొన్నాడు. ఒత్తిడికి లోనవుతూ, ఔటయ్యే ప్రమాదాలను తప్పించుకుంటూ కాస్త సహకారం అందించిన హార్దిక్ పాండ్య (22; 52 బంతుల్లో 3×4)తో ఆరో వికెట్‌కు 48 పరుగులు జోడించాడు. ఉన్నంతసేపూ ఊగిసలాడిన పాండ్య జట్టు స్కోరు 148 వద్ద కరన్ బౌలింగ్‌లో బౌల్డయ్యాడు. ఆ తర్వాత కోహ్లి కాస్త దూకుడు పెంచాడు. మరింత సాధికారికంగా, మరింత ఆత్మవిశ్వాసంతో షాట్లు కొట్టడం మొదలు పెట్టాడు. అశ్విన్, ఇషాంత్‌లు అండగా నిలిచిన కాసేపు జట్టుకు ఎంతో విలువైన పరుగులు జోడించాడు. స్టోక్స్ బౌలింగ్‌లో బౌండరీతో అర్ధశతకం పూర్తి చేశాడు. అండర్సన్ బౌలింగ్‌లో అశ్విన్ (10), షమి (2) కొద్ది తేడాలో ఔటైనా కోహ్లి చక్కని బ్యాటింగ్‌ను కొనసాగించాడు. ఇషాంత్ (17 బంతుల్లో 5)తో తొమ్మిదో వికెట్‌కు విలువైన 35 పరుగులు జోడించాడు. ఇషాంత్ ఔటైనా ఉమేశ్ అండగా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. స్టోక్స్ బంతిని పాయింట్ దిశగా బౌండరీ దాటించి శతకం పూర్తి చేసుకున్న కోహ్లి.. తర్వాతి బంతికి మిడాన్ దిశగా బౌండరీ రాబట్టాడు. అదే దూకుడుతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివరికి 150 పరుగుల మైలురాయికి ఒక్క పరుగు దూరంలో వెనుదిరిగాడు. ఉమేశ్‌తో ఆఖరి వికెట్‌కు కోహ్లి 57 పరుగులు జోడించాడు. ఈ భాగస్వామ్యంలో ఉమేశ్ చేసింది ఒక్క పరుగే.

కార్తీక్ బౌల్డ్

హడలెత్తించిన కరన్: 50/0. ఓవర్‌నైట్ స్కోరు 287/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లాండ్‌ను మరో రెండు పరుగులకే ఆలౌట్ చేసిన భారత్‌కు లభించిన ఆరంభమిది. అండర్సన్, బ్రాడ్‌లను ఓపెనర్లు విజయ్(20) , ధావన్(26) జాగ్రత్తగా ఎదుర్కొన్నారు. కానీ కరన్ విజృంభణతో భారత్ తడబాటు మొదలైంది. మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. భారత్ చకచకా మూడు వికెట్లు చేజార్చుకుని 59/3కు పడిపోయింది. కరన్ ఒకే ఓవర్లో రెండు వికెట్లు పడగొట్టి భారత్‌ను గట్టి దెబ్బ తీశాడు. మొదట ఓ ఇన్ స్వింగర్‌తో అతడు విజయ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఇక రాహుల్(4) దూరంగా వెళ్తున్న బంతిని వికెట్ల మీదకు ఆడుకున్నాడు. కరన్ తర్వాతి ఓవర్లో ఔట్ స్వింగర్‌ను డ్రైవ్ చేయబోయిన ధావన్.. మలన్ చేతికి చిక్కాడు. కోహ్లికి రహానె (15) జత కలవడంతో వికెట్ పతనం కాసేపు ఆగింది. కానీ జట్టు స్కోరు 100 వద్ద భారత్ రహానె, కార్తీక్ (0) వికెట్లు చేజార్చుకుని చిక్కుల్లో పడింది. వరుస ఓవర్లలో స్టోక్స్ వీళ్లిద్దరినీ ఔట్ చేశాడు.

ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 287

భారత్ తొలి ఇన్నింగ్స్: విజయ్ ఎల్బీ (బి) కరన్ 20; ధావన్ (సి) మలన్ (బి) కరన్ 26; రాహుల్ (బి) కరన్ 4, కోహ్లి (సి) బ్రాడ్ (బి) రషీద్ 149; రహానె (సి) జెన్నింగ్స్ (బి) స్టోక్స్ 15; దినేశ్ కార్తీక్ (బి) స్టోక్స్ 0; హార్దిక్ పాండ్య ఎల్బీ (బి) కరన్ 22; అశ్విన్ (బి) అండర్సన్ 10; షమి (సి) మలన్ (బి) అండర్సన్ 2; ఇషాంత్ శర్మ ఎల్బీ (బి) రషీద్ 5; ఉమేశ్ యాదవ్ నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 20 **మొత్తం:** (76 ఓవర్లలో ఆలౌట్) 274; **వికెట్ల పతనం:** 1-50, 2-54, 3-59, 4-100, 5-100, 6-148, 7-169, 8-182, 9-217; **బౌలింగ్:** అండర్సన్ 22-7-41-2; బ్రాడ్ 10-2-40-0; సామ్ కరన్ 17-1-74-4; రషీద్ 8-0-31-2; స్టోక్స్ 19-4-73-2

ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్: కుక్ (బి) అశ్విన్ 0; జెన్నింగ్స్ బ్యాటింగ్ 0; ఎక్స్‌ట్రాలు 4 **మొత్తం:** (3.4 ఓవర్లలో వికెట్ నష్టానికి) **9; వికెట్ల పతనం:** 1-9; **బౌలింగ్:** షమి 2-2-0-0; అశ్విన్ 1.4-0-5-1

కలిసొచ్చిన అదృష్టం

ఓ అద్భుత ఇన్నింగ్స్‌తో భారత్‌ను నిలబెట్టిన కోహ్లికి అదృష్టం కూడా కలిసొచ్చింది. రెండు సార్లు అతడి క్యాచ్‌లు వదిలేసిన ఇంగ్లాండ్ పెద్ద మూల్యమే చెల్లించుకుంది. 51 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద స్టోక్స్ బౌలింగ్‌లో మలన్ క్యాచ్ అందుకోలేకపోవడంతో కోహ్లి బతికిపోయాడు. అంతకుముందు వ్యక్తిగత స్కోరు 21 వద్ద కోహ్లికి జీవనదానం లభించింది. అప్పుడూ వదిలేసింది మలనే. అండర్సన్ బౌలింగ్‌లో కోహ్లి బ్యాటును తాకి వెళ్లిన బంతిని రెండో స్లిప్‌లో మలన్ చేజార్చాడు. అది మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. లేదంటే 100 పరుగుల వద్ద అప్పటికే రెండు వికెట్లు కోల్పోయి 100/5తో నిలిచిన భారత్.. కుప్పకూలేదే. రెండు అవకాశాలను కోహ్లి పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. తాను బతికిపోయి జట్టును బతికించాడు.

రింగ్ తీసి.. ముద్దు పెట్టి

స్టోక్స్ బౌలింగ్‌లో బౌండరీతో గ్రాండ్‌గా సెంచరీ పూర్తి చేసుకున్న కోహ్లి.. భిన్నంగా సంబరాలు చేసుకున్నాడు. నాన్‌స్ట్రైకింగ్‌లోకి రాగానే గాల్లోకి ఎగురుతూ సింహనాదం చేసిన విరాట్.. బ్యాట్‌ను కిందపెట్టి.. చొక్కా లోపల నుంచి నిశ్చితార్థం రింగ్‌ను బయటకు తీసి ముద్దు పెట్టాడు. ఆ తర్వాత స్టాండ్స్‌లో ఉన్న భార్య అనుష్క-శర్మ వైపు బ్యాట్‌ను చూపిస్తూ గాల్లోకి ముద్దులు గుప్పించాడు.

విరాట్ @ 7000

విరాట్ మరో మైలురాయి దాటాడు. అతను ఈ మ్యాచ్‌లో తన వ్యక్తిగత స్కోరు 42 పరుగుల వద్ద అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కెప్టెన్‌గా 7000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. బ్రాడ్ బౌలింగ్‌లో బౌండరీతో అతను ఘనంగా ఈ క్లబ్‌లో చేరాడు. 7 వేల పరుగులను వేగంగా పూర్తి చేసిన ఘనత కూడా విరాట్ (124 ఇన్నింగ్స్)దే. అతను లారా (164 ఇన్నింగ్స్)ను అధిగమించాడు. 7 వేల పరుగులు చేసిన భారత కెప్టెన్లలో అజహరుద్దీన్, గంగూలీ, ధోనిల తర్వాత కోహ్లి స్థానం సంపాదించాడు.

గురువారం దిల్లీలో కేంద్ర మంత్రి పాసవాన్‌ను కలిసిన మంత్రి ఈటల రాజేందర్, ఎంపీ కవిత నేతృత్వంలోని బృందం

లెవీ బకాయిలు విడుదల చేయండి

కేంద్రాన్ని కోరిన రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల

ఈనాడు, దిల్లీ: లెవీ కింద 2014-15 సంవత్సరానికి కేంద్రం నుంచి రాష్ట్రానికి రావల్సిన రూ.1,586 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి రాంవిలాస్ పాసవాన్‌ను కోరారు. దిల్లీలో కేంద్ర మంత్రిని గురువారం కలిసిన ఈటల నాలుగేళ్లుగా నిధులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఓ ప్రైవేటు సంస్థలాగా రాష్ట్ర ప్రభుత్వంతో వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం దగ్గర ఉన్నవి ప్రజల సొమ్మేనని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్రానికి 7.17 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ ద్వారా విడుదల చేయాలని కోరుతూ ఇప్పటికే వివరాలు అందించామన్నారు. నిధుల విడుదల, రాష్ట్రానికి బియ్యం కేటాయింపుపై తెరాస ఎంపీలు శుక్రవారం కేంద్రమంత్రితో మరోసారి సమావేశమవుతారని ఈటల వెల్లడించారు. మంత్రివెంట తెరాస లోక్‌సభ పక్ష నేత జితేందర్‌రెడ్డి, ఎంపీలు కవిత, సీతారాం నాయక్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీబీ పాటిల్, మల్లారెడ్డి, బండ ప్రకాశ్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ ఉన్నారు.

ఎన్‌సీబీసీకి చట్టబద్ధత హర్షణీయం: బూర నర్సయగౌడ్

పాలకుల నిర్లక్ష్యంతోనే వెనకబడిన తరగతులు మరింత వెనకబడ్డారని తెరాస ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌సీబీసీకి చట్టబద్ధత కల్పించాలని కేంద్రం నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. లోక్‌సభలో ఎన్‌సీబీసీబిల్లు సవరణ చర్చలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఐటీఐఆర్ ప్రాజెక్టుకు సాయం చేయాలని, వీలైనంత త్వరగా నిధులు విడుదల చేయాలని తెరాస ఎంపీ బండ ప్రకాశ్ కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఏదైనా ప్రాజెక్టు కారణంగా ఆదివాసీలు, గిరిజనులకు పునరావాసం అందని పక్షంలో తమ దృష్టికి తీసుకొస్తే వారికి న్యాయం చేస్తామని తెరాస ఎంపీ సీతారాంనాయక్ ప్రశ్నకు కేంద్రమంత్రి తోమర్ సమాధానమిచ్చారు.

ఎల్‌బీ, సరూర్‌నగర్ స్టేడియాల్లో సింథటిక్ ట్రాక్

ఖేలో ఇండియా పథకం కింద హైదరాబాద్‌లోని సరూర్‌నగర్, ఎల్‌బీ స్టేడియంలలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు కేంద్రం సూత్రప్రాయ అంగీకారం తెలిపినట్లు క్రీడా శాఖ మంత్రి రాజ్యవర్ధన్ రాథోడ్ తెలిపారు. లోక్‌సభలో నల్గొండ ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. వరంగల్‌లో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఏర్పాటుకు రూ.7 కోట్ల ప్రతిపాదనలు వచ్చాయని, తొలి విడతగా మార్చి 22న రూ.3.50 కోట్లు విడుదల చేశామన్నారు.

ఈ సమావేశాల్లోనే ఎస్సీ, ఎస్టీ బిల్లు: రాజ్‌నాథ్

దిల్లీ: ఎస్సీ, ఎస్టీలపై వేధింపుల నిరోధం చట్టంలోని అసలు నిబంధనలను పొందుపరుస్తూ ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లు ప్రవేశపెడుతామని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. గురువారం లోక్‌సభలో శూన్యగంట సందర్భంగా ఆయన ఈ ప్రకటన చేశారు.

రైల్వే క్రీడాకారుల పదోన్నతులపై కొత్త విధానం

దిల్లీ: రైల్వే క్రీడాకారుల పదోన్నతుల విషయంలో కొత్త విధానానికి రైల్వే మంత్రి పీయూష్ గోయల్ ఆమోదం తెలిపారు. ఒలింపిక్ పతక విజేతలకే కాకుండా, వారిని తీర్చిదిద్దేవారికీ గుర్తింపు లభించేలా.. క్రీడాకారులతోపాటు కోచ్‌లకు అధికారి హోదాను ఇవ్వాలని నిర్ణయించినట్లు రైల్వేమంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. పద్మశ్రీ అవార్డులు పొందిన క్రీడాకారులు, కోచ్‌లు అందరికీ.. అధికారులుగా పదోన్నతి కల్పించనున్నట్లు పేర్కొంది.

‘ఉత్తుత్తి కొలువుల’ ముఠా అరెస్టు

- ‘ఆర్‌ఆర్‌సీ’ పేరుతో వెబ్‌సైట్
- సికింద్రాబాద్, కాచిగూడ స్టేషన్లలో టీసీ విధులూ చేయించారు..

ఈనాడు - హైదరాబాద్

సర్కారు కొలువులిప్పిస్తామంటూ నిరుద్యోగులను ఆకట్టుకుంటారు.. తర్వాత ఉత్తుత్తి నియామకపు పత్రాలతో నమ్మించి రూ.లక్షలు దోచుకుంటారు. నిరుద్యోగులను నమ్మించేందుకు వారితో ఉద్యోగమూ చేయిస్తారు. అవసరమనుకుంటే మొదటినెల వేతనం కూడా వారే అభ్యర్థుల ఖాతాల్లో వేస్తారు. తొమ్మిది మంది సభ్యులున్న ఈ ముఠా రెండు, మూడేళ్ల నుంచి ఎందరో ఉద్యోగార్థులను మోసం చేసింది. తూర్పుగోదావరి జిల్లా కాకినాడకు చెందిన వర్ధనపు గంగాధర్‌కు నాలుగేళ్ల క్రితం హైదరాబాద్‌లో పేట్ బషీరాబాద్‌లో నివాసముంటున్న పిట్ల దత్తాత్రి పరిచయమయ్యాడు. నిరుద్యోగులను మోసం చేసేందుకు ప్రణాళిక వేసుకున్నారు. దత్తాత్రి హైదరాబాద్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్న ఎం.శివారెడ్డి, కె.రాజేష్, ఏరుకొండ స్వామి, ముక్కెర క్రాంతికుమార్‌లను ఏజెంట్లుగా నియమించుకున్నాడు. హుజూరాబాద్‌లో ఉంటున్న యంసాని వీరేషం కరీంనగర్, వరంగల్ జిల్లాలకు చెందిన వారిని హైదరాబాద్‌కు పంపించేవాడు. గంగాధర్ ప్రభుత్వ సంస్థల అధికారిక ముద్రలతో నియామకపు పత్రాలను అభ్యర్థులకు పంపించేవాడు. ఉద్యోగ స్థాయిని బట్టి ఒక్కో ఉద్యోగానికి రూ.10 లక్షల నుంచి రూ.25 లక్షలు వసూలు చేసుకునేవారు. వారికి ఒడిషా, విశాఖపట్నాల్లో శిక్షణ కూడా ఇచ్చేవారు. పకడ్బందీగా ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్న ఈ అంతర్రాష్ట్ర ముఠాను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎనిమిది మంది నిందితులను పట్టుకున్నారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ అంజనీకుమార్ విలేకరులతో మాట్లాడుతూ రైల్వే, రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, విద్యాశాఖల్లో వీరు ఉత్తుత్తి నియామకపు పత్రాలు ఇచ్చారని వివరించారు. వీరివద్ద నుంచి రూ.24.10 లక్షల నగదు, తొమ్మిది చరవాణులు, ఒక ల్యాప్‌టాప్, ప్రింటర్, స్విఫ్ట్‌కారు, బజాజ్ పల్సర్ వాహనం, స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. పరారీలో ఉన్న పద్మారెడ్డి కోసం టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధా కిషన్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో.. నకిలీ ఉద్యోగాలిచ్చే అంతర్రాష్ట్ర ముఠా సభ్యుల వివరాలను వెల్లడిస్తున్న నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

మొదటి నెల వేతనం కూడా...

ఉద్యోగార్థులను నమ్మించేందుకు అయిదుగురికి రైల్వేలో టిక్కెట్ కలెక్టర్ ఉద్యోగం వచ్చిందంటూ టీసీ దుస్తులు ఇచ్చారు. సికింద్రాబాద్, కాచిగూడ రైల్వేస్టేషన్లలో వీరితో పని కూడా చేయించారు. శిక్షణ సమయం కాబట్టి కేవలం పరిసరాలను పరిశీలిస్తే సరిపోతుందంటూ వారిని స్టేషన్లకు తీసుకువెళ్లారు. అక్కడ అధికారులను కలవనివ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రైల్వే అధికారులూ నకిలీ టీసీలను పట్టించుకోలేదు. నెల రోజుల తర్వాత జీతం కూడా వీరి ఖాతాల్లో వేశారు. రైల్వేశాఖలో ఉద్యోగాల కోసం ఏకంగా రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్ (ఆర్‌ఆర్‌సీ)ని పద్మారెడ్డి సృష్టించింది. నకిలీ నియామక పత్రాలు తీసుకుని వేర్వేరు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లిన బాధితుల ద్వారా గంగాధర్ బృందం మాయాజాలం అర్థమైంది. వీరిపై వేర్వేరు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని ఇన్‌స్పెక్టర్లు ఎస్.శ్రీనివాస్, గట్టుమల్లు తెలిపారు.

పింగళి వెంకయ్య కీర్తి అజరామరం

జయంతి సభలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

దిల్లీ: మువ్వన్నెల జెండా రూపశిల్పి పింగళి వెంకయ్య కీర్తి అజరామరమని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు కొనియాడారు. గురువారమిక్కడి ఏపీ భవన్‌లో 141వ పింగళి జయంతి వేడుకలు నిర్వహించారు. పింగళి వెంకయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. “పింగళి తెలుగువారు కావడం నిజంగా తెలుగు ప్రజల అదృష్టం. జాతీయ జెండాతో మాజీ ప్రధాని వాజ్‌పేయీ సహా ఎందరో ప్రముఖుల్లో ఆయన స్ఫూర్తిని నింపారు. సైనికుడు, బహుభాషా కోవిదుడు, వ్యవసాయ పరిశోధకుడు ఇలా ఎన్నో రంగాల్లో పింగళి తనదైన ముద్రవేశారు. అందరికీ ఆమోదయోగ్యమైన జెండాను రూపొందించి మహాత్మా గాంధీ ప్రశంసలూ పొందారు”అని వెంకయ్యనాయుడు కొనియాడారు. కార్యక్రమంలో కేంద్ర సమాచార కమిషనర్ మాడభూషి శ్రీధర్ ఆచార్యులు, ట్రస్ట్ వ్యవస్థాపకురాలు కె.ఎస్.ఎస్.జగదాంబ, రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమపై చొరవ చూపండి: తెదేపా ఎంపీల వినతి

కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు విషయంలో చొరవచూపాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకి తెదేపా ఎంపీలు విజ్ఞప్తి చేశారు. గురువారమిక్కడ సుజనాచౌదరి, సీఎం రమేశ్‌ల నేతృత్వంలో పార్టీ ఎంపీలు కడప జిల్లా ఐకాస నేతలు ఉపరాష్ట్రపతితో భేటీ అయ్యారు.

భారత్‌కు తొలగిన అడ్డంకి

- రష్యాపై విధించిన ఆంక్షల ప్రభావం మనపై లేకుండా బిల్లు
- అమెరికా కాంగ్రెస్ ఆమోదం

వాషింగ్టన్: రష్యాపై విధించిన ఆంక్షల ప్రభావం భారత్‌పై పడకుండా అమెరికా సెనేట్ కీలక బిల్లుకు ఆమోదం తెలిపింది. జాతీయ రక్షణ ఆధీకృత చట్టం (ఎన్‌డీఏఏ) బిల్లుకు అనుకూలంగా సెనేట్ సభ్యులు ఓటు వేశారు. ఈ బిల్లుకు ఇప్పటికే ప్రతినిధుల సభ ఆమోదం లభించింది. అధ్యక్షుడు ట్రంప్ సంతకంచేయగానే చట్ట రూపం దాలుస్తుంది. అమెరికా వైరిపక్షాలను ఆంక్షల ద్వారా ప్రతిఘటించే చట్టం (కాట్సా)లోని సెక్షన్ 231కు ఈ బిల్లు ద్వారా సవరణ చేశారు. రష్యా నుంచి రక్షణ సామగ్రిని కొనుగోలు చేసే దేశాలపై ఆంక్షలు విధించడానికి సెక్షన్ 231 వీలు కల్పిస్తోంది. అమెరికాకు వ్యూహాత్మక భాగస్వామ్య పక్షాలయిన భారత్ లాంటి దేశాలపై తాజా బిల్లుతో ఆంక్షల ఎత్తివేత సాధ్యమవుతుంది.

భారత్‌కు ప్రయోజనమేమిటి?: రష్యా నుంచి దాదాపు 4.5బిలియన్ డాలర్ల వ్యయంతో ఎస్-400 ట్రయంఫ్ గగనతల రక్షణ వ్యవస్థలు ఐదింటిని కొనడానికి భారత్ యోచిస్తోంది. కాట్సా వల్ల ఈ కొనుగోలుకు ఇబ్బంది ఏర్పడింది. అమెరికా తాజా బిల్లు కారణంగా ఈ ఇబ్బంది తొలగిపోతుంది. ఎన్‌డీఏఏలో ఉపయోగించిన శాసనపరమైన భాష చూస్తే రష్యా నుంచి రక్షణ కొనుగోళ్లు చేసే దేశాలపై ఆంక్షల ఉచ్చు మరింత బిగుసుకుంటుందన్నట్లుగా ఉందని, వాస్తవానికి ఆ బిల్లులో ఉపయోగించిన భాషలో పలు లొసుగులున్నాయని, అవి భారత్‌కు ప్రయోజనం కలిగిస్తాయని శ్వేతసౌధంలో గతంలో జాతీయ భద్రతా మండలి సీనియర్ అధికారిగా పని చేసిన జాషువా వైట్ చెప్పారు. అమెరికా వ్యూహాత్మక జాతీయ భద్రతా ప్రయోజనాలకు కీలకమయిన వ్యవహారాల్లో అమెరికాకు ఫలానా దేశం సహకరిస్తోంది అని అధ్యక్షుడు ధ్రువీకరించడానికి తాజా బిల్లులో అవకాశం కల్పించారని, భారత్ కేసును సమర్థించడానికి ఇది సరిపోతుందని ఆయన చెప్పారు. అదే సమయంలో భవిష్యత్తులో భారత్‌కు ప్రతిబంధకమయ్యే అంశాలూ ఇందులో ఉన్నాయన్నారు.

భారత్‌కు ప్రధాన రక్షణ భాగస్వామి హోదా!: భారత్‌తో అమెరికా తన ప్రధాన రక్షణ భాగస్వామ్యాన్ని విస్తృతం చేసుకోవాలని, బలోపేతం చేసుకోవాలని, ఈ భాగస్వామ్యం.. రెండు దేశాల సైన్యాల మధ్య వ్యూహాత్మక, కార్యకలాపాల సమన్వయానికి వీలు కల్పించాలని సంయుక్త సంఘం నివేదిక పేర్కొంది. ప్రతినిధుల సభ, సెనేట్‌లు రూపొందించిన వేర్వేరు బిల్లులకు ఒకటే రూపం ఇస్తూ సంయుక్త సంఘం నివేదిక రూపొందించింది. సముద్రజలాల భద్రత సహా భారత రక్షణ సామర్థ్యాలు అభివృద్ధి చేసుకునేందుకు సహకరించేందుకు, రెండు దేశాల సైన్యాలు కలిసి పని చేయడం, సమాచారం పరస్పరం పంచుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాలు బదిలీ చేయడం వంటివాటిని మరింత మెరుగుపర్చుకునేందుకు అవకాశం కల్పించేలా భారత్‌కు ప్రధాన రక్షణ భాగస్వామి హోదా అమలు చేయడానికి ఉన్న అదనపు అవకాశాలను పరిశీలించాలని ట్రంప్ యంత్రాంగానికి సూచించింది.

చైనాపై కఠిన వైఖరి: ప్రపంచంలోనే అతి పెద్దదైన అంతర్జాతీయ సముద్ర జలాల యుద్ధ విన్యాసాలయిన రిమ్ ఆఫ్ ది పసిఫిక్‌ఎక్సర్సైజ్(రిమ్‌పాక్)లో చైనా పాల్గొనకుండా నిషేధించే నిబంధనలు ఈ బిల్లులో ఉన్నాయి. రక్షణ, భద్రతా సంస్థలకు ప్రత్యేకించిన టెలికం ఉపకరణాలను చైనా కంపెనీలకు అందుబాటులో లేకుండా ఈ బిల్లు నియంత్రిస్తోంది.

పాకిస్థాన్‌కు రక్షణ సాయంలో భారీ కోత

వాషింగ్టన్: ఉగ్రవాదంపై పోరాటం నిమిత్తం సంకీర్ణ మద్దతు నిధి (సీఎస్ఎఫ్) ద్వారా పాకిస్థాన్‌కు అమెరికా అందిస్తున్న రక్షణ సాయంలో భారీగా కోత పడింది! ఇకపై ఏటా కేవలం 150 మిలియన్ డాలర్లను మాత్రమే ఆ దేశానికి ఇవ్వాలని అమెరికా కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ‘జాతీయ రక్షణ ధృవీకరణ చట్టం (ఎన్‌డీఏఏ-2019)’ బిల్లును ఆమోదించింది.

నిరోధక అస్త్రం

స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధిచేసిన సూపర్‌సోనిక్ నిరోధక క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. కొన్ని మెరుగుపరచిన సాంకేతిక పరిజ్ఞానాలను దీనిలో విశ్లేషించింది.



నిరోధక క్షిపణి పరీక్ష విజయవంతం

బాలాసోర్: శత్రు క్షిపణులను చిత్తుచేసే అధునాతన “సూపర్‌సోనిక్ నిరోధక క్షిపణి” పరీక్ష విజయవంతమైంది. స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధిచేసిన దీన్ని అడ్వాన్స్‌డ్ ఎయిర్ డిఫెన్స్ (ఏఏడీ)గా పిలుస్తున్నారు. అబ్దుల్ కలాం దీవినుంచి గురువారం ఉదయం 11.24 గంటలకు దీన్ని ప్రయోగించారు. నిప్పులు చిమ్ముకుంటూ ఇది దూసుకెళ్లింది. సముద్రంపై ఓ మోస్తరు ఎత్తులోని లక్ష్యాన్ని ఛేదించింది. కొన్ని మెరుగుపరచిన సాంకేతికతల పనితీరును అంచనా వేసేందుకు దీనికి పరీక్షలు నిర్వహించినట్లు రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. భిన్న అంచెల బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను సిద్ధంచేసే క్రమంలో భాగంగా దీన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఉపగ్రహ దిక్సూచీ వ్యవస్థతో అనుసంధానించిన ఈ క్షిపణి పయనమార్గాన్ని నియంత్రించే వీలుందని చెప్పారు. ఘన ఇంధనంతో దూసుకెళ్లే ఏఏడీ 15 నుంచి 25 కి.మీ. ఎత్తుల్లో ఎదురుగా వచ్చే క్షిపణులను అడ్డగించగలదు. ప్రయోగ ఏర్పాట్లను ప్రోగ్రాం డైరెక్టర్ యు.రాజబాబు, రక్షణ మంత్రికి శాస్త్రీయ సలహాదారు జీ సతీశ్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. క్షిపణి అభివృద్ధి ప్రాజెక్టు డైరెక్టర్‌గా శశికళ సిన్హా కొనసాగారు.

కువైట్ నుంచి 149 మంది ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయలుదేరిన జె9-608 జజీరా ఎయిర్‌లైన్స్ విమానం గురువారం తెల్లవారుజామున శంషాబాద్ విమానాశ్రయంలో దిగుతుండగా ఓ ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. అధికారుల అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితంగా దిగారు.

– న్యూస్‌టుడే, శంషాబాద్ గ్రామీణ

జాతీయ రాజకీయాల్లో ఎన్‌ఆర్‌సీ కుదుపు!

- అక్రమ వలసదారులపై చర్చకు తెరతీసిన భాజపా
- ‘లౌకిక పార్టీల’ను ఎండగట్టేందుకు వ్యూహం
- హిందువులకు మరింత చేరువయ్యే ప్రయత్నం

ఈనాడు, దిల్లీ: అసోంలో జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) తుది ముసాయిదాతో దేశరాజకీయాల్లో భాజపా ఒక కుదుపును తెచ్చింది. అక్రమ వలసదారులని సాంకేతికంగా తేలాక బంగ్లాదేశీ ముస్లింలను భారత దేశం ఎంతకాలం భరించాలన్న ప్రశ్నను రేకెత్తించింది. అయితే ఆ వలసదారులనూ భారత పౌరులుగా అసోంలో స్థిరపడేందుకు అనుమతించాలన్నది దేశవ్యాప్తంగా ఉన్న ముస్లింల అభిమతం. ఇతర రాష్ట్రాల్లోనూ ఈ కసరత్తును మోదీ సర్కారు చేపట్టొచ్చని, అసలైన భారతీయ ముస్లింలనూ అక్రమ వలసదారుల జాబితాలో చేర్చొచ్చన్న ఆందోళన వారిలో ఉంది. వారి ఆందోళనను ప్రతిబింబిస్తూ ఎన్‌ఆర్‌సీ కసరత్తును కాంగ్రెస్, ఇతర ‘లౌకిక పార్టీలు’ మోదీ సర్కారును దుయ్యబట్టాయి. ఈ పార్టీల వైఖరిని ఎండగట్టడం ద్వారా హిందువుల మనస్సును గెల్చుకోవాలని భాజపా పావులు కదుపుతోంది.

సున్నితమైన ఎన్‌ఆర్‌సీ అంశాన్ని మోదీ సర్కారు చాలా పేలవంగా నిర్వహించిందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విమర్శించారు. తృణమూల్ కాంగ్రెస్, ఆర్జేడీ, సమాజ్‌వాదీ పార్టీలు కూడా తీవ్రస్థాయిలో ఎన్‌ఆర్‌సీని వ్యతిరేకించాయి. తృణమూల్ అధినాయకురాలు, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర స్వరంతో దీన్ని ఖండించారు. అసోం నుంచి 40 లక్షల మందిని తరలించేస్తే అంతర్యుద్ధం చెలరేగొచ్చన్న వ్యాఖ్యలు చేశారు. ఆ నిరాశ్రయులకు తమ రాష్ట్రంలో ఆశ్రయమిస్తామన్నారు. బెంగాల్‌లో ముస్లిం జనాభా 28 శాతంగా ఉంది. వీరిలో మూడోవంతు మంది అక్రమ వలసదారులేనన్న వాదన ఉంది. వీరి సెంటిమెంట్‌ను మమత ప్రతిబింబిస్తున్నారు. అలాగే బిహార్‌లోని తూర్పు జిల్లాల్లో లక్షల మంది బంగ్లాదేశ్ ముస్లింలు ఉన్నారు. ఆర్జేడీ హయాంలో వీరు వలసవచ్చారు. వీరు తనకు విశ్వసనీయ ఓటు బ్యాంకుగా మారడంతో ఆర్జేడీ కూడా ఎన్‌ఆర్‌సీపై విరుచుకుపడుతోంది.

మాకు కలిసొస్తుంది

ఇది భాజపాకు ఆనందాన్ని కలిగిస్తోంది. “ఎన్‌ఆర్‌సీని కాంగ్రెస్ ఎంత తీవ్రంగా వ్యతిరేకిస్తే.. అది ముస్లిం అనుకూల పార్టీ అన్న భావన అంత లోతుగా వెళుతుంది. అసోంలోని హిందువులు కాంగ్రెస్‌ను ముస్లింల పార్టీగా ఇప్పటికే భావిస్తున్నారు. ఎన్‌ఆర్‌సీపై విమర్శల ద్వారా ఈ భావన దేశవ్యాప్తమవుతుంది” అని భాజపా నేత ఒకరు పేర్కొన్నారు. తృణమూల్, ఆర్జేడీల వ్యతిరేకత.. భాజపాకు ఎక్కువ సంతోషాన్ని కలిగిస్తోంది. బంగ్లాదేశ్ అక్రమవలసదారుల రాజకీయ ప్రాబల్యం పెరగడం హిందువులకు ఏమాత్రం ఇష్టం ఉండదని కమలనాథులు పేర్కొంటున్నారు. దీనివల్ల బెంగాల్, బిహార్‌లో గరిష్ఠ స్థాయిలో తమ పార్టీకి లబ్ధి కలుగుతుందని లెక్కలేస్తున్నారు. బంగ్లాదేశ్ వలసదారులు దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ స్థిరపడ్డారు. అంతిమంగా అసోంలోని ఎన్‌ఆర్‌సీ కసరత్తు ప్రభావం దేశవ్యాప్తంగా ఉంటుందని భాజపా నేతలు చెబుతున్నారు. “ఎన్‌ఆర్‌సీ ముసాయిదాను అధికారులు సవరిస్తుంటారు. అందువల్ల వచ్చే లోక్‌సభ ఎన్నికల వరకూ ఆ అంశం సజీవంగా ఉంటుంది. దీని నుంచి భాజపా ప్రయోజనం పొందుతుంది” అని ఓ స్వతంత్ర విశ్లేషకుడు పేర్కొన్నారు.

మరిన్ని ఆయుధాలు..

2019 ఎన్నికల్లో గెలుపునకు ‘అభివృద్ధి మంత్రం’ ఒక్కటే సరిపోదని భాజపా గుర్తించింది. ఈ దృష్ట్యా ఎన్‌ఆర్‌సీ లాంటి సున్నితమైన ఆయుధాల కోసం గాలిస్తోంది. ‘లౌకిక పార్టీల మైనార్టీ బుజ్జగింపు చర్యల’ను వెలుగులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తోంది. ముమ్మారు తలాక్, బహుభార్యత్వం తదితర అంశాలను తీవ్రస్థాయిలో చర్చనీయాంశం చేయబోతోంది. దీనివల్ల హిందువులు తమ వెంటే నిలబడతారని ఆ పార్టీ భావిస్తోంది.

అక్రమ వలసదారులూ అరుణాచల్‌ను వీడండి: విద్యార్థి సంఘం

ఈటానగర్: సరైన పత్రాలు లేకుండా అరుణాచల్ ప్రదేశ్‌కు వలస వచ్చినవారు 15 రోజుల్లోగా రాష్ట్రాన్ని వీడి వెళ్లిపోవాలని ‘అరుణాచల్‌ప్రదేశ్ విద్యార్థి సంఘం’ (ఆప్సు) డిమాండ్ చేసింది. అసోంలో ‘జాతీయ పౌరుల పట్టిక’ (ఎన్‌పీఆర్)ను ప్రచురించిన నేపథ్యంలో దానిలో స్థానం లభించని అనేకమంది ప్రజలు అక్కడినుంచి అరుణాచల్‌లో చొరబడవచ్చుని అనుమానం వ్యక్తం చేసింది. దీనిని నివారించడానికి రాష్ట్ర ప్రవేశ మార్గాల వద్ద నిఘా విధించి, అధికార యంత్రాంగానికి సహకరిస్తామని తెలిపింది. దీని కోసం ‘ఆపరేషన్ క్లీన్ డ్రైవ్’ను ప్రారంభిస్తామని ఆప్సు ప్రధాన కార్యదర్శి తొబొమ్ దాయ్ తెలిపారు. సరైన పత్రాలు లేనివారిని గుర్తించేందుకు ప్రభుత్వం గత వారమే ఒక కార్యక్రమం చేపట్టింది.

‘ముజఫర్‌పుర్’ బాలికల చిత్రాలు ప్రసారం చేయొద్దు

మీడియాకు సుప్రీంకోర్టు ఆదేశం

దిల్లీ/పట్నా: బిహార్‌లోని ముజఫర్‌పుర్‌లో ఉన్న వసతి గృహంలో అత్యాచారానికి గురయిన బాలికల చిత్రాలను, ఇంటర్వ్యూలను ప్రసారం చేయకూడదని సుప్రీంకోర్టు గురువారం మీడియాను ఆదేశించింది. మార్ఫిడి చేసిన చిత్రాల రూపంలోనూ ఇవ్వకూడదని తెలిపింది. చిత్రాలను ప్రసారం చేసి వారు పదేపదే బాధపడేటట్టు చేయకూడదని పేర్కొంది. పత్రికలకు కూడా ఈ ఆదేశాలు వర్తిస్తాయి. ప్రభుత్వ నిధులతో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ వసతి గృహంలో జరిగిన అక్రమాలపై పట్నాకు చెందిన రణ్‌విజయ్ అనే వ్యక్తి రాసిన లేఖను జస్టిస్ ఎం.బి.లోకుర్, జస్టిస్ దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఇంటర్వ్యూలు ఇవ్వాల్సిందిగా బాధితులపై ఒత్తిడి వస్తున్నట్టు ఆ లేఖలో ఫిర్యాదు చేశారు. దీనిపై సమాధానాలు చెప్పాలని బిహార్, కేంద్ర ప్రభుత్వాలను ఆదేశిస్తూ తదుపరి విచారణను ఈ నెల ఏడో తేదీకి వాయిదా వేసింది. బాధితులను విచారించే సమయంలో నిపుణులైన కౌన్సెలర్లు, బాలల మానసిక నిపుణుల సహాయం తీసుకోవాలని దర్యాప్తు సంస్థలకు సూచించింది.

బిహార్‌లో స్తంభించిన జనజీవనం: అత్యాచార ఘటనలో బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ గురువారం వామపక్షాలు బిహార్ బందు నిర్వహించడంతో జనజీవనం స్తంభించింది. ఈ బందుకు ప్రధాన ప్రతిపక్షాలైన ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మద్దతు ప్రకటించాయి. వసతి గృహం నిర్వాహకుడు బ్రజేష్ ఠాకుర్ ఇంటివద్ద ఆర్జేడీ, సీపీఐ (ఎంఎల్) కార్యకర్తలు ధర్నా చేశారు.

అసోంలో తృణమూల్ బృందాన్ని అడ్డుకున్న పోలీసులు

- మండిపడ్డ మమత

దిల్లీ, సిల్‌చార్(అసోం), కోల్‌కతా: అసోంలో రూపొందించిన జాతీయ పౌరుల జాబితా (ఎన్‌ఆర్‌సీ) ముసాయిదాలో 40 లక్షల మంది పేర్లు లేకపోవడంపై గురువారం కూడా పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. పరిస్థితులను అంచనా వేసేందుకు అసోం వెళ్లిన తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ప్రజాప్రతినిధుల బృందాన్ని నాటకీయ పరిణామాల మధ్య విమానాశ్రయంలోనే పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై తృణమూల్ అధ్యక్షురాలు మమతా బెనర్జీ మండిపడ్డారు. మరోపక్క- ఎన్‌పీఆర్‌ను దేశ ఐక్యతతో ముడిపెడుతూ ఆమె బుధవారం చేసిన వ్యాఖ్యలపై అసోం పోలీసుస్టేషన్లలో మరోరెండు కేసులు నమోదయ్యాయి. పార్లమెంటులోనూ తృణమూల్ సభ్యులు ఈ అంశాలను లేవనెత్తారు.

దేశంలో ‘సూపర్ ఎమర్జెన్సీ’.. మమత: సిల్‌చార్ విమానాశ్రయంలో మహిళలతో సహా తమ పార్టీ ప్రతినిధులపై పోలీసులు చేయిచేసుకున్నట్లు టీఎంసీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ఆరోపించారు. దేశంలో భాజపా ‘అత్యయిక’కు మించిన పరిస్థితి (సూపర్ ఎమర్జెన్సీ)ని అమలు చేస్తోందని విమర్శించారు. ఏ చట్టం కింద తమ బృందాన్ని అడ్డుకున్నారో తెలపాలని డిమాండ్ చేశారు. దిల్లీ నుంచి కోల్‌కతాకు చేరుకున్న మమత విలేకరులతో మాట్లాడారు. ఎన్‌ఆర్‌సీ వ్యవహారంపై తాను కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌ను కలిసినప్పుడు ఎవరిపైనా ఎలాంటి వేధింపులు ఉండవని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

కేంద్రం సమాధానమివ్వాలి.. సౌగత్‌రాయ్: టీఎంసీ ఎంపీలను అసోంలోని సిల్‌చార్ విమానాశ్రయంలో నిర్బంధంలోకి తీసుకోవడంపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలంటూ ఆ పార్టీ సీనియర్ నేత సౌగత్ రాయ్ డిమాండ్ చేశారు. లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని లేవనెత్తారు. తమ ఎంపీలు కకోలీఘోష్ దస్తీదార్, అర్పితా ఘోష్, మమతా ఠాకుర్, సుఖేందుశేఖర్ రాయ్ తదితరులు అసోంను సందర్శించేందుకు వెళ్లగా. . పోలీసులు విమానాశ్రయంలోనే నిర్బంధించినట్లు ఆరోపించారు. ఇది హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని సౌగత్‌రాయ్ పేర్కొన్నారు. కాగా టీఎంసీ డిమాండ్‌ను స్పీకర్ సుమిత్ర మహాజన్ దృష్టికి తీసుకెళతానని ఉపసభాపతి ఎం.తంబిదురై తెలిపారు.

ఎన్‌ఆర్‌సీ ముసాయిదాలో ఎమ్మెల్యే పేరూ గల్లంతు!

దిల్లీ: అసోంలో ఇటీవల విడుదలైన జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్‌ఆర్‌సీ) తుది ముసాయిదాలో చోటుదక్కని లక్షల మందిలో అనేక మంది ప్రముఖులూ ఉన్నారు. ఒక మాజీ సైనికాధికారి, ఎమ్మెల్యే, భాజపా ఎమ్మెల్యే భార్య తదితరులు ఉన్నారు. వారు భారత పౌరులే.

30 ఏళ్లు సైన్యంలో పనిచేసినా..: అజ్మల్ హక్.. మాజీ సైనికాధికారి. అసోంలోని కామరూప్ జిల్లాలోని ఛయగావ్ ప్రాంతంలో ఉంటున్నారు. ఎన్‌ఆర్‌సీ తాజా ముసాయిదాలో ఆయన పేరు గల్లంతైంది. ఆయన భారతసైన్యంలో 30ఏళ్లపాటు పనిచేశారు. అజ్మల్ కుమారుడు, కుమార్తె పేర్లు కూడా జాబితాలో లేవు. సైన్యంలో చేరేటప్పుడే తన పూర్వాపరాలన్నింటినీ తనిఖీ చేశారని అజ్మల్ పేర్కొన్నారు. ఎన్‌ఆర్‌సీకి అన్ని పత్రాలనూ సమర్పించినప్పటికీ పేర్లు గల్లంతయ్యాయని వాపోయారు.

మాజీ రాష్ట్రపతి బంధువులకూ..: జియాఉద్దీన్ అలీ అహ్మద్! ఆయన భారత ఐదో రాష్ట్రపతి ఫక్రుద్దీన్‌అలీ అహ్మద్‌కు మేనల్లుడు. ఆయన కామరూప్‌జిల్లాలో కల్మోని బర్హంపూర్ గ్రామంలో తన కుటుంబంతో కలసి నివసిస్తున్నారు. ఆశ్చర్యకరంగా ఆయనతోపాటు భార్య, ఇద్దరు కుమారుల పేర్లు ఎన్‌ఆర్‌సీ జాబితాలో లేవు. ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అనంతకుమార్‌మాలో, భాజపా ఎమ్మెల్యే దిలీప్‌కుమార్ పాల్ భార్య అర్చనా పాల్, నిషిద్ధ ఉల్ఫా-ఐ నాయకుడు పరేశ్‌బారువాభార్య బాబీ భుయాన్‌బారువా, ఆయన కుమారులు అంకుర్, ఆకాశ్‌ల పేర్లనూ ఈజాబితాలో చేర్చలేదు.

చిత్రంలో నవ్వులు చిందిస్తున్న ఈవిడ పేరు లెస్లీ హిగ్గిన్స్. స్కాట్లాండ్‌కు చెందిన ఈమెకు రూ.517 కోట్ల లాటరీ లభించింది. లాటరీ టికెట్టును తనిఖీ చేస్తుండగా తొలుత లాటరీ రాలేదనుకొని పొరపాటున దాన్ని చింపేశారు. అనంతరం మళ్లీ తనిఖీ చేయగా రూ.517 కోట్ల భారీ మొత్తాన్ని గెలుచుకున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. A1/1, Block No.3, Industrial Development Area, Uppal-500 039, Medchal District, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.

BAJAJ

2 లక్షల

మంది చేశారు హ్యాట్-ట్రిక్

త్వరపడండి! ఆఫర్ ఇప్పుడు ఆగస్టు 31, 2018 వరకు

హ్యాట్-ట్రిక్

ఆఫర్*

1 సంవత్సరం	+	2 సంవత్సరాలు	+	5 సంవత్సరాలు
ఉచిత ఇన్స్యూరెన్స్		ఉచిత సర్వీస్		వారంటీ

Call 7219821111 or visit www.bajajauto.com/hattrick

*మూడు ఆఫర్లు పల్సర్ 150, పల్సర్ 160, V, డిస్కవర్ మరియు ప్లాటినా పైన లభిస్తాయి. ఇతర పల్సర్లు మరియు CT100 పైన 2 సంవత్సరాల పాటూ ఉచిత సర్వీసు మరియు 5 సంవత్సరాల పాటూ వారంటీ లభిస్తుంది. డామినర్ మరియు అవెంజర్ పైన 5 సంవత్సరాల పాటూ వారంటీ లభిస్తుంది. నియమ నిబంధనలు వర్తిస్తాయి. తక్కువ వడ్డీ రేటు మరియు తక్కువ డౌన్‌పేమెంట్ ఆఫర్లను కూడా వినియోగించుకోండి.

For institutional/bulk orders, please send an email to corporatesales@bajajauto.co.in

Authorised Dealers For Bajaj Auto Ltd.: Bahadurpura SRI VINAYAKA BAJAJ 9393745666 • Begumpet SRI VINAYAKA BAJAJ 9390459666 • Chandanagar VARUN BAJAJ 8297544420 • Dilsukhnagar SRI VINAYAKA BAJAJ 9391770116 • Erragadda MGB BAJAJ 8885102244 • Habsiguda SELECT BAJAJ 8008104400 • Hydernagar TALWAR BAJAJ 7702015533 • Kachiguda SRI VINAYAKA BAJAJ 9030030280 • Kompally S&S BAJAJ 7995509090 • Kondapur VARUN BAJAJ 8297544408 • Kukatpally Y Jun TALWAR BAJAJ 8008034443 • LB Nagar SRI VINAYAKA BAJAJ 9948222455 • RC Puram VARUN BAJAJ 8297544405 • RP Road DECCAN BAJAJ 9948884427 • Tolichowki ABHINANDAN BAJAJ 8008803761 • Uppal SELECT BAJAJ 8008100966. **Authorised Service Centre**: ALWAL 9550896800, AMBERPET 9848224558, ANAND BAGH 9246322799, ATTAPUR 8008803765, BALAPUR 9949256471, BALANAGAR 7842025556, BN REDDY COLONY 9989652503, BODDUPAL 8008104449, CHANDRAYANGUTTA 9885647692, DMRL'X'ROAD 9849300124, ECIL 8008104461, GAJWEL 9848347349, HAYATH NAGAR 8341528028, IBRAHIMPATNAM 9912299916, IDPL COLONY 9246260803, LUNGER HOUSE 9885562687, MALAKPET 9000228558, MALKAJGIRI 8008104445, MEDAK 7702014433, MEDCHAL 9440442588, MEERPET 9949523333, METTUGUDA 9000049373, MOOSAPET 9989192111, MUSHEERABAD 9985801947, NAGARAM 6301212199, NARSAPUR 7702313330, NARSINGI 8297544402, PARIGI 8297544414, SADASIVPET 9848877161, SAINIKPURI 9652040129, SANGAREDDY 8297544409, SHAMSHABAD 9100793093, SHANKARPALLY 9949022223, SIDDIPET 7702015577, SURARAM 9393920588, TANDUR 8297544419, TEMPLE ALWAL 9000055318, THUMKUNTA 9985731111, TUPRAN 7702014400, VIKARABAD 8297544425, ZAHEERABAD 8297544426.

GH